‘ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 264

సోమవారం 15-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

యువ భారత్‌దే పైచేయి

పాక్ అండర్-19 జట్టుపై భారత్ విజయం 90 పరుగుల తేడాతో విక్టరీ

10లో

భారత్ భళా... సఫారీ డీలా

మూడో టి20లో 7 వికెట్లతో టీమిండియా జయభేరీ.. 17న లక్నోలో నాలుగో టి20

10లో

బీజేపీ డీఎన్‌ఏలో ఓటు చోరీ

సత్యం, అహింస అనే నినాదంతో బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు.

వివరాలు 6లో ▸

...మా పిల్లలపై ఆంక్షలు

సోషల్ మీడియాను వాడుకోవడంలో తన పిల్లలకు ఆంక్షలు, పరిమితులు పెట్టానని యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ చెప్పారు.

వివరాలు 6లో ▸

యూదులపై ఉగ్రదాడి

ఆస్ట్రేలియా రాజధాని సిడ్నీలో యూదులపై ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులు జరపగా 11 మంది మరణించారు.

వివరాలు 6లో ▸

విమానంలో ప్రాణదానం

విమానంలో ప్రయాణిస్తుండగా ఓ ప్రయాణికురాలు అస్వస్థతకు గురికాగా.. ఓ మాజీ ఎమ్మెల్యే సీపీఆర్ చేసి ప్రాణాన్ని నిలిపారు

వివరాలు 6లో ▸

‘రియల్’.. సీన్ రివర్స్!

రాష్ట్రవ్యాప్తంగా క్షీణించిన స్థిరాస్తి క్రయ విక్రయాలు

అవసరానికి అమ్ముకోలేక ప్రజల అవస్థలు

భూములు, అపార్టుమెంట్లు, ప్లాట్లు అడిగేవారేరీ?

అల్లాడుతున్న భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, వ్యాపారులు

విజయవాడ, తిరుపతి, నెల్లూరులో వ్యాపారాలు డీలా

- రాజధాని అమరావతిలోనూ మందగమనం
- రాష్ట్రంలో వరుసగా రెండేళ్లు పడిపోయిన రిజిస్ట్రేషన్ల ఆదాయం
- స్వయంగా టార్గెట్లు తగ్గించుకున్న ప్రభుత్వం
- 2023–24లో ఏపీలో ఏకంగా 22.25 లక్షల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
- ఈ ఏడాది అక్టోబర్ నాటికి రిజిస్ట్రేషన్ జరిగిన డాక్యుమెంట్లు 13.92 లక్షలే
- భూముల మార్కెట్ విలువ సగటున 50 శాతం పెంచినా లక్ష్యాన్ని చేరుకోవటంలో విఫలం
- సంపద సృష్టిస్తూ, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందిస్తూ గత ప్రభుత్వ హయాంలో అడుగులు
- మెడికల్ కాలేజీలు, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, జోరుగా ఇళ్ల నిర్మాణంతో స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి

2లో

ఏడాదిలో ఒక్కటీ అమ్ముడుపోలేదు

టీడీపీ అధికారంలోకి వచ్చాక భూముల అమ్మకాలు, కొనుగోళ్లు తగ్గాయి. గత ఏడాది కాలంలో ఒక్క ప్లాటు కూడా అమ్ముడు పోలేదు. పెట్టుబడులు మొత్తం ప్రాజెక్టులపై పెట్టాం. వ్యాపారం దివాలా తీస్తోంది. తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు కట్టడమే సరిపోతోంది.

– షేక్ కిరణ్‌బాబు, బిల్డర్, ఈడుపుగల్లు, కంకిపాడు మండలం

కోటి సంతకాల పత్రాలతో.. నేడు జిల్లా కేంద్రాల్లో

భారీ ర్యాలీలు

- ఆ తర్వాత వాటిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపనున్న నేతలు
- ర్యాలీలకు వ్యతిరేకంగా పోలీసులను ఉసిగొల్పుతున్న చంద్రబాబు సర్కారు
- దీంతో ర్యాలీల్లో పాల్గొంటే కేసులు పెడతామంటూ జిల్లాల్లో నోటీసులు
- వీటిని ఖాతరు చేయబోమంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నేతలు
- వాహనాల ర్యాలీలకు అనుమతివ్వాలంటూ డీజీపీకి పార్టీ లేఖ

వివరాలు 5లో

పార్లమెంటు స్థాయీ సంఘం నివేదికకు

ఎల్లో మీడియా వక్రభాష్యం

- వైద్య కళాశాలలపై పీపీపీని స్థాయిసంఘం సమర్థించిందని దుష్ప్రచారం
- కొత్త ప్రభుత్వ వైద్యకళాశాలల ఆవశ్యకతను నొక్కివక్కాణించిన స్థాయి సంఘం
- వచ్చే ఐదేళ్లలో 75 వేల సీట్లు పెరిగితేనే విద్యార్థుల వలసల కట్టడి సాధ్యమని అభిప్రాయం
- వైద్య విద్యలో అసమానతలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏపీ ఒకటని వెల్లడి
- కొత్త కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వాలు కృషి చేయాలని సూచన
- పీపీపీలో వైద్య కళాశాలల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి కేవలం పన్ను రాయితీలు చాలని ఉద్బోధ
- దీనిని వక్రీకరించి చంద్రబాబుకు అనుకూలంగా కట్టుకథలల్లుతున్న ‘పచ్చ’పత్రిక
- వాస్తవానికి ఏపీలో నెలకొన్న అసమానతలను చెరిపేసేలా ఐదేళ్ల కిందటే వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలు
- 17 కళాశాలల ఏర్పాటుతో 2,550 ఎంబీబీఎస్ సీట్లు సమకూర్చేలా 2019లోనే అడుగులు

5లో

బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా

నితిన్ నబీన్

- నియమించిన పార్టీ నాయకత్వం
- కాషాయ దళం తదుపరి చీఫ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం
- చిన్న వయసులో బీజేపీ పగ్గాలు చేపట్టిన నేతగా నబీన్ చరిత్ర సృష్టిస్తారంటున్న పార్టీ నేతలు
- ప్రస్తుతం బిహార్ కేబినెట్ మంత్రిగా నబీన్ బాధ్యతలు
- కష్టించి పనిచేసే కార్యకర్త అంటూ ప్రధాని అభినందనలు

6లో

45 ఏళ్లకే 5సార్లు ఎమ్మెల్యేగా..

న్యూస్‌రీల్

ఉత్సాహం నింపిన నేవీ మారథాన్

నావికాదళం ఆధ్వర్యంలో వైజాగ్ నేవీ మారథాన్ ఔత్సాహిక పరుగు వీరులతో సాగర తీరం నిండిపోయింది. 17 వేల మంది ఈ పరుగులో భాగస్వామ్యం కాగా కొందరు విదేశీ అథ్లెట్లు కూడా పాల్గొన్నారు.

వివరాలు 14లో ▸

అటల్ ప్రేరణతో దేశాభివృద్ధి

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రేరణ, స్ఫూర్తితో ప్రధాని మోదీ దేశాన్ని ఆర్థికంగా పురోగమన బాటలో నడుపుతున్నారని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి అన్నారు. రాష్ట్రంలో రెండు చోట్ల ఆయన వాజ్‌పేయి విగ్రహావిష్కరణ చేశారు.

వివరాలు 5లో ▸

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹96	ఫారం దగ్గర లైవ్ బర్డ్	125 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	220 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	152 కిలో	స్కిన్ లెస్	251 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

మల్లన్న సన్నిధిలో మహాదోపిడీ!

శ్రీశైలం ఆలయంలో ప్రతి పనికీ మామూళ్లు వసూలు చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా అనుచరులు

- దేవస్థానంలో ఏ టెండర్ అయినా 7 శాతం బి-ట్యాక్స్ చెల్లించాల్సిందే..
- దాతలు భవనాలు నిర్మించాలన్నా కమీషన్ సమర్పించుకోవాల్సిందే
- శ్రీశైలం మండలంలో ఇసుక, కంకర టన్నుకు రూ.100 చొప్పున బి-ట్యాక్స్
- సున్నిపెంటలో మద్యం దుకాణాల నుంచి నెలకు రూ.2లక్షలు వసూలు
- డబ్బులు ఇవ్వకపోతే ఒక్క పనీ జరగదు... అవసరమైతే దాడులకూ వెనుకాడరు
- ఈ దందాల కోసం ప్రత్యేకంగా ఒకరిని పెట్టుకున్న ఎమ్మెల్యే బుడ్డా
- ఏడాదిన్నరగా అడ్డూ, అదుపు లేకుండా సాగుతున్న దోపిడీపర్వం

3లో

కో-లివింగ్.. ఇన్వెస్ట్‌మెంటే!

ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న ట్రెండ్

- సాధారణ అద్దెతో పోలిస్తే కో-లివింగ్‌తో ఎక్కువ ఆదాయం
- అద్దెకన్నా వార్షికంగా 35–40 శాతం ఎక్కువ వచ్చే అవకాశం
- నిర్వహణ మొత్తం చూసుకునేందుకు ప్రత్యేక ఏజెన్సీలు.. విజయవాడ, వైజాగ్ తదితర ప్రాంతాల్లో డిమాండ్

ప్రాఫిట్ ప్లస్‌లో

పోషకాలు తగ్గిపోతాయ్!

గాలిలో కార్బన్ డయాక్సైడ్ పెరిగితే తగ్గుతున్న కార్బోహైడ్రేట్లు

తగ్గుతున్న ప్రొటీన్లు, జింక్ ముఖ్యమైన సూక్ష్మపోషకాలు

పెరుగుతున్న సీసం, నికెల్ వంటి భార ఖనిజాలు

వరి, గోధుమలు, జొన్నలపై తాజా అధ్యయనంలో వెల్లడి

14లో

'రియల్'.. సీన్ రివర్స్!

రాష్ట్రవ్యాప్తంగా క్షీణించిన స్థిరాస్తి క్రయ విక్రయాలు

అవసరానికి అమ్ముకోలేక ప్రజల అవస్థలు

- విజయవాడ పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ హయాంలో మంచి రోజుల్లో సగటున రోజుకు 150, ఇతర రోజుల్లో 100-120 రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఇప్పుడు మంచి రోజుల్లోనూ 70-80 దాటడం లేదు. సాధారణ రోజుల్లో 50 రిజిస్ట్రేషన్లు కావడం గగనంగా ఉంది.
- 2019కి ముందు మచిలీపట్నం శివారులో సెంటు రూ.3 లక్షలు ఉంటే 2024లో రెట్టింపై రూ.6 లక్షలకు చేరుకుంది. తరువాత చంద్రబాబు ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా ధరలు పెరగలేదు.
- 2022-23లో తూర్పు గోదావరి జిల్లాలో 1,29,355 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా 2025-26 నవంబర్ చివరి నాటికి కేవలం 61,597 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్టర్ అయ్యాయి.
- విజయనగరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.10 లక్షలు ఉన్న 200 గజాల ఇంటి స్థలం 2019 తరువాత వైఎస్ జగన్ హయాంలో రూ.25 - రూ.30 లక్షలకు చేరుకుంది. ఇప్పుడు ఒక్కసారిగా ధరలు తగ్గిపోయాయి. మూడు నాలుగేళ్ల క్రితం కొన్న ధరకు అమ్ముకుందామన్నా కొనేవారు లేరని వ్యాపారులు చెబుతున్నారు.
- కడప అర్బన్, రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గత ప్రభుత్వంలో రోజుకు సుమారు 250-300 రిజిస్ట్రేషన్లు జరగగా ప్రస్తుతం 50-60 మించడం లేదు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రోజుకు 80-90 రిజిస్ట్రేషన్లు నుంచి ప్రస్తుతం 30కి తగ్గిపోయాయి.
- ఆదోని మెడికల్ కాలేజీ పరిసరాల్లో గతంలో ఎకరం రూ.5 కోట్లు పలకగా ఇప్పుడు అడిగే నాథుడే కరువయ్యారు.

2023–24 వైఎస్ జగన్ హయాంలో

1) రిజిస్ట్రేషన్ల ఆదాయం టార్గెట్ రూ.12,000 కోట్లు
2) రాష్ట్రంలో భారీగా పెరిగిన భూముల ధరలు
3) రోజూ వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు.. 22.25 లక్షల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
4) రాష్ట్రవ్యాప్తంగా పేదలకు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు, 30 లక్షలకుపైగా గృహ నిర్మాణాలు
   + ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 కొత్త మెడికల్ కాలేజీలకు శ్రీకారం
   + తీర ప్రాంతంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటు
   + గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలతో స్థానికంగా ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధితో పాటు సంపద సృష్టిస్తూ అడుగులు
5) భవన నిర్మాణ కార్మికులకు సమృద్ధిగా పనులు
6) సంక్షేమ పథకాల అమలుతో పెరిగిన పేదల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు
7) రియల్ ఎస్టేట్ అనుబంధ రంగాలు కళకళ. జోరుగా గృహ నిర్మాణాలతో సిమెంట్, పెయింట్లు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వ్యాపారాల జోరు

2025–26 బాబు ప్రభుత్వంలో..

1) రిజిస్ట్రేషన్ల ఆదాయం టార్గెట్ రూ.10,169 కోట్లకు కుదింపు
2) భూముల ధరలు ఒక్కసారిగా పతనం.. రాజధానిలోనూ మందగమనం
3) రిజిస్ట్రేషన్లు పదుల సంఖ్యకే పరిమితం.. అక్టోబర్ దాకా 13.92 లక్షలే
4) కొత్తగా ఎలాంటి నిర్మాణాలూ చేపట్టకపోగా ఉన్న వ్యవస్థలే నిర్వీర్యం
5) పొట్ట కూటి కోసం కార్మికుల అవస్థలు
6) పథకాలు అందక, అభివృద్ధి జాడ లేక పేదల దీనావస్థ
7) రియల్ ఎస్టేట్ వెలవెల. ఆగిన ఇళ్ల నిర్మాణాలు. వ్యాపారులు బేజార్

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి విజయవాడ, నెట్‌వర్క్: అభివృద్ధికి చిరునామా..! మంచి ప్రభుత్వం..! విజనరీ పాలన..! సంపద సృష్టిస్తానంటూ అంటూ నమ్మబలికిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వ్యవస్థలను దిగజారుస్తూ, అన్ని రంగాలను కుప్పకూలుస్తున్నారు. సంక్షేమం ఊసే పట్టించుకోకుండా.. అభివృద్ధి జాడే లేకుండా చేస్తున్నారు. ఒకవైపు పారిశ్రామిక విధానం ముసుగులో తమకు నచ్చినవారికి ఖరీదైన భూములను పప్పు బెల్లాల మాదిరిగా 99 పైసలకే కేటాయిస్తూ, మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నీరుగార్చడంతో అవసరాలకు అమ్ముకోలేక రైతులు, పనులు లేక భవన నిర్మాణ కార్మికులు, వ్యాపారులు అల్లాడుతున్నారు. రాజధాని ప్రాంతంలో సైతం ఇదే దుస్థితి నెలకొంది. వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా విజయవాడ, బందరులో జిల్లా కేంద్రాలు, పోర్టు, కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయడంతో గుంటూరు నుంచి మచిలీపట్నం దాకా భూముల ధరలు బాగా పెరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగింది. ఇప్పుడు ఏడాదిన్నరగా భవన నిర్మాణ రంగాలు కుదేలయ్యాయి. నెలకు పది రోజులు కూడా ఉపాధి దొరకటం లేదని కార్మికులు వాపోతున్నారు. ప్రధాన పట్టణాలు, నగరాల్లో పరిస్థితి తారుమారైంది. రియల్ ఎస్టేట్ అనుబంధ రంగాలైన సిమెంట్, ఐరన్, శానిటేషన్, ఎలక్ట్రికల్, పెయింట్స్, ప్లంబింగ్ తదితరాల వ్యాపారం కుప్పకూలింది. విజయవాడ, తిరుపతి, నెల్లూరులో స్థిరాస్తి వ్యాపారులు అల్లాడుతున్నారు. రాజధానిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రచారం మినహా అభివృద్ధి జాడ లేకపోవడంతో ఏడాదిన్నరగా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం రివర్స్‌లో ప్రయాణిస్తోంది. అన్ని ప్రాంతాల్లోనూ స్థిరాస్తి క్రయ విక్రయాల్లో మందగమనం కనిపిస్తోంది. రాష్ట్రం దూసుకుపోతోందంటూ ప్రభుత్వం చేస్తున్న హడావుడికి, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేదు. చంద్రబాబు సర్కారు మాటలు నిజమైతే స్థిరాస్తి మార్కెట్ కళకళలాడాలి. రిజిస్ట్రేషన్ల ద్వారా ఖజానాకు వచ్చే ఆదాయం పెరగాలి. కానీ మార్కెట్ బేల చూపులు చూస్తోంది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గతంలో ఎన్నడూ లేనివిధంగా పడిపోవడమే ఇందుకు ఉదాహరణ. 2023–24లో రూ.12 వేల కోట్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ల టార్గెట్ తాజాగా 2025–26 ఏడాదిలో రూ.10,169 కోట్లకు తగ్గిపోవడం గమనార్హం. ఏ రాష్ట్రంలో అయినా ప్రభుత్వాలు టార్గెట్‌ను పెంచుకుంటూ వెళ్లి అందుకనుగుణంగా ఆదాయాన్ని సముపార్జిస్తాయి. కానీ చంద్రబాబు ప్రభుత్వం రివర్స్‌లో టార్గెట్‌ను తగ్గించుకుంటూ వెళుతోంది. తద్వారా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని, స్థిరాస్తుల కొనుగోళ్లు జరగడం లేదని ప్రభుత్వమే అధికారికంగా నిర్ధారించేసింది. 2023–24లో గత ప్రభుత్వంలో రాష్ట్రంలో 22.25 లక్షల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరగగా చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాదిలో అక్టోబర్ నాటికి 13.92 లక్షల డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ కావడం దిగజారిన పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. కాగా దివంగత వైఎస్సార్ హయాంలో గొల్లపూడి నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఇన్నర్ రింగు రోడ్డు నిర్మాణంతోపాటు బుడమేరుపై ఫ్లైఓవర్లతో విజయవాడ పరిసరాల్లో రియల్ ఎస్టేట్ ఊపందుకుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. చిన అవుటపల్లి నుంచి వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులను 2014–19 మధ్య టీడీపీ హయాంలో పట్టించుకోలేదు. 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిన అవుటపల్లి నుంచి వెస్ట్ బైపాస్ పనులను 96 శాతం మేర పూర్తి చేసింది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరకుపైగా అవుతున్నా మిగిలిన కొద్దిపాటి పనులను పూర్తి చేయడంలో విఫలమైంది.

రిజిస్ట్రేషన్ల టార్గెట్లు రివర్స్

చంద్రబాబు సర్కారు అస్తవ్యస్థ పాలన, విచ్చలవిడి అవినీతితోపాటు సంక్షేమ పథకాలు అందకపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి క్షీణించి స్థిరాస్తుల క్రయవిక్రయాలు ఊహించని విధంగా పడిపోయాయి. కనీసం వసూళ్ల లక్ష్యాన్ని కూడా సరిగా నిర్దేశించుకోలేని స్థాయికి రిజిస్ట్రేషన్ల ఆదాయం క్షీణించింది. ఎప్పుడో మూడేళ్ల క్రితం నిర్దేశించిన లక్ష్యం కంటే కూడా ప్రస్తుతం తక్కువ టార్గెట్ పెట్టుకోవడం ద్వారా స్థిరాస్తి క్రయ విక్రయాలపై చంద్రబాబు సర్కారు ఆశలు వదిలేసుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల శాఖ రూ.12 వేల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుని రూ.9,546 కోట్లు రాబట్టింది. కానీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఈ లక్ష్యాన్ని తగ్గించుకుంటూ వస్తుండడం గమనార్హం. 2024–25లో రూ.11,997 కోట్ల లక్ష్యాన్ని పెట్టుకుని రూ.8,843 కోట్లను మాత్రమే రాబట్టగలిగింది. అంతకుముందు సంవత్సరం వచ్చిన ఆదాయాన్ని కూడా చంద్రబాబు సర్కారు తొలి ఏడాది సాధించలేకపోయింది. ఇక 2025–26లో లక్ష్యాన్ని రూ.10,169 కోట్లుగా పెట్టుకుని అక్టోబర్ నాటికి రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.7 వేల కోట్లు వసూలు చేయగలిగింది. వరుసగా రెండేళ్లపాటు లక్ష్యాన్ని తగ్గించుకోవడాన్ని బట్టి స్థిరాస్తి రంగంలో ఏమాత్రం వృద్ధి లేదని ఈ ప్రభుత్వమే బయటపెట్టింది. దీంతో తన హయాంలో పడిపోయిన ఆదాయాలనే కొలమానంగా తీసుకుని ప్రస్తుత ఆదాయాలను పోల్చుతుండడం విశేషం. ఆదాయాన్ని 2023–24 సంవత్సరంతో పోల్చకపోవడం, తక్కువ లక్ష్యాన్ని పెట్టుకుని దాంతో పోల్చడం ద్వారా ప్రజలను మభ్యపుచ్చేందుకు యత్నిస్తోంది. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో చంద్రబాబు సర్కారు రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువను సగటున 50 శాతానికిపైగా పెంచింది. దీంతో ప్రజలపై భారం పడి రిజిస్ట్రేషన్ల సొమ్ము ఎక్కువగా కట్టాల్సి వస్తోంది. చార్జీలు పెంచడం ద్వారా ప్రజలను బాది ఆదాయాన్ని పెంచుకున్నా రిజిస్ట్రేషన్లు మాత్రం అమాంతం తగ్గిపోవడం గమనార్హం. లేదంటే రిజిస్ట్రేషన్ల ఆదాయం ఇంకా భారీగా పడిపోయేదని స్పష్టంగా తెలుస్తోంది.

రిజిస్ట్రేషన్ల టార్గెట్లు రివర్స్ ఇలా.. సంవత్సరం	టార్గెట్ రూ.కోట్లలో	రెవెన్యూ వసూళ్లు రూ.కోట్లలో	రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లు
2023-24	12,000	9,546	22.25 లక్షలు
2024-25	11,997	8,843	20.20 లక్షలు
2025-26 (అక్టోబర్ వరకు)	10,169	7,219	13.92 లక్షలు

రాజధానిలో 'రియల్' షాక్..!

రాజధాని అమరావతి ప్రాంతంలో కూడా రియల్ ఎస్టేట్ పడిపోయిందని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. రాజధానికి బడా కంపెనీలు, కార్యాలయాలు వచ్చేస్తున్నాయని చంద్రబాబు సర్కారు ప్రచారం చేస్తున్నా రియల్ వ్యాపారం మాత్రం పెరగడంలేదు. రాజధాని పరిసర ప్రాంతాల్లో కొత్త వెంచర్లు వేయడం తగ్గిపోయింది. ఇప్పటికే వేసిన వాటిలో స్థలాలు అమ్ముడు కావడంలేదు. అపార్టుమెంట్లలో ప్లాట్లు పరిస్థితి కూడా అలాగే ఉంది. స్థలాలు, ప్లాట్ల కొనుగోలు చేసేందుకు కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో వ్యాపారులు ఆందోళనలో మునిగిపోయారు. స్వయంగా చంద్రబాబు రాజధానిలోని వెలగపూడిలో ఇల్లు నిర్మించుకుంటున్నట్లు చెబుతున్నా అక్కడ రియల్ ఎస్టేట్ పుంజుకోలేదు. రెండు, మూడు విడతల భూసమీకరణ ద్వారా మరింత భూమిని తీసుకుంటామని ప్రకటించడం, పూలింగ్‌కు భూములు ఇవ్వకపోతే బలవంతంగా భూసేకరణ చేస్తామని బెదిరిస్తుండటంతో రాజధానిలో పరిస్థితి ఆందోళనకరంగా మారిపోయింది. చంద్రబాబు సర్కారు భూదాహంపై రాజధాని రైతులు మండిపడుతున్నారు.

పట్టణాలు, నగరాల్లోనూ డీలా

చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాయలసీమను పట్టించుకోకపోవడం, ఆ ప్రాంతంలో పెట్టుబడులు రాకపోవడంతో రియల్ రంగం కుదేలైంది. వైఎస్ జగన్ హయాంలో సీమలో పరుగులు తీసిన రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఇప్పుడు కుదేలయ్యాయి. ప్రధానంగా తిరుపతి, కర్నూలు, అనంతపురం, కడప తదితర ప్రాంతాల్లో భూముల అమ్మకాలు తగ్గిపోయాయి. స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధుల దందాలు, భూములపై పెత్తనం చేస్తుండడంతో కొనాలనుకున్న కొద్దిమంది కూడా జంకుతున్నారు.

క్షీణించిన ప్రజల కొనుగోలు శక్తి

విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, రాజమహేంద్రవరం లాంటి ప్రధాన నగరాల్లోనూ రియల్ వ్యాపారం మందకొడిగా ఉంది. నగరాల్లోనూ అమ్మకాలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. విజయవాడ–మచిలీపట్నం రహదారికి ఇరువైపులా గతంలో కళకళలాడిన వ్యాపారం ఇప్పుడు పడిపోయింది. ప్రజల కొనుగోలు శక్తి క్షీణించడం, ఈ ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, కార్పొరేట్ కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయని చంద్రబాబు ప్రభుత్వం బడాయి పోతున్నా భూముల కొనుగోళ్లు మాత్రం లేకపోవడం గమనార్హం. 2019–24 మధ్య విశాఖలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లిన రియల్ వ్యాపారం ఏడాదిన్నరగా దిగజారిపోయింది. పెద్ద ప్రాజెక్టులు చాలా వరకూ ఆగిపోయాయి. కొత్త ప్రాజెక్టులు తగ్గిపోయాయి.

నిర్మాణ రంగం విలవిల

ఒకపక్క రియల్ రంగం తిరోగమనంలో ఉండడంతో మరోపక్క దానిపై ఆధారపడిన నిర్మాణ రంగం కూడా కుదేలైంది. భవన నిర్మాణ కార్మికులకు పనులు తగ్గిపోయాయి. విశాఖ, విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో కార్మికులకు గతంలో చేతి నిండా పని ఉండేది. ఇప్పుడు పని దొరకడం కష్టంగా మారింది. నిర్మాణ రంగంలో కీలకమైన ఇటుక, సిమెంట్, పెయింటింగ్, ప్లంబింగ్, ఇనుము. ఎలక్ట్రిసిటీ, విక్రయాల వ్యాపారాలు క్షీణించాయి. ఇలా చంద్రబాబు సర్కారు అస్తవ్యస్థ విధానాల వల్ల కీలక రంగాలు చతికిలపడ్డాయి. వ్యాపారాలు తగ్గిపోవడంతో వాటిపై ఆధారపడిన వారు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో మనీ సర్క్యులేషన్ తగ్గిపోవడంతో అన్ని వ్యాపారాలు తగ్గిపోయాయి.

కృష్ణాలో కుప్పకూలింది..!

కృష్ణా జిల్లాలో ఏడాదిన్నరగా భవన నిర్మాణ రంగాలు కుదేలయ్యాయి. గత ప్రభుత్వంలో నెలకు 20 రోజులకు తగ్గకుండా పనులుంటే ఇప్పుడు పది రోజులు కూడా ఉపాధి దొరకటం లేదని భవన నిర్మాణ కార్మికులు వాపోతున్నారు. అనుబంధ రంగాలైన సిమెంట్, ఐరన్, శానిటేషన్, ఎలక్ట్రికల్, పెయింట్స్, ప్లంబింగ్ తదితరాల వ్యాపారం కుప్పకూలింది. వైఎస్సార్ సీపీ హయాంలో బందరు పోర్టుకు శంకుస్థాపన చేసి పనులను పరుగులు పెట్టించింది. మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్, పలు కొత్త హైవేలు రావడంతో జిల్లా పునర్విభజన సమయంలో మచిలీపట్నం పరిసరాల్లో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. బందర్ హైవే వెంట నిడుమోలు, పామర్రు, ఉయ్యూరు. కంకిపాడు ప్రాంతాల్లో భారీగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. కత్తిపూడి–ఒంగోలు హైవేతో పెడన, అవనిగడ్డ నియోజక వర్గాల్లో సైతం రియల్ భూమ్ అందుకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక వేగం మందగించడంతో రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొంది.

బాపట్లలో భవన రంగం బాధలు

బాపట్ల జిల్లాలో ఏడాదిన్నరగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పతనమైంది. గత ప్రభుత్వంతో పోలిస్తే రిజిస్ట్రేషన్లు సగం తగ్గాయి. వైఎస్ జగన్ హయాంలో బాపట్ల జిల్లాలో 2022 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 76,215 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరగగా టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 50,983 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ జరిగాయి. ప్రభుత్వానికి రాబడి తగ్గిపోగా భవన నిర్మాణ రంగాలు కుదేలయ్యాయి. గత ప్రభుత్వంలో నెలకు 22 రోజులకు తగ్గకుండా పనులుంటే ఇప్పుడు పది రోజులు కూడా దొరకడం లేదని భవన నిర్మాణ కార్మికులు వాపోతున్నారు. సిమెంట్, ఐరన్ విక్రయాలు పడిపోయాయని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో జిల్లాలో ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టింది. తీరప్రాంతం అభివృద్ధికి నిధులు కేటాయించడంతో రోడ్లు ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా జరిగాయి. బాపట్ల కేంద్రంగా గత ప్రభుత్వం మెడికల్ కళాశాల మంజూరు చేసింది. దీంతో 2019 తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. అప్పటివరకూ తీర ప్రాంతంలో ఎకరం రూ.30 లక్షలు పలికిన భూమి తరువాత రూ.3 నుంచి 5 కోట్లకు చేరింది. గత ఏడాదిన్నరగా పరిస్థితి తారుమారైంది. వైఎస్ జగన్ హయాంలో బాపట్ల మెడికల్ కళాశాల ప్రాంతంలో రూ.కోటిన్నర పలికిన ఎకరం భూమిని ప్రస్తుతం రూ.20 లక్షలకు కూడా కొనేవారు లేరు. అద్దంకి, రేపల్లె ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో ఎకరం రూ.కోటి దాకా పలికిన భూముల ధరలు తిరిగి రూ.20 లక్షలకు పతనమయ్యాయి.

పల్నాడులో ధరలు పతనం..

పల్నాడు జిల్లాలో గత ప్రభుత్వంలో మెడికల్ కళాశాల రాకతో పిడుగురాళ్ల, దాచేపల్లి, రాజుపాలెం, మాచవరం తదితర మండలాల్లో ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. రైతుల భూములు రెట్టింపు ధరలు పలికాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ ఆదాయం అమాంతం పడిపోయింది. పల్నాడు జిల్లావ్యాప్తంగా 2023–24లో రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.472.38 కోట్ల ఆదాయం సమకూరగా 2024–25లో ఆదాయం రూ.396 కోట్లకు పడిపోయింది. 2025–26లో ఇప్పటిదాకా రూ.200 కోట్లు కూడా రాలేదు. గతంలో ఏటా సగటున 32 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరగగా ప్రస్తుతం అది 14 వేలకు పడిపోయింది. దీంతో మధ్యవర్తులు ఉపాధిలేక హైదరాబాద్ లాంటి నగరాలకు వలస వెళ్తున్నారు. గతంలో వెంచర్ల ఏర్పాటుతో ఉపాధి పొందిన వేలాది మంది కూలీలు, ట్రాక్టర్, జేసీబీ, ట్రక్కు డ్రైవర్లు ప్రస్తుతం పనుల కోసం అడ్డాలలో ఎదురు చూస్తున్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చేరువలోని కామేపల్లి గ్రామ పరిధిలో 2019కి ముందు ఎకరం పొలం రోడ్డు పక్కన సుమారు రూ.30 లక్షలు ఉండగా స్థానికంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఏకంగా ఎకరం రూ.కోటిన్నర దాకా పలికింది. 2024లో వైఎస్సార్‌సీపీ దిగిపోయేనాటికి ఎకరం రూ.2 కోట్ల దాకా వెళ్లింది. అదే ఇప్పుడు కనీసం రూ.60 – రూ.80 లక్షలు కూడా పలకడం లేదు. కనీసం ధర గురించి అడిగే వారు లేరని రైతులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. నరసరావుపేటలోనూ వెంచర్లు వేసిన వ్యాపారులు స్థలాలు అమ్ముకోలేక, వడ్డీలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

నెల్లూరులో నీరసించిన వ్యాపారం

నెల్లూరు జిల్లాలో రియల్ ఎస్టేట్ బాగుంటుందని హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నుంచి వచ్చిన రియల్టర్లు లేఅవుట్‌లు వేశారు. అన్ని సదుపాయాలతో అధునాతనంగా ఇళ్ల నిర్మాణాలు కూడా చేశారు. ఇప్పుడు వాటిని కొనేవారు లేరు. గత 9 నెలలుగా ఖాళీగా ఉన్నారు. కొందరు బిల్డర్‌లు నూతనంగా నిర్మించిన ఇళ్లను బాడుగలకు ఇస్తున్న పరిస్థితి ఏర్పడింది. భారీగా వడ్డీలు కట్టలేక లబోదిబోమంటున్నారు. ఇక మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తూ చంద్రబాబు సర్కారు ప్రకటన చేసినా రియల్ ఎస్టేట్ ఏమాత్రం ఊపందుకోలేదు.

వలసలు పోతున్నారు

ఏడాదిన్నరగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. స్థలం అమ్మేవారు ఉన్నా.. కొనేవారు లేరు. అందుకే రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఇల్లు కట్టించే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. ఓపెన్ ప్లాట్లు కూడా అమ్ముడు పోవడం లేదు. దీంతో భవన నిర్మాణ కార్మికులు తమ పనులను వదిలేసి బెంగళూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. – నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు, కదిరి, సత్యసాయి జిల్లా

పూర్తిగా పతనమైన రియల్ ఎస్టేట్

ప్రకాశం జిల్లాలో రియల్ ఎస్టేట్ పూర్తిగా డౌనైపోయింది. మార్కాపురం జిల్లా ప్రకటిస్తే మంచి ధరలు వస్తాయని ఆశించాం. అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. అమ్మే వారు ఉన్నాగానీ కొనేవారు లేరు. నేషనల్ హైవే పక్కన కూడా కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. సంతనూతలపాడు మండలంలో రియల్ ఎస్టేట్ భూం ఇప్పుడు పూర్తిగా పతనమైంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో నమోదవుతున్న రిజిస్ట్రేషన్ల సంఖ్యే ఇందుకు నిదర్శనం. ఇక్కడ 2022–23లో 6,029 రిజిస్ట్రేషన్లు జరిగాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 2024–25లో ఆ సంఖ్య 3,972కు పడిపోయింది. – కుంచాల ఆంజనేయులు, సంతనూతలపాడు, ప్రకాశం జిల్లా

పూట గడవడమే కష్టంగా ఉంది

రియల్ ఎస్టేట్ కుదేలైంది. భవన నిర్మాణాలు భారీగా తగ్గిపోయాయి. గతంలో నెలలో 20 రోజులకుపైగా పనులుంటే ప్రస్తుతం 10–15 రోజులు కూడా దొరకడం లేదు. భవన నిర్మాణ కార్మికులకు పూట గడవడమే కష్టంగా ఉంది. – జి.హరికృష్ణారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు

నెలలో సగం రోజులే పని

రియల్ ఎస్టేట్ లావాదేవీలన్నీ నిలిచి పోయాయి. దీంతో నిర్మాణ పనులపై ఆధారపడి ఇక్కడ జీవిస్తున్న వేల మంది తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాజధాని వస్తుందన్న సమయంలో భవనాల పనులు మొదలుపెట్టారు. అందరికీ చేతినిండా పని ఉండేది. ఇప్పుడు పూర్తి స్థాయిలో పనులు దొరకడం లేదు. రోజుకో బ్యాచ్‌కి పని సర్దుబాటు చేయాల్సి వస్తోంది. అంటే ఒక కార్మికుడికి నెలలో 15 రోజులు కూడా పని లేకుండా పోయింది. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు దొరకకపోవడంతో చాలామంది సొంతూళ్లకు వెళ్లిపోయారు. – వైఎస్ మూర్తి, శ్రీ దుర్గా భవానీ భవన నిర్మాణ శ్రామిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మధురవాడ, విశాఖ

పని దొరకడం లేదు..

గత ప్రభుత్వంలో నెలకు 22 రోజులు పనులు దొరికేవి. ఈ ప్రభుత్వం వచ్చాక నెలకు పది రోజులు కూడా పనులు ఉండడం లేదు. ఉదయమే సెంటర్‌కు వచ్చి పడిగాపులు కాస్తున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. – నాగూర్‌బాషా, భవన నిర్మాణ కార్మికుడు, ఉప్పరపాలెం, బాపట్ల జిల్లా.

వాళ్ల మొహం కూడా చూడం.. ఊళ్లోనే ఉండం!

- మూడు కుటుంబాలను పార్టీలో చేర్చుకునేందుకు వెళ్లిన దేశం నాయకులు
- సంబంధిత విందులో గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని ఒత్తిడి
- నిరసనగా ఇళ్లకు తాళాలు వేసి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ప్రత్యేక విందు ఏర్పాటు
- వైఎస్సార్ జిల్లాలో ఘటన

వేంపల్లె: వైఎస్సార్‌సీపీకి ప్రజా మద్దతు మరోసారి స్పష్టమైంది. మూడు కుటుంబాలను పార్టీలో చేర్చుకునేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి)తో పాటు టీడీపీ నాయకులు గ్రామంలోకి అడుగుపెట్టగానే, ప్రజాస్వామ్య స్ఫూర్తితో గ్రామస్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేసి.. ఆ గ్రామాన్నే వదిలివెళ్లిన ఘటన వైఎస్సార్‌జిల్లా వేంపల్లె మండలం అమ్మగారిపల్లెలో చోటుచేసుకుంది. నిరసనను అణచివేయడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించకపోగా, ఈ చర్యలు స్థానికులను మరింత ఆగ్రహానికి గురిచేశాయి.

దేశం కుతంత్రాలకు సమాధానం

గత కొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్న గ్రామస్తులను రాజకీయంగా చీల్చే ప్రయత్నంలో భాగంగా ప్రలోభాలకు తెరలేపుతూ అడ్వకేట్ వెన్నపూస ఈశ్వర్‌రెడ్డితో పాటు మరో రెండు కుటుంబాలను టీడీపీలోకి చేర్చుకునేందుకు బీటెక్ రవి తదితర టీడీపీ నాయకులు గ్రామానికి వచ్చారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసే విందులో గ్రామంలోని ప్రజలంతా పాల్గొనాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారు. పోలీసులనూ ఇందుకు వినియోగించుకున్నారు. ఈ రాజకీయ కుతంత్రాలకు గ్రామస్తులు గట్టి సమాధానం చెప్పారు. టీడీపీ నాయకుల ముఖాలను కూడా చూడకూడదన్న సంకల్పంతో గ్రామస్తులంతా స్వచ్ఛందంగా ఇళ్లకు తాళాలు వేసి ఊరును ఖాళీ చేశారు. గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామ సమీపంలోని కొండ గంగమ్మ వద్ద వైఎస్సార్‌సీపీకి సంఘీభావంగా ప్రత్యేక విందు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామం వదిలి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదని పోలీసులు అంతక్రితం గ్రామస్తులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అనుమతి లేదంటూ విందును అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా గ్రామస్తులు లెక్కచేయలేదు. ఈ ఘటనతో టీడీపీ నాయకులకు తీవ్ర అవమానం ఎదురైంది. గ్రామంలో ఒక్కరూ లేకపోవడంతో బీటెక్ రవిసహా ఇతర అధికార పార్టీ నాయకులు కంగుతిన్నారు. ఇదిలావుండగా టీడీపీ నాయకులు, పోలీసులు ఎంత ఒత్తిడి తెచ్చినా, ఎంత ఇబ్బందులకు గురిచేసినా వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని, వైఎస్ కుటుంబం వెంటే నడుస్తామని గ్రామస్తులు తేల్చిచెప్పారు.

అమ్మగారిపల్లెలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయిన గ్రామస్తులు

పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నారు

పోలీసులను అడ్డుపెట్టుకొని టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ బలహీనపడుతోందనడానికి అమ్మగారిపల్లె ఘటనే రుజువు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని మాజీ సీఎం వైఎస్ జగన్ కోరుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేక టీడీపీ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు.
– ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

సాయుధ బలగాల్లో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యం

మహిళా సిబ్బంది విభాగాల వారీగా ఇలా.. ఫోర్స్	2025	2026
సీఆర్పీఎఫ్	294	1,192
బీఎస్ఎఫ్	1,680	2,513
ఐటీబీపీ	1,093	1,375
ఎస్ఎస్‌బీ	172	91

సాక్షి, హైదరాబాద్: కేంద్ర సాయుధ పోలీస్ బలగాల్లో మహిళా సిబ్బంది భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాదిలో సీఆర్పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్), బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్), ఐటీబీపీ (ఇండో–టిబెటియన్ బోర్డర్ పోలీస్), ఎస్ఎస్‌బీ (సశస్త్ర సీమాబల్)లో కలిపి మొత్తం 3,239 మంది మహిళా సిబ్బంది నియమితులయ్యారు. 2026లో మొత్తం 5,171 పోస్టుల భర్తీ లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల వెల్లడించారు. కానిస్టేబుల్ ర్యాంకులో మహిళా సిబ్బంది నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగానే సీఆర్పీఎఫ్‌లో 33 శాతం, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీలో 14 నుంచి 15 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించి మహిళా సిబ్బందిని నియమిస్తున్నారు. మహిళా సిబ్బందికి సరైన పని వాతావరణం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వారికి ప్రత్యేకంగా బ్యారక్‌లు, టాయిలెట్లు, డ్రెస్ చేంజింగ్ రూంలు, క్రెచ్‌లు, డే కేర్ సెంటర్లు కూడా ఏర్పాటు చేయడంతో మహిళలు ఈ బలగాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. మహిళా సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఉమెన్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. లైంగిక వేధింపుల వంటి అంశాల్లో ఫిర్యాదులపై అత్యంత గోప్యత పాటించడంతోపాటు సమస్య పరిష్కారం చేలా అంతర్గత వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా...

ఆదిత్యుని సేవలో సుధామూర్తి

అరసవల్లి: శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాజ్యసభ ఎంపీ సుధామూర్తి ఆదివారం దర్శించుకున్నారు. అలాగే శ్రీకూర్మంలోని కూర్మనాథుడిని కూడా సుధామూర్తి దర్శించుకున్నారు.

సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో పొగలు

అన్నవరం: గౌహతి–తాంబరం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(15630) రైలుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఏసీ బోగీలో దట్టమైన పొగ రావడంతో ఆదివారం ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకూ ఆ రైలును కాకినాడ జిల్లా అన్నవరం స్టేషన్‌లో నిలిపివేశారు. బోగీలోని ప్రయాణికులు ఆందోళనతో కిందకు దిగిపోయారు. సమాచారం అందుకున్న రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది బోగీని తనిఖీ చేశారు. చక్రాల వద్ద బ్రేక్‌లలో సాంకేతిక లోపంతో పొగ వస్తోందని గుర్తించారు. వెంటనే మరమ్మతులు చేసి, రైలును పంపించారు.

రైతులకిచ్చే రిటర్నబుల్ ప్లాట్లకు నేడు 'ఈ-లాటరీ'

తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూ సమీకరణ పథకం కింద ఇటీవల భూములు అందజేసిన రైతులకు సోమవారం ఈ–లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించనున్నట్టు సీఆర్డీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్–17 రహదారి నిర్మాణం వల్ల ప్రభావితమైన అనంతవరం మినహాయింపు భూమికి సంబంధించిన 24 మంది రైతులకు, మల్కాపురం సర్వే నంబర్–18లో మినహాయింపు భూమివల్ల ప్రభావితమైన ఇద్దరికి, మల్కాపురం అనధికార లేఅవుట్ వల్ల ప్రభావితమైన ఏడుగురు రైతులకు ఈ–లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయిస్తామని పేర్కొంది. 225 మంది రైతులకు మొత్తంగా 405 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయించబడతాయని తెలిపింది. వీటిలో 264 ప్లాట్లు 9.14 కింద భూములు అందజేసిన రైతులకు, మిగిలిన 108 ప్లాట్లు ప్రత్యామ్నాయ ప్లాట్లు అని వివరించింది. సంబంధిత రైతులు సంబంధిత ప్రొవిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరింది.

మల్లన్న సన్నిధిలో మహా దోపిడీ!



శ్రీశైల ఆలయం

శ్రీశైలం ఆలయంలో ప్రతి పనికీ మామూళ్లు వసూలు చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా అనుచరులు

దేవస్థానంలో ఏ టెండర్ అయినా 7 శాతం బి-ట్యాక్స్ చెల్లించాల్సిందే..

- దాతలు భవనాలు నిర్మించాలన్నా కమీషన్ సమర్పించుకోవాల్సిందే
- శ్రీశైలం మండలంలో ఇసుక, కంకర టన్నుకు రూ.100 చొప్పున బి–ట్యాక్స్
- సున్నిపెంటలో మద్యం దుకాణాల నుంచి నెలకు రూ.2లక్షలు వసూలు
- డబ్బులు ఇవ్వకపోతే ఒక్క పనీ జరగదు...అవసరమైతే దాడులకూ వెనుకాడరు
- ఈ దందాల కోసం ప్రత్యేకంగా ఒకరిని పెట్టుకున్న ఎమ్మెల్యే బుడ్డా
- ఏడాదిన్నరగా అడ్డూ, అదుపు లేకుండా సాగుతున్న దోపిడీపర్వం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీశైలం మల్లన్న సన్నిధిలో స్థానిక టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనుచరులు మహాదోపిడీకి పాల్పడుతున్నారు. దేవస్థానంలో ఏ పని చేయాలన్నా కాంట్రాక్టర్ నుంచి 7 శాతం బి–ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. చివరికి దాతలు వచ్చి భక్తులకు ఉపయోగపడే సత్రాలు, భవనాలు నిర్మించి ఇవ్వాలన్నా కమీషన్లు సమర్పించుకోవాల్సిందేనని హెచ్చరిస్తున్నారు. వారు చెప్పినట్లు వినకపోతే ఏ పనీ జరగకుండా అడ్డుకుంటున్నారు. కాంట్రాక్టర్లపై దాడులకు సైతం వెనుకాడటం లేదు.

వసూళ్ల కోసమే మండలానికి ఒక ఇన్‌చార్జి

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి శ్రీశైలం మండలానికి తన అనుచరుడిని ఇన్‌చార్జిగా పెట్టారు. ప్రతి శాఖ అధికారులను పిలిపించి ఆయనకు పరిచయం చేశారు. తన అనుచరుడు చెప్పినట్లు వినాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఆయన దేవస్థానంలో ఏ పని చేస్తున్నా కాంట్రాక్టర్ నుంచి 7 శాతం బి–ట్యాక్స్ ముక్కుపిండి వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. క్యూ కాంప్లెక్స్ మరమ్మతులు, మాడవీధుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, పుష్కరిణి అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ల నుంచి ఎమ్మెల్యే బుడ్డా అనుచరుడు బి–ట్యాక్స్ వసూలు చేసినట్లు సమాచారం. అదేవిధంగా శివరాత్రి, సంక్రాంతి, ఉగాది, దసరా, కార్తీకమాసం, శ్రావణ మాసం తదితర ప్రత్యేక పర్వదినాల సమయంలో పెండాల్స్, షామియానాలు, తాత్కాలిక విద్యుత్ దీపాల అలంకరణ, భక్తులకు ఇతర సదుపాయాల కల్పన కోసం పనులు చేసిన కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

దేవస్థానం ఆదాయానికి భారీగా గండి

కాంట్రాక్టర్లను సిండికేట్‌గా మార్చి కమీషన్లు వసూలు చేయడంలోనూ ఎమ్మెల్యే బుడ్డా అనుచరుడు కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన కాంట్రాక్టర్లను పిలిపించి 'ఎవరు ఏ టెండర్ వేస్తారనేది ముందుగానే నిర్ణయించుకోండి. కేవలం 1 నుంచి 3 శాతం మాత్రమే నిర్ణీత ధర కన్నా తక్కువకు టెండర్ వేయండి. ఆ తర్వాత ఆఫీసులో నేను చూసుకుంటాను. మా కమీషన్ 7 శాతం ఇవ్వండి. మీరు పోటీ పడి 10 నుంచి 20 శాతానికి తక్కువకు టెండర్ వేసి నష్టపోవద్దు.' అని హితబోధ చేస్తున్నట్లు తెలిసింది. తద్వారా దేవస్థానం ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. మరోవైపు శ్రీశైలం క్షేత్రం వద్ద భక్తులకు ఉపయోగపడేలా సత్రాలు, ఇతర ప్రైవేట్ భవనాలను నిర్మించే దాతలను బెదిరించి కూడా బి–ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీశైలంలో 4స్టార్ హోటల్ నిర్మించతలపెట్టిన హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యాపారవేత్త నుంచి కూడా బి–ట్యాక్స్ వసూలు చేశారని సమాచారం.

బి-ట్యాక్స్ చెల్లించకపోతే దాడులే...

ఎమ్మెల్యే బుడ్డా అనుచరులకు బి–ట్యాక్స్ చెల్లించకపోతే కాంట్రాక్టర్లపై దాడులకు సైతం వెనుకాడటం లేదు. గతంలో దేవస్థానం నిర్వహించిన క్లోక్ రూమ్ టెండర్‌లో పాల్గొనేందుకు వచ్చిన సున్నిపెంటకు చెందిన ఓ కాంట్రాక్టర్‌పై దాడి చేసి పంపించారు. తాజాగా ఈ నెల 11వ తేదీన తలనీలాలు పోగుచేసుకునే కాంట్రాక్టు కోసం రూ.50లక్షలు చొప్పున చెక్కులు తీసుకుని బహిరంగ వేలంలో పాల్గొనేందుకు దేవస్థానం పరిపాలన భవనం వద్దకు వచ్చిన కాంట్రాక్టర్లపైనా దాడి చేసి రక్తం వచ్చేలా కొట్టారు. తమ ఎమ్మెల్యేతో మాట్లాడుకుని బేరం కుదుర్చుకున్న తర్వాతే రావాలని బెదిరించి పంపారు. ఇలా తరచూ కాంట్రాక్టర్లను బెదిరిస్తూనే ఉన్నారు.

బుడ్డా బొమ్మ ఉంటే టిప్పర్ ఆగదు

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీశైలం మండలంలో ఇసుక, కంకర ఎవరూ అమ్మకూడదని ఎమ్మెల్యే బుడ్డా అనుచరుడు హుకుం జారీ చేశారు. ఇసుక, కంకర అమ్మేవారిపై పోలీసు కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురిచేశారు. అనంతరం ఇసుక, కంకర తన వద్దే కొనుగోలు చేసి అమ్ముకోవాలని చెప్పాడు. టన్నుకు అదనంగా రూ.100ఇవ్వాలని ఆదేశించాడు. దీనికి వ్యాపారులు అంగీకరించడంతో ఇసుక, కంకర రవాణా కోసం ఆయన ఏకంగా టిప్పర్లు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఆ టిప్పర్లు ఎవరూ ఆపకుండా వాటిపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించాడు. దీంతో ఎక్కడా వాటికి బ్రేకులు పడకుండా 24 గంటలూ తిరుగుతున్నాయి. మరోవైపు సున్నిపెంటలో ఉన్న రెండు మద్యం షాపుల నుంచి కూడా నెలకు రూ.2లక్షల చొప్పున వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇసుక, కంకర సరఫరా చేసే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనుచరుడి టిప్పర్లు

కుంతీమాధవుని సన్నిధిలో జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

కాకినాడ జిల్లా పిఠాపురంలోని కుంతీ మాధవస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు ఆశీర్వచనాలు, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉన్నారు. అనంతరం జస్టిస్ రాయ్ పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామిని, పదో శక్తిపీఠం పురుహూతికా అమ్మవారిని, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

– పిఠాపురం

ఈ-స్టాంప్ కేసులో అమిలినేనికి హైకోర్టు నోటీసులు

కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మెడకు ఈ- స్టాంప్‌ల కుంభకోణం చుట్టుకుంది. ఈ–స్టాంప్ కుంభకోణంపై వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య వేసిన పిల్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు ఎమ్మెల్యే అమిలినేని, మరో 11 మందికి నోటీసులు జారీ చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 18లోపు వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నోటీసులతో అమిలినేనికి గట్టి షాక్ తగిలినట్టైంది. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర డీజీపీ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజీ, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్, యూనియన్ ఆఫ్ ఇండియా, బోయ ఎర్రప్ప అలియాస్ మీ– సేవ బాబు, కట్టా భార్గవి, ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్‌కు హైకోర్టు నుంచి నోటీసులు అందాయి.

విద్య అనేది మెదడును వికసింపజేయటానికే కానీ, వేధించటానికి కాదు!
– స్వామి రంగనాథానంద

సాక్షి
సోమవారం, 15 డిసెంబర్ 2025

పది నీతులు, పది బూతులు

కుందవరపు చౌడప్ప పేరు తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధమే. 'నీతులకేం కానీ, బూతాడక పోతే దొరకు నవ్వు పుట్టదు ధరలో' అంటాడాయన. 'సభలో పది నీతులూ, పది బూతులూ ఉన్న పద్యాలు చెప్పినవాడే అధికు'డంటూ నీతినీ, బూతునూ ఒకే గాటన కట్టిన తెంపరి ఆయన. అక్షరాన్ని సాక్షాత్తు 'సరస్వతి'గా ఉపాసించారు కనుకనే పూర్వులు రచనను 'సారస్వత' మన్నారు. అలా అక్షరాన్ని పవిత్రంగా భావించేవారెవరైనా బూతు రాతలో రోతనే తప్ప నీతినీ, నవ్వునూ చూడలేరు. ఒకానొక విశ్వవిద్యాలయంలో తోటి ఆచార్యుని చర్మరోగాన్ని ఆక్షేపిస్తూ ఏకంగా పద్యాలే రాసి తనకు అబ్బిన పద్యవిద్యను బురదగుంటలో పొర్లించిన ఇటీవలి ఆచార్య పుంగవులూ లేకపోలేదు కానీ, తెలుగు సాహిత్యం అదృష్టం కొద్దీ బూతుకవిగా చౌడప్ప ఒక్కడే చరిత్ర కెక్కాడు. ఇప్పుడు లెక్కకు మిక్కిలిగా బూతుల బుంగల్ని సృష్టించి సామాజిక మాధ్యమాలు ఆ హేయచరిత్రకు వేల సంఖ్యలో కొత్తపుటలు జోడిస్తున్నాయి.

నిజానికి మాధ్యమాలు సామాజికీకరణ చెందడం ఎంతైనా స్వాగతించదగినదే; అందువల్ల తమ భావాలను ఇతరులతో పంచుకునే అవకాశం కొత్తకొత్త వర్గాలకు అందు బాటులోకి వచ్చింది. దాంతోపాటే అవి అసభ్యతా, అశ్లీలం, బూతు, వ్యక్తిగతమైన వేధింపు వగైరాల రూపంలో చెప్పలేనంత మురికినీ తెప్పలుగా పారిస్తున్నాయి. డ్రైనేజీ స్కీములేక అది డేంజర్‌గా మారుతోంది. కాకపోతే, మనందరికీ తెలిసిన 'బూతు'లాంటి మోటు మాటలతో కాకుండా ఎక్కువమందికి తెలియని 'ట్రోలింగ్' అనే నాజూకు పేరుతో ఇది చలామణీ అవుతోంది. స్కాండెనేవియా జానపద కథల్లోని రాక్షసులు, మరుగుజ్జుల్లాంటి జగడాలమారి, అసాంఘిక శక్తులను సంకేతించడంతో ప్రారంభించి, చేపలకు వేసే ఎర వరకూ పదిహేనో శతాబ్ది నుంచి రకరకాల అర్థాల్లో వాడుతూ వచ్చిన ఈ 'ట్రోల్' అనే మాట ఇప్పుడు రకరకాల అసహ్యార్థాలలో అంతర్జాల సంస్కృతిలో స్థిరపడింది.

భారతీయ సమాజంలో తిట్టుకూ, బూతుకూ స్త్రీలనే లక్ష్యం చేసుకోవడం మొదటి నుంచీ ఉన్నదే. సామాజిక మాధ్యమాలు ఇందుకు కొత్తగా అందివచ్చిన రొచ్చుబండలయ్యాయి. అక్కడక్కడ స్వయంగా మహిళలూ ఇందులో భాగస్వాములవడం ఈ అధఃపతనంలో కొత్త లోతు. సహజంగా స్త్రీల నుంచే దీనిపట్ల తీవ్ర నిరసన వెల్లువెత్తుతోంది. బూతులకు, వేధింపులకు గురవుతున్న కొంతమంది మహిళా యూట్యూబర్లు ఈ మధ్య ఒక పోలీస్ ఉన్నతాధికారిని కలిసి దీనిపై ఫిర్యాదు చేశారు. అయినా దీనికి అడ్డుకట్టపడే సూచన కానీ, పడుతుందన్న ఆశకు ఆస్కారం కానీ కనిపించడం లేదు. ఫేస్‌బుక్ మాధ్యమంలో చురుగ్గా పనిచేస్తున్న ఒక గ్రూపు తన వంతుగా రంగంలోకి దిగి దీనిపై ఒక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించి, కొన్ని సందేశాత్మక వీడియోలను ప్రచారంలోకి తెచ్చింది.

అయితే, సమస్య ఎన్నో శక్తుల భాగస్వామ్యంతో లోతుగా వేళ్లూనుకున్న స్థితిలో పై మెరుగుల చర్యల వల్ల ఫలితముంటుందా అన్న ప్రశ్నా ఎదురవుతుంది. ఉదాహరణకు, మహిళలు విద్యా, ఉద్యోగాల్లోనే కాక, ఆ యా సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలమవడాన్ని కంటగించుకునే సాంప్రదాయిక శక్తులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుంటూ తమ అసహనాన్నీ, అక్కసునూ వెళ్ళగక్కుతున్నాయి. ఇంకోవైపు, వివిధ భావజాలాల మధ్య ఘర్షణ పతాకస్థాయికి చేరుకున్న నేటి దేశీయ వాతావరణంలో వాటికి నాయకత్వం వహించే రాజకీయ పక్షాలు సాంప్రదాయిక మాధ్యమాలకు అదనంగా సామాజిక మాధ్యమాలనూ యథేచ్ఛగా వాడుకుంటున్నాయి. అధికార బలంతోపాటు అర్థబలం, అంగబలం దండిగా ఉన్న శక్తులు ఈ బూతులూ, తిట్ల పంచాంగాన్ని వ్యవస్థీకృతం చేసి తెర వెనుక నుంచి నడిపిస్తున్న సూచనలూ పొడగడుతున్నాయి.

దేవుళ్ళూ, మతమూ, సంస్కృతీ, సభ్యతా, సంస్కారాలతో సహా మనవనుకునే అన్నిటినీ ఆకాశానికెత్తే నోళ్లే బూతులూ, అశ్లీలాల మురికిని పుక్కిలించడం ఈ మొత్తంలో ఒక అపహాస్యభరితమైన అతిపెద్ద వైరుధ్యం. తమవైన వ్యవస్థలకూ, విలువలకూ తమ చేతులతోనే చెరుపుకోలేనంత మసీ, మకిలీ అంటించి చెరుపు చేస్తున్నామన్న స్పృహ కూడా లోపించిన పరిస్థితి. అన్ని తేడాలకూ అతీతంగా అందరూ ఒక్కటై కడతేర్చవలసిన సామాజిక రుగ్మతగా గుర్తించడమే దీనికి ఏకైక పరిష్కారం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.10.04 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** చిత్త ప.12.53 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.7.03 నుండి 8.48 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.16 నుండి 1.00 వరకు తదుపరి ప.2.27 నుండి 3.11 వరకు, **అమృత ఘడియలు:** తె.5.34 నుండి 7.17 వరకు (తెల్లవారితే మంగళవారం), **సర్వ ఏకాదశి.**

సూర్యోదయం : 6.25
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

టెక్నిక్

మీరు మీ సిక్స్త్ సెన్స్‌ను అభివృద్ధి చేసుకోలేకపోతే విజయవంతమైన స్ట్రైకర్ కాలేరు. గోల్‌ను మీరు 'స్మెల్' చేయగలగాలి. గోల్ కీపర్ కన్నుగప్పటానికి మీకు సెకను కంటే తక్కువ సమయం ఉంటుంది. ఆ లోపే మీరు గోల్ కొట్టేసే టెక్నిక్‌ను, మానసిక బలాన్ని సాధించాలి.

– బైచూంగ్ భుటియా, ఫుట్‌బాలర్

దాటండి

కష్టపడి సాధన చేయటం ఎప్పుడూ శిక్ష కాదు. కఠోర దీక్షను మీరు మీ భాగస్వామిగా ఎంచుకుంటే... సంశయాల నుండి విజయం వైపు మళ్లుతారు. మీ గ్రామం దాటుతారు. జిల్లాను దాటుతారు. మహిళగా మీకున్న పరిమితులన్నీ దాటేస్తారు. అది కదా విజయం!

– గీతా ఫోగట్, రెజ్లర్

క్రమశిక్షణ



జీవితంలో మాదిరిగానే గోల్ఫ్‌లో కూడా క్రమశిక్షణ నుండే విజయం లభిస్తుంది. ఇక్కడ ప్రతి రౌండూ ఒక కొత్త ప్రారంభం. మానసికంగా మీరు ఆరోగ్యంగా ఉంటే ప్రతిదీ మీకు అనుకూలంగానే మారుతుంది. పట్టును వీడకండి. నమ్మకం కోల్పోకండి.

– జీవ్ మిల్ఖా సింగ్, గోల్ఫర్

షార్ట్‌కట్స్



నా నిఘంటువులో షార్ట్‌కట్ అనే మాటలేదు. పనిని సులభంగా చేసేయాలన్న తలంపు ఎప్పుడైతే వస్తుందో అప్పుడే మనం పక్కదారుల కోసం వెదుకుతాం. పని ఉద్దేశం సులభంగా జరగటం కాదు. సక్రమంగా జరగటం. కష్టపడండి. పనిలో సంతృప్తి లభిస్తుంది.

– నార్మన్ అనిల్ బ్రౌన్, రిటైర్డ్ ఎయిర్ చీఫ్ మార్షల్

దీదీ

నాకు గుర్తుంది. దీదీ (అక్క) టోర్నమెంట్ గెలిచి తన ప్రైజ్ మనీ అంతా నా ఎక్విప్‌మెంట్ కొనటానికి ఖర్చు పెట్టేసింది. జీవితపు తొలినాళ్లలో మనం ఒక దారిలో పడటానికి సహాయం చేసిన వారి వల్లనే మనం ఎదుగుతాం. దీదీ లేకుండా ఇప్పుడు నేనిక్కడ లేను.

– రాహుల్ బెనర్జీ, ఒలింపియన్ ఆర్చర్

టాలెంట్

కష్టపడి పని చేయటం వల్లనే నేను ఇక్కడికి చేరుకున్నానని నాకు తెలుసు. నేను కష్టపడటం మానేసిన రోజు ఇదంతా పోతుంది. టాలెంట్ ఉన్నవాళ్లు కష్టపడి పని చేయటం మానేసినప్పుడు, కష్టపడి పని చేసేవాళ్లు టాలెంట్‌ను తేలిగ్గా ఓడించేస్తారని గుర్తుంచుకోండి.

– కెవిన్ డ్యూరాండ్, బాస్కెట్‌బాల్ ప్లేయర్

ఇది ప్రజల గొంతుకను నొక్కడమే!

అభిప్రాయం

భూమన కరుణాకర రెడ్డి

స్వేచ్ఛగా, విమర్శనాత్మకంగా పనిచేసే పత్రిక... ప్రజాస్వామ్యానికి రక్తనాళం లాంటిది. – నెల్సన్ మండేలా

ఈ మాటలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విని ఉండే అవకాశం లేదు. ఆయన దృష్టిలో పత్రికా స్వేచ్ఛ అంటే తనకు అనుకూల పత్రికల స్వేచ్ఛ మాత్రమే. ప్రశ్నించే పత్రిక అంటే భయం. అందుకే 'సాక్షి' మీడియా మీద కత్తి కట్టాడు. కక్ష పెంచుకుని వేధిస్తున్నారు. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై 19 కేసులు పెట్టారు. దేశ చరిత్రలోనే ఇలాంటిది ఎప్పుడూ ఎక్కడా జరగలేదు. జరిగే అవకాశం కూడా లేదు. ఆంధ్రప్రదేశ్‌లోనే ఇది సాధ్యం. ఎందుకంటే ప్రజాస్వామ్యంపై నమ్మకం, విశ్వాసం, గౌరవం లేని నాయకుడు చంద్రబాబు.

ఇదా విజనరీ లక్షణం?

దేశం భద్రంగా ఉండాలంటే పత్రికా స్వేచ్ఛ అతి ముఖ్యం అంటాడు జాన్ ఆడమ్స్. అమెరికా వ్యవస్థాపకులుగా పిలవబడే ఐదుగురిలో ఆయన ఒకరు. తాము భద్రంగా ఉండాలంటే ప్రశ్నించే పత్రికలు ఉండకూడదని బాబు నమ్మకం. ఆంధ్రప్రదేశ్‌ను భ్రష్టు పట్టించిన వాళ్లలో ఈయన ప్రథముడు. కానీ ఆయన తనని తాను విజనరీ అని చెప్పుకొంటారు. విజనరీకి ఉండాల్సిన మొదటి లక్షణం పత్రికా స్వేచ్ఛను కాపాడడం.

ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాల్లో పత్రికా స్వేచ్ఛ ఒకటి. ఆ స్తంభం తన సొంత స్తంభం కావాలని చంద్రబాబు కోరిక. 'సాక్షి' అంటే చంద్రబాబుకు ఎందుకు భయమంటే... అది ప్రశ్నిస్తుంది; ప్రజల నిరసనను, అసహనాన్ని, కోపాన్ని, రౌద్రాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రజల ఆగ్రహం నరసింహస్వామిగా మారి ఆ స్తంభం లోంచి ఉగ్రరూపం బయట పడుతుందని బాబు భయం. అందుకే 'సాక్షి' గొంతు నొక్కాలి, కేసులు పెట్టాలి, వీలైతే మూసి వేయించాలి. టీవీ ప్రసారాల్ని అడ్డుకోవాలి. అందుకే ఎడిటర్‌కూ, ఆ మీడియా జర్నలిస్టులకూ అన్ని వేధింపులు, కేసులు!

చారిత్రక అవసరం లోంచి...

'సాక్షి' ఒక చారిత్రక అవసరం లోంచి పుట్టింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పథకాల్ని, ప్రజా క్షేమం కోసం ఆయన చేస్తున్న మహోత్తర కార్యక్రమాల్ని, జనాన్ని ప్రేమించే ముఖ్యమంత్రిగా ఆయన ఉన్నందుకు కత్తి కట్టి, మంచి పనుల్ని వక్రీకరిస్తున్న నేపథ్యంలో 'సాక్షి' వచ్చింది. అబద్ధం నిజం అవుతున్నపుడు, నిజాల్ని పచ్చి నిజాలుగా చెప్పడానికి వచ్చింది. నిజం అంటే చంద్రబాబుకు భయం. అందుకే 'సాక్షి' అంటే భయం. ప్రశ్నను భరించలేని కూటమి ప్రభుత్వం కుట్రకు తెరతీసింది. 'సాక్షి'లో వచ్చే కథనాల్లోని కఠోర సత్యాలను భరించలేక భగ్గుమని ఒళ్లంతా కారం పూసుకుని మండి పడుతున్నారు.

◆ ఇంతకీ 'సాక్షి' ఏమడిగింది? నిజాలు చెప్పమని నిలదీసింది. పాలనలోని డొల్లతనాన్ని ప్రశ్నించింది. చంద్రబాబు వక్రీకరణలకు భాష్యం చెప్పింది. అభివృద్ధి, సంపద సృష్టి పదాలకు అసలు అర్థం అప్పులు, చంద్రబాబు సొంత సంపద సృష్టి అని తాత్పర్యం వివరించింది. అందుకే బాబుకు అదంటే కసి, క్రోధం, పగ!

ఇంతకీ 'సాక్షి' ఏమడిగింది? నిజాలు చెప్పమని నిలదీసింది. పాలనలోని డొల్లతనాన్ని ప్రశ్నించింది. చంద్రబాబు వక్రీకరణలకు భాష్యం చెప్పింది. అభివృద్ధి, సంపద సృష్టి పదాలకు అసలు అర్థం అప్పులు, చంద్రబాబు సొంత సంపద సృష్టి అని తాత్పర్యం వివరించింది. బూటకపు మాటలకు ప్రతిపదార్థాన్ని విప్పి చెప్పింది. అందుకే కసి, క్రోధం, పగ!

ప్రశ్నించడమే తప్పా?

18 నెలల్లో చంద్రబాబు ఏం చేశాడు? 'సూపర్ సిక్స్' పేరుతో వంచించాడు. ఫించన్లు పెంచినట్టే పెంచి లక్షల్లో లబ్ధిదారుల్ని తగ్గించాడు. 'అమ్మకు వందనం' అంటూ తల్లుల్ని తొలగించాడు. ఏడాది ఎగ్గొట్టి, అరకొరగా ఇచ్చాడు. సిలిండర్ పథకంలో చంద్రబాబు గ్యాస్ కొట్టిందే ఎక్కువ. రైతులకు పంగనామాలు పెట్టి నామ్ కే వాస్తే నిధులిచ్చాడు. అన్ని బస్సులూ ఫ్రీ అని, కొన్ని బస్సుల్లోనే చెల్లెమ్మలు ఎక్కేలా చేశాడు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డల పథకం ఊసే లేదు. అయినా 'సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్' అని ప్రకటనలు ఇచ్చుకుంటూ ఉంటే 'సాక్షి' ప్రశ్నించడం తప్పెలా అవుతుంది?

ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్ని సంస్థానాలుగా భావించి ప్రజలతో కప్పం కట్టించుకుంటూ, పాలెగాళ్లలా అన్ని వనరుల్నీ దోచుకుంటూ ఉంటే ప్రశ్నించడం తప్పా? పేకాట క్లబ్బులు, గంజాయి బ్యాచ్‌లు ఆడపిల్లలపై అత్యాచారాలు యథేచ్ఛగా సాగిస్తుంటే, పోలీసులు చూసీచూడనట్టు ఉంటే 'సాక్షి' కూడా చూసీ చూడనట్టుండాలా? అన్ని రంగాల్లో వైఫల్యాలు చెంది తండ్రీ కొడుకులు విమానాల్లో తిరుగుతూ, పెట్టుబడుల పేరిట దేశాలన్నీ పర్యటిస్తూ కాశీమజిలీ కథలు చెబుతూ ఉన్నా కూడా మౌనం వహించాలా?

వైసీపీ హయాంలో, జగన్ పాలనలో రాష్ట్రం శ్రీలంక అయిపోయిందని గోబెల్స్ ప్రచారం చేసినవాళ్లు 18 నెలల్లో చంద్రబాబు, ఆయన కూటమి ప్రభుత్వం రెండున్నర లక్షల కోట్లకు పైగా ఎందుకు అప్పులు చేశారో చెప్పగలరా? అనేక పథకాలతో ప్రజలకు చేరువై, ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌పై చిమ్మిన విషాన్ని చూసి ఒకవేళ గోబెల్స్ బతికి ఉంటే మళ్లీ ఆత్మహత్య చేసుకునేవాడు. సువిశాల రష్యాలోని జార్ చక్రవర్తుల అహంకారాన్ని, అరాచకాల్ని 'ప్రావ్దా' పత్రిక ద్వారా లెనిన్ కూల్చేశాడు. ప్రజల గొంతు పత్రిక ద్వారా వినిపించకపోతే పాలకుల గొంతే శిలాశాసనంగా మారుతుందని అంటాడు లెనిన్. ప్రపంచానికి కమ్యూనిజాన్ని ప్రసాదించిన లెనిన్ పార్టీ నిర్మాణానికి, విప్లవానికి ప్రావ్దా మూలస్తంభం అంటాడు.

పత్రికా స్వేచ్ఛను గౌరవించిన వాళ్లే చరిత్రలో నిలబడ్డారు. కూల్చేయాలని చూసిన వాళ్లు కాలగర్భంలో కలిసిపోయారు. పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో ఒక భాగం కాదు, ప్రజాస్వామ్యం అంటేనే పత్రికా స్వేచ్ఛ అంటాడు ప్రముఖ అమెరికా పాత్రికేయుడు వాల్టర్ క్రాన్‌కైట్. కానీ మన చంద్రబాబు పాత్రికేయుల్ని జైల్లో పెట్టే పనిలో బిజీగా ఉన్నాడు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు గొంతెత్తినా మరుక్షణంలోనే పోలీసులు వాలిపోయే వ్యవస్థను సృష్టించాడు. ప్రజాస్వామ్యంలో పత్రికలపై పగబట్టిన వాళ్లంతా చిరునామా లేకుండా పోయారు. చంద్రబాబు కూడా అతీతుడు కాదు. స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలని చూసిన వాళ్లంతా చరిత్రలో కలిసిపోయారు.

అల్లావుద్దీన్ అద్భుత దీపం ఉందని చెబుతున్న చంద్రబాబు చేతిలో అసలు దీపమే లేదు. ఆయన చేతిలో ఉన్నది అగ్గిపెట్టె మాత్రమే! దాంతో రాష్ట్రాన్ని తగలబెట్టే పనిలో ఉన్నాడు.

సత్యం జయిస్తుంది. 'సాక్షి' కూడా జయిస్తుంది. దాని గొంతు నొక్కడం సాధ్యం కాదు, ఎందుకంటే అది ప్రజల గొంతు!

వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే

క్రైస్తవానికి పునాది లౌకికవాదం!

సమాజం లార్వా నుండి ప్యూపా రూపంలోకి, అటునుండి సీతాకోక చిలుకలా మారే ఒక నిరంతర ప్రక్రియలో ఉంటుంది. సమాజ గతి చలనం ఎన్ని సంస్కృతులు, ఎన్ని జాతులు, మతాలు, ఖండాలు ఏర్పడినా... అది ఒక సమూహంగా మనడానికి గతి మార్గాన్ని మార్చుకుంటూ వెళ్తూ ఉంటుంది. ఇందులో కొన్ని ప్రయోగాలు ఉంటాయి. కొన్ని అనుభవ రీత్యా నేర్చుకున్న పాఠాలు ఉంటాయి. కొన్ని శాస్త్రీయ పరిణామాలు ఉంటాయి. వీటన్నిటికీ కావాల్సిన ఫౌండేషన్ – ఒక బేసిక్ సోషల్ ఫ్యాబ్రిక్. అది సమాజం మొత్తానికీ ఉమ్మడిగా సమ్మతమైన మోరల్ కోడ్, సోషల్ కోడ్!

ఇది వ్యక్తిగత అభిరుచులు, నమ్మకాలు, హక్కులకు అతీతంగా సామూహిక ప్రయోజనాల మీద నిలబడి ఉండాలి. లేనప్పుడు– వ్యక్తిగత హక్కులు, సామూహిక నిబంధనలకు లోనై– ఒక ఘర్షణ పూరితమైన, ఒక తిరోగమన సమాజానికి దారి తీస్తుంది. ఈ కోడ్– సమానత్వం, సౌభ్రాతృత్వంతో సమ్మిళితమైన స్వేచ్ఛ కలిగి ఉండాలి. స్వేచ్ఛ పరిమాణం ఎంత అన్నది మరో ప్రశ్న. తిరిగి అది 'ర్యాడికల్ ఇండివిడ్యువలిజం'ను ప్రేరేపిస్తే అది మరో తిరోగమన రూపాన్ని తీసుకుంటుంది. ఈ బ్యాలన్స్ ప్రజాస్వామిక వ్యవస్థలో ఇప్పటికీ ఎవాల్వ్ అవుతూ ఉంది. అయితే – ఎంతో విపరీతమైన ఘర్షణ రూపంలో కొన్ని తిరోగమన సమాజాలలో ఎంతో రక్తపాతం తర్వాత వస్తుంది. అందుకే వీటన్నిటికీ కావాల్సిన సత్తా ఉండే సోషల్, మోరల్ ఫ్యాబ్రిక్– ఒక మతమే! మతం అంటే 'కల్ట్'లా ఉండటం కాదు. రోజుకు ఎన్ని సార్లు పూజించాలి, ఏం బట్టలు కట్టాలి, మీసాలు ఎలా పెంచాలి... ఇలాంటి 'రూల్స్' మతాన్ని పోషించడం మొదలు పెడితే అది 'కల్ట్' అవుతుంది. ఆ 'కల్ట్' ఒక మూస పోసిన విధానంలో మనుషులను సామాజిక సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు అతీతంగా తయారు చేస్తుంది. అటు నుండి ఒక పిడివాదం మొదలవుతుంది. అది ఒక ఫండమెంటలిజానికి దారి తీస్తుంది. దైవ విశ్వాసాలకు, సోషల్ లాజిక్‌కు సరిగ్గా కుట్లు వేసి అందంగా తీర్చగలిగేదే ఆదరించదగ్గ మతం అవుతుంది. దేవుడు ఒక సామాజిక అవసరం.



ఒక మతానికి కావాల్సిన లిట్మస్ టెస్ట్ అంబేడ్కర్ చెప్తాడు: 'మతం అన్నది ముఖ్యంగా నియమ సూత్రాలకు సంబంధించినది అయి ఉండాలి. ఎప్పుడైతే అది నిబంధనల చుట్టూ తిరుగుతుందో మతానికి ఉండాల్సిన సారమైన (సామాజిక) బాధ్యతను చంపేస్తుంది' ('కుల నిర్మూలన' నుండి). మత ప్రాతిపదిక మీదనే–అంబేడ్కర్ ప్రగతి వాద కోణంలో మాట్లాడితే– దేవుడు ఈ 'లిట్మస్ టెస్ట్'కు నిలబడలేని మనిషి/ ఆత్మ/ శక్తి అయితే ఆ దేవుడు నీతిమంతుడు కాలేడు.

సమాజంలో ఒకరి అభిప్రాయాలకు, నమ్మకాలలో ఎన్ని తేడా, తారతమ్యాలు ఉన్నా... కలిసి ఒక సామూహిక ప్రయోజనాన్ని పండించడం కోసం ప్రజలు నడవడం ఈ రోజు సమాజానికి కావాల్సిన అత్యవసరమైన అంశం. యేసు క్రీస్తు యోహాను సువార్త గ్రంథంలో ఇలా అంటాడు: 'నేను మీకు ఒక కొత్త ఆజ్ఞను ఇస్తున్నాను – మీరు ఒకరినొకరు ప్రేమించుకొనవలెను. నేను మిమ్మును ప్రేమించినట్టు మీరు కూడ ఒకరిని మరొకరు ప్రేమించవలెను.' అదే రకంగా మార్కు సువార్త గ్రంథంలో 'నీవు నీ పొరుగువానిని నీలాగునే ప్రేమింపవలెను' అంటాడు. ఇది సింపుల్‌గా కనిపించవచ్చు. కానీ చాలా డెప్త్ ఉన్న స్టేట్‌మెంట్. ఇక్కడ పొరుగు క్రైస్తవుడిని ప్రేమించమని యేసు క్రీస్తు చెప్పలేదు. లేదా నాస్తికుడిని ప్రేమించవద్దు అని చెప్పలేదు. హంతకుడు, దొంగ ఎవరైనా సరే వాళ్ళను ప్రేమించవద్దు అని చెప్పలేదు. పది మంది కుష్టువాళ్ళను బాగు చేస్తే అందులో ఒక కుష్టువాడు మాత్రమే జీసస్‌ను ఫాలో అవుతాడు. ఆయన 'ముందుగా నన్ను ఫాలో అయితేనే నిను బాగుపరుస్తా' అనే కండిషన్ పెట్టి బాగుపరచలేదు. జీసస్ విధానం పూర్తిగా పక్షపాత రహితం, రాజకీయ స్వార్థాల నుండి దూరం, అందరినీ చేరదీసే స్వభావం, విశ్వమానవతా దృష్టి కలిగినది. ఆ అర్థంలో ఆయన ఆచరణలో 'లౌకికత' ఉంటుంది.

ముగింపుగా – క్రిస్టియానిటీ ఎదగడానికి ప్రభుత్వ చట్టాలు అవసరం లేదు. క్రిస్టియానిటీ యుద్ధాలు చేసి ఎదగాల్సిన అవసరం లేదు. ఎందుకంటే– క్రిస్టియానిటీకి మూలం సెక్యులరిజం!

– పి. విక్టర్ విజయ్ కుమార్ । రచయిత, విమర్శకుడు
(క్రిస్మస్ ఆగమన కాలం సందర్భంగా)

భారత తొలి మహిళా ఆర్కిటెక్ట్

విజ్ఞాన వేగుచుక్కలు-34

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిర్మించబడిన తొలి భారతీయ నగరం చండీగఢ్... అంతర్జాతీయంగా ఆర్కిటెక్చర్, పట్టణ ప్రణాళికల విషయంలో పేరుగాంచింది. హిమాలయాల శివాలిక్ శ్రేణుల చెంత నెలకొన్న ఈ నగరం యునెస్కో ద్వారా 'వరల్డ్ హెరిటేజ్ నిర్మాణం'గా కూడా 2016లో గుర్తింపు పొందింది. ఆ అందమైన, అర్థవంతమైన నిర్మాణాలను చూసినప్పుడు లి కర్బూసియర్ (స్విస్–ఫ్రెంచ్), పీరి జినరేట్ (స్విస్), మ్యాక్స్ ఫ్రై (బ్రిటిష్), జేన్ డ్ర్యూ (బ్రిటిష్) వంటి నలుగురు వాస్తు శిల్పులతో పాటు గుర్తుకొచ్చే ఏకైక మహిళ ఊర్మిళా యూలీ చౌధురీ. ఆ నగరంతో మూడు దశాబ్దాల పాటు ముడిపడిన ఈమె రచయిత్రి, అనువాదకురాలు, చిత్రకారిణి, పియానో వాయించగల గాయని, రంగస్థలం మీద రాణించిన నటి, విద్యార్హతలున్న తొలి ఆసియా – తొలి భారతీయ మహిళా ఆర్కిటెక్ట్. 'ద ట్రిబ్యూన్' పత్రికలో 1983 నుంచి ఒక పుష్కరం పాటు 'సిన్నర్స్ అండ్ విన్నర్స్' కాలమ్ నిర్వహించారు. ఆమె వాస్తు శిల్ప శాస్త్ర కౌశలంలో 'స్వచ్ఛత, నిరాడంబరత్వం, పారదర్శకత, వినయం, ఆర్థిక పరంగానే కాకుండా ఇతరంగా కూడా తక్కువ వనరులు వాడకం వంటి లక్షణాలు ద్యోతకమవుతాయ'ని ఆమెతో కలిసి పని చేసిన సర్బ్‌జిత్ సింగ్ బగ్గా వ్యాఖ్యానిస్తారు.

ఊర్మిళా యూలీ చౌధురీ

1923 అక్టోబర్ 4న ఉత్తర ప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో ఒక ఆంగ్లో–ఇండియన్ కుటుంబంలో ఆమె జన్మించారు. తండ్రి ఉద్యోగం కారణంగా పలు దేశాలలో పెరిగిన ఈమె కేంబ్రిడ్జ్ స్కూల్ సర్టిఫికెట్‌ను జపాన్‌లోనూ, ఆస్ట్రేలియాలోని సిడ్నీ విశ్వవిద్యాలయం నుంచి 1947లో ఆర్కిటెక్చర్ పట్టానూ పొందారు. కొంతకాలం అమెరికాలో ఉద్యోగం చేసి, 1951లో భారతదేశం తిరిగి వచ్చి లి కర్బూసియర్ బృందంతో కలిసి చండీగఢ్ నిర్మాణ ప్రణాళికలో అంతర్భాగమయ్యారు. ప్రభుత్వ భవనాలకు ఫర్నిచర్ కూడా ఆమె విలక్షణంగా తయారు చేయించారు. ఆమె పంజాబ్ రాష్ట్రపు చీఫ్ ఆర్కిటెక్ట్‌గా కూడా పని చేశారు. లి కర్బూసియర్ రచించిన ప్రఖ్యాత ఫ్రెంచ్ పుస్తకాన్ని 'త్రీ హ్యూమన్ ఎస్టాబ్లిష్మెంట్స్' పేరుతో అనువాదం చేశారు. అలాగే వారితో తన అనుభవాలను 'దోజ్ వర్ ద డేస్' పేరుతో రచించారు. 'రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్రిటిష్ ఆర్కిటెక్ట్స్' సంస్థలో సభ్యత్వం పొందిన తొలి మహిళ కూడా ఈమే. సుమారు 100 దాకా రైల్వే స్టేషన్లు, కళాశాలలు, హాస్టల్స్ వంటి పబ్లిక్ బిల్డింగ్స్‌కు డిజైన్, ప్లానింగ్ రూపొందించారు. చండీగఢ్‌లో పనిచేసే కాలంలోనే ఆర్కిటెక్ట్‌గా పని చేసిన అస్సామీ వ్యక్తి జుగల్ కిశోర్ చౌధురీని వివాహం చేసుకున్నారు. ఆధునిక భారత వాస్తు నిర్మాణ రంగంలో ఆమె చిరస్మరణీయురాలు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

విమానాలకూ 'రాజధానే'!

డేటా పాయింట్

దేశంలో రోజూ అత్యధిక దేశీయ విమానాలు వెళ్లే ఎయిర్‌పోర్టు ఢిల్లీ. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అక్టోబరులో విడుదల చేసిన డిసెంబరు రెండో వారం (8–14) షెడ్యూలు ప్రకారం... ఢిల్లీ నుంచి సగటున రోజూ 541 విమానాలు వెళ్తున్నాయి.



అన్నీ ఆటే!

జ్యోతిర్మయం

ఆయన ఒక జెన్ సాధువు. వయోవృద్ధుడు. మిత్రులను పిలిపించారు. 'మిత్రులారా! భిన్నమైన రీతిలో చనిపోవాలన్నది నా ఆశ. అందుకు ఏదైనా ఒక మార్గం చెప్పండి' అని అడిగారు.

'ఏమిటంటున్నారు... మరణం అనేది ఓ ఆటా? మీకు తెలియంది మాకెలా తెలుస్తుంది?' అన్నారు మిత్రులు. అయితే సాధువు కాసేపు ఆలోచించించి 'ఇప్పటి వరకూ ఎవరైనా నడుస్తూ నడుస్తూ చనిపోయేరా' అని అడిగారు. అందరూ కలిసి 'లేదు' అన్నారు. కానీ ఒకడన్నాడు, అలా నడుస్తూ నడుస్తూ ఒకరు చనిపోయినట్టు ఒకచోట చదివాను అని. 'సరే... అలాగైతే ఆ విధంగా నేను చనిపోవాలనుకోలేదు. నిల్చుని ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా' అని అడిగితే, 'అలాక్కూడా ఒకరు చనిపోయారు' అన్నాడు ఇంకొకడు.

అప్పుడు సాధువు, 'ఎవరైనా తలకిందులుగా యోగా చేస్తూ చనిపోయారా' అని అడిగారు. శీర్షాసన పద్ధతిలో ఎవరైనా మరణించారో లేదో తమకు తెలీదన్నారు. ఆ మాటతో సాధువుకు పట్టరానంత ఆనందమేసింది. వెంటనే లేచి నిల్చున్నారు. శీర్షాసనం వేశారు. ఆయనలో చలనం లేదు. అంతే, ఆ ఆశ్రమంలో ఆందోళన నెలకొంది.

ఇలా ఒక వ్యక్తి శీర్షాసనంతో ప్రాణం కోల్పోయినట్టు ఇప్పటి వరకూ వారెవరూ వినలేదు. వైద్యుణ్ణి పిలిపించారు. ఆయన పరీక్షించి సాధువు మరణించినట్లు నిర్ధారించారు. అనంతరం ఈ విషయాన్ని సాధువు అక్కయ్యకు చెప్పి తీసుకొచ్చారు. ఆవిడకు తొంభై ఏళ్ళు. మరణించిన తన సోదరుడిని చూసి తన దగ్గరున్న కర్రతో తమ్ముడి దేహం మీద మెల్లగా కొట్టారు. 'మరణించేటప్పుడు కూడా ఇదేం ఆటరా' అని అన్నారావిడ.

మరణాన్ని సైతం ఓ క్రీడగా మలుచుకున్న సాధువాయన. ఎవరి నుంచీ ఏదీ ఆశించకుండా జీవితాన్ని జీవించి అదృశ్యమైన మహాత్ముడు ఆ సాధువు. తమ పరిశ్రమను ఓ ఆటలా భావించి నడిపించడం తెలిసిన వారికి జీవితమూ ఓ క్రీడే సుమా! అప్పుడు వారికి జీవితంలో ప్రతిదీ ఓ ఆటే! చివరికి మరణం కూడా!!

– యామిజాల జగదీశ్

అటల్ ప్రేరణతో దేశాభివృద్ధి

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ సభల్లో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి

మదనపల్లె/రేణిగుంట/తిరుమల: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రేరణ, స్ఫూర్తితో ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని ఆర్థికంగా పురోగమన బాటలో నడుపుతున్నారని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి అన్నారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా జరుగుతున్న 'అటల్–మోదీ సుపరిపాలన యాత్ర'ను పురస్కరించుకుని పుష్కర్ సింగ్ ధామి అన్నమయ్యజిల్లా మదనపల్లె, తిరుపతి జిల్లా రేణిగుంట సమీపంలోని మర్రిగుంట కూడలిలో వాజ్‌పేయి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ అజాత శత్రువుగా దేశం మొత్తం వాజ్‌పేయిని గౌరవించిందన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఉత్తరాఖండ్ సీఎం తిరుమల శ్రీవారిని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

తిరువూరు టీడీపీలో ఏఐ రచ్చ

తిరువూరు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఫొటోలను మార్ఫింగ్ చేయవచ్చంటూ తెలుగుదేశం పార్టీ నేతలపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు గుప్పించారు. తాను ఓ మహిళతో సన్నిహితంగా ఉన్నట్లు మార్ఫింగ్ ఫొటోలను పోస్టు చేసిన వారిపై ఎమ్మెల్యే అదే రీతిలో వాట్సాప్ స్టేటస్‌లో స్పందించారు. ఇద్దరు నేతల ఫొటోలను ఎమ్మెల్యే వాట్సాప్ స్టేటస్‌లో పెట్టడంతో టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తనపై ఎంపీ కేశినేని అనుచర వర్గంలోని నాయకులు చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ మార్ఫింగ్ చేసిన ఫొటోలతో తన వ్యక్తిత్వ హననం చేయజాలరని, ఇదే విధంగా ఇద్దరు సీనియర్ నాయకుల మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

ఏపీఆర్‌జేసీ ఉన్నతస్థాయికి చేర్చింది

- తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు
- ముగిసిన ఏపీఆర్‌జేసీ స్వర్ణోత్సవాలు

మాట్లాడుతున్న తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ఏపీఆర్‌జేసీలో చదవటం వల్ల వేదిక మీదనున్న తామంతా జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లగలిగామని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు చెప్పారు. ఈ కళాశాల మాకు ఎంతో ఇచ్చిందన్నారు. నాగార్జునసాగర్‌లో రెండురోజులు జరిగిన ఏపీఆర్‌జేసీ స్వర్ణోత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపుసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణారావు మాట్లాడుతూ తాను చీఫ్ సెక్రటరీ స్థాయికి ఎదిగానని, మహేందర్‌రెడ్డి డీజీపీ స్థాయికి వెళ్లారని, జస్టిస్ తుకారాంజీ హైకోర్టు న్యాయమూర్తి అయ్యారని చెప్పారు. తమ ఎదుగుదలకు ఈ కళాశాలలోనే పునాది పడిందన్నారు. తెలంగాణ రిటైర్డ్ డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గురుకుల విద్యాలయాలు తన జీవితాన్ని తీర్చిదిద్దాయని చెప్పారు. జస్టిస్ తుకారాంజీ మాట్లాడుతూ ఇక్కడ గురువులు తమను మలిచిన తీరు. ఇచ్చిన స్ఫూర్తి, నింపిన ధైర్యం తమను ఇంతవారిని చేశాయని చెప్పారు. సభలో స్వర్ణోత్సవ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సభలో ఏపీఆర్ఈఐఎస్ సెక్రటరి వి.ఎన్.మస్తానయ్య, పార్వతీపురం మాజీ ఎంపీ డాక్టర్ డి.వి.జి. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

తెలంగాణలో హస్తం హవా!

సాక్షి, హైదరాబాద్: రెండో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ దాదాపుగా తొలి విడత ఫలితాలే పునరావృతమయ్యాయి. మొదటి విడత తరహాలోనే రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ స్థానాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులే విజయం సాధించారు. ఆదివారం రాష్ట్రంలోని 3,911 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. కాంగ్రెస్ మద్దతు పలికిన అభ్యర్థులు 2,067 మంది గెలుపొందారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు 1,160 స్థానాలు గెలుపొందగా, బీజేపీ బలపర్చిన అభ్యర్థులు 250 మంది గెలిచారు. మరోవైపు స్వతంత్రులు, సీపీఎం, సీపీఐ పార్టీలకు చెందినవారు..429 మంది గెలుపొందారు. వీరు మొత్తం స్థానాల్లో 11 శాతానికి పైగానే గెలుపొందడం విశేషం. ఇక రెండు విడతల్లో కలిపి కాంగ్రెస్ బలపర్చగా గెలిచిన వారి సంఖ్య 4,500 దాటింది. బీఆర్ఎస్ బలపర్చిన 2,300 మంది విజయం సాధించగా, బీజేపీ బలపర్చిన వారు 440 మంది వరకు గెలుపొందినట్లు గణాంకాలు చెబుతున్నాయి. రెండో విడతకు సంబంధించి 416 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో మాదిరిగానే రెండో విడతలో కూడా 55 శాతం వరకు పంచాయతీలు కాంగ్రెస్ బలపర్చిన వారికే దక్కగా, అదే సమయంలో బీఆర్ఎస్ సైతం మంచి పోటీ ఇచ్చింది. ఆ పార్టీకి 29 శాతం కంటే ఎక్కువగా పంచాయతీలు దక్కాయి. బీజేపీ మద్దతిచ్చిన వారు 6 శాతానికి పైగా విజయం సాధించారు.

పార్లమెంటు స్థాయీ సంఘం నివేదికకు ఎల్లోమీడియా వక్రభాష్యం

కొత్త ప్రభుత్వ వైద్యకళాశాలల ఆవశ్యకతను నొక్కివక్కాణించిన స్థాయీ సంఘం

- వచ్చే ఐదేళ్లలో 75 వేల సీట్లు పెరిగితేనే విద్యార్థుల వలసల కట్టడి సాధ్యమని అభిప్రాయం
- వైద్య విద్యలో అసమానతలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏపీ ఒకటని వెల్లడి
- కొత్త కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వాలు కృషి చేయాలని సూచన
- పీపీపీలో వైద్య కళాశాలల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి కేవలం పన్ను రాయితీలు చాలని ఉద్బోధ
- దీనిని వక్రీకరించి చంద్రబాబుకు అనుకూలంగా కట్టుకథలల్లుతున్న 'పచ్చ'పత్రిక
- వాస్తవానికి ఏపీలో నెలకొన్న అసమానతలను చెరిపేసేలా ఐదేళ్ల కిందటే వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలు
- 17 కళాశాలల ఏర్పాటుతో 2,550 ఎంబీబీఎస్ సీట్లు సమకూర్చేలా 2019లోనే అడుగులు
- విదేశాలకు ఏపీ విద్యార్థుల వలసల నియంత్రణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి
- ప్రభుత్వ రంగంలోనే పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల బలోపేతానికి చర్యలు
- అయితే జగన్ ప్రారంభించిన, ప్రారంభానికి సిద్ధం చేసిన కళాశాలలనూ పీపీపీ ద్వారా పూర్తిగా ప్రైవేటుకు కట్టబెడుతున్న చంద్రబాబు సర్కారు

దోపిడీ విధానాన్ని సమర్థించుకోవడానికి పాట్లు

పీపీపీ పేరిట దేశంలో ఎక్కడా లేనివిధంగా బాబు సర్కారు తెరలేపిన దోపిడీ విధానంపై అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఉద్యమానికి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతమైంది. నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన నిరసన ర్యాలీలకు రాజకీయాలకు అతీతంగా విద్యార్థి, ప్రజా, మేధావి వర్గాలు తరలివచ్చాయి. ఈ నేపథ్యంలో తన దోపిడీ విధానాన్ని సమర్థించుకోవడానికి చంద్రబాబు సర్కారు నానా పాట్లు పడుతోంది. పార్లమెంట్ స్థాయి సంఘం సిఫార్సులకు వక్రభాష్యం చెబుతోంది. వైద్య కళాశాలల అభివృద్ధిలో పీపీపీ విధానమే ఉత్తమం అంటూ తన ఆస్థాన మీడియాలో ప్రచారం చేయించుకుంటోంది. అయితే పార్లమెంట్ స్థాయి సంఘం ఎక్కడా ప్రభుత్వం నిర్మించిన, నిర్మాణం ప్రారంభించిన కళాశాలలను పీపీపీలో ప్రైవేట్‌కు కట్టబెట్టాలని చెప్పనే లేదు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు.. మసిబూసి మారేడుగాయ చేయడంలో ఆరితేరిన చంద్రబాబు పార్లమెంట్ స్థాయి సంఘంలోని చిన్న అంశాన్ని ఆయుధంగా మలుచుకుని తాను చేసేదే కరెక్ట్ అన్నట్టు వక్రీకరించేస్తున్నారు. పీపీపీ తప్పితే ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలు నిర్వహించడం వేస్ట్ అన్నట్టుగా తప్పుడు ప్రచారాన్ని మరింత విస్తృతం చేసే పనిలోపడ్డారు. ఫ్లగ్ ప్లే తరహాలో తరగతులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటుకు కట్టబెడుతూ పీపీపీనే ఉత్తమ విధానం అంటూ సమర్థించుకోవడానికి తెగ తాపత్రయపడుతున్నారు.

సాక్షి, అమరావతి: దేశంలో వైద్యవిద్య నాణ్యతపై ఇటీవల పార్లమెంటు స్థాయీ సంఘం విడుదల చేసిన నివేదికకూ ఎల్లో మీడియా వక్రభాష్యం పలికింది. కొత్త ప్రభుత్వ వైద్యకళాశాలల ఆవశ్యకత, ఎంబీబీఎస్ సీట్ల పెంపు అవసరాన్ని స్థాయి సంఘం నొక్కివక్కాణిస్తే.. పీపీపీ విధానాన్ని సమర్థించినట్టు కట్టుకథలల్లుతోంది. కొత్తగా కళాశాలలు ఏర్పాటుకు ముందుకొచ్చే ప్రైవేటు సంస్థలకు కేవలం పన్ను రాయితీలు చాలన్న స్థాయీ సంఘం సూచనను వక్రీకరించి చంద్రబాబు ప్రైవేటీకకరణకు అనుకూలంగా నివేదిక ఇచ్చినట్టు దుష్ప్రచారం చేస్తోంది. దీనిపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

అసలు స్థాయి సంఘం చెప్పిందేమంటే..!

'దేశంలో వైద్య విద్యకు ఉన్న పోటీకి తగ్గట్టుగా ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారుతోంది. సీట్లు పరిమితంగా ఉండటంతో దేశం వెలుపల ఎంబీబీఎస్ అభ్యసించడానికి వలస వెళ్లే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోంది.' అని పార్లమెంట్ స్థాయీ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం ఇప్పటికే ప్రకటించినట్టు వచ్చే ఐదేళ్లలో 75 వేల సీట్లు జోడిస్తే విద్యార్థులు వలసలు వెళ్లడానికి అవసరం ఉండదని దృఢంగా అభిప్రాయపడింది. దేశంలో వైద్య విద్య నాణ్యతపై ఇటీవల స్థాయీ సంఘం నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక దేశంలోని అనేక రాష్ట్రాల్లోని వైద్య విద్యలో అసమానతలను బట్టబయలు చేసింది. దేశంలో వైద్య విద్యలో అసమానతలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏపీ ఒకటని స్పష్టం చేసింది. దేశం మొత్తం 1.10 లక్షల ఎంబీబీఎస్ సీట్ల పంపిణీలో రాష్ట్రాల మధ్య అసమానతలను ఎత్తి చూపింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి కొన్ని రాష్ట్రాల్లో ప్రతి 10 లక్షల జనాభాకు 150కు దగ్గరగా ఎంబీబీఎస్ సీట్లు ఉండగా జాతీయ స్థాయిలో 75 సీట్లే ఉంటున్నాయని వివరించింది. 10 లక్షల జనాభాకు 50 కంటే తక్కువ సీట్లున్న రాష్ట్రాలు ఉన్నాయని పేర్కొంది. అయితే ఆయా రాష్ట్రాల పేర్లను నివేదికలో వెల్లడించలేదు. జాతీయ స్థాయిలో 10 లక్షల జనాభాకు 100 సీట్ల నిష్పత్తిని సాధించడానికి మరో 40 వేల సీట్లు కొత్తగా సమకూర్చాల్సి ఉందని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా 10 లక్షల జనాభాకు వంద కంటే ఎంబీబీఎస్ సీట్లున్న రాష్ట్రాలు కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు కృషి చేయాలని సిఫార్సు చేసింది. వైద్య కళాశాలలు అందుబాటులో లేని జిల్లాల్లో ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, కళాశాలల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైద్య విద్యలో బోధన, బోధనేతర సిబ్బంది కొరత అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్య, ఆరోగ్య శాఖలకు పలు సూచనలు చేసింది. వైద్య విద్యలో అసమానతలు అధిగమించడంతోపాటు, నాణ్యత పెంపునకు స్థాయీ సంఘం చేసిన సిఫార్సులకు ఐదేళ్ల కిందటే వైఎస్ జగన్ రాష్ట్రంలో కార్యరూపం ఇచ్చిందని వైద్యవర్గాల్లో చర్చ ఊపందుకుంది.

చంద్రబాబు సర్కారు గ్రహణం

2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం బాబు గద్దెనెక్కడంతో మిగిలిన మెడికల్ కళాశాలలకు చంద్రగ్రహణం పట్టుకుంది. ఎక్కడికక్కడ గతేడాది జూన్ నుంచి నిర్మాణాలను ఆపేసి, పీపీపీలో వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టే కార్యక్రమానికి చంద్రబాబు తెరలేపారు. వైద్య విద్యపై బాబు చిన్న చూపు ఏపీ విద్యార్థులకు పెను శాపంగా మారింది. ఉమ్మడి ఏపీ నుంచి వేరుపడిన సందర్భంలో మన కంటే తెలంగాణలో తక్కువ సీట్లు ఉండేవి. ఇదిలా ఉండగా పదేళ్లలో ఆ రాష్ట్రంలో తొమ్మిది వేలకుపైగా ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 2014లో కేంద్రంలోని ఎన్డీఏతో పొత్తులో ప్రభుత్వాన్ని నడిపిన బాబు రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ఒక్కటంటే ఒక్క కొత్త వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి చేయలేదు. ఫలితంగా ఐదు కోట్లమందికిపైగా జనాభా ఉన్న ఏపీలో 2019–20లో 4,650 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉన్నాయి. వీటిలో కేవలం రెండు వేల సీట్లు ప్రభుత్వ కళాశాలల్లో ఉండగా, మిగిలినవి ప్రైవేట్ కాలేజీల్లోవి. పక్కనే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనూ ఏపీ కంటే ఎక్కువ సీట్లుండేవి. పోటీకి సరిపడా ఎంబీబీఎస్ సీట్లు లేక, ప్రైవేట్‌లో వైద్య విద్యను కొనే స్థోమత లేని వేల మంది విద్యార్థులు రష్యా, ఉక్రెయిన్, కజికిస్తాన్ వంటి విదేశాలకు పరుగులు తీశారు. సామాన్య ప్రజలు సైతం ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందక తీవ్ర అగచాట్లు పడేవారు.

పీపీపీ పేరిట దోచిపెట్టే కుట్రలు

దేశంలో వైద్య విద్యను బలోపేతం చేసే క్రమంలో ప్రభుత్వాలు పీపీపీలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చే సంస్థలకు పన్ను రాయితీలు ఇవ్వాలని పార్లమెంట్ స్థాయీ సంఘం సూచించింది. ఇదిలా ఉండగా చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో ఇప్పటికే అభివృద్ధి చేసిన బోధనాస్పత్రులను, తరగతులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెడుతోంది. 10 కళాశాలలను పీపీపీలో ప్రైవేట్‌కు కట్టబెట్టడం కోసం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. ప్రభుత్వమే భూములు సేకరించి, టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించి, నిర్మాణాల్లో మంచి పురోగతి సాధించిన కళాశాలలను పప్పుబెల్లాల మాదిరిగా ప్రైవేటుకు కట్టబెట్టేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో బాబు సర్కారు అవలంబిస్తున్న విధానం దేశంలో ఏ రాష్ట్రంలో లేదని ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా పార్లమెంట్ స్థాయి సంఘం సైతం కొత్త కళాశాలల ఏర్పాటు కోసం కేవలం పన్ను రాయితీలు మాత్రమే ఇవ్వాలని సిఫార్సు చేయడం గమనార్హం. అయితే ఇందుకు పూర్తి భిన్నంగా బాబు సర్కారు అడుగులు వేస్తోంది. అంతేకాకుండా విద్యార్థుల నుంచి ఫీజులు, రోగుల నుంచి చార్జీల రూపంలో దోచుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. ఎకరం భూమికి కేవలం రూ.100 లీజు రూపంలో ఏకంగా 66 ఏళ్ల పాటు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో కళాశాలలు పెట్టేస్తోంది. గతేడాది ప్రారంభం కాకుండా నిలిచిపోయిన పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని వైద్య కళాశాలలకు టెండర్లూ పిలిచింది. వాస్తవానికి పులివెందుల కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణం వైఎస్ జగన్ హయాంలోనే పూర్తయింది. ఈ నేపథ్యంలోనే బాబు ప్రభుత్వం ఏమీ చేయకున్నా పులివెందులకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) 2024–25లోనే 50 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసింది. అయితే కళాశాల మాకొద్దంటూ చంద్రబాబు సర్కార్ ఎన్ఎంసీకి లేఖలు రాసి, అనుమతులు రద్దు చేసింది. మిగిలిన మూడు కళాశాలలు ప్రారంభించకుండా వదిలేసింది. ఇప్పుడీ నాలుగింటిని తొలి దశలో ప్రైవేట్‌కు కట్టబెట్టడమే కాకుండా మరింత బరితెగించి, గత ప్రభుత్వం అభివృద్ధి చేసిన బోధనాస్పత్రులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టబోతుంది. రెండేళ్ల పాటు ఈ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బందికి ఖజానా నుంచి వేతనాలు చెల్లించడం ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు రూ.వందల కోట్లు దోచిపెట్టడానికి స్కెచ్ వేసింది.

ఐదేళ్ల కిందటే వైఎస్ జగన్ కార్యరూపం

ప్రతి 10 లక్షల జనాభాకు 50 కంటే తక్కువ సీట్లు రాష్ట్రాలు కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని స్థాయి సంఘం ప్రభుత్వాలకు సూచించింది. వైద్య సౌకర్యాలు సరిగా లేని జిల్లాల్లో కళాశాలలు ఏర్పాటు చేయాలని పేర్కొంది. ప్రైవేటులో వైద్య విద్యను అభ్యసించడానికి రూ. కోట్లలో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్న క్రమంలో సామాన్య విద్యార్థుల తెల్లకోటు కల సాకారం చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నొక్కి చెప్పింది. పార్లమెంట్ స్థాయీ సంఘం ఇప్పుడు చేసిన సిఫార్సులకు ఐదేళ్ల కిందటే, అంటే 2019లోనే వైఎస్ జగన్ కార్యరూపంలోకి తీసుకొచ్చారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లా చేసి, ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తానన్న హామీని అమలు చేస్తూ ఏకంగా రూ.8వేల కోట్లకుపైగా నిధులతో 17 కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి వరకూ ఒక్క ప్రభుత్వ/ప్రైవేట్ వైద్య కళాశాల లేని పల్నాడు, ఏఎస్ఆర్, బాపట్ల, అన్నమయ్య, సత్యసాయి, అనకాపల్లి, పార్వతీపురం మన్యం ప్రాంతాల ప్రజలకు ఉచిత సూపర్‌స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేసే దిశగా అడుగులు వేశారు. మరోవైపు ప్రైవేట్ వైద్య కళాశాలే తప్ప ప్రభుత్వ రంగంలో సూపర్ స్పెషాలిటీ వైద్యం అందని నంద్యాల, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, విజయనగరం, చిత్తూరు జిల్లాల్లోనూ కొత్త వైద్య కళాశాలలు నెలకొల్పడానికి నడుం బిగించారు. వీటితోపాటు కృష్ణా జిల్లా మచిలీపట్నం, కర్నూల్ జిల్లా ఆదోని, వైఎస్సార్ జిల్లా పులివెందుల, ప్రకాశం జిల్లాలోని మార్కాపురంలో కొత్త కళాశాలల నిర్మాణాలను కరోనా సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని అధిగమించి ప్రారంభించారు. 2023లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, 2024లో పాడేరు వైద్య కళాశాలను ప్రారంభించారు.

కోటి సంతకాల పత్రాలతో.. నేడు జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీలు

ఆ తర్వాత వాటిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపనున్న నేతలు

సాక్షి, అమరావతి: పేదలకు నాణ్యమైన వైద్యం, సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందకుండా చేస్తూ.. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తూ.. రూ.లక్ష కోట్ల ప్రజల ఆస్తులను బినామీలకు కట్టబెట్టి 'నీకింత నాకింత' అంటూ పంచుకుతినేందుకు చంద్రబాబు సర్కారు కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ కోటి మందికి పైగా ప్రజలు సంతకాలు చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పైగా.. ఈ ప్రజా ఉద్యమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగ–ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందంగా కదంతొక్కడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడీ ఉద్యమం తుది అంకానికి చేరుకుంది. కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తుండటాన్ని నిరసిస్తూ 175 నియోజకవర్గాల్లోనూ కోటి మందికి పైగా ప్రజలు సంతకాలు చేసిన పత్రాలను ఆయా నియోజకవర్గాల నుంచి ఇప్పటికే జిల్లా కేంద్రాల్లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు భారీ ర్యాలీలతో తరలించారు. ఈ నేపథ్యంలో.. సోమవారం జిల్లా కేంద్రాల్లో కోటి సంతకాల పత్రాలతో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ.. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకతను చాటిచెప్పేలా వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీలు నిర్వహిస్తోంది.

ర్యాలీల్లో పాల్గొంటే కేసులంటూ బెదిరింపులు..

ఇక ఈ ర్యాలీలను అడ్డుకోవడానికి చంద్రబాబు సర్కారు అప్పుడే పోలీసులను ఉసిగొలిపింది. ర్యాలీల్లో పాల్గొనవద్దని.. పాల్గొంటే కేసులు పెడతామంటూ వైఎస్సార్‌సీపీ నేతలు, విద్యార్థులు, ప్రజాసంఘాల నేతలకు జిల్లాల్లో పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. అయితే, ఈ బెదిరింపులను ఏమాత్రం ఖాతరు చేయబోమని.. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహించే ర్యాలీల్లో కదంతొక్కుతామని వారు తేల్చిచెబుతున్నారు. కోటి సంతకాల పత్రాలతో జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి.. కొత్త మెడికల్ కాలేజీలపై చంద్రబాబు సర్కారు అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి, బినామీలకు కట్టబెట్టి కమీషన్ల దండుకోవడానికి వేసిన ప్రణాళిక.. పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను దూరం చేయడానికి చేస్తున్న కుట్రను మరోసారి ప్రజలకు వైఎస్సార్‌సీపీ నేతలు వివరించనున్నారు. ఆ తర్వాత కోటి సంతకాల పత్రాలు ఉన్న వాహనాలను జిల్లా కేంద్రాల నుంచి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపడానికి జెండా ఊపి ప్రారంభిస్తారు. జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న ఈ కోటి సంతకాల పత్రాలను ఈనెల 18న సా. 4 గంటలకు పార్టీ నేతలతో కలిసి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ గవర్నర్‌కు నివేదిస్తారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును వివరిస్తారు. ప్రభుత్వమే వాటిని పూర్తిచేసి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైఎస్ జగన్ విజ్ఞప్తి చేయనున్నారు.

వాహనాల ర్యాలీకి అనుమతివ్వండి

కోటి సంతకాల ప్రతులున్న వాహనాల ర్యాలీలకు అనుమతివ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర డీజీపీకి లేఖ రాసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఈ మేరకు డీజీపీకి విజ్ఞప్తి చేశారు. ర్యాలీల్లో పాల్గొనద్దంటూ జిల్లాల్లో పోలీసులు నోటీసులు జారీచేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ర్యాలీలు, సంతకాల పత్రాల రవాణా సజావుగా సాగేందుకు అనుమతి అవసరమని.. దీనికోసం అన్ని జిల్లాల ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలని అప్పిరెడ్డి తన లేఖలో డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ పోరాటం ఆగదు

వైఎస్ జగన్ ప్రారంభించిన 17 కాలేజీలను పూర్తి చేయాల్సిందే
మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్న సీఎం చంద్రబాబు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్యను అందించాలన్న లక్ష్యంతో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేటీకరించడం ద్వారా పేదలకు వాటిని దూరం చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. చంద్రబాబు నిర్ణయం వల్ల 2,450 మెడికల్ సీట్లు పేద విద్యార్థులకు దూరమవుతున్నాయని మండిపడ్డారు. వైఎస్ జగన్ ప్రారంభించిన 17 మెడికల్ కాలేజీలను పూర్తిచేసి ఆ ఘనత తను చంద్రబాబు ఖాతాలోనే వేసుకోవాలని సూచించారు. అంతే తప్ప ప్రైవేటీకరణ పేరుతో పేదల నోట్లో మట్టికొట్టొద్దని కోరారు. ప్రైవేటీకరణ కూటమి విధానమైతే.. అందుకు వైఎస్సార్‌సీపీ పూర్తి విరుద్ధమన్నారు. ప్రైవేటీకరణపై రాజీనామా చేసి ప్రజల రెఫరెండంకు సిద్ధమా? అని చంద్రబాబును ప్రశ్నించారు. వైఎస్ జగన్ హయాంలో కాలేజీల నిర్వహణ కోసం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఏర్పాటు చేస్తే.. మెడికల్ సీట్లు అమ్ముకుంటున్నారని గగ్గోలు పెట్టిన చంద్రబాబు అధికారంలోకి వస్తే 100 రోజుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ రద్దు చేస్తామని బీరాలు పలికారని గుర్తు చేశారు. తాను అధికారంలోకి వచ్చాక చంద్రబాబు పూర్తిగా కాలేజీలనే ప్రైవేటుపరం చేయడంపై మండిపడ్డారు. పేద బిడ్డల చదువుల మీద ఉక్కుపాదం మోపాలని చూస్తే కోటి కాస్తా పదికోట్ల సంతకాలు అవుతాయని స్పష్టం చేశారు. పీపీపీకి వ్యతిరేకంగా ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని, తమ తలలు పగిలినా వైఎస్ జగన్ నేతృత్వంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

చంద్రబాబు జేబు సంస్థల్లా వ్యవస్థలు: రాష్ట్రంలో ప్రభుత్వ వ్యవస్థలు మేనేజ్ చేయబడుతున్నాయని.. చంద్రబాబుకి జేబు సంస్థలుగా మారిపోతున్నాయని సుధాకర్‌బాబు ధ్వజమెత్తారు. చంద్రబాబు మాఫియా డాన్‌లా మారిపోయారని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు డప్పు కొట్టడంలో ఈనాడు మొదటి స్థానంలో ఉందన్నారు. 'వైఎస్ జగన్ విధానాలకు, చంద్రబాబు విధానాలకు.. ఇద్దరి సిద్ధాంతాలు, సంస్కరణలపై రోజంతా చర్చ నిర్వహిద్దాం. మీకు నచ్చిన టీవీ చానల్స్ అధినేతలందరినీ విజయవాడ తీసుకురండి. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధులంతా వస్తాం' అని సుధాకర్‌బాబు సవాల్ చేశారు.

ఎల్లో మీడియా రాతలు నీచం

మెడికల్ కాలేజీలకు పీపీపీనే మేలంటూ తప్పుడు రాతలు రాస్తున్నారు
పార్లమెంటరీ స్థాయి కమిటీ సిఫార్సులనూ వక్రీకరిస్తున్నారు
పీపీపీ గురించి ఆలోచించాలని మాత్రమే చెప్పింది
వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే ప్రైవేటీకరణ
మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఫైర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం పీపీపీ విధానంలోనే మేలంటూ ఎల్లో మీడియా రాతలు రాయడం దుర్మార్గమని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. గతంలో విశాఖపట్నం తూర్పు తీరంలో ఉండటంవల్ల అది తీవ్రవాద దాడులకు టార్గెట్ అని.. విదేశీ దాడులకు సాఫ్ట్ టార్గెట్ అని.. అలాగే, విశాఖ భూకంపాల జోన్‌లో ఉందని.. హైరిస్క్ ఏరియా అని రాశారని, గ్లోబల్ వార్మింగ్‌వల్ల సముద్ర మట్టాలు పెరిగిపోయి విశాఖ మునిగిపోతుంది కాబట్టి ఆ నగరాన్ని రాజధానిగా చెయొద్దంటూ మీడియాలో అడ్డగోలుగా విషపు రాతలు రాశారని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడేమో చంద్రబాబు విజన్‌వల్లే విశాఖ రూపురేఖలు మారిపోతున్నాయని రాయడం నీచాతినీచమన్నారు. శ్రీకాకుళంలో ఆదివారం సీదిరి మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

ఆ సంఘం సిఫార్సులంటూ పిచ్చిరాతలు..: పీపీపీ మోడల్‌లో మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేస్తే పేదలకు మేలు జరుగుతుందని చంద్రబాబు ఏడాదిగా చెబుతున్నారు. ప్రైవేటు గుత్తాధిపత్యం ఎక్కువైతే ఏం జరుగుతుందో ఇండిగో విమానాల వ్యవహారంలో చూశాం. వైద్య వ్యవస్థలు ప్రైవేటు చేతుల్లో ఉంటే కరోనా లాంటి విపత్తుల్లో ఏం జరిగి ఉండేదో ఆలోచించాలి. ఇప్పుడు పార్లమెంటరీ స్థాయీ సంఘం పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేయాలని సిఫార్సు చేసిందంటూ పిచ్చి రాతలు రాస్తున్నారు. నిజానికి.. ఆ కమిటీ మెడికల్ కాలేజీల నిర్వహణకు ఎవరైనా ముందుకొస్తే రాయితీలు ఇవ్వాలని, ఖర్చు పెరుగుతున్న తరుణంలో పీపీపీ గురించి ఆలోచించాలని మాత్రమే సిఫార్సు చేసిందని, అంతే తప్ప ఉన్నవాటిని పీపీపీ విధానంలో చేపట్టాలని ఎక్కడా చెప్పలేదు. అదే వాస్తవమైతే ఎయిమ్స్, జిప్‌మర్, ఐఐటీ వంటి సంస్థలు కూడా పీపీపీ విధానంలో పెట్టుకోవాలి కదా. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు, ప్రభుత్వాస్పత్రులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమంటే పేదల కలలను తుంచేయడమే. దీనికితోడు.. ప్రైవేటు ఆస్పత్రుల్లో జీతాలు కూడా ప్రభుత్వమే రెండేళ్ల పాటు ఇస్తుందన్న ఆఫర్లు ఎక్కడైనా విన్నామా?

జగన్‌కు పేరు వస్తుందనే..: రెండు వారాల కిందట అమరావతి కోసం రూ.7,500 కోట్లు అప్పుచేశారు. నిన్న దాన్ని కేబినెట్‌లో ఆమోదించడం దారుణం. 2027లో రానున్న గోదావరి పుష్కరాలకు రూ.5 వేల కోట్లు కేటాయిస్తున్నారు. ఇక అమరావతిలో కిలోమీటరు రోడ్డు వేసేందుకు రూ.180 కోట్లు చొప్పున మూడు కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.540 కోట్లకు టెండర్ ఇచ్చారు. వాస్తవానికి.. రెండు, మూడు కిలోమీటర్ల రోడ్డు ఖర్చుతో ఒక మెడికల్ కాలేజీ పూర్తయిపోతుంది. కేవలం వైఎస్ జగన్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు మొగ్గుచూపుతున్నారు.

మెడికల్ ఉద్యమానికి ఎన్నారైల మద్దతు

వైఎస్సార్‌సీపీ ఎన్నారై వింగ్ గ్లోబల్ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి
యూకేలో ఘనంగా వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు

యూకేలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో నేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ చేపట్టిన మెడికల్ కళాశాలల ఉద్యమానికి ఎన్నారైలు పూర్తి మద్దతు ఇస్తున్నారని ఆపార్టీ ఎన్నారై విభాగం స్పష్టం చేసింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆదివారం యూకేలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యూకే విభాగం ఆధ్వర్యంలో కోవెంట్రీ నగరంలో జరిగిన ఈ వేడుకల్లో ఆ పార్టీ ఎన్ఆర్ఐ వింగ్ గ్లోబల్ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో సాంబశివారెడ్డి మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో పార్టీకోసం ఏవిధంగా పనిచేయాలనే విషయంపై యూకేలోని పార్టీ యూత్ వింగ్‌కు దిశా నిర్దేశం చేశారు. 18 నెలల పాలనలో చంద్రబాబు సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ (ఎన్నారై అఫైర్స్) డాక్టర్ ప్రదీప్ చింతా మాట్లాడుతూ కొత్త మెడికల్ కాలేజీల్లో పదింటిని గంపగుత్తగా ప్రైవేటుపరం చేస్తూ సీఎం చంద్రబాబు దానికి ముద్దుగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) అని పేరుపెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ కోవెంట్రీ విభాగం నేతలు గ్రీష్మంత్, పుష్పేంద్ర, అమర్, హరీష్, లోహిత్, నిరంజన్ యూకే కన్వీనర్ ఓబుల్‌రెడ్డి పాతకోట, యూఎస్ఏ కన్వీనర్ శివ అన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూదులపై ఉగ్రదాడి

సంప్రదాయ హనుక్కా వేడుకలో తీవ్ర విషాదం

- ఆస్ట్రేలియా బాండీ బీచ్‌లో ఇద్దరు ముష్కరుల కాల్పులు
- 11 మంది మృతి
- ఇద్దరు పోలీసులు సహా 29 మందికి గాయాలు
- పోలీసుల కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతం
- మరొకరి అరెస్టు

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని సిడ్నీలోని బాండీ బీచ్ కాల్పుల మోతతో దద్దరిల్లింది. యూదుల సంప్రదాయ హనుక్కా వేడుక విషాదాంతంగా మారింది. ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో బీచ్‌లో ఉత్సాహంగా పండగలో పాల్గొంటున్న యూదులపై ఇద్దరు ఉగ్రవాదులు హఠాత్తుగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 11 మంది మరణించారు. ఇద్దరు పోలీసులు సహా 29 మంది గాయపడ్డారు. ఇది ముమ్మాటికీ ఉగ్రవాద దాడేనని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రకటించింది. మతపరమైన వేడుకను లక్ష్యంగా చేసుకోవడం, ఆయుధాలతో విరుచుకుపడడంపై కచ్చితంగా ఉగ్రవాద దాడిగా ప్రభుత్వం పేర్కొంది. యూదులపై కాల్పుల జరిపిన ఇద్దరు ముష్కరులపై పోలీసులు ఎదురు కాల్పులు ప్రారంభించారు. ఒకరిని మట్టుబెట్టారు. పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన రెండో ఉగ్రవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఉగ్రవాద దాడిని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ తీవ్రంగా ఖండించారు. ఈ రాక్షస కాండ ఘటన ఆస్ట్రేలియా హృదయాన్ని గాయపర్చిందని ఉద్ఘాటించారు. దుశ్చర్య పట్ల ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా స్పందించారు. యూదులపై విద్వేషాన్ని అల్బనీస్ పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. తాజా దాడికి ఆయనే కారణమని ఆరోపించారు.

విచ్చలవిడిగా కాల్పులు

ప్రాచీన కాలంలో జెరూసలేం నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్న చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా యూదులు హనుక్కా పండుగను ప్రతిఏటా ఘనంగా నిర్వహించుకుంటారు. యూదులకు ఇది ప్రధానమైన పండుగ. ఆస్ట్రేలియాలోని యూదులు బాండీ బీచ్‌లో హనుక్కాలో పాల్గొనడానికి భారీగా తరలివచ్చారు. వందలాది మంది గుమికూడారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సంతోషంగా ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. ఇంతలో నల్లటి దుస్తులు ధరించి అక్కడికి చేరుకున్న ఇద్దరు ముష్కరులు తుపాకులతో విచ్చలవిడిగా కాల్పులు ప్రారంభించారు. ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపే 11 మంది విగతజీవులయ్యారు. జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. బీచ్‌లో ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. యూదులపై కాల్పుల్లో జరిపిన సాయుధ దుండగుల్లో ఒకరిని 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌గా గుర్తించారు. సిడ్నీ బానీరిగ్ ప్రాంతంలోని అతడి నివాసంలో సోదాలు నిర్వహించారు. కాల్పుల ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న సహాయక సిబ్బంది

సంతాపం ప్రకటించిన ప్రధాని మోదీ

ఆస్ట్రేలియాలో యూదులపై ఉగ్రవాద దాడి పట్ల భారత ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ముష్కరుల దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతులకు సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు భారతీయుల తరఫున సానుభూతి తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషాదకర సమయంలో ఆస్ట్రేలియా ప్రజలకు అండగా ఉంటామని ఉద్ఘాటించారు. మానవాళికి పెను ముప్పుగా మారిన ఉగ్రవాదం పట్ల భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు మోదీ గుర్తుచేశారు. ఉగ్రవాదంపై పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

యూకేలో భద్రత కట్టుదిట్టం

ఆస్ట్రేలియాలో జరిగిన ఉగ్రదాడిని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఖండించారు. యూదుల మరణించడం పట్ల విచారం వ్యక్తంచేశారు. యూకేలో యూదులు నివసించే ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా లండన్‌లో యూదుల ప్రార్థనా మందిరాలకు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నట్లు మెట్రోపాలిటన్ పోలీసులు తెలియజేశారు. సామూహిక వేడుకల్లో పాల్గొనేవారు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

రియల్ హీరో అహ్మద్

బీచ్‌లో ముష్కరులు కాల్పులు జరుపుతుండగా అహ్మద్ అనే వ్యక్తి ప్రాణాలకు తెగించి అడ్డుకున్నాడు. చెట్టు చాటు నుంచి బుల్లెట్ల వర్షం కురిపిస్తున్న ఓ ఉగ్రవాదిని గట్టిగా పట్టుకొని, తుపాకీని లాక్కొని అతడికే గురిపెట్టాడు. అహ్మద్‌ను గమనించిన మరో ఉగ్రవాది కాల్పులు ప్రారంభించాడు. దాంతో అహ్మద్ గాయాలపాలై కుప్పకూలిపోయాడు. పోలీసులు అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. అహ్మద్ సాహసోపేతంగా వ్యవహరించిన దృశ్యం ఆస్ట్రేలియా టీవీ చానళ్లలో ప్రసారమైంది. అతడు ధైర్యంగా అడుగు ముందుకు వేయకపోతే ఉగ్రవాదుల కాల్పుల్లో మరికొందరు మరణించేవారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. రియల్ హీరో అహ్మద్ అంటూ జనం ప్రశంసిస్తున్నారు.

దేశంలో ఆయుధ చట్టాలు కఠినం

ఆస్ట్రేలియాలో సామూహిక జనంపై కాల్పుల ఘటనలు చాలా అరుదే. 1996లో పోర్ట్ ఆర్థర్ టౌన్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో 35 మంది మరణించారు. ఈ ఘటన తర్వాత ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆయుధ చట్టాలను కఠినతరం చేసింది. ఆయుధ లైసెన్స్‌లు సులభంగా దక్కకుండా చర్యలు చేపట్టింది. ఆ తర్వాత 2014లో జరిగిన కాల్పుల్లో ఐదుగురు, 2018లో ఏడుగురు మృతిచెందారు. ఆయా ఘటనల్లో సాయుధులు తమ కుటుంబసభ్యులపైనే కాల్పులు జరిపి, తర్వాత ఆత్మహత్య పాల్పడ్డారు. 2019లో ఉత్తర ఆస్ట్రేలియాలోని డార్విన్ సిటీలో జైలు నుంచి పెరోల్‌పై బయటకు వచ్చిన ఖైదీ జరిపిన కాల్పుల్లో నలుగురు మృతిచెందారు. 2022లో క్వీన్స్‌లాండ్ స్టేట్‌లో ఓ తీవ్రవాది జరిపిన కాల్పుల్లో ఇద్దరు పోలీసు అధికారులు మరణించారు. ఆస్ట్రేలియాలో భారీ ఎత్తున కాల్పులు జరగడం, పది మందికిపైగా ప్రాణాలు కోల్పోవడం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి.

పెచ్చరిల్లుతున్న యూదు వ్యతిరేకత

ఆస్ట్రేలియా జనాభా 2.8 కోట్లు. వీరిలో 1.17 లక్షల మంది యూదులు ఉన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ యుద్ధం మొదలైన తర్వాత ఆస్ట్రేలియాలో యూదులపై దాడులు పెరిగిపోయాయి. వారి ఆస్తుల విధ్వంసం, బెదిరింపులు చోటుచేసుకుంటున్నాయి. యూదు వ్యతిరేక ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. గత ఏడాది సిడ్నీ, మెల్‌బోర్న్ నగరాల్లో యూదుల లక్ష్యంగా దాడులు జరిగాయి. యూదుల ప్రార్థనా మందిరాలకు, వారి వాహనాలకు నిప్పుపెట్టారు. మరోవైపు యూదులకు తగిన రక్షణ కల్పించాలని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆస్ట్రేలియా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

పాటలతో పులులు పరార్!

ఉత్తరప్రదేశ్ గ్రామీణుల కొత్త ఆలోచన

పిలిభిత్: సంగీతంతో ఎవరైనా ఇట్టే ఆకర్షితులవుతారని మనకు తెలుసు. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని గ్రామీణులు ఏకంగా పులుల్నే భయపెడుతున్నారు. కత్తులు, కర్రలకు బదులుగా సంగీతంతో, అదీ మామూలు సినిమా పాటలతోనే వాటిని అదరగొడుతున్నారు. సంగీత ధ్వనుల ధాటికి పులులు అడవిని దాటి పొలాలు, జనావాసాల వైపు రావడానికి జంకుతున్నాయట. ఇప్పుడిక తాము ఊరు బయటకు, పొలాలు, చెరుకు తోటల్లోకి నిర్భయంగా వెళ్లివస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇంతకీ వీళ్లు ఎలా పులుల్ని వణికిస్తున్నారంటే.. మాలా అటవీ రేంజ్‌లో పిలిభిత్ టైగర్ రిజర్వు ఉంది. పులుల సంరక్షణ ప్రాంతానికి ఆనుకుని డజను వరకు గ్రామాలున్నాయి. గ్రామాల చుట్టూ పొలాలు, దట్టంగా చెరుకు తోటలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో టైగర్ రిజర్వులోని పులులు పొలాలు, చెరుకుతోటల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఆవాసాల సమీపంలో సంచరిస్తుండటంతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా చర్యలు శూన్యం. దీంతో, జమునియా గ్రామానికి చెందిన కృష్ణకుమార్ ఓ ఉపాయం కనిపెట్టారు. 'పెద్ద శబ్దాలను వింటే, జంతువులు భయపడి దూరంగా వెళ్లిపోతాయని నాకు తెలుసు. ఇదే ఉపాయాన్ని అమల్లో పెట్టా. సౌర శక్తితో పనిచేసే మైక్ సెట్‌ను మా చెరుకు తోట వద్ద ఏర్పాటు చేశాను. మైక్ ద్వారా పెద్ద శబ్దంతో వచ్చే సంగీతం, సినిమా పాటలతో పులి వంటి జంతువులు మా ఛాయలకు కూడా రావడం లేదు. మా పొలాలకు దూరంగా వెళ్లిపోతున్నాయి. నన్ను చూసి, మిగతా రైతులు కూడా ఇదే ఉపాయాన్ని అమలుచేస్తూ సత్ఫలితాలు సాధించారు. మా ఊరే కాదు, అజిత్‌పూర్, రామ్‌నగరియా, మహువా, మలా ఘెరా, రిచ్చోలా, బసంత్‌పూర్‌లాంటి పులుల భయమున్న గ్రామాల రైతులూ ఇదే ఉపాయం అమలు చేస్తున్నారు' అని కుమార్ తెలిపారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు

- ఇద్దరు దుర్మరణం
- అనుమానితుడి అరెస్ట్

ప్రావిడెన్స్: అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జించింది. రోడ్ ఐలాండ్స్‌లోని ప్రావిడెన్స్ పట్టణంలోని బ్రౌన్ యూనివర్సిటీలో కాల్పుల మోత మోగింది. ఓ దుండగుడు కాలేజ్‌కు వచ్చి పరీక్షలు రాస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. దాంతో ఇద్దరు మరణించారు. 9 మంది గాయపడ్డారు. వెంటనే దుండగుడు పరారయ్యాడు. అతను 30ల్లో ఉంటాడని, నలుపు దుస్తులు ధరించాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ఆధారంగా పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఎప్పుడు, ఎక్కడ అతడు దొరికాడన్న విషయం పోలీసులు వెల్లడించలేదు. క్షతగాత్రులను హుటాహుటిన ఆస్పత్రిలో చేర్చారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కాల్పుల శబ్దం వినగానే విద్యార్థులంతా హడలిపోయారు. రూమ్‌లో, బాత్రూమ్‌లలో, డెస్క్ కింద, జిమ్‌లో, ఎక్కడ వీలైతే అక్కడే గంటల తరబడి దాక్కున్నారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాల్సిందిగా పోలీసులు విజ్ఞప్తి చేశారు. దాంతో వారాంతంలో అత్యంత సందడిగా ఉండే పట్టణ వీధులన్నీ దుండగుడు బయటే తిరుగుతున్నాడన్న భయంతో నిర్మానుష్యంగా మారిపోయాయి. సెక్యూరిటీ చెకింగ్‌లను దాటుకుంటూ అతను కాలేజీలోకి హంతకుడు ఎలా రాగలిగాడు? ఫేస్ రికగ్నిషన్ లాక్ రక్షణ ఉన్న క్లాస్ రూమ్ లోనికి ఎలా దూరాడు అన్నది ప్రశ్నగా మారింది. మృతులకు అమెరికా ట్రంప్ నివాళులు అర్పించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుండగుడు హ్యాండ్ గన్ వాడినట్టు భావిస్తున్నారు.

అనుమానితుడి సీసీటీవీ ఫుటేజీ దృశ్యం

ఢిల్లీలో ఆరుబయట ఆటలొద్దు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో వాయు కాలుష్యం నానాటికీ దిగజారుతోంది. దాంతో పిల్లల ఆరోగ్యం దృష్ట్యా ఔట్ డోర్ క్రీడలన్నింటినీ తక్షణం రద్దు చేయాల్సిందిగా ఢిల్లీ ప్రభుత్వాన్ని, నగర డెవలప్మెంట్ అథారిటీ (డీడీఏ)ని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం) ఆదేశించింది. లేదంటే పిల్లలు తీవ్ర అనారోగ్య బారి పడటం ఖాయమని హెచ్చరించింది. ఢిల్లీతో పాటు హరియాణా, రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాలకు కూడా ఈ మేరకు కమిషన్ లేఖలు రాసింది. 'ఆరుబయట ఆడే క్రీడలన్నింటినీ రద్దు చేయాలంటూ నవంబర్ 19నే మేం లేఖలు రాశాం. కానీ కొన్ని స్కూళ్లు, విద్యా సంస్థలు ఇంకా వాటిని కొనసాగిస్తున్నాయి' అంటూ ఆక్షేపించింది. 'రోడ్లపై విపరీతమైన దుమ్ము పేరుకొని ఉంది. ఒకవైపు తీవ్ర కాలుష్యంతో సతమతమవుతూ ఉంటే వాటి నిర్వహణ ఇంత అధ్వానంగానా? సగానికి సగం రోడ్లపై మున్సిపాలిటీ వ్యాన్లు సేకరించిన చెత్త పడి ఉంది' అంటూ నాలుగు పెట్టింది. శనివారం నుంచి ఢిల్లీ, ఎన్ సీఆర్ పరిధిలో అన్ని నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలను సీఏక్యూఎం నిషేధించడం తెలిసిందే. అలాగే ట్రక్కులకు నగరంలోకి ప్రవేశాలు నిలిపేశారు. ఢిల్లీలో డీజిల్ వాహనాల రాకపోకలను నిషేధించారు. చలికాలంలో ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోతూ ఉంటుంది.

కర్టెన్లు చాలు: రామ్ దేవ్

ఢిల్లీ కాలుష్యానికి ఎయిర్ ప్యూరిఫయర్ల వాడకం పరిష్కారం కాదని యోగ గురు బాబా రామ్ దేవ్ అన్నారు. పైగా అది సంపన్నుల ఆడంబరం అంటూ ఎద్దేవా చేశారు. 'ఢిల్లీ కొన్నిసార్లు గ్యాస్ చాంబర్‌ను తలపిస్తుంది. అంతమాత్రాన ఆందోళన పడాల్సిన పనిలేదు. డోర్ కర్టెన్లు వేసుకుంటే చాలు. వాటిని 20 రోజులకు ఒకసారి మూతికి మాస్క్ పెట్టుకొని దులుపుకుంటే సరిపోతుంది. దీనితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం కూడా అలవాటు చేసుకోవాలి' అని ఒక టీవీ చానల్ చర్చా కార్యక్రమంలో సూచించారు. ఇంత కాలుష్యంలో వ్యాయామమా అని ప్రశ్నించగా, కపాలభాతి వంటి శ్వాస వ్యాయామాలు చేయాలన్నారు.

సోషల్ మీడియా వాడకంలో మా పిల్లలపై ఆంక్షలు

యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ వెల్లడి

న్యూఢిల్లీ: యూట్యూబ్ సహా సోషల్ మీడియాను వాడుకోవడంలో తన పిల్లలకు ఆంక్షలు, పరిమితులు పెట్టానని యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ చెప్పారు. సోషల్ మీడియా మితిమీరిన వాడకం వల్ల ఎన్నో అనర్థాలున్నాయన్నారు. అందుకే, తమ ముగ్గురు పిల్లలు సామాజిక మాధ్యమ వేదికలైన యూట్యూబ్ ఇతర ప్లాట్ ఫాంలతో సమయం దుర్వినియోగం చేయకుండా కట్టడి విధించామన్నారు. తనతోపాటు భార్య హేమ కూడా ఈ విషయంలో వారాంతాల్లో వారికి కాస్తంత వెసులుబాటు ఇచ్చినా, మిగతా రోజుల్లో మాత్రం కఠినంగా ఉంటామన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులకు పిల్లలపై అదుపు అవసరమని నీల్ మోహన్ చెప్పారు. సోషల్ మీడియా ద్వారా వాళ్లు ఏం చేస్తున్నదీ పెద్దలు ఎప్పటికప్పుడు తెల్సుకుని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తల్లిదండ్రులు దీన్నో బాధ్యతగా తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా వాడకంలో పిల్లలపై తల్లిదండ్రుల నియంత్రణ ఎక్కువగా ఉండాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. యూట్యూబ్‌ను తమ ఇంటి అవసరాలకు తగినట్లుగా పిల్లలు వాడుకునేలా తల్లిదండ్రులకు వీలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని నీల్ మోహన్ చెప్పారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలు ఫేస్‌బుక్ వాడకుండా నిషేధిస్తూ ఇటీవల చట్టం తేవడం తెల్సిందే.

బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నబీన్

- కాషాయ దళం తదుపరి చీఫ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం
- కష్టించి పనిచేసే కార్యకర్త అంటూ ప్రధాని మోదీ అభినందనలు

న్యూఢిల్లీ/లక్నో: అందరి అంచనాలను తలకిందుల చేస్తూ బీజేపీ అగ్రనాయకత్వం బిహార్ యువ నేత నితిన్ నబీన్‌ను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. నబీన్ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఆదివారం నోటిఫికేషన్‌లో ప్రకటించారు. కాయస్థ వర్గానికి చెందిన 45 ఏళ్ల నితిన్ నబీన్ ప్రస్తుతం బిహార్ కేబినెట్ మంత్రిగా పనిచేస్తున్నారు. బీజేపీ చీఫ్ జేపీ నడ్డా స్థానంలో భవిష్యత్తులో ఈయన బీజేపీ చీఫ్ పదవిని చేపట్టే అవకాశముందని చెబుతున్నారు. తద్వారా తక్కువ వయస్సులోనే బీజేపీ అధ్యక్ష పదవిని చేపట్టిన నేతగా నబీన్ చరిత్ర సృష్టిస్తారని పార్టీ నేతలు అంటున్నారు.

మోదీ అభినందనలు..

బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబీన్‌ను ప్రధాని మోదీ అభినందించారు. కష్టించి పనిచేసే కార్యకర్తగా గుర్తింపు పొందిన నబీన్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. 'యువకుడు, కష్టించి పనిచేసే నేత, సంస్థాగత వ్యవహారంలో అనుభవమున్న వాడు, ఎమ్మెల్యేగా మంచి రికార్డు ఉంది. బిహార్‌కు పలుమార్లు మంత్రిగా పనిచేశారు. ప్రజల ఆకాంక్షల మేరకు బాధ్యతలు నిర్వర్తించారు' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

యూపీ బీజేపీ అధ్యక్షుడిగా పంకజ్ చౌదరి

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆదివారం లక్నోలో కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ ప్రకటించారు. ఈ పదవికి శనివారం పంకజ్ చౌదరి నామినేషన్ వేశారన్నారు. పోటీలో ఆయన ఒక్కరే ఉండటంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. మొత్తం 1.62లక్షల బూత్‌ల ద్వారా ఈ ఎన్నిక జరిగిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర చౌదరి నుంచి పంకజ్ చౌదరి బాధ్యతలు స్వీకరించారని గోయెల్ తెలిపారు. యూపీ బీజేపీ 17వ అధ్యక్షుడిగా ఎన్నికైన పంకజ్ చౌదరి కుర్మి వర్గానికి చెందిన వారు. ఈ వర్గం ఇతర వెనుకబడిన కులా(ఓబీసీ)ల జాబితాలో ఉంది. ఈ సందర్భంగా పియూష్ గోయెల్ పార్టీ జాతీయ కౌన్సిల్‌లోని 120 మంది సభ్యుల పేర్లను ప్రకటించారు. వీరిలో ప్రధాని మోదీ కూడా ఉన్నారు. ప్రధాని మోదీ వారణాసి నుంచి, సీఎం ఆదిత్య నాథ్ గోరఖ్‌పూర్ నుంచి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ లక్నో నుంచి ప్రాతినిథ్యం వహిస్తారు.

45 ఏళ్లకే 5 సార్లు ఎమ్మెల్యేగా..

బిహార్‌లో బీజేపీ సీనియర్ నేత, నాటి ఎమ్మెల్యే నబీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా 2006లో ఆకస్మికంగా చనిపోయారు. దీంతో ఆయన కుమారుడు నితిన్ నబీన్‌కు పార్టీ అధిష్టానం పట్నా(పశ్చిమ) నియోజకవర్గం ఉప ఎన్నికల్లో టికెట్ ఇచ్చి తొలి సారిగా బరిలోకి దింపింది. ఏకంగా 60వేల ఓట్ల భారీ మెజారిటీతో నబీన్ గెలిచారు. అప్పట్నుంచి వరసగా దాదాపు రెండు దశాబ్దాలుగా ఎమ్మెల్యేగా గెలుస్తూనే ఉన్నారు. తాజాగా బిహార్ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో 51,000 ఓట్ల మెజారిటీతో బంకింపూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అలా కేవలం 45 ఏళ్ల వయసుకే ఆయన ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బిహార్ ప్రభుత్వంలో మంత్రిగా పలుమార్లు పనిచేశారు. ప్రస్తుతం నితీశ్ ప్రభుత్వంలో ప్రజాపనుల శాఖ మంత్రిగా ఉన్నారు. నబీన్ గతంలో యువ మోర్చాలో పనిచేశారు. రాష్ట్ర ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. బీజేపీ చీఫ్‌గా నడ్డా స్థానంలో మరొకరిని నియమించాల్సిన సమయంలో నబీన్‌కు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలను అప్పగించడం గమనార్హం. నడ్డా తర్వాత బీజేపీ నూతన చీఫ్ అయ్యే అవకాశాలు నబీన్‌కు అత్యధికంగా ఉన్నాయని పార్టీ వర్గాలు స్వయంగా చెబుతున్నాయి. బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ నియమితులైనట్లు తెలియడంతో పట్నాలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉత్సవాలు మిన్నంటాయి. నితిన్ నబీన్‌కు శుభాకాంక్షల సందేశాలు వెల్లువలా వచ్చాయి. ఈ నియామకం పార్టీ కార్యకర్తలకు అంకితమిస్తున్నానని మీడియాతో నబీన్ పేర్కొన్నారు. తనపై విశ్వాసముంచి గురుతర బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోదీ, జేపీ నడ్డా, అమిత్ షాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధిష్టానం యువనాయకత్వం వైపు మొగ్గుచూపుతోందనడానికి నబీన్ నియామకం ఒక సంకేతమని వార్తలొచ్చాయి.

తీర్పును టెక్నాలజీ మెరుగుపర్చగలగాలి

సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్య

కటక్(ఒడిశా): నూతన సాంకేతికత అనేది న్యాయస్థానాల తీర్పును మరింత మెరుగుపర్చాలిగానీ తీర్పును అధిగమించేదిగా ఉండకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఒడిశాలోని కటక్ నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు. పెండింగ్ కేసుల భారం దిగువ కోర్టు నుంచి అత్యున్నత న్యాయస్థానం వరకు న్యాయ వ్యవస్థలోని ప్రతి స్థాయిలోనూ ఇబ్బందులను సృష్టిస్తున్నాయన్నారు. పైస్థాయిలో తలెత్తిన అడ్డంకులు దిగువ స్థాయిపై ఒత్తిడిని మరింతగా పెంచుతున్నాయని చెప్పారు. పెండింగ్ సమస్యను అధిగమించేందుకు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని సీజేఐ తెలిపారు. అవసరానికి తగినన్ని న్యాయస్థానాలు లేకుంటే, ఎంత చిత్తశుద్ధి కలిగిన న్యాయవ్యవస్థ అయినా కుప్పకూలిపోతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఆధునిక సాంకేతికతతో ఎన్నో సౌలభ్యాలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ దుష్ప్రభావాలు కూడా ఉన్న విషయం మరువరాదన్నారు. నేటి డీప్ ఫేక్‌లు, డిజిటల్ అరెస్ట్‌ల కాలంలో న్యాయస్థానాలకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పేదలు, వృద్ధులను పట్టించుకోని సంస్కరణ అస్సలు సంస్కరణే కాదు, అది తిరోగమనం కూడా అని తెలిపారు.

బీజేపీ డీఎన్ఏలో ఓటు చోరీ

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆగ్రహం
- ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో 'ఓటు చోర్–గద్దీ చోడ్' మహాధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: అసత్యం, ఓట్ల చోరీ బీజేపీ–ఆర్ఎస్ఎస్ డీఎన్ఏలోనే ఉన్నట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. సత్యం, అహింస అనే నినాదంతో బీజేపీ–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని ప్రతిన బూనారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓటు చోర్–గద్దీ ఛోడ్' మహాధర్నాలో రాహుల్ ప్రసంగించారు. కాంగ్రెస్ ముఖ్యనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సుఖూ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీతోపాటు ఎన్నికల సంఘం తీరుపై తీవ్రస్థాయిలో రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ వారంతా బీజేపీ కోసం పని చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు అధికారం అండతో విచ్చలవిడిగా ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సిద్ధాంతాన్ని అనుసరించేవారి డీఎన్ఏలో సత్యం ఉంటుందన్నారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్ డీఎన్ఏలో మాత్రం అసత్యం, ఓట్ల చోరీ మాత్రమే ఉంటాయని తేల్చిచెప్పారు.

సత్యానికి, అసత్యానికి మధ్య పోరాటం

''సత్యమే మన ఆయుధం. సమయం పట్టొచ్చు గానీ ఎప్పటికైనా సత్యానిదే విజయం. ప్రపంచం సత్యాన్ని పట్టించుకోదని, అధికారాన్ని, బలాన్ని మాత్రమే చూస్తుందని ఆర్ఎస్ఎస్ అధినేత భాగవత్ చెప్పడం దారుణం. బీజేపీ కోసమే ఎన్నికల సంఘం పనిచేస్తున్న సంగతి నిజం కాదా? ఎన్నికల కమిషనర్లను కాపాడేందుకు ప్రధాని మోదీ కొత్త చట్టం తీసుకొచ్చారు. మేమే వచ్చాక ఈ చట్టాన్ని తప్పనిసరిగా మారుస్తాం'' అని అన్నారు.

దొంగతనమే వారి డీఎన్ఏ

దొంగతనం బీజేపీ డీఎన్ఏలో ఉందని ఆరోపిస్తూ రాహుల్ గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. డబ్బు దొంగతనం, భూమి దొంగతనం, వ్యవస్థల దొంగతనం, హక్కుల దొంగతనం, ఉద్యోగాల దొంగతనం, ప్రజా తీర్పును దొంగిలించడం, ప్రభుత్వాన్ని దొంగిలించడం, ఎన్నికలను, ఓట్లను దొంగిలించడం బీజేపీకి అలవాటేనని ధ్వజమెత్తారు. ప్రజలను దోచుకొని అధికారం అనే నిచ్చెనపైకి ఎగబాకడం బీజేపీ విధానమని దుయ్యబట్టారు.

ప్రజల కోసమే రాహుల్ పోరాటం: ఖర్గే

ప్రజల కోసమే రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఆయనను బలపర్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఓట్ చోర్–గద్దీ ఛోడ్ ధర్నాలో ఖర్గే ప్రసంగించారు. రాహుల్ గాంధీకి మద్దతు ఇవ్వకుంటే దేశానికి నష్టం జరుగుతుందన్నారు. దేశాన్ని, ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే మనమంతా కలిసి పోరాటం చేయాలన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం, భావజాలం దేశాన్ని నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. హిందూమతం, హిందుత్వం పేరుతో పేదలను బానిసలుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న బీజేపీని అధికారం నుంచి తొలగించాలని పేర్కొన్నారు. దేశాన్ని కాపాడగలిగేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ద్రోహులైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దలకు, ఓట్ల దొంగలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటానికి మరింత బలోపేతం చేయాలని ప్రజలకు ఖర్గే విజ్ఞప్తి చేశారు.

బ్యాలెట్ పేపర్లతో గెలిచే దమ్ముందా?

బ్యాలెట్ పేపర్లతో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించి గెలిచే దమ్ముందా? అని బీజేపీకి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సవాలు విసిరారు. ఓట్ల చోరీపై ఎన్నికల సంఘం ఏదో ఒకరోజు దేశ ప్రజలకు సమాధానం చెప్పక తప్పదని అన్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ అనుమానాస్పదంగా సాగుతోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును కూడా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘం సహకరించకపోతే ఎన్నికల్లో బీజేపీ ఎట్టిపరిస్థితుల్లోనూ నెగ్గలేదని తేల్చిచెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేస్తున్నారని ప్రియాంక మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలన్నీ మోదీ సర్కార్ ఎదుట మోకరిల్లుతున్నాయని ఆరోపించారు.

విమానంలో ప్రాణదానం

సాక్షి, బళ్లారి: విమాన ప్రయాణంలో ఉండగా హఠాత్తుగా విదేశీ ప్రయాణికురాలు తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆ సమయంలో మాజీ మహిళా ఎమ్మెల్యే వైద్య సేవలతో ఆమెకు ప్రాణం పోశారు. ఈ సంఘటన గోవా నుంచి ఢిల్లీకి వెళ్తున్న ఇండిగో విమానంలో శనివారం మధ్యాహ్నం జరిగింది. గోవా నుంచి టేకాఫ్ తీసుకున్న 10 నిమిషాల్లోనే అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన జెన్నీ (31) అస్వస్థతకు గురైంది. గుండెపోటుతో సొమ్మసిల్లింది. అదే విమానంలో బెళగావి జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అంజలి నింబాల్కర్ ఢిల్లీ వెళ్తున్నారు. వెంటనే జెన్నీ పరిస్థితిని గమనించి సీపీఆర్‌తో ఆమెకు కృత్రిమ శ్వాస కల్పించారు. దీంతో జెన్నీ కోలుకుంది. ఆమె అభ్యర్థన మేరకు అంజలి విమానం దిగే వరకు పక్కనే కూర్చున్నారు. విమానం ఢిల్లీలో ల్యాండయిన వెంటనే జెన్నీని ఆస్పత్రికి తరలించారు. అంజలిని సీఎం, నెటిజన్లు అభినందించారు.

డాక్టర్ అంజలి

నేటి నుంచే సోషల్ మీడియా ఖాతాల తనిఖీ

న్యూఢిల్లీ: హెచ్–1బీ, హెచ్–4 వీసాల కోసం దరఖాస్తు చేసుకున్నవారి సోషల్ మీడియా ఖాతాల ప్రొఫైల్స్‌ను, వారు చేసిన పోస్టులను అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగం క్షుణ్నంగా తనిఖీ చేయబోతోంది. సోమవారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని అమెరికా స్టేట్ డిపార్టుమెంట్ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేశాయి. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్ల విషయంలో ఇప్పటికే ఈ నిబంధన అమలవుతోంది.

సీఎంను సన్మానించండి

రత్లాం: మధ్యప్రదేశ్ కు చెందిన వివాదాల మంత్రి కున్వర్ విజయ్ షా మరోసారి వార్తల్లో నిలిచారు. రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయానికి కారణమైన లాడ్లీ బెహన్ యోజన లబ్ధిదారులైన మహిళలను కించపరిచేలా మాట్లాడారు. ' కనీసం 50 వేల మంది లాడ్లీ బెహన్ లబ్ధిదారులు సీఎంను సత్కరించాలి. ఇందుకోసం ఈవెంట్ ప్లాన్ చేయండి. వచ్చే మహిళలకు ఆ పూటకు అన్నం కూడా పెడదాం. రానివారి సంగతి తెలుద్దాం. వారిపై విచారణ జరపండి. వారిలో ఆధార్ లింకు కాని వారుంటే వెంటనే పథకం నుంచి వారి పేర్లు తొలగించండి' అని అధికారులను ఆదేశించారు. షా వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది.

సాక్షి గుంటూరు

సోమవారం । 15 । డిసెంబర్ । 2025



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 573.40 అడుగులకు చేరింది. ఇది 265.1042 టీఎంసీలకు సమానం.

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీటి విడుదల నిలిచిపోయింది. దిగువకు 3,200 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 42.3253 టీఎంసీలు.

మరకత లింగానికి అన్నాభిషేకం

ఫిరంగిపురం: మండల పరిధి వేమవరం గ్రామంలోని కోటి ఒక్క లింగాల క్షేత్రంలోని మరకత లింగానికి ఆదివారం వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. భక్తుల నుంచి సేకరించిన, వంటశాలలో సిద్ధం చేసిన వంద కిలోల అన్నాన్ని వినియోగించారు.

న్యూస్‌రీల్

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

నగరంపాలెం: జిల్లాలో ఈవ్‌టీజింగ్‌పై 332 మందికి అవగాహన కల్పించినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రహదారులపై అనవసరంగా సంచరిస్తున్న కొందరి ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. ఈవ్‌టీజింగ్‌ను సహించేదిలేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. జిల్లాలోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, వ్యాపార కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో ప్రత్యేక గస్తీ, ఆకస్మిక తనిఖీలు చేపట్టారని అన్నారు. ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులు, ప్రజలకు పోలీస్ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారని పేర్కొన్నారు. జిల్లాలో మహిళలు, ఆడపిల్లల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శక్తి బృందాలు, ప్రత్యేక పోలీస్ బృందాలు, నిఘా వర్గాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉందన్నారు.

తెనాలి జిల్లా వైద్యశాలలో స్క్రబ్ టైఫస్ కేసులు

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో 10 మంది స్క్రబ్ టైఫస్ బాధితులు చికిత్స పొందుతున్నారు. వీరిలో చేబ్రోలు మండలం శేకూరుకు చెందిన మహిళ, కొల్లూరు మండలం క్రాప, పొన్నూరు, దుగ్గిరాల, తెనాలి ఐతానగర్, కొల్లిపర, కొల్లూరు ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. వీరందరికి వ్యాధి నిర్ధారణ కావడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వీరిలో గర్భిణి ఉన్నారు. వీరికి ఎటువంటి ప్రమాదం లేదని సీనియర్ ఫిజిషియర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు డివిజన్ పీఆర్‌ఓ వినయ్‌కాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికారాబాద్ – కాకినాడ టౌన్ (07264), సికింద్రాబాద్ – కాకినాడ టౌన్ (07261), సికింద్రాబాద్ – నరసాపూర్ (07239) రైళ్లు జనవరి 9వ తేదీన, వికారాబాద్ – నరసాపూర్ (07211) జనవరి 10న, సికింద్రాబాద్ – కాకినాడ టౌన్ (07280), సికింద్రాబాద్ – కాకినాడ టౌన్ (07261), వికారాబాద్ – నరసాపూర్ (07249) రైళ్లు జనవరి 11న, వికారాబాద్ – నరసాపూర్ (07211), వికారాబాద్–నరసాపూర్(07253) జనవరి 12 వ తేదీన, సికింద్రాబాద్ – కాకినాడ టౌన్ (07261) జనవరి 13న కేటాయించినట్లు తెలిపారు. కాకినాడ టౌన్ – వికారాబాద్(07263) జనవరి 8న, నరసాపూర్–వికారాబాద్ (07250) జనవరి 9న, కాకినాడ టౌన్ –సికింద్రాబాద్ (07279), కాకినాడ టౌన్ – సికింద్రాబాద్ (07262), నరసాపూర్ – వికారాబాద్ (07248) రైలు జనవరి 10న, నరసాపూర్ – వికారాబాద్ (07250) జనవరి 11న, కాకినాడ టౌన్ –వికారాబాద్(07262), నరసాపూర్–వికారాబాద్ (07248) జనవరి 12న, నరసాపూర్–వికారాబాద్ (07257), కాకినాడ టౌన్–వికారాబాద్ (07241) రైలు జనవరి 17న, నరసాపూర్–వికారాబాద్ (07259) రైలు జనవరి 18న, కాకినాడ టౌన్–వికారాబాద్ (07285) రైలు జనవరి 19న గుంటూరు డివిజన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

జిల్లా వైద్యశాల ఎదుట ధర్నా



తెనాలిఅర్బన్: దళితుడుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నం ధర్మారావు డిమాండ్ చేశారు. చుండూరు మండలం వలివేరు దళితవాడకు చెందిన పందిపాటి రెడ్డియ్యపై దాడికి నిరసనగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు కొద్దిసేపు ఆందోళన చేశారు. ముందుగా బాధితుడిని పరామర్శించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ రద్దు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఏ) ఆవరణలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను అనివార్య కారణాలతో తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీఓ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. జిల్లాలోని ప్రజలు గమనించి, జిల్లా పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

అన్నివర్గాలకూ చంద్రబాబు అన్యాయం

వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ చేయటం వలన అన్నివర్గాల విద్యార్థులకు అపార నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా రిజర్వేషన్లు, ప్రతిభతో ముందుకు సాగే విద్యార్థులకు ఇదొక శాపంలాంటి నిర్ణయం. కేవలం దోచుకో, దండుకో, దాచుకో అనే సిద్ధాంతంతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకు సాగుతోంది. కోటి సంతకాల కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక చెంపపెట్టు. వైఎస్ జగనన్న నేతృత్వంలో కచ్చితంగా ఎంతటి ఉద్యమాలకైనా వెనుకాడం. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే చంద్రబాబు ప్రభుత్వ ఆలోచనను విరమించుకునే వరకు వైఎస్సార్‌సీపీ తరపున పోరాటం కొనసాగిస్తాం.

– షేక్ నూరి ఫాతిమా, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త

ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో వ్యతిరేకత

ప్రభుత్వం నిర్వహించాల్సిన వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వారికి, కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం చూస్తోంది. ఈ విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ప్రకారం కోటి సంతకాల సేకరణలో ప్రతి నియోజకవర్గంలోనూ వేల మంది ప్రజలు తమ వ్యతిరేకతను తెలియజేస్తూ స్వచ్ఛందంగా సంతకాలు చేయటం ఇందుకు నిదర్శనం. జిల్లా కేంద్రం నుంచి సంతకాల పత్రాలను రాష్ట్ర పార్టీ ఆఫీసుకు తరలించే ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని జయప్రదం చేయాలి.

– అన్నాబత్తుని శివకుమార్, తెనాలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

పేదలకు చంద్రబాబు తీరని ద్రోహం

చంద్రబాబు ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ ద్వారా పేదలకు, వైద్య విద్య అభ్యసించే పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాల కోసం 17 వైద్య కళాశాలలను తీసుకొచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం ఆ కళాశాలల ప్రైవేటీకరణకు ప్రయత్నించడం దారుణం. ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణకు పొన్నూరు నియోజకవర్గంలో అనూహ్య స్పందన లభించింది. సోమవారం ఉదయం గుంటూరులో జరిగే భారీ ర్యాలీకి అందరూ భారీగా తరలిరావాలి.

– అంబటి మురళీకృష్ణ, పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

ర్యాలీని జయప్రదం చేయండి

నేడు ఉదయం 10 గంటలకు గుంటూరు కేంద్రంగా బృందావన్ గార్డెన్స్ నుంచి జరిగే కోటి సంతకాల పత్రాలను కేంద్ర పార్టీ కార్యాలయానికి చేర్చేందుకు చేపట్టే ర్యాలీని జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. పేద వర్గాలకు వైద్య విద్యను దూరం చేసి, తమ జేబులు నింపుకొనేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్న పరిస్థితులు చూస్తున్నాం. చంద్రబాబు నిర్ణయంపై నిరసనగా రాష్ట్రంలో కోటి సంతకాలకు పిలుపునిస్తే.. కోటిన్నర సంతకాలు అయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న వ్యతిరేకత దీనిబట్టి అర్థమవుతోంది. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా కోటి సంతకాల కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కచ్చితంగా ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ నేడు జరిగే ప్రదర్శనకు తరలిరావాలని కోరుతున్నాం.

– అంబటి రాంబాబు, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు

సంతకమే.. సమర శంఖమై..!

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయంపై నిరసన వెల్లువ
- 'కోటి సంతకాల సేకరణ ఉద్యమం'లో భాగంగా సంతకాల పత్రాలతో నేడు ర్యాలీ
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తల కృషితో ఇప్పటికే భారీగా ప్రజల నుంచి మద్దతు
- నేడు గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

పేదల జీవితాలను నాశనం చేసేలా చంద్రబాబు సర్కారు చేస్తున్న కుట్రలపై ప్రజా 'సంతకమే' సమర శంఖం మోగించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉన్న వ్యతిరేకత ప్రజాగళమై గర్జించింది. పేదల సొమ్మును పెత్తందారుల చేతిలో పెట్టనున్న చంద్రబాబు ప్రభుత్వంపై పోరుకు నాంది పలికింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణకు అన్ని వర్గాల నుంచి లభించిన అనూహ్య మద్దతుతో కార్యక్రమం విజయవంతమైంది. సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయానికి సంతకాల పత్రాలను భారీ ర్యాలీల నడుమ తరలించనున్నారు.

సంతకాల పత్రాలను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి ర్యాలీగా తరలిస్తున్న అంబటి, శ్రేణులు (ఫైల్)

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం గుంటూరు జిల్లాలో విజయవంతంగా ముగిసింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు, పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, తాడికొండ నియోజవకర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం దిగ్విజయంగా ఆయా అనియోజకవర్గాల్లో ముగిసింది. ప్రతి డివిజన్‌లోని మండంలో ఉన్న గ్రామానికి వెళ్లి వార్డులలోని ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వలన జరిగే నష్టాన్ని వివరించారు. ప్రజల నుంచి స్వచ్ఛందంగా సంతకాలు సేకరించారు. ఆ సంతకాలను డిజిటలైజేషన్ కూడా చేశారు. నియోజకవర్గాల వారీగా చూస్తే గుంటూరు పశ్చిమ – 74,763, గుంటూరు తూర్పు – 65,000, తెనాలి – 75,000, మంగళగిరి – 66,296, పొన్నూరు – 65,000, ప్రత్తిపాడు – 68,000, తాడికొండ – 64,000లతో కలిపి మొత్తం 4,78,59 మంది సంతకాలు చేశారు. ఈ క్రమంలోనే ప్రజా ఉద్యమ ర్యాలీని నిర్వహించి వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాలు అందజేశారు. ఈ నెల 10వ తేదీన భారీ ఊరేగింపుల నడుమ సంతకాల పత్రాలను గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి జిల్లా పార్టీ కార్యాలయానికి చేర్చారు.

నేడు భారీ ర్యాలీ..

జిల్లాలోని గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడుల నుంచి సంతకాల పత్రాలను జిల్లా పార్టీ కార్యాలయానికి చేరాయి. దానిలో భాగంగా సోమవారం జిల్లా పార్టీ కార్యాలయం నుంచి సంతకాల పత్రాలను తాడేపల్లిలోని కేంద్ర పార్టీ కార్యాలయానికి చేర్చనున్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నుంచి ఎన్టీఆర్ స్టేడియం, చంద్రమౌళినగర్, లక్ష్మీపురం మీదుగా లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన కొనసాగనుంది. ఇప్పటికే పార్టీ శ్రేణులు, జిల్లా వ్యాప్తంగా సన్నాహక సమావేశాలు పెట్టి సంతకాల పత్రాలను కేంద్ర పార్టీ కార్యాలయానికి చేర్చే అంశాన్ని అనుబంధ విభాగాల నేతలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా, నగర కమిటీ నేతలకు వివరించారు. నేడు జరిగే ర్యాలీకి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లును చేశారు. ఉదయం 10 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుంది.

ప్రైవేటీకరణ ఆగేవరకు పోరాటం

పేదలకు వైద్య విద్య, పేద విద్యార్థులకు వైద్యాన్ని దూరం చేసి కార్పొరేట్ శక్తులకు మరింత ఊతం ఇచ్చేలా చంద్రబాబు సిగ్గులేని పాలన చేస్తున్నారు. పేదలు ఉన్నత విద్యను అభ్యసించకూడదా..? వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో కష్టపడి 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారు. వాటిని చంద్రబాబు తన తాబేదార్లకు దోచిపెట్టేందుకు దుష్ట కార్యక్రమాలు చేస్తున్నారు. కచ్చితంగా కళాశాలల ప్రైవేటీకరణ ఆగే వరకు పోరాటం ఆగదు.

– మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీ, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల పరిశీలకుడు

ప్రజా ఉద్యమం విజయవంతం

చంద్రబాబు నిరంకుశ పాలన, రూ.లక్షల కోట్ల అప్పులు, అందని ద్రాక్షగా సంక్షేమం, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ ఆస్తులను ధారదత్తం చేస్తున్న తీరుతో రాష్ట్రంలో ప్రజలు విసిగిపోయారు. అందుకే ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు నియోజకవర్గంలో 72 వేల మందికిపైగా ప్రజలు కోటి సంతకాల ఉద్యమంలో పాల్గొని మద్దతు తెలిపారు. పార్టీలకు అతీతంగా అందరూ సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. చంద్రబాబు తన వర్గానికి రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనించారు. బాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు.

– బలసాని కిరణ్‌కుమార్, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

అన్ని వర్గాల నుంచి స్పందన

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి ప్రజల నుంచి ఊహించని స్థాయిలో భారీ మద్దతు లభించింది. ప్రజల్లో తిరుగుతుంటే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తోంది. పేదవాడికి వైద్యం, వైద్య విద్యను దూరం చేసి కార్పొరేట్ వారికి ఆసుపత్రులకు కట్టబెట్టేందుకు చంద్రబాబు కుట్రలకు తెరలేపారని ప్రజలకు తెలిసిపోయింది. ఇకనైనా బాబు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకొని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలి.పేదలకు న్యాయం చేయాలి. లేకుంటే ప్రజలే బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి.

– వనమా బాల వజ్రబాబు, తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

ప్రైవేటీకరణను సహించం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదు. చంద్రబాబు సర్కార్ కమీషన్ల కోసమే ప్రైవేటీకరణకు యత్నిస్తోంది. నేడు ఉదయం 10 గంటలకు మంగళగిరి బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బైక్ ర్యాలీ ఉంటుంది. గాలిగోపురం మీదుగా మిద్దె సెంటర్, గౌతమ బుద్ధ రోడ్, బీఎండబ్ల్యూ షోరూమ్ వరకు సాగుతుంది. అక్కడి నుండి గుంటూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి ర్యాలీ చేరుకుంటుంది. అక్కడి నుంచి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి వెళుతుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలి.

– దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

బాబు కుట్రలపై నిరసన 'సంతకం'

- వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణకు భారీగా స్పందన
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించిన ప్రజలు
- అన్నివర్గాల వారి నుంచి ఉద్యమానికి అనూహ్య మద్దతు
- గుంటూరు తూర్పు సమన్వయకర్త నూరి ఫాతిమా ఆధ్వర్యంలో చురుగ్గా సాగిన సేకరణ

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై మహిళలను చైతన్యపరుస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో ప్రజలు చేసిన ఒక్కో సంతకం చంద్రబాబు సర్కారు కుట్రలపై నిరసన తీవ్రత తెలుపుతోంది. రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో విజయవంతం అయింది. ప్రజా ఉద్యమంలా ముందుకు సాగింది. పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా, పేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలకు అందకుండా చంద్రబాబు సర్కార్ వ్యవహరిస్తున్న తీరును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ సంతకాలతో మద్దతు తెలిపారు. అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ చేపట్టిన ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు. గుంటూరు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రజలు భారీగా తమ సంతకాలతో చంద్రబాబు ప్రభుత్వంపై వ్యతిరేకతను చాటిచెప్పారు.

అవగాహన కల్పించి మరీ...

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 23 డివిజన్‌లలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ఆధ్వర్యంలో అక్టోబర్ 18వ తేదీ నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభమైంది. నియోజకవర్గంలోని 1వ డివిజన్ నుంచి 15వ డివిజన్ వరకు, 17, 50, 51, 53, 54, 55. 56, 57 డివిజన్‌లలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. నూరి ఫాతిమా 14 డివిజన్‌లలో స్వయంగా పాల్గొన్నారు. ప్రతి ఇంటి గడపకు వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. అనేక డివిజన్‌లలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ జరిగితే జరిగే అనర్థాలను ప్రజలకు స్వయంగా వివరించారు. అందరితో మమేకమవుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజెప్పారు. అనేక డివిజన్‌లలో ఆమె పర్యటించిన నేపథ్యంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 65 వేల సంతకాలను సేకరించారు. పార్టీ అనుబంధ విభాగాల నేతలు, యువజన విద్యార్థి విభాగం నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కోర్ కమిటీ నేతల సహాయ సహకారాలతో సంతకాల సేకరణ పూర్తయింది. కార్యక్రమానికి మైనార్టీ అసోసియేషన్ నేతలు, అఖిల భారత వడ్డెర సంఘం, మాదిగ సంక్షేమ పోరాట సమితి, ఆటో యూనియన్ నేతలు మద్దతు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న జిల్లా పార్టీ కార్యాలయానికి నియోజవకర్గం నుంచి సేకరించిన సంతకాల పత్రాలను పంపారు. సంతకాల సేకరణ కార్యక్రమానికి పలు విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, కార్మిక సంఘాలు కూడా మద్దతు తెలియజేశాయి.

పేదలంటే చంద్రబాబుకు చిన్నచూపు



పేదలన్నా, పేద విద్యార్థులన్నా చంద్రబాబు చిన్న చూపుతో చూస్తున్నారు. కేవలం డబ్బుల కోసం కక్కుర్తి పడి పేద విద్యార్థుల కడుపు కొడుతున్నారు. పేదలకు వైద్య విద్య, వైద్యాన్ని దూరం చేసే దిశగా చంద్రబాబు ప్రభుత్వం ముందుకు సాగడం సిగ్గుచేటు. జగనన్న పేద విద్యార్థుల కోసం అనేక కళాశాలలను, విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారు. వాటన్నింటినీ చంద్రబాబు నాశనం చేస్తున్నారు. సంతకాల సేకరణ సమయంలో ప్రజల నుంచి ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యతిరేకత ఉందనే విషయం స్పష్టమైంది. చంద్రబాబు సర్కారుకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

– షేక్ నూరి ఫాతిమా, గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ నెల్లూరు

ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని విన్నర్‌గా నిలిచిన నెల్లూరు జిల్లా జట్టు సభ్యులు

431 పాయింట్లతో రన్నర్‌గా నిలిచిన విశాఖపట్నం జట్టు సభ్యులకు అవార్డు ప్రదానం

- ముగిసిన ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలు
- రెండవ రోజూ అదే ఉత్సాహాన్ని ప్రదర్శించిన వెటరన్ క్రీడాకారులు
- అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రదానం

5కే రన్‌లో పరుగెడుతున్న మహిళలు

ప్రత్తిపాడు: వెటరన్ క్రీడాకారులు రెండో రోజూ అదే ఉత్సాహాన్ని కనబరిచారు. పెదనందిపాడు మండలం పాలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 45వ రాష్ట్రస్థాయి వెటరన్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2025 పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ నిమ్మగడ్డ నాగేశ్వరరావు, శ్రీ హాస్పిటల్ అధినేత చెరుకూరి పవన్‌కుమార్‌లు హాజరయ్యారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్‌తోపాటు, మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జమ్మలపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ జనరల్ సెక్రటరీ మంగా వరప్రసాద్ తెలిపారు.

విజేతల వివరాలు..

రెండో రోజు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి వివరాలను ఏపీఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ మంగా వరప్రసాద్, వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ గణేశుని రాంబాబు, జాయింట్ సెక్రటరీ చెన్నుపాటి శివనాగేశ్వరరావు వెల్లడించారు. 5కె రన్నింగ్ పురుషుల 65 ప్లస్ విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన వి.సుధాకర్, 70 ప్లస్ విభాగంలో విశాఖపట్నంకు చెందిన ఎం. శంకరరావులు ప్రథమ స్థానం సాధించారు. మహిళల 5కె రన్నింగ్ 60 ప్లస్ విభాగంలో నెల్లూరు జిల్లాకు చెందిన పి.కోటేశ్వరమ్మ, కె.శారదలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 1కెఎం వాక్ 90 ప్లస్ విభాగంలో డి.శేషగిరిరావు (గుంటూరు), 3కె వాక్ 70 ప్లస్‌లో బి.వెంకటలక్ష్మిలు ప్రథమ స్థానం సాధించారు. 481 పాయింట్లతో నెల్లూరు జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్, 431 పాయింట్లుతో విశాఖ జిల్లా రన్నర్స్‌గా నిలిచింది. బెస్ట్ మార్చ్‌ఫాస్ట్ వైజాగ్ ప్రథమ స్థానం, కృష్ణా జిల్లా ద్వితీయ స్థానం దక్కించుకుంది. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.శ్రీనివాసరావు, ఇస్మాయిల్, రాఘవరావు, కృపారావు, అనిల్, ఎం.సత్యనారాయణలు వ్యవహరించారు.

క్లుప్తంగా

ఆడియాలజిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ శిరీష

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా గుంటూరుకు చెందిన డాక్టర్ ఆర్.శిరీషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరు కొత్తపేటలోని సంఘ కార్యాలయంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ రాష్ట్ర సెక్రటరీగా డాక్టర్ బి.ప్రకాశం, ట్రెజరర్‌గా డాక్టర్ సిహెచ్.సుజిత ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఏపీలోని పలు ప్రాంతాల్లో అనధికారికంగా స్పీచ్ థెరపీ సెంటర్లు నడుపుతున్నారని చెప్పారు. మాట, ప్రవర్తన లోపాలు ఉన్న పిల్లల తల్లిదండ్రుల నుంచి అనాధికార స్పీచ్ సెంటర్ల నిర్వాహకులు నెలకు రూ. 25 నుంచి రూ.30 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. పిల్లలకు సరైన పద్ధతుల్లో స్పీచ్ థెరపీ అందించలేకపోతున్నారని, వేలల్లో ఫీజులు దండుకుంటున్నారని వాపోయారు. ప్రభుత్వం అనధికార ఫీజు సెంటర్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినికిడి లోపం ఉన్న వారి పిల్లల తల్లిదండ్రులు నిపుణులైన ఆడియాలజిస్ట్‌లను సంప్రదించి వారి పర్యవేక్షణలోనే యంత్రాలు వినియోగించాలని సూచించారు. సమావేశంలో సంఘ సభ్యులు మోహన్‌కుమార్, లావణ్య, క్రిష్టాఫర్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో పురోగతి

- పోలీసుల అదుపులో కొంతమంది యువకులు
- పూర్తిస్థాయిలో విచారిస్తున్న పోలీసులు
- సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుల కోసం ప్రత్యేక బందాలు

పట్నంబజారు: రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మైనర్ బాలిక డ్రగ్స్ సేవించిన కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. తెలిసిన సమాచారం ప్రకారం... గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్‌లోని లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న బజార్‌లో నివాసం ఉండే ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక మైనర్ బాలికకు కొందరు యువకులు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యారు. డ్రగ్స్‌కు బానిసగా మార్చడంతో ఆమె తల్లి వంగల స్వప్న ప్రియ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన కొంతమంది యువకులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. బాలిక స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన పోలీసు అధికారులు యువకులను గుర్తించినట్లు తెలుస్తోంది. సాంకేతిక నిపుణుల ద్వారా ఇన్స్టాగ్రామ్‌లో బాలికకు పరిచయమైన యువకుల అంశాలను పరిశీలిస్తున్నారు. బాలిక చెప్పిన వాస్తవాలు ఆధారంగా డ్రగ్స్ ఎక్కడి నుంచి వారికి అందుతున్నాయి? ఈ వ్యాపారానికి కూడా మరెవరైనా డ్రగ్స్ అందజేస్తున్నారా? రక్తంలో చేస్తున్న యువకులు ఎక్కడినుంచి వస్తున్నాయనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులను పట్టుకునేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో కొంతమంది యువకులను విచారించి నేరవృత్తంలో అసలు నిందితుల కోసం వెతుకులాడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులు సమాచారం అడగ్గా దర్యాప్తులో ఉందని చెబుతున్నారు. యువకులను రిమాండ్ కూడా తరలించారని వాదనలు వినవస్తున్నాయి.

ఏపీలో 15 ఏళ్ల తరువాత ఫార్మాసిస్ట్‌ల ఎన్నికలు

- ఈ నెల 24లోపు పోస్టల్ బ్యాలెట్‌లు చేరాలి
- యునైటెడ్ రిజిస్టర్ ఫార్మాసిస్ట్ ప్యానల్ అభ్యర్థులను గెలిపించాలని వినతి



గుంటూరు మెడికల్: విభజిత ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 2025 డిసెంబర్‌లో ఏపీ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఏపీ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ సంఘ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు తెలిపారు. గుంటూరులోని ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..15 ఏళ్లఅనంతరం ఏపీలో ఫార్మాసిస్ట్‌ల ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 60వేల మంది ఫార్మాసిస్ట్‌లు ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఓటును యునైటెడ్ రిజిస్టర్ ఫార్మసిస్ట్ ప్యానల్ అభ్యర్థులైన వేమూరు మాలతి, నరేష్ లుక్కాకు వేయాలని అభ్యర్థించారు. ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనే వారు ఈనెల 24లోపు పోస్టల్ బ్యాలెట్లను స్పీడ్ పోస్ట్ ద్వారా విజయవాడలోని ఫార్మసీ కౌన్సిల్ కార్యాలయానికి చేరేలా చూడాలని కోరారు.

కుంచెతో తెలుగును వెలిగించిన బాపు

ముగ్గురికి స్మారక పురస్కారాల ప్రదానం



సినీ దర్శకులు వర ముళ్లపూడిని సన్మానిస్తున్న అతిథులు

నగరంపాలెం: చిత్రాలు, కార్టూన్ల ద్వారా తెలుగును వెలిగించిన చిరస్మరణీయుడు బాపు అని స్మరించుకోవడం అందరి బాధ్యతని గజల్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్ రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ఆదివారం బాపు– రమణ–బాలు కళాపీఠం, మల్లెతీగ సంయుక్తంగా బాపు జయంతి – బాపు స్మారక పురస్కారాల సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ అందమైన స్త్రీని బాపు బొమ్మగా ప్రశంసిస్తున్నామంటే అది ఆయన చిత్రాలకున్న గొప్పతనమని తెలిపారు. తెలుగు వారు ఉన్నంత కాలం బాపు సినిమాలు, చిత్రాలు, కార్టూన్లు సజీవంగా ఉంటాయని చెప్పారు. తెలుగు అమ్మ ఒడి భాష కావాలన్నారు. తెలుగును అధికార భాషకంటే ముందు మమకార భాషగా గుర్తించాలని పేర్కొన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాపు– రమణ – బాలు కళాపీఠ వ్యవస్థాపకులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి మాట్లాడుతూ బాపును స్మరించుకోవడం మన అదృష్టంగా భావించాలని తెలిపారు. బాపు సినిమాల్లోని ముఖ్య సన్నివేశాల్ని, పాటల్ని ఆత్మీయ అతిథి, సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్ గుర్తు చేశారు. సాహితీ సమాఖ్య గుంటూరు కార్యదర్శి ఎస్ఏఎస్.లక్ష్మీనారాయణ బాపు ప్రతిభను తెలిపే సంగతుల్ని వివరించారు. మల్లెతీగ కలిమిశ్రీ మాట్లాడుతూ బాపు దర్శకునిగా, చిత్రకారుడిగా, కార్టూనిస్టుగా సేవలందించారని పేర్కొన్నారు. అనంతరం సుప్రసిద్ధ సినీ దర్శకులు వర ముళ్లపూడి, చిత్రకారుడు అరసవల్లి గిరిధర్, కార్టూనిస్టు హరి వెంకటరమణలకు బాపు స్మారక పురస్కారాలను అందించారు. బాపుతో ఉన్న అనుబంధాన్ని పురస్కార గ్రహీతలు గుర్తు చేసుకున్నారు.

చిత్రకారుడు అరసవల్లి గిరిధర్‌కు సన్మానం

కార్టూనిస్టు హరి వెంకటరమణకు సత్కారం

నేటి ర్యాలీని జయప్రదం చేయండి

మాట్లాడుతున్న అంబటి రాంబాబు, వేదికపై నిమ్మకాయల తదితరులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు: పేద ప్రజల పక్షాన.. వారి గొంతుకై పేద విద్యార్థుల కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా సోమవారం కోటి సంతకాలకు సంబంధించి పార్టీ జిల్లా కార్యాలయం నుంచి జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ కాకుండా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపుమేరకు చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం దిగ్విజయంగా ముగిసిందన్నారు. జిల్లాలో సుమారుగా నాలుగు లక్షల 80 వేల సంతకాల సేకరణ జరిగిందని తెలిపారు. ఇందులో కార్యకర్తలు, పార్టీ నేతలు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఇప్పటికే ఈ నెల 10వ తేదీన గుంటూరు పశ్చిమం, తూర్పు, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల నుండి సంతకాలు జిల్లా కార్యాలయానికి చేరుకున్న విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిందే అన్నారు. సంతకాల సేకరణలో భాగంగా నేడు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయం నుండి లాడ్జి సెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ, ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. లాడ్జి సెంటర్ నుంచి తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్దకు వెళ్లి సంతకాలను అందజేయడం జరుగుతుందని వివరించారు. ఈ ర్యాలీలో భాగంగా అనుబంధ విభాగాలు, పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ప్రదర్శనను జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, వంగల వల వీరారెడ్డి, కార్పొరేటర్లు ఆచారి, అచ్చాల వెంకటరెడ్డి, వంశీ, సుబ్బారెడ్డి, ఆబిద్, మెహమూద్, కిషోర్, అనుబంధ విభాగాల అధ్యక్షులు సిడి భగవాన్, వజ్ర సైరా ఖాన్, కోటిపాటి ప్రేమ్ కుమార్, పార్టీ ముఖ్య నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అత్యుత్తమ మార్గం సాహిత్యం

ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ వైస్ చైర్మన్ విల్సన్

పురస్కారాలు అందుకున్న కవులు, రచయితలు

నగరంపాలెం: సమస్యల పరిష్కారానికి అత్యుత్తమ మార్గం సాహిత్యమేనని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ వైస్ చైర్మన్ ఆర్‌డీ.విల్సన్ అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ధార్మిక ప్రాంగణంలో ఆదివారం 16వ సోమేపల్లి సాహితీ పురస్కారాల సభ నిర్వహించారు. రమ్య భారతి సాహిత్య పత్రికను చలపాక ప్రకాష్, శ్రీ వసిష్ఠ సోమేపల్లి నిర్వహణలో జరిగిన, అతిథులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. రమ్య భారతి గౌరవ సంపాదకులు వేమూరి భార్గవ రత్నయ్య గుప్తా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి, అకాడమీ వైస్ చైర్మన్ ఆర్‌డీ.విల్సన్ మాట్లాడుతూ సాహిత్యంలో మానవతా విలువలు ఉన్నప్పుడు రాణిస్తుందని పేర్కొన్నారు. ఏపీ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.భవానీదేవి, ప్రముఖ కథకులు శ్రీ కంఠమూర్తి మాట్లాడుతూ మనిషిలో అంతర్గతంగా ఉన్న సాహిత్యాన్ని వెలికితీసేందుకు వేదికను నెలకొల్పిన మహా వ్యక్తి సోమేపల్లి అని కొనియాడారు. అనంతరం కథల పోటీల్లో ప్రథమ విజేత సింగరాజు శ్రీనివాసరావు (గెలుపు), ద్వితీయ విజేత జి.రంగబాబు (ఇక్కడైనా మారండి), తృతీయ విజేత బీవీఎస్.కెర్మల్ల (బేరం), ప్రోత్సాహక ఉత్తమ పురస్కారాలను సింహప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు (హైదరాబాద్), ఇంద్రగంటి నరసింహమూర్తి (కాకినాడ) కు అందించి, సత్కరించారు. సభలో సాహితీవేత్త లు కేంద్ర సాహిత్య అవార్డుగ్రహీతలు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, రావెల సాంబశివరావు, సిహెచ్.సుశీలమ్మ, శివప్రసాద్, తోట కూర వెంకటనారాయణ, సుభాని పాల్గొన్నారు.

ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ యాక్ట్

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: గుంటూరు నగరంలోని ఇద్దరి రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిపై పీడీ యాక్ట్ అమలు చేయాలని కోరుతూ జిల్లాస్థాయి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సిఫార్స్ చేయగా, ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. సుందరయ్య కాలనీ ఐదో వీధిలో ఉంటున్న షేక్ బాజీ అలియాస్ సిరివ్వరం బాజీపై నల్లపాడు పీఎస్‌లో ఏ కేటగిరి రౌడీషీట్, ఐదు కేసులు నమోదై ఉన్నాయన్నారు. రామిరెడ్డితోట ఒకటో వీధికి చెందిన 19 ఏళ్ల షేక్ సమీర్ అలియాస్ ఫైజల్‌పై కొత్తపేట పీఎస్‌లో ఏ–రౌడీషీట్, రెండు హత్య కేసులు సహా పది కేసులు ఉన్నాయని వెల్లడించారు. రౌడీషీటర్ బాజీ తరచూ హింసాత్మక మలుపుల్లో ఉంటూ, ప్రజా శాంతికి, స్వేచ్ఛకు భంగం సృష్టించేలా ప్రవర్తించేవాడని, మరో రౌడీషీటర్ సమీర్ బాల్యం నుంచే నేర జీవితానికి అలవాటుపడ్డాడని తెలిపారు. దోపిడీ, దొంగతనం, హత్యలకు సంబంధించి వరుస హింసాత్మక, చట్ట విరుద్ధమైన తీవ్ర నేరాల్లో పాల్గొనేవాడని వివరించారు. ఇద్దరు నిరంతరం నేరాల్లో కొత్తం చేసుకునేవారని, పలు కేసులు నమోదై, జైళ్లకు వెళ్లి శిక్షలు అనుభవించిన వారిలో మార్పు రాలేదని తెలిపారు. ఈ క్రమంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు వారిపై పీడీ చట్టం ప్రయోగించామని ఎస్పీ పేర్కొన్నారు. ఇద్దరిని రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించామని తెలిపారు. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా పీడీ చట్టం ప్రయోగిస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం

గుంటూరు రూరల్: రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ నేతృత్వంలో పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి వెణుమాధవరావు తెలిపారు. గుంటూరు జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నగరంలోని కృషి భవన్‌లో నిర్వహించారు. వేణుమాధవరావు మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణాధికారులకు జాబ్ చార్ట్, నామినల్ రోల్ మార్పు తదితర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో ఏపీ జేఏసీ సహకారంతో పరిష్కారం అవుతాయన్నారు. జిల్లావ్యవసాయ విస్తరణ అధికారులకు తమ సమస్యలను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించుకోవాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కోశాధికారి సుభాని గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు సురేష్, బాపట్ల జిల్లా అధ్యక్షులు సురేష్ గోపి, ప్రకాశం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ నాయుడు, పల్నాడు జిల్లా అధ్యక్షులు విజయ పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా కార్యవర్గం

గుంటూరు జిల్లా ఏఈఓ సంఘం అధ్యక్షులుగా ఆలా రమేష్‌బాబు, కార్యదర్శిగా ఎన్ ప్రసాద్‌బాబు, కోశాధికారిగా ఎంఎన్ కృష్ణారావు, సహాధ్యక్షులుగా ఐ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా పి రవికుమార్, ఆర్ వెంకయ్య, వీరంకి గోపి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివరావు, ప్రచార కార్యదర్శిగా కె రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా ఐ జ్యోత్స్న, పి రాజేంద్ర ప్రసాద్, బి సౌజన్య, కార్యవర్గ సభ్యులుగా దేవ నారాయణ, ఆదిలక్ష్మి, మురళి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రమణయ్య ఈ సందర్భంగా తెలిపారు.

ఉపకార వేతనాలతో ఉన్నతస్థాయికి ఎదగాలి

- పారిశ్రామికవేత్త తులసీ రామచంద్రప్రభు
- 430 మందికి రూ.14.53లక్షల ఉపకార వేతనాల పంపిణీ

స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న తులసీ రామచంద్రప్రభు, డాక్టర్ జగదీష్‌బాబు

తెనాలి: విద్యార్థులు ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పారిశ్రామికవేత్త, తులసీ సీడ్స్ అధినేత తులసీ రామచంద్ర ప్రభు పేర్కొన్నారు. ఒక స్థాయికి చేరుకున్నాక తిరిగి సమాజానికి సేవ చేయాలని అన్నారు. పట్టణానికి చెందిన కృష్ణదేవరాయ ఎడ్యుకేషన్ ప్రోగ్రెస్ అసోసియేషన్ (కెపా) 21వ ప్రతిభా స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం ఆదివారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చింతల శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సభలో 2024–25 విద్యా సంవత్సరానికి 430 మంది విద్యార్థులకు రూ.14.53 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. రామచంద్రప్రభు మాట్లాడుతూ తాను ఎస్ఎస్ఎల్‌సీ పరీక్ష ఫీజు రూ.16 కోసం నాలుగిళ్ల తిరగాల్సి వచ్చిందని, పీయూసీ, బీటెక్‌కు మెరిట్ స్కాలర్‌షిప్‌తో చదువుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. స్కాలర్‌షిప్ ప్రాముఖ్యతను విద్యార్థులు గుర్తెరగాలని చెప్పారు. రంగారెడ్డి ప్రెసిడెంట్ అధినేత డాక్టర్ గుత్తికొండ జగదీష్ బాబు మాట్లాడుతూ ఐర్లాండ్‌లో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. నారాయణ (గుప్త్ స్కూల్స్), గుంటూరు ఏబీఎం దాసం శివనాగరాజు, శింగంపూడి వీరన్న, విశ్రాంత బిజినెస్ అధికారి బళ్ల నరేంద్రకుమార్, భావనా పవన్‌కుమార్, రంగాచారి రమేష్ ప్రసంగించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జవ్వాజి కోటేశ్వరయ్య, కార్యదర్శి తాడికొండ చిన్న భాస్కర్, సభ్యులు బొల్లిముంత అమరేశ్వరరావు, చెంకుప్పన్నారావు, బొల్లిముంత శివరామకృష్ణ, సాయిక్ష్మ, సాంబశివరావు, బర్మా కోటేశ్వరరావు, జగన్మోహనరావు, సోమరౌతు సాంబశివరావు, తన్నీరు కల్యాణ్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్, తెనాలి యూనిట్ కార్యదర్శిగా ఎన్నికైన మున్నంఘడి సాయికృష్ణను అతిథుల చేతులమీదుగా సత్కరించారు.

ఖోఖో బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక

నకరికల్లు: ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ పల్నాడు జిల్లా ఖోఖో జట్టు సెలక్షన్స్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఉత్కంఠభరితంగా సాగిన సెలక్షన్స్‌ను గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, కార్యదర్శి చింతా పుల్లయ్య, ట్రెజరర్ జె.యాన్సీరాణి పర్యవేక్షించారు. సుమారు 200 మందికి పైగా బాలబాలికలు సెలక్షన్స్‌కు హాజరు కాగా సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. ఒక్కో జట్టుకు 19 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి చింతా పుల్లయ్య మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19వతేదీ నుంచి 21వరకు జె.పంగులూరులోను, 24వ తేదీ నుంచి 26 వరకు గుడివాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలిపారు.

చంద్రబాబు పాలనలో విద్యా రంగం నిర్వీర్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

హాజరైన ఉపాధ్యాయులు

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- ఘనంగా ముగిసిన యూటీఎఫ్ 51వ జిల్లా మహాసభలు

చేబ్రోలు: కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని, ఆన్‌లైన్ యాప్‌ల విధానంతో ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) గుంటూరు జిల్లా 51వ కౌన్సిల్ సమావేశం ఆదివారం చేబ్రోలులో ఘనంగా జరిగింది. స్థానిక ఆర్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు య. రాజశేఖరరావు అధ్యక్షత వహించారు. సమావేశాల ప్రారంభం సందర్భంగా జాతీయ, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ జెండాలను నారాకోడూరు హైస్కూల్ హెచ్‌ఎం ఎం. ఏడుకొండలు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర్, సీనియర్ నాయకులు ఆర్వీ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. యూటీఎఫ్ బలోపేతం, పీఎంఎస్ రద్దు, ఉపాధ్యాయుల సంక్షేమం, టెట్ అర్హత పరీక్ష, బోధనేతర పనులతో విద్యార్థిని దూరమవుతున్న ఉపాధ్యాయుడు, అభ్యుదయ భావాలతో కూడిన విద్య అందరి బాధ్యత అని అంశాల గురించి సమావేశంలో చర్చలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ టెట్ అర్హత తో కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల్లో ఎనిమిది తీర్మానాలు చేశారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్. నాయుడు, యూటీఎఫ్ నాయకులు ఎన్. కుమారరాజా, యన్. తాండవ కృష్ణ, ఎం. కళాధర్, వై. నాగమణి, జి. వెంకటేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు బాలాజీ బాబు, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, స్థానిక ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్వీ కృష్ణయ్య, సీవటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా య. రాజశేఖరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం. కళాధర్, సహాధ్యక్షుడిగా జి వెంకటేశ్వర్లు, మహిళా సహాధ్యక్షులుగా షకీలా బేగం, కోశాధికారిగా గయా షుద్పుల, జిల్లా కార్యదర్శులుగా సిహెచ్. ఆదినారాయణ, జి. వెంకటేశ్వరరావు, సాంబశివరావు, కేదార్నాథ్, గోవింద, రంగారావు, ప్రసాద్, కామాక్షి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరావు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ చిన్న వ్యాపార యజమానులకు మంచి అవకాశం. ZED MSME ప్రభుత్వ పథకంలో RS.లో భాగస్వాములు చేయండి. ఈ అవకాశాన్ని మిస్ కావద్దు. ☎ 8595824917

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకొంటాం. ☎ 8333833368

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును (స్టాట్ క్యాష్) ఫోన్: 81422 92071

WANTED

■ 30 to 65 yrs బ్యాంకు అనుభవం ఉన్నవారిలో జీతం + Inc 35 వేలు. టీం మేనేజర్, ఎగ్జిక్యూటివ్ Q: 10th -డిగ్రీ, ఏదైనా. బిజినెస్, ఇన్సూరెన్స్, ఏజెన్సీ, మ్యూచువల్ ఫండ్స్, మార్కెటింగ్ నో టార్గెట్. ☎ 90524 70111

■ SHO కు MLT, DMLT, BSc-MLT, ANM, GNM లు కావలెను. వయస్సు 8–10వేలు, నం॥ SHO 2/1 బ్రాడీపేట, గుంటూరు. 9848391212

■ Wanted Experienced Lady Tele caller cum Computer Operater for Education Consultancy in Guntur, Lakshmipuram. Sal: 15k to 20K, Qua: Degree. 9052975353

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSO క్లర్క్, క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను (M/F) 7893436019

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్, వార్డెన్గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హత: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించండి గుంటూరు. ఫోన్ నెంబర్: 92487 33372

■ శ్రీ ఇన్ఫ్రా రియల్ ఎస్టేట్ గుంటూరు నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయిస్ కావలెను. అర్హత 7th–10th. జీతం పార్ట్‌టైమ్– 6000/–, ఫుల్‌టైమ్–13000/–ఎలెంట్. 9908886363

■ Wanted Accountants to Work in Audit Office having Knowledge in Tally. GST Contact Numbers: 89780 21054

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్, క్లాస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ మరియు పిజి వరకు, వయస్సు: 22 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించండి. ఫోన్ నెంబర్: 89784 80429

■ తెనాలి డ్రైవర్, దుగ్గిరాలలో ప్రముఖ శాఖాకు పరిశ్రమకు ASO (Ex. Service Man & Civil), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సంప్రదించండి ☎ 80961 61777, 70939 24466

■ సెక్యూరిటీ గార్డ్స్ అమరావతి కొత్త CRDA ప్రాంతంలో 12 గం కావలెను. వ: 45 Q: 10 P/F, జీ: 17 వేలు + PF, ESI. సంప్ర: 94903 80213, 94902 48039

■ డ్రోన్ అవకాశం డిగ్రీ పూర్తిచేసిన వారికి ఫీల్డ్‌వర్క్ (Field Work) కోసం అవకాశం, వయస్సు : 30 సం|లోపు. ☎ +91 88006 29648. RSJ Inspection Service Ltd.

ఈ ప్రకటనలతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు

గుంటూరు

7075167663
7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు వాటి వివిధాంగాలు ప్రకటనకర్త స్పందించాలని మేము కోరుతున్నాం. పాఠకులు ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించి ఆయా ప్రకటనకర్తలతో సంప్రదించి వారి పూర్తి వివరాలు తెలుసుకొన్న తర్వాతే వాటికి తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలి. ఆన్‌లైన్ సంప్రదింపులు చేయకుండా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయవద్దు. ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఫిరంగిపురం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని గుండాలపాడు, మునగపాడు గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. గుండాలపాడులో గ్రామ సచివాలయం నూతన భవనం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, మునగపాడు నుంచి హైవే వరకు తారు రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలి

తాడేపల్లి రూరల్ : ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు సుభాని, అంకయ్య, ఆశీర్వాదంలతో కలసి ప్రారంభించారు. కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు గత 376 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో స్పందన రాలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, నవనీతమ్మ, మొలకల శారద, దానయ్య, సూర్యప్రకాష్, రిబ్కా, మోహనరావు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

విలువ రూ. 10 లక్షలు

మంగళగిరి టౌన్: పట్టణంలో చైన్ స్నాచింగ్ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. కొత్తపేటలో నివాసముంటున్న ఈశ్వరమ్మ ప్రతిరోజు ఇంటికి సమీపంలో వున్న రామాలయానికి వెళ్లి శుభ్రం చేసి వస్తుంది. ఆదివారం గుడికి వెళ్లి అక్కడ అంతా శుభ్రం చేసి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. బిగ్గరగా కేకలు వేసినా రోడ్డుపై ఎవరు లేకపోవడంతో చోరుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. జరిగిన సంఘటనపై బాధిత మహిళ ఈశ్వరమ్మ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గొలుసు సుమారు 82 గ్రాముల ఉంటుందని, రూ. 10 లక్షల వరకు విలువ చేస్తుందని ఆమె పేర్కొంది. ఎస్ఐ రవీంద్రనాయక్ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

ఆర్థిక సాయం అందజేత

తెనాలి రూరల్: ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమైన దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన విద్యార్థిని ఎన్. విమోచనకు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ-2 డి. శ్రీనివాసరావు ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. డిగ్రీ రెండో సంవత్సరం వరకు చదివిన విమోచన కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువును మధ్యలోనే వదిలేసి తెనాలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో పని చేస్తోంది. ఇటీవల వైద్యశాలకు వెళ్లిన ఎస్ఐ శ్రీనివాసరావు ఆమె పరిస్థితి గురించి తెలుసుకున్నారు. రూరల్ సీఐ నాయబ్ రసూల్ చేతుల మీదుగా స్టేషన్‌లో విమోచన, ఆమె తండ్రికి సాయం అందించారు. చదువుపై ఆసక్తి ఉన్నప్పటికీ మధ్యలో మాని కుటుంబ పోషణ నిమిత్తం పనికి వెళుతోందని, ఆమె చదువుకు తన వంతుగా ఈ సాయం చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కె. ఆనంద్ పాల్గొన్నారు.

మహిళపై దాడి: కేసు నమోదు

తెనాలిరూరల్: స్థల వివాదం కారణంగా మహిళపై దాడి చేసిన వ్యక్తిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం మల్లేపాడు గ్రామానికి చెందిన చావలి రాజమ్మ, ఆమె బావ యేసోబుకు స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన రాజమ్మపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కమీషన్ల కోసమే చంద్రబాబు ప్రైవేటీకరణ జపం

- మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి
- నేడు మంగళగిరిలో భారీ ర్యాలీ

దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్ / మంగళగిరి టౌన్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని, చంద్రబాబు సర్కార్ కమీషన్ల కోసమే ప్రైవేటీకరణకు పూనుకుందని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెడికల్ కాలేజీలను అభివృద్ధి చేయాల్సింది పోయి కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం సిగ్గుచేటని ఖండించారు. ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపేందుకు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ నెల 18వ తేదీన కోటి సంతకాల పత్రాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సోమవారం మంగళగిరిలో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు మంగళగిరి బస్టాండ్ వద్ద వున్న అంబేడ్కర్ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ మొదలవుతుందని తెలిపారు. గాలిగోపురం మీదుగా మిద్దె సెంటర్, గౌతమ బుద్ధ రోడ్, బీఎం డబ్ల్యూ షోరూం వరకు సాగి, అక్కడి నుంచి గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ దగ్గరున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి చేరుకుంటుందని వివరించారు. అక్కడి నుంచి ఏడు నియోజకవర్గాల అధ్యక్షులు, నాయకులతో గుంటూరు జిల్లాలో పూర్తి చేసుకున్న సంతకాల సేకరణ పత్రాలను ర్యాలీగా తీసుకువెళ్లి తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయానికి అందజేయనున్నట్లు వేమారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొంటారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అపార్ట్‌మెంటులో రెండు చోరీలు

వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ బహుళ అంతస్తులో నివాసముండే వారు దైవదర్శనం కోసం వెళ్లారు. మరొకరు కుమారుడి దగ్గరకు వెళ్లారు. ఆ రెండు నివాసాల్లో ఆదివారం తెల్లవారుజామున దొంగలు తాళాలు పగలకొట్టి చోరీకి తెగబడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. రామ్‌గోపాల్ కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం షిర్డీ వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటికి తిరిగి రాగా తాళాలు తీసి ఉండడం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడవేసి ఉండడం గమనించి, తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ప్రతాప్ కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. వారు ఆధారాలు సేకరిస్తున్న సమయంలో అదే అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగినట్లు సమాచారం వచ్చింది. ఇంటి యజమాని రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రేవంత్ హైదరాబాద్ వెళ్లడంతో ఇంట్లో ఏ వస్తువులు చోరీకి గురయ్యాయో తెలియరాలేదు. రామ్ గోపాల్ ఇంట్లో 25 కాసుల బంగారం, రెండు వెండిపట్టీలు, 40 వేల రూపాయలు నగదు పోయినట్లు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ ప్రతాప్ అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. చోరీకి పాల్పడిన వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

నూతన విద్యా విధానంతో వికసిత్ భారత్ సాధన

లక్ష్మణ్

తాడేపల్లి రూరల్ : వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనలో నూతన జాతీయ విద్యావిధానం ముఖ్య పాత్ర పోషిస్తుందని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ కార్యదర్శి గుంత లక్ష్మణ్ పేర్కొన్నారు.ఆదివారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాస వర్గ (స్టేట్‌ఫ్యాకల్టీ ట్రెనింగ్) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఐదేళ్లలోనే నూతన విద్యావిధానం సత్ఫలితాలు ఇస్తోందని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, విలువలు, మానవీయత ఆధారంగా విద్యా విధానాన్ని ముందుకు తీసుకువెళ్లాలని, తద్వారా భారత విశ్వగురువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు వై.వి. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.ఎస్.వి.ఎస్. బాలసుబ్రహ్మణ్యం, అదనపు ప్రధాన కార్యదర్శి జి. రాజశేఖర్, కాశీబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిగ్రీ కళాశాలల విభాగం ప్రొఫెసర్ ముప్పాల లక్ష్మణరావు, శరత్, ఎం. వి. నరసయ్య, 200 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

భగవంతుడి ఆరాధనతోనే సంతోషం

వాక్యోపదేశం చేస్తున్న ఫాదర్ విజయ జోజిబాబు

జెండా ప్రతిష్ట చేస్తున్న గురువులు

ఫిరంగిపురం: భగవంతుడి ఆరాధనతోనే ఆనందం, సంతోషం కలుగుతాయని ఫాదర్ పి. విజయ జోజిబాబు(సెయింట్ ఆన్స్ రీజనల్ సెమినరీ ప్రొఫెసర్, హైదరాబాద్) అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో క్రీస్తు జయంతి మహోత్సవ జెండా ప్రతిష్ట, దివ్యపూజాబలిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ జోజిబాబు వాక్యోపదేశం చేస్తూ భగవంతుడి ఆరాధన ద్వారా ఎడారి ప్రాంతంలో ఉన్నా సంతోషాన్ని కలిగిస్తాడని తెలిపారు. దేవుడి వైభవాన్ని తేజస్సుగా చూస్తారని చెప్పారు.కార్యక్రమానికి ముందుగా క్రీస్తు జన్మిస్తున్నాడనే శుభసూచికంగా జెండాలను ప్రతిష్టించారు. కార్యక్రమంలో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి, సహాయ విచారణ గురువు కె.సాగర్, మఠకన్యా స్త్రీలు, ప్యారిష్ కౌన్సిల్, సొడాలిటీ సభ్యులు, గుడి పెద్దలు, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.

రాయపూడిలో అక్రమ రేషన్ బియ్యం దందా

తాడికొండ: మండలంలోని రాయపూడి పంజా చెట్టు సెంటర్‌లో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఓ ఇంటిలో నిల్వ చేసి అర్ధరాత్రి తరలిస్తున్నారు. తుళ్లూరు మండలం అన్ని గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సివిల్ సప్‌లెస్ అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అక్రమ రేషన్ సరఫరాను నిలిపి వేయాలి.

మత్తు పదార్థాల సరఫరాపై నిఘా అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్ : రాష్ట్రంలో మత్తు పదార్థాల సరఫరాపై నిఘా ఏర్పాటు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయితో పాటు మత్తు పదార్థాలు యథేచ్ఛగా సరఫరా కావడం ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. మత్తు పదార్థాల సరఫరా, అమ్మకాలపై పోలీస్ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. యువత, విద్యార్థులు లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా పని చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వీటి బారిన పడిన భావిభారత పౌరుల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని వాటి బారి నుంచి తప్పించేందుకు ప్రత్యేక డ్రైవ్‌తో పాటు వారికి కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి. సుబ్బారెడ్డి, డి. కోదండరామయ్య పాల్గొన్నారు.

క్రియాశీల కార్యకర్తలకు గుర్తింపు

తెనాలి: వైఎస్సార్ సీపీలో అంకితభావంతో పని చేసే క్రియాశీల కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పార్టీ వాణిజ్య విభాగం తెనాలి మండల అధ్యక్షుడిగా నియమితులైన సురవరపు శ్రీనివాసరెడ్డి శివకుమార్‌ను ఆదివారం కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలను శివకుమార్ ఆయనకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాదం సురేష్, కోడూరి లూకా, కొలకలూరి బాబి, కొలకలూరి భరత్, పినపాటి అనిల్, వీరమల్ల కార్తికేయ, చంగల్‌శెట్టి సాయి, ఉన్నవ్ అఖిలేష్‌యాదవ్, షేక్ అమీర్‌భాష, షేక్ ఖాజా, సురవరపు వీరారెడ్డి, బిజిలీ నవీన్, మారంరెడ్డి అంజిరెడ్డి, సూరవరపు శంకర్‌రెడ్డి, సురవరపు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 గంటల పాటు నామసంకీర్తన

తెనాలి: నీవెంత వినమ్రుడవైతే నీ కీర్తి అంతగా అభివృద్ధి పొందుతుంది అనే హరనాథుని సూక్తిని అనుసరిస్తూ నడుస్తున్న తెనాలి నందులపేటలోని శ్రీకుసుమ హరనాథ్ మందిరంలో ఆదివారం ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తజనరంజకంగా సాగింది. మాతృశ్రీ కుసుమకుమారిదేవి 155వ జన్మదినం సందర్భంగా 'జయ హరనాథ జయ కుసుమకుమారి జయ' నామసంకీర్తనను 12 గంటల పాటు నిర్వహించారు. ఉదయం 5.45 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు భక్తులతో నామసంకీర్తన భజన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. హాజరైన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం హారతి, తీర్థ ప్రసాదాలతో కార్యక్రమం ముగిసింది. మందిర కమిటీ అధ్యక్షుడు పీవీఎస్ నరసింహం, ఇతర పాలకవర్గ సభ్యులు, రాచపూడి సుజాత, ముద్దా భక్తుని రమణయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని బాలుడికి గాయాలు

తెనాలి రూరల్: బైక్ ఢీకొని బాలుడు గాయాలపాలైన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ ఐతానగర్‌కు చెందిన ఐదేళ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన సముద్రాల చంటి బైక్‌తో ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలుడి తండ్రి మహేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతి ఆదివారం - తెలుగు వారం పునఃప్రారంభం

తెనాలి: గాంధీనగర్‌లోని కాజావారి వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు పీటీ అవధాని ఆధ్వర్యంలో 'ప్రతి ఆదివారం - తెలుగు వారం' కార్యక్రమాన్ని ఆదివారం పునఃప్రారంభించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమాన్ని కవి, రచయిత పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి ప్రారంభించారు. నిర్వాహకుడు పీటీ అవధాని మాట్లాడుతూ గతంలో ఇదేవిధంగా రెండేళ్లపాటు ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ముఖ్యంగా ఇంగ్లిష్ మీడియం వారికి తెలుగు పదాలు, శతక పద్యాలు, నైతిక విలువలు, భగవద్గీత శ్లోకాలు, దేశభక్తి గీతాలు, సూక్తులు, సామెతలపై శిక్షణిచ్చినట్టు తెలిపారు. కరోనా వల్ల వాయిదా పడిన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించినట్టు తెలిపారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, రాత సామగ్రి పంపిణీ చేశారు. బెల్లంకొండ అనూరాధ, గద్దె వరలక్ష్మి, ఎన్.శ్రీనివాసరావు, ఎ.శివరామకృష్ణ, కుర్రా శ్రీనివాసరావు, తన్నీరు శివశంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

తెనాలి రూరల్: నూతనంగా ఆధునికీకరించిన తెనాలి తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నారు. దాతల సాయం, కొంత ప్రభుత్వ నిధులతో అధునాతన హంగులతో కార్పొరేట్ కార్యాలయంగా తహసీల్దార్ కార్యాలయాన్ని తీర్చిదిద్దారు. పనుల మీద వచ్చే ప్రజలకూ వసతులు కల్పించారు. పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.

నోటి శుభ్రతతో రోగాలు దూరం

తెనాలి: నోటి శుభ్రతను పాటిస్తే పలు రోగాల నుంచి దూరంగా ఉండొచ్చని ప్రముఖ దంతవైద్యుడు, సిబార్ డెంటల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్ అన్నారు. ది తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం చెంచుపేట అమరావతి కాలనీలోని ఎన్టీఆర్ కమ్యూనిటీ హాలులో జరిగింది. సమావేశంలో 'ఓరల్ హెల్త్, డెంటల్ కేర్' అంశంపై రవీంద్రనాథ్ సభ్యులకు అవగాహన కల్పించారు. సభ్యుల సందేహాలకు సమాధానాలను ఇచ్చారు. 2026 ఫిబ్రవరి 22, 23 తేదీల్లో భువనేశ్వర్‌లో జరగనున్న ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫరెన్స్‌కు తెనాలి శాఖ నుంచి సభ్యుల హాజరుపై చర్చించారు. అనంతరం డాక్టర్ రవీంద్రనాథ్‌ను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కొల్లిపర: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కొల్లిపర ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని చెప్పారు. ముఖ్యంగా ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా సాధారణ జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'చలపతి'లో హిల్ వ్యూ స్టేడియం ఆవిష్కరణ

కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని

తాడికొండ: మండలంలోని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా నిర్మించిన హిల్ వ్యూ స్టేడియాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ చలపతిలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం హర్షణీయమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసం, ఆరోగ్యాన్ని కలుగజేస్తాయన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం, ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. క్రీడల్లో పట్టు సాధించి మెరుగ్గా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, విద్యా సంస్థల చైర్మన్ వై.వి. ఆంజనేయులు, కార్యదర్శి వై. సుజిత్ కుమార్ డైరెక్టర్ వినయ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ కె. కిరణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సర్'తో బీజేపీ వ్యతిరేక ఓట్ల తొలగింపు

సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

మంగళగిరి టౌన్: ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే అవకాశం ఉందని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కార్మికవర్గానికి నష్టాన్ని కల్గించే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌పై వారిని సంఘటిత పరిచి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న తొమ్మిది రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని తెలిపారు. ఇప్పటికే బెంగాల్‌లో ఎస్ఐఆర్ అమలు చేసి సుమారు 44 లక్షల ఓట్లు తొలగించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు లోకేష్ ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.వి. జవహర్‌లాల్, ఎస్ఎస్ చెంగయ్య, పిల్లలమర్రి బాలకృష్ణ పాల్గొన్నారు.

శ్మశానవాటిక లేక దళితులకు అవస్థలు

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

దుగ్గిరాల: శ్మశానవాటిక లేక అవస్థలు పడుతున్నామని మండలంలోని పెనుమూలిలో దళితులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ మాట్లాడుతూ దళితులకు శ్మశానవాటిక లేదంటూ హైకోర్టుకి హ్యూమన్ రైట్స్ లేఖ ద్వారా ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, జిల్లా కలెక్టరు, సాంఘిక సంక్షేమ శాఖ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదనిన చెప్పారు. వంద సంవత్సరాల పైబడి చరిత్ర కలిగిన పెనుమూలిలో మాదిగలకు నిర్దిష్ట శ్మశానవాటిక లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలకు మరణానంతరం మృతదేహాన్ని ఖననం చేయడానికి సెంటు భూమి కూడా లేదని, వారి ఆత్మగౌరవానికి తీవ్ర విఘాతం కలుగుతోందని చెప్పారు. అధికారులు స్పందించి శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి రూరల్: తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ బి. జనార్ధనరావు ఆదివారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఉదయం స్టేషన్‌కు వచ్చిన ఆయన రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాల గురించి సీఐ నాయబ్ రసూల్, ఎస్ఐ ఆనంద్‌లను అడిగి తెలుసుకున్నారు. 498ఏ కేసులు ఎక్కువ నమోదవుతున్న దృష్ట్యా కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు సిబ్బంది నిరంతరం కృషి చేయాలన్నారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. రూరల్ స్టేషన్‌పరిధిలో 36 మంది రౌడీషీటర్లు ఉండగా ఆరుగురు జైళ్లలో ఉన్నారని, మిగిలిన వారికి ప్రతి వారం కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

రౌడీషీటర్లు, పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ బి.జనార్ధనరావు సూచించారు. తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరస్తులకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు అందరిపై నిఘా ఉంటుందని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కుటుంబాల కోసమైనా మారి మంచిగా జీవించాలని సూచించారు.

21న ఐక్య గ్రాండ్ క్రిస్మస్

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం తెనాలి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న మండల కేంద్రం కొల్లిపరలో ఐక్య గ్రాండ్ క్రిస్మస్‌ను నిర్వహించనున్నారు. దీనికి సంబంధిత ఆహ్వాన పత్రికను ఆదివారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెనాలిలో ఆవిష్కరించారు. గ్రాండ్ క్రిస్మస్‌లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రులు డాక్టర్ మేరుగ నాగార్జున, మేకతోటి సుచరిత, గుంటూరు పార్లమెంటరీ పరిశీలకుడు పోతిన మహేష్, విజయవాడ పార్లమెంటరీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజే సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు వరికూటి అశోక్ బాబు, షేక్ నూర్‌ఫాతిమా, బాలసాని కిరణ్, అంబటి మురళీకృష్ణ, ఈవూరి గణేష్, వనమా బాలవజ్ర డైమండ్‌బాబు, దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుదిబండి చిన్నవెంకటరెడ్డి, గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గెడ్డటి సురేంద్ర పాల్గొంటారని వివరించారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో ఎస్సీ విభాగం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లో శ్రీ వాసవీ మణికంఠ సేవా సమతి, శ్రీదేవి స్వీట్స్, బూర్లగడ్డ రామకృష్ణ, గాదంశెట్టి శ్రీనివాసులు, వెచ్చా సత్యనారాయణ, కార్తిక్ మిత్ర మండలి ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజా మహోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. 50 అడుగుల ఎత్తులో భారీ అయ్యప్ప మండపాన్ని ఏర్పాటు చేసి భక్తి గీతాలు ఆలపించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్పలు, శివస్వాములు, భవానీలు పాల్గొని పూజలు చేశారు. శంకర్‌స్వామి, జొన్న శ్రీను, సత్యం గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

చరిత్ర సృష్టించిన భారత స్క్వాష్ జట్టు... తొలిసారి ప్రపంచకప్ టైటిల్ సొంతం

చెన్నై: స్వదేశంలో భారత స్క్వాష్ జట్టు చిరస్మరణీయ ప్రదర్శన చేసింది. ఆదివారం ముగిసిన ప్రపంచకప్ మిక్స్‌డ్ టీమ్ స్క్వాష్ టోర్నమెంట్‌లో తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. ఈ ఘనత సాధించిన తొలి ఆసియా జట్టుగా రికార్డు నెలకొల్పింది. హాంకాంగ్ జట్టుతో జరిగిన ఫైనల్లో భారత్ 3–0తో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో ప్రపంచ 79వ ర్యాంకర్ జోష్నా చినప్ప 7–3, 2–7, 7–5, 7–1తో ప్రపంచ 37వ ర్యాంకర్ లీ కా యిపై గెలిచి భారత్‌కు శుభారంభం అందించింది. రెండో మ్యాచ్‌లో ప్రపంచ 29వ ర్యాంకర్ అభయ్ సింగ్ 7–1, 7–4, 7–4తో ప్రపంచ 42వ ర్యాంకర్ అలెక్స్ లాయుపై నెగ్గడంతో భారత్ ఆధిక్యం 2–0కు పెరిగింది. మూడో మ్యాచ్‌లో ప్రపంచ 28వ ర్యాంకర్ అనాహత్ సింగ్ 7–2, 7–2, 7–5తో ప్రపంచ 31వ ర్యాంకర్ టొమాటో హోపై గెలవడంతో భారత్‌కు ప్రపంచకప్ టైటిల్ ఖరారైంది.

హైదరాబాద్‌కు రెండో విజయం

రాణించిన మిలింద్, తనయ్, తన్మయ్, రాహుల్

పుణే: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ 'సూపర్ లీగ్' దశలో హైదరాబాద్ జట్టు రెండో విజయంతో ఫైనల్‌కు చేరువైంది. రాజస్తాన్ జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో సీవీ మిలింద్ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత రాజస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 178 పరుగులు సాధించింది. మహిపాల్ లొమ్రోర్ (35 బంతుల్లో 48; 1 ఫోర్, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హైదరాబాద్ బౌలర్లలో మొహమ్మద్ సిరాజ్ (2/23), సీవీ మిలింద్ (3/25), తనయ్ త్యాగరాజన్ (3/38) రాణించారు. అనంతరం హైదరాబాద్ జట్టు ధాటిగా ఆడుతూ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తన్మయ్ అగర్వాల్ (41 బంతుల్లో 73; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), రాహుల్ బుద్ధి (36 బంతుల్లో 55; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాజస్తాన్ బౌలర్ల భరతం పట్టి అర్ధ సెంచరీలతో మెరిపించారు. నాలుగు జట్లున్న గ్రూప్ 'బి'లో ప్రస్తుతం హైదరాబాద్ 8 పాయింట్లతోపాటు 2.999 రన్‌రేట్‌తో అగ్రస్థానంలో ఉంది. హరియాణా (4 పాయింట్లు; 0.234 రన్‌రేట్), ముంబై (4 పాయింట్లు; –0.371 రన్‌రేట్) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. మంగళవారం జరిగే చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో హరియాణాతో హైదరాబాద్; రాజస్తాన్‌తో ముంబై తలపడతాయి.

'శత'క్కొట్టిన హేమంత్ రెడ్డి

53 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లతో 109 నాటౌట్

ప్రసాద్ అజేయ అర్ధసెంచరీ • పంజాబ్‌పై 206 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఆంధ్ర

పుణే: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ 'సూపర్ లీగ్' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు అద్భుతం చేసింది. పంజాబ్‌తో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో ఆంధ్ర 206 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది. ఒకదశలో ఆంధ్ర జట్టు 56 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా పయనించింది. అయితే మారం రెడ్డి హేమంత్ రెడ్డి (53 బంతుల్లో 109 నాటౌట్; 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ శతకం ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (35 బంతుల్లో 53 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేసి ఆంధ్ర జట్టును గెలిపించారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు అజేయంగా 155 పరుగులు జోడించి ఆంధ్ర జట్టుకు ఆరు వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. హర్నూర్ సింగ్ (30 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్), అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (27 బంతుల్లో 47; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), సలీల్ అరోరా (22 బంతుల్లో 42 నాటౌట్; 5 సిక్స్‌లు), రమణ్‌దీప్ సింగ్ (18 బంతుల్లో 43; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి, పృథ్వీరాజ్, సౌరభ్ కుమార్, సత్యనారాయణ రాజు ఒక్కో వికెట్ తీశారు. 206 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసి గెలిచింది. శ్రీకర్ భరత్ (1), అశ్విన్ హెబ్బర్ (4), నితీశ్ కుమార్ రెడ్డి (0), రికీ భుయ్ (15), పైలా అవినాశ్ (13) విఫలమవ్వడంతో ఆంధ్ర 8.1 ఓవర్లలో 56 పరుగులకే సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో హేమంత్, ప్రసాద్ అద్భుత ఆటతీరుతో ఆంధ్రకు ఊహించని విజయాన్ని అందించారు.

భారత్ భళా... సఫారీ డీలా

మూడో టి20లో 7 వికెట్లతో టీమిండియా జయభేరి

- నిప్పులు చెరిగిన అర్ష్‌దీప్, హర్షిత్
- తిప్పేసిన వరుణ్, కుల్దీప్
- 17న లక్నోలో నాలుగో టి20

ధర్మశాల: ధర్మశాల అసలే శీతల ప్రదేశం. ఇక ఈ చలికాలమైతే మంచు గడ్డలా మారాల్సిందే. అలాంటి వేదికపై మన పేసర్లు దక్షిణాఫ్రికా బ్యాటర్లకు సెగ పెట్టారు. ఆరంభంలో పేస్ ప్రతాపం, తర్వాత స్పిన్ మాయాజాలం భారత్‌ను సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో నిలిపింది. ఆదివారం జరిగిన మూడో టి20లో టీమిండియా 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 117 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ మార్క్‌రమ్ (46 బంతుల్లో 61; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే భారత బౌలింగ్‌కు ఎదురు నిలిచాడు. మ్యాచ్ మొదలైన కాసేపటికే అర్ష్‌దీప్ (2/13), హర్షిత్ రాణా (2/34), హార్దిక్ పాండ్యా (1/23) పేస్‌కు సఫారీ కుదేలైంది. రిజా హెండ్రిక్స్ (0), డికాక్ (1), బ్రెవిస్ (2)లు పెవిలియన్ చేరడంతో ఒకదశలో 3.1 ఓవర్లలో సఫారీ స్కోరు 7/3. తర్వాత స్పిన్ తిరగడంతో 77 పరుగుల వద్ద 7వ వికెట్‌ను కోల్పోయింది. మార్క్‌రమ్ ఫిఫ్టీతో జట్టు కష్టంగా వంద పైచిలుకు స్కోరు చేసింది.

మెరిపించిన అభిషేక్

భారత్ ముందున్న లక్ష్యం ఏమాత్రం కష్టమైంది కాదు. ఇలాంటి స్కోరు ఛేదించేందుకు దిగిన భారత్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ (18 బంతుల్లో 35; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (28 బంతుల్లో 28; 5 ఫోర్లు) చక్కని ఆరంభమిచ్చారు. అభిషేక్ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో టీమిండియా స్కోరు 4.1 ఓవర్లలోనే 50 పరుగులు దాటింది. ఓపెనింగ్ వికెట్‌కు చకచకా 60 పరుగులు జోడించిన అభిషేక్ తొలి వికెట్‌గా నిష్క్రమించాడు. తిలక్ వర్మ (34 బంతుల్లో 26 నాటౌట్; 3 ఫోర్లు), గిల్ కుదురుగా ఆడారు. స్వల్ప వ్యవధిలో గిల్, కెప్టెన్ సూర్యకుమార్ (12) నిష్క్రమించినప్పటికీ మిగతా లాంఛనాన్ని తిలక్, శివమ్ దూబే (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ముగించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్ తదుపరి నాలుగో టి20 బుధవారం (17న) లక్నోలో జరుగుతుంది.

3 స్టబ్స్‌ను అవుట్ చేసిన హార్దిక్ అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో 100 వికెట్లను పూర్తి చేసుకున్నాడు. ఈ మైలురాయిని అందుకున్న మూడో భారత బౌలర్. అర్ష్‌దీప్, బుమ్రాలు ఇదివరకే వంద వికెట్ల క్లబ్‌లో ఉన్నారు.

50 స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి పొట్టి క్రికెట్‌లో 50 వికెట్లు పడగొట్టాడు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్షిత్ రాణా 1; హెండ్రిక్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 0; మార్క్‌రమ్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 61; బ్రెవిస్ (బి) హర్షిత్ 2; స్టబ్స్ (సి) జితేశ్ (బి) హార్దిక్ 9; బాష్ (బి) దూబే 4; ఫెరీరా (బి) వరుణ్ 20; యాన్సెన్ (బి) వరుణ్ 2; నోర్జే (స్టంప్డ్) జితేశ్ (బి) కుల్దీప్ 12; ఎన్‌గిడి (నాటౌట్) 2; బార్ట్‌మన్ (సి) సూర్యకుమార్ (బి) కుల్దీప్ 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 117.** **వికెట్ల పతనం:** 1–1, 2–1, 3–7, 4–30, 5–44, 6–69, 7–77, 8–113, 9–115, 10–117. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–13–2, హర్షిత్ 4–0–34–2, హార్దిక్ పాండ్యా 3–0–23–1, వరుణ్ 4–0–11–2, శివమ్ దూబే 3–0–21–1, కుల్దీప్ 2–0–12–2.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) మార్క్‌రమ్ (బి) బాష్ 35; శుబ్‌మన్ (బి) యాన్సెన్ 28; తిలక్ వర్మ (నాటౌట్) 26; సూర్యకుమార్ (సి) బార్ట్‌మన్ (బి) ఎన్‌గిడి 12; శివమ్ దూబే (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (15.5 ఓవర్లలో 3 వికెట్లకు) 120. వికెట్ల పతనం:** 1–60, 2–92, 3–109. **బౌలింగ్:** ఎన్‌గిడి 3–0–23–1, యాన్సెన్ 3–0–24–1, బార్ట్‌మన్ 3.5–0–34–0, బాష్ 3–0–18–1, నోర్జే 3–0–14–0.

భారత్‌దే పైచేయి

- పాకిస్తాన్ అండర్–19 జట్టుపై 90 పరుగులతో ఘనవిజయం
- రాణించిన ఆరోన్ జార్జి, కనిష్క్

దుబాయ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన యువ భారత జట్టు ఆసియా కప్ అండర్–19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 90 పరుగుల తేడాతో గెలిచింది. వరుసగా రెండో విజయంతో యువ భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మొదట భారత జట్టు 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (5) ఈసారి విఫలమవ్వగా ... హైదరాబాద్ ప్లేయర్ ఆరోన్ జార్జి (88 బంతుల్లో 85; 12 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్ ఆయుశ్ మాత్రే (25 బంతుల్లో 38; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), కనిష్క్ చౌహాన్ (46 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. 241 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ జట్టు 41.2 ఓవర్లలో 150 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. హుజైఫా హసన్ (70; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేశాడు. భారత బౌలర్లు దీపేశ్ (3/16), కనిష్క్ చౌహాన్ (3/33), కిషన్ సింగ్ (2/33) పాక్‌ను దెబ్బ తీశారు. కనిష్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఇద్దరు దిగ్గజాల భేటీ
ముంబైలో భారత క్రికెట్ మేటి సచిన్ టెండూల్కర్‌తో అర్జెంటీనా స్టార్ మెస్సీ

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: భూగోళశాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ అవేర్‌నెస్

టెన్త్ క్లాస్‌లో.. టాప్ స్కోర్!

ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలక దశగా పేర్కొనే పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నాహకాలు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణలో తాజాగా పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 14 నుంచి పరీక్షలు జరుపనున్నట్లు ప్రకటించారు. అంటే విద్యార్థులకు మూడు నెలల సమయం మాత్రమే అందుబాటులో ఉంది. ఈ విలువైన సమయాన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకుంటే.. పరీక్షల్లో టాప్ స్కోర్ సాధించొచ్చు. ఈ నేపథ్యంలో.. టెన్త్ పరీక్షల్లో బెస్ట్ స్కోర్ సొంతం చేసుకునేందుకు నిపుణుల సూచనలు..

- ఏపీలో మార్చి 16 నుంచి పరీక్షలు
- తెలంగాణలో మార్చి 14 నుంచి పరీక్షలు
- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలే కీలకం
- టాప్ స్కోర్ సాధించేందుకు సబ్జెక్ట్‌పై పట్టు, ప్రాక్టీస్ ముఖ్యం

జనరల్ సైన్స్‌కు రెండు పేపర్లు

ఏపీలో తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మ్యాథమెటిక్స్, సోషల్ స్టడీస్‌లో 100 మార్కుల చొప్పున ప్రశ్న పత్రాలు ఉంటాయి. జనరల్ సైన్స్‌కు సంబంధించి ఫిజికల్ సైన్స్‌లో 50 మార్కులకు ఒక పేపర్, నేచురల్ సైన్స్‌కు 50 మార్కులకు ఒక పేపర్ చొప్పున 2 పేపర్లుగా నిర్వహిస్తారు. ఇక తెలంగాణలో కూడా ఇదే రీతిలో ఏడు పేపర్లలో పరీక్షలు ఉంటాయి. అయితే ఇంటర్నల్ మార్క్స్ విధానం నేపథ్యంలో.. ఒక్కో పేపర్‌కు 80 మార్కులు చొప్పున కేటాయించారు. జనరల్ సైన్స్‌లో.. ఫిజికల్ సైన్స్ పేపర్‌కు 40 మార్కులు, నేచురల్ సైన్స్ పేపర్‌కు 40 మార్కులు ఉంటాయి.

మ్యాథమెటిక్స్

పదో తరగతి స్థాయిలో విద్యార్థులు క్లిష్టంగా భావించే సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్. ఈ సబ్జెక్ట్‌లో టాప్ స్కోర్ కోసం సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం, రేఖా గణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించాలి. ప్రాబ్లమ్ సాల్వ్ చేయడంతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పెంచుకోవాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను షార్ట్ నోట్స్‌లో రాసుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యపుస్తకంలో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం, త్రికోణమితి, క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేయాలి.

ఫిజికల్ సైన్స్

ఫిజికల్ సైన్స్‌లో మంచి మార్కుల కోసం అప్లికేషన్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజ జీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. విషయ అవగాహనతోపాటు, ప్రశ్నించడం–పరికల్పన చేయడం, ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు, సమాచార నైపుణ్యాలు–ప్రాజెక్ట్ పనులు, పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై పట్టు సాధించాలి. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలిచ్చే పట్టు లభిస్తుంది. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత సొంతమవుతుంది

నేచురల్ సైన్స్

సైన్స్ పేపర్‌లోనే జీవశాస్త్రం సబ్జెక్ట్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. అవగాహన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలను పెంచుకోవాలి. పుస్తకాల్లోని ఆయా అంశాలకు సంబంధించి ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించే విధంగా చదవాలి. ప్రయోగాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, భేదాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్ భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

తెలుగు

ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు పేపర్‌లో మంచి మార్కులు సాధించేందుకు పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలపై పట్టు సాధించాలి. వాటిని తరచూ పునశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని కేవలం చదవడంతో సరి పెట్టకుండా.. సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యాన్ని సొంతంగా ఆలోచిస్తూ చదవాలి.ఉప వాచకానికి సంబంధించి ఇతివృత్తం,ప్రాముఖ్యత, పాత్రలు,వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. వ్యాకరణంలో సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్త్యర్థాలు, జాతీయాలు బాగా చదవాలి.

ఇంగ్లిష్

ఇంగ్లిష్ పేపర్‌లో మంచి మార్కుల కోసం సొంతంగా విశ్లేషించేలా నైపుణ్యం పెంచుకోవాలి. తొలుత పాత ప్రశ్న పత్రాల సమాధానాలను పరిశీలించాలి. ప్రతి పాఠం చివరలో ఉండే కాంప్రహెన్సివ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రతి పాఠానికి సంబంధించి సారాంశాన్ని గ్రహించి సొంతంగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. పొయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కుల సాధన కోసం సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితోపాటు.. పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్‌పైనా అవగాహన పెంచుకోవాలి. వీటిని చదవడంతోపాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు మరింత ఆస్కారం లభిస్తుంది. అదే విధంగా అపరిచిత గద్యం(అన్ నోన్ ప్యాసేజెస్) సారాంశాన్ని గ్రహించేలా చదవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.

సోషల్ స్టడీస్

ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కులు పొందాలంటే.. సమకాలీన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. పాఠ్య పుస్తకంలోని ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు దానికి సంబంధించి మన నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలతో పోల్చుకుంటూ అధ్యయనం చేయాలి. సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన, ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలను సాధన చేయాలి. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి, సొంత పరిజ్ఞానంతో రాసే విధంగా నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం–భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి–ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధాల సమయంలో ప్రపంచం, సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రపై ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగాల నుంచి అనుసరించారు? వంటి కోణాల్లో చదవాలి.

ప్రిపరేషన్ టిప్స్..

- సిలబస్‌లో ఆయా సబ్జెక్ట్‌లు, చాప్టర్లలో సిలబస్‌ను పరిశీలించాలి.
- ముఖ్యమైన చాప్టర్లను వెయిటేజీ ఆధారంగా వర్గీకరించుకోవాలి.
- అత్యధిక వెయిటేజీ ఉండే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను బాగా అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌డీఏ–ఎన్‌ఏ–2026 పరీక్ష

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాలలో ప్రవేశాలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమి–నేవల్ అకాడమి ఎగ్జామినేషన్1 –2026 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా నేషనల్ డిఫెన్స్ అకాడమి(ఎన్‌డీఏ) 157వ కోర్సు, ఇండియన్ నేవల్ అకాడమి 119వ కోర్సుల్లో(ఐఎన్‌ఏసీ) ప్రవేశం కల్పిస్తారు.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 394(పురుషులు–370, మహిళలు–24).
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్‌మేటిక్స్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎత్తు:** పురుషులు 157 సెం.మీ, మహిళా అభ్యర్థులు 152 సెం.మీ. ఉండాలి.
- **వయసు:** 16 1/2 నుంచి 19 1/2 ఏళ్లు ఉండాలి. 01.07.2007 కంటే ముందు 01.07.2010 తర్వాత అభ్యర్థులు జన్మించి ఉండరాదు.
- **స్టైపెండ్:** నెలకు రూ.56,100.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.12.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.12.2025.
- **పరీక్ష తేది:** 12.04.2026.
- **ఫలితాలు తేది:** మే 2026.
- **ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ తేది:** 2026 జూన్ నుంచి జూలై వరకు.
- **ఎన్‌డీఏ 157వ కోర్సు ప్రారంభతేది:**01.01.2027
- **ఎన్ఏ 119వ కోర్సు ప్రారంభతేది:** 01.01.2027
- **వెబ్‌సైట్:** https://upsc.gov.in

నిఫ్ట్‌లో 2026–27 ప్రవేశాలు

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ ప్రోగ్రామ్ ఫ్యాషనల్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.

- **కోర్సుల వివరాలు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడీఎస్), బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(బీఎఫ్ టెక్నాలజీ), మాస్టర్ ప్రోగ్రామ్స్(ఎంఎఫ్‌డీఎస్, ఎంఎఫ్ఎం, ఎంఎఫ్‌టీ), పీహెచ్‌డీ.

అర్హత

- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. చివరి ఏడాది చదువుతున్నవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుకు మ్యాథ్స్‌తో ఇంటర్ ఉత్తీర్ణులవ్వాలి లేదా మూడేళ్ల డిప్లొమా చేసి ఉండాలి. చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌కు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా నిఫ్ట్ లేదా నిడ్ నుంచి కనీసం మూడేళ్ల వ్యవధితో యూజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుకు నిఫ్ట్ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(బీఎఫ్‌టెక్) లేదా ఏదైనా సంస్థ నుంచి బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. చివరి ఏడాది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు 01.08.2026 నాటికి 24 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఎంపిక చేసుకున్న కోర్సు ప్రకారం ప్రశ్నాపత్రం మారుతుంది. కొన్ని కోర్సుల్లో చేరడానికి పరీక్ష ఒక్కటే సరిపోతుంది. మిగిలిన వాటికి పరీక్షతో పాటు గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూ, క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్, సిట్యువేషన్ టెస్ట్ ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 08.12.2025.
- **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 07.01.2026 నుంచి 10.01.2026.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 12.01.2026 నుంచి 14.01.2026.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.01.2026.
- **పరీక్ష తేది:** 08.02.2026.
- **వెబ్‌సైట్:** https://exams.nta.nic.in/niftee

లక్నో యూనివర్శిటీలో 10 పోస్టులు

లక్నో యూనివర్శిటీ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్–04, డేటా అసిస్టెంట్/కంప్యూటర కమ్ టాబ్యులేటర్–04,రీసెర్చ్ ఫెలో1–01,రీసెర్చ్ ఫెలో2–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ, పీజీ(స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ /మ్యాథమేటిక్స్ /డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్ /స్టాటిస్టిక్స్ /ఎకనామిక్స్ /మ్యాథ్‌మేటిక్స్ /సోషియాలజీ/పబ్లిక్ హెల్త్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.12.2025.
- **వెబ్‌సైట్:** www.lkouniv.ac.in

మంచిమాట

జీవన నావకు స్నేహ సారథి

ఆపదలో తోడుండేవాడే నిజమైన స్నేహితుడు. యుద్ధంలో ధైర్యం చూపించేవాడే అసలైన వీరుడు. దానగుణం కలవాడే నిజమైన ధనవంతుడు. పేదరికంలోనూ పక్కన నిలబడేదే ఉత్తమ భార్య. కష్టాల్లో ఆదుకునేవారే నిజమైన బంధువులు. నిజమైన గుణగణాలు కష్ట సమయాలలోనే బయటపడతాయి. సుఖంలో నవ్వు పంచుకున్నవారంతా స్నేహితులు కారు; కష్టకాలంలో కన్నీళ్లు తుడిచేవాడే కల్మషం లేని బంధువు అని ఇది స్పష్టం చేస్తుంది. వారిచ్చే మానసిక ధైర్యం, ఆపత్కాలంలో మనకు పెద్ద ఆసరా.

జీవితం ఓ అద్భుత ప్రయాణం. ఈ ప్రయాణంలో మనకు తోడుగా, నీడగా నిలిచే అనుబంధాలలో కెల్లా స్నేహం అత్యంత మధురమైనది, విలువైనది. రక్త సంబంధం లేకున్నా, ఆత్మ బంధాన్ని పెంచే మనసులతో పెనవేసుకునే ఈ బంధం, సంతోషాన్ని ద్విగుణీకృతం చేసి, దుఃఖాన్ని అర్ధం చేసుకుని, భారంగా ఉన్నప్పుడు భుజం తట్టి, విజయాలను ఉత్సాహంగా పంచుకుని, వైఫల్యాలలో ఓదార్పునందించే అమృత భాండం. జీవితంలోని ప్రతీ మైలురాయి వద్ద తోడు నిలిచే స్నేహం, కాలంతో పాటు మరింత గాఢమవుతుంది. స్నేహం లేని జీవితం, రంగులు లేని చిత్రలేఖనంలా, సంగీతం లేని రాగంలా వెలవెలబోతుంది.

స్నేహం - జీవన గీతం

మన సనాతన ధర్మంలో స్నేహానికి అత్యున్నత స్థానం ఉంది. శ్రీ కృష్ణుడు, కుచేలుడు; రాముడు, సుగ్రీవుడు వంటి అనన్య స్నేహ బంధాలు మన ఇతిహాసాలలో నిబిడీకృతమై ఉన్నాయి. భగవద్గీతలో సైతం స్నేహితుని పట్ల ఉండాల్సిన ఆత్మీయత, త్యాగ భావన పరోక్షంగా ప్రస్తావించబడ్డాయి.

'న మిత్రార్థే పరిత్యజేత్ ప్రియమాత్మానమాత్మనః'. అంటే స్నేహితుడి కోసం తన ప్రియమైన ఆత్మను కూడా త్యజించకూడదు (అంటే, తన ఉనికిని కోల్పోకుండానే స్నేహితునికి ఎంతటి సహాయమైనా చేయాలి). ఇది స్నేహం తాలూకు ఉన్నతమైన ఆత్మార్పణ భావనను తెలియజేస్తుంది. నిజమైన స్నేహితుడు మన ఎదుగుదలకు తోడ్పడతాడే తప్ప, మన అస్తిత్వాన్ని హరించడు. స్నేహం పేరుతో ఒకరిపై ఒకరు ఆధారపడటమో, బలహీనతలను ఆసరాగా తీసుకోవడమో కాకుండా, ఇరువురూ తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూనే పరస్పరం శక్తిగా మారతారని ఈ సూక్తి తెలియజేస్తుంది.

> **నిజమైన స్నేహితుడు మనకు లభించిన ఒక వరం. అటువంటి స్నేహాన్ని కాపాడుకోవడమే మన జీవితానికి అసలైన సంపద. మనసులోని మాటను పంచుకోవడానికి, ఆశలను, కలలను సాకారం చేసుకోవడానికి, ఒంటరితనాన్ని దూరం చేయడానికి స్నేహం కంటే గొప్ప ఔషధం లేదు.**

కష్టసమయాల్లో మనం కృంగిపోకుండా, మనలో ధైర్యాన్ని నింపి, సరైన మార్గంలో నడిపించేవాడే నిజమైన స్నేహితుడు. స్నేహం అంటే కేవలం కాలక్షేపం కాదు, అది పరస్పర గౌరవం, నమ్మకం, నిస్వార్థ ప్రేమల కలయిక.

'దద్యాత్ దద్యాన్న దద్యాత్ ఖలు మిత్రస్య మిత్రః సదా ప్రార్థనాశీలో న మిత్రం స్యాత్ సదా ప్రార్థనాశీలః.'

అనగా... ఇచ్చేవాడు స్నేహితుడు, కానీ ఎప్పుడూ యాచించేవాడు స్నేహితుడు కాడు. నిజమైన స్నేహం ఇవ్వడం, తీసుకోవడం అనే సమతుల్యతతో కూడుకున్నదని ఈ సుభాషితం తెలుపుతుంది.

స్నేహంలో ప్రతిఫలం ఆశించకుండా సాయం చేయడమే గొప్పతనం. నిరంతరం ఏదో ఒకటి ఆశించే వ్యక్తి, నిజమైన స్నేహితుడు కాలేడు. స్నేహం అనేది త్యాగం, నిస్వార్థ ప్రేమల పునాదులపై నిర్మితమైన గొప్ప అనుబంధం. ఇవ్వడంలోనే నిజమైన ఆనందం, స్నేహ మాధుర్యం దాగి ఉన్నాయి.

జీవిత గమనంలో స్నేహితుల చేయూత ఎల్లప్పుడూ తోడుగా నిలిచి, ప్రతీ అడుగులోనూ సరికొత్త స్ఫూర్తిని నింపుతుంది. మన జీవితాలను సుసంపన్నం చేసే ఈ అమూల్యమైన స్నేహ బంధాలను పదిలంగా కాపాడుకుంటూ, ప్రతిరోజూ ఆనందాన్ని, శక్తిని పొందుదాం.

– కె. భాస్కర్ గుప్తా
వ్యక్తిత్వ వికాస నిపుణులు

తాత్త్వికథ

అందం ఎక్కడుంది?



లక్షల జీతం ఆర్జించే ఒక సాఫ్ట్ వేర్ జంట ఒక్కగానొక్క కూతురు పుట్టినరోజు ఆరోజు. ఖరీదైన కారులో అయిదు నక్షత్రాల హోటల్ కి మధ్యాహ్న భోజనానికి వెళ్ళారు. అక్కడే సాయంకాలమయ్యింది. వారి ఇంటికి వెళ్ళే దారిలో సముద్రం ఉంది. సముద్ర తీరంలో తమ అయిదేళ్ళ పాపతో కొద్దిసేపు గడుపుదామని అక్కడికి వెళ్ళారు.

అక్కడ ఒక పేద వృద్ధురాలు చెత్తాచెదారం లాంటివి ఏరి గోతాములో వేసుకుంటోంది. ఆమె గుడ్డలు చిరిగి, మనిషి మురికిగా ఉంది. ఆ సాఫ్ట్ వేర్ జంటకి ఆమెను చూసి చాలా అసహ్యం వేసింది. అక్కడ తమ పాపను ఆడించడం వారికి నచ్చలేదు.

పాపను తీసుకుని కారులో మరి కొద్ది దూరం వెళ్ళి అక్కడ సముద్ర తీరం వద్ద దిగారు. పాప ఆ మెత్తటి ఇసుకలో పరుగులు తీసింది. అలలు చూస్తూ కేరింతలు కొట్టింది. దొరికిన గవ్వలని ప్రోగు చేసింది. అలా చాలాసేపు ఆడుకొంది. ఇక ఇంటికి వెళ్దామని బయలుదేరబోయారు.

ఆ పేద వృద్ధురాలు చెత్త ఏరుకుంటూ అక్కడికి చేరుకుంది. 'రామేశ్వరం పోయినా శనేశ్వరం తప్పనట్లు ఉంది' అని ఆమెను చూసి తిట్టుకున్నారు. పాప ఇంకొద్దిసేపు ఆడుకోవాలని మారాం చేసింది. వద్దని అమ్మానాన్నలు వారించే లోగా ఆ పాప పరుగులు తీసింది.

ఆ వృద్ధురాలు పాపవైపు పరుగులు తీస్తూ ''ఆ దారిలో వెళ్లొద్దు. అక్కడ గాజు పెంకులు ఎక్కువ ఉంటాయి'' అని అరిచింది. ఆ ఇసుకలో పాప వెనుక పరిగెత్తలేక పడిపోయింది. అప్పటికే ఆ పాప అమ్మానాన్నలు పాపను ఎత్తుకొచ్చేశారు. వృద్ధురాలి గోతాంలోని వస్తువులన్నీ బయట పడ్డాయి. అవి ఏమిటా అని చూసింది ఆ సాఫ్ట్ వేర్ జంట. అవన్నీ గాజుపెంకులు. ''నువ్వు చేసే పని ఏమిటి?'' అని అడిగారు.

''ఖాళీ సమయాల్లో ఈ సముద్ర తీరంలో పడి ఉన్న గాజు పెంకులను ఏరి దూరంగా పారేస్తాను. ఎందుకంటే ఇక్కడికి చాలా మంది తల్లితండ్రులు తమ చిన్న పిల్లల్ని తీసుకు వస్తారు. విషయం తెలియని పిల్లలు ఇక్కడ పరుగులు తీస్తారు. గాజు పెంకులు చిన్న పిల్లల పాదాలకు గుచ్చుకోకూడదని ఏరుతుంటాను'' అని బదులిచ్చింది.

ఆశ్చర్యపోయింది ఆ సాఫ్ట్ వేర్ జంట. 'మనిషి కట్టుకునే గుడ్డల్లోనూ, ఆకారంలోనూ కాదు అందం ఉండాల్సింది, ఆలోచనల్లో ఉండాలి' అని తెలుసుకున్నారు. తాము చెడ్డగా చేసిన ఆలోచనలకు బాధపడ్డారు. ఆమెకు రెండు అయిదు వందల రూపాయల నోట్లను పాప చేతిగుండా ఇప్పించి కొత్త గుడ్డలను కొనుక్కోమన్నారు. ఆమె వారికి చేతులెత్తి నమస్కరించింది. కారులో వెళ్తున్న ఆ పాప వృద్ధురాలిని చూస్తూ చేతులూపింది.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

సహానా... సహానా

ప్రభాస్

'సహానా... సహానా... నా ఊపిరినే ఊయలూపిన మైనా...' అంటూ పాట అందుకున్నారు ప్రభాస్. ప్రేయసిపైన తన ప్రేమనంతా పాట రూపంలో వ్యక్తపరిచారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందిన 'రాజా సాబ్' చిత్రంలోని పాట ఇది. తమన్ స్వరపరచిన ఈ మెలోడీ సాంగ్‌ను ప్రభాస్, నిధీ అగర్వాల్‌పై చిత్రీకరించారు. 'సహానా... సహానా...' ఫుల్ లిరికల్ సాంగ్‌ను బుధవారం విడుదల చేయనున్నారు. హారర్, కామెడీ జానర్‌లో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన 'రాజా సాబ్' జనవరి 9న విడుదల కానున్న విషయం తెలిసిందే. మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్ర చేశారు.

కొత్త సంవత్సరంలో నువ్వు నాకు నచ్చావ్

వెంకటేశ్, ఆర్తి

వెంకటేశ్, ఆర్తీ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా కె. విజయభాస్కర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నవ్వు నాకు నచ్చావ్'. త్రివిక్రమ్ కథ, డైలాగ్స్ అందించిన ఈ సినిమాను 'స్రవంతి' రవికిశోర్ నిర్మించారు. ఈ చిత్రం 2001 సెప్టెంబరు 6న విడుదలై, బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించింది. ఈ చిత్రాన్ని జనవరి 1న 4కే వెర్షన్‌తో ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ చేయనున్నట్లుగా 'స్రవంతి' రవికిశోర్ తెలిపారు. ఈ సందర్భంగా రవికిశోర్ మాట్లాడుతూ– ''తెలుగు సినిమా చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిన చిత్రం 'నువ్వు నాకు నచ్చావ్'. ఇది కేవలం రీ–రిలీజ్ కాదు. నూతన సంవత్సరాన్ని (2026 జనవరి 1) కుటుంబంతో కలిసి నవ్వులు పూయిస్తూ ప్రారంభించడానికి ఇదే సరైన సమయం'' అని చెప్పారు.

వెండితెర సోగ్గాడు తిరిగొస్తున్నాడు

బీవీఎస్ఎన్ ప్రసాద్, పూర్ణచంద్రరావు, మురళీమోహన్, సురేష్‌బాబు

'సోగ్గాడు' తిరిగొస్తున్నాడు. శోభన్‌బాబు హీరోగా నటించిన సూపర్ హిట్ సినిమా 'సోగ్గాడు (1975)'. జయచిత్ర, జయసుధ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని కె. బాపయ్య దర్శకత్వంలో డి. రామానాయుడు నిర్మించారు. 1975 డిసెంబరు 19న ఈ సినిమా విడుదలైంది. 'సోగ్గాడు' చిత్రం 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సురేష్ ప్రొడక్షన్స్, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19న హైదరాబాద్‌లో స్వర్ణోత్సవం జరగనుంది. అదే రోజు సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ సినిమాను రీ రిలీజ్ చేయనుంది. ఆదివారం 'సోగ్గాడు' సినిమా స్వర్ణోత్సవ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు మాట్లాడుతూ – ''సోగ్గాడు' మా సంస్థకు మంచి పేరు, డబ్బు తెచ్చిపెట్టింది. నేటి టెక్నాలజీని ఉపయోగించి, ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేయబోతున్నాం. అలాగే మా సంస్థ చిత్రాలను ఏఐలోకి మార్చే ప్రక్రియను కూడా కొనసాగిస్తున్నాం'' అని చెప్పారు. మురళీ మోహన్ మాట్లాడుతూ– ''శోభన్ బాబుతో నేను 'ముగ్గురు మిత్రులు' సినిమా తీశాను'' అని అన్నారు. ఇంకా పలువురు దర్శక–నిర్మాతలు, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

అఖండ 2 కేవలం తెలుగు సినిమా కాదు

తమన్, బాలకృష్ణ, బోయపాటి శ్రీను

– బాలకృష్ణ

'అఖండ 2: తాండవం' కేవలం తెలుగు సినిమా మాత్రమే కాదు. భారతీయ చిత్రం మాత్రమే కాదు... ప్రపంచవ్యాప్త ప్రేక్షకులకు సంబంధించిన సినిమా ఇది. సనాతన హైందవ ధర్మం పరాక్రమాన్ని చూపించిన చిత్రం. ఈ సినిమా చూశాక సనాతన హైందవ ధర్మం మీసం మెలేసిందని అందరూ అంటున్నారు'' అని బాలకృష్ణ అన్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అఖండ 2: తాండవం'. సంయుక్త, హర్షాలీ మల్హోత్రా, ఆది పినిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఆదివారం యూనిట్ నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో బోయపాటి శ్రీను మాట్లాడుతూ– ''ఈ సినిమాను ఈ స్థాయికి తీసుకువెళ్లిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మన సినిమాను గెలిపించుకోవాలని ఈ సినిమా కోసం కష్టపడిన ప్రతి ఆర్టిస్టు, టెక్నీషియన్‌కు థ్యాంక్స్. ఆ శివుడే మా వెనకాల ఉండి నడిపించాడు'' అన్నారు. ''అఖండ 2'కు మ్యూజిక్ ఇవ్వడం చాలెంజింగ్‌గా అనిపించింది. ఈ సినిమా ఎప్పుడొచ్చినా సక్సెస్ అవుతుందని ధైర్యంగా అనుకున్నాం'' అని చెప్పారు తమన్. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''బోయపాటిగారు బాలకృష్ణగారిని ఇండియన్ సూపర్ హీరో చేశారు. దైవంతో కూడిన ఒక క్యారెక్టర్‌ను డిజైన్ చేసి, ఒక సూపర్ హీరోని చేయడం అది బాలకృష్ణ, బోయపాటిగార్లకే చెల్లింది. తెలంగాణలో రిలీజ్ చేసిన మాకు మూడో రోజుకే మేం పే చేసిన దానికి 70 శాతం రెవెన్యూ రికవరీ అయ్యింది. నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా, ఇండస్ట్రీలో కీలకమైన వ్యక్తిగా నాకు ఆనందంగా ఉంది'' అన్నారు. ఈ వేడుకలో విజీ చంద్రశేఖర్, గంగాధర శాస్త్రి, కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నీ ప్రేమను ఎలా చెప్తావ్ అర్జున్!

అనీష్

దర్శకుడు వెంకీ కుడుముల నిర్మాతగా మారి, అనీష్‌ని హీరోగా పరిచయం చేస్తూ, 'ఇట్లు అర్జున' టైటిల్‌తో ఓ చిత్రానికి శ్రీకారం చుట్టారు. మహేశ్ ఉప్పల దర్శకత్వంలో వాట్ నెక్స్ట్ ఎంటర్ టైన్మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం ఇది. అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'సోల్ ఆఫ్ అర్జున' పేరుతో ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను ఆదివారం విడుదల చేశారు. ''ప్రేమ... అది ఎంత దూరమైనా పరిగెత్తిస్తుంది... కానీ ఎంత ఇష్టమో చెప్పనంత.., ప్రేమ అందరి మనసుల్లో పుడుతుంది.., నిజానికి మాటల్లో కూడా సరిగ్గా చెప్పలేనిదే ప్రేమ... అసలే నువ్వు మూగోడివి... నీ ప్రేమను ఎలా చెప్తావ్ అర్జున్' అంటూ నాగార్జున వాయిస్ ఓవర్‌తో చెప్పిన డైలాగ్స్‌తో పాటు 'అర్జున్ నువ్వు ఏం చెప్పినా నాకు అర్థమౌతుంది. చెప్పు అర్జున్' అనే డైలాగ్ కూడా ఈ వీడియోలో వినిపిస్తుంది. ఈ సినిమాకు సంగీతం: తమన్ .ఎస్.

ఓ తల్లి త్యాగం

జ్యోతి అపూర్వ

రవి రావణ్ రుద్ర, శ్రేయ తివారీ జోడీగా, జ్యోతి అపూర్వ ప్రధాన పాత్రలో, బేబి శ్రీహర్షిణి, మీనా వాసు ప్రత్యేక పాత్రల్లో నటించిన చిత్రం 'విచిత్ర'. సైపుద్దీన్ మాలిక్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. సైపుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ– ''తల్లీ కూతుళ్ళ అనుబంధం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. తల్లి ప్రేమ, త్యాగం, అనుబంధం గురించి ప్రతి ఒక్కర్నీ ఆలోచింపజేసేలా కథనం సాగుతుంది'' అని చెప్పారు.

బాలు తొలి పాటకు అరవై ఏళ్లు

15 డిసెంబర్ 1966

'నా పాట పంచామృతం' అన్న బాలు వాక్కులు నిజంగానే 'బ్రాహ్మి' (సరస్వతి) వాక్కులే!! నెల్లూరు జిల్లాలో కోనేటం పేటలో పుట్టిన ఈ బాలుడు పాటల కోనేటిరాయడై అఖిల భారతీయుల అభిమానాన్ని చూరగొంటాడని ఎవ్వరూ ఊహించలేదు. బాలు సైతం సినీ గాయకుడవుతానని కలలో కూడా ఊహించలేదు. ఆయనను ఇంజనీర్‌గా చూడాలనేది తండ్రి సాంబమూర్తి కల. కానీ ఆ కలకు భిన్నంగా బాలు తన ప్రతిభతో పాటల ఇంజనీరింగ్‌నే మార్చి ఆరు దశాబ్దాలు అప్రతిహతంగా సినీ సంగీత ప్రపంచానికి రారాజు అయ్యారు.

కలయా... నిజమా....

1964లో మద్రాస్ సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ నిర్వహించిన లలిత సంగీత పోటీల్లో బాలుకి ప్రథమ బహుమతి లభించింది. ఆ పోటీకి సంగీత దర్శకులు సుసర్ల దక్షిణామూర్తి, పెండ్యాల నాగేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావులు న్యాయనిర్ణేతలు. అదే పోటీలో బాలు ప్రతిభను మరో సంగీతదర్శకుడు ఎస్.పి. కోదండపాణి గమనించి, సినిమాల్లో అవకాశం కల్పిస్తానని మాట ఇచ్చారు. ఆ మాటను నమ్మి బాలు కొన్నాళ్లు ఎదురు చూశారు. ఎ.ఎం.ఐ.ఇ రెండో సంవత్సరంలో ప్రవేశించారు కానీ సినీరంగ ప్రవేశం మాత్రం జరగలేదు. బాలు కూడా క్రమంగా ఆ విషయం మరచిపోయారు. ఓ రోజు కోదండపాణి హడావుడిగా వచ్చి, బాలు గది తలుపు తట్టి, 'ఏమయ్యా పంతులూ... నీ అడ్రస్ ఇవ్వకపోతివి... చాలా కాలంగా నీ కోసం వెతుకుతున్నాను. ఇక్కడ ఉంటివా' అని చీవాట్లు వేసి 'పద్మనాభం ఓ సినిమా తీయబోతున్నారు. పాట పాడడానికి నీకు అవకాశమిస్తాను... ఎ.వి.ఎం స్టూడియోలో రికార్డింగ్ ఉంది' అని చిరునామా వివరాలు ఇచ్చి వచ్చినంత వేగంగా వెళ్ళిపోయారు. బాలుకు తల గిర్రున తిరిగింది... తనేంటి? కలయా... నిజమా అనుకున్నారు. అనుకున్న రోజు రానే వచ్చింది... తన ఫ్రెండ్ మురళితో కలిసి బాలు సైకిల్ పై ఎ.వి.ఎం. స్టూడియోకి వెళ్ళారు.

గేటు దగ్గరే నిలబెట్టేశాడు

గేట్‌మేన్ బాలును ఆపి లోనికి పోవడానికి వీల్లేదని, నీలాంటి వారు రోజూ ఇలాగే వస్తుంటారని అడ్డుకున్నాడు. గేటు దగ్గరే నిలబెట్టేశాడు. చివరికి కనీసం మురళినైనా లోపలికి పంపించి, కోదండపాణిగారికి తను వచ్చిన విషయం చెప్పండని, ఒకవేళ ఆయన రావద్దంటే తిరిగి వెళ్లిపోతామని బాలు అనగానే గేట్‌మేన్ అంగీకరించి, మురళిని అనుమతించగానే ఆయన వెళ్లి కోదండపాణికి విషయం చెప్పడం, ఆయన స్వయంగా గేటు వద్దకు వచ్చి గేట్‌మేన్‌ను తిట్టి బాలును లోనికి తీసుకెళ్ళడం జరిగింది.

రావే కావ్య సుమబాల...

ఆ రోజు 15 డిసెంబర్ 1966... మధ్యాహ్నం 2.30 ని.లకు బాలు తొలిసారిగా తన గళం విప్పారు. నటుడు, నిర్మాత పద్మనాభం నిర్మించిన 'శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న' చిత్రం అది. వీటూరి రాసిన 'ఏమి ఈ వింతమోహం' పాటను సుశీల, పీబీ శ్రీనివాస్, కె. రఘురామయ్య వంటి ఉద్దండ గాయకులతో కలిసి పాడారు. అది ఘంటసాల పాడాల్సిన వెర్షన్. ఆయన బదులు కొత్తవాడైన బాలు పాడటం పద్మనాభానికి ఇష్టం లేదు. ఆ పాట కృష్ణ, శోభన్ బాబు, హరనాథ్, రామకృష్ణ, రాజశ్రీ వంటి తారలపై చిత్రించే మల్టీ స్టార్ సాంగ్ కావడం వలన ఆయన ఒప్పుకోలేదు. ఘంటసాల అనారోగ్యం వలన బాలుతో పాడిస్తున్నానని, ఒకవేళ బాగా లేకుంటే మళ్ళీ ఘంటసాలతో పాడిద్దామని కోదండపాణి ఒప్పించి రికార్డింగ్ పూర్తి చేశారు. వందకు పైచిలుకు వాద్యకారులున్న ఆర్కెస్ట్రా అది. ఆరు నిమిషాల రాగమాలికైన ఆ పాటలో కల్యాణి రాగంలో కంపోజ్ చేసిన 'రావే కావ్య సుమబాల' అనే చరణాన్ని బాలు పాడారు. బాలు పాడిన చరణాన్ని తెరపై శోభన్‌బాబు అభినయించారు. మరునాడు ఘంటసాలను ఆహ్వానించి, ఆ పాటను వినిపించగానే, ఆ మహానుభావుడు ఎంతో ఆనందించారు.



తొలి పాట రికార్డింగులో ఎస్.పి. కోదండపాణి, పద్మనాభంలతో బాలు

అబ్బాయి బాగా పాడాడు...

'అబ్బాయి బాగా పాడాడు... ఎవరినీ అనుకరించలేదు... ఎంతో సహజంగా పాడాడు... ప్రతి సంగతిని చక్కగా వేశాడు. నేను పాడక్కరలేదు... ఈ పాటను ఇలాగే ఉంచండి..' అని చెప్పి కొత్త గొంతును పరిచయం చేసినందుకు అభినందించారు. ఘంటసాల మాటలకు పద్మనాభం ఎంతో సంతోషించి, బాలుకు అదే చిత్రంలో మరో పాటను, పద్యాన్ని పాడడానికి అవకాశం ఇవ్వడం విశేషం.

ఘంటసాలకు సిసలైన వారసుడు

బాలు పాడిన మొదటి పాట రికార్డుని తన దగ్గరకు వచ్చిన సంగీత దర్శకులకు వినిపించి, అవకాశాలు ఇప్పించే వారు కోదండపాణి. తొలి పాట పాడాక బాలుకు వెంటనే రెండవ చిత్రంలో అవకాశం ఇచ్చారు ఎం.ఎస్. రెడ్డి. ఆయన 'కాలచక్రం' అనే తమిళ డబ్బింగ్ సినిమాలో పాడించారు. 1969 నుంచి బాలుకు గాయకుడిగా పుష్కలంగా అవకాశాలు రాసాగాయి. చాలామంది నటులకు వారి హావభావాలకు, నటనా శైలులకు అనుగుణంగా పాటలు పాడి ప్రాణం పోశారు బాలు. అందుకే అమర గాయకుడు ఘంటసాల 'తన తరువాత బాలు మాత్రమే తెలుగు సినీ పాటకు సిసలయిన వారసుడు' అని చెప్పిన జోస్యాన్ని బాలు నిజంగానే నిరూపించుకున్నారు. ఘంటసాల తెలుగు మినహా వేరే భాషల్లో పాడలేదు. బాలు దేశంలోని దాదాపు భాషలలో పాడి, లక్షలాది అభిమానులను సంపాదించుకొన్నారు.

శంకరాభరణంతో...

బాలు 1966 నుండి సినిమాలలో పాడుతున్నప్పటికీ ఆయన శాస్త్రీయ గీతాలను సైతం సశాస్త్రీయంగా పాడగలరని నిరూపించిన చిత్రం 'శంకరాభరణం' (1980). దానికి ముందు ఘంటసాల జీవించిన కాలంలో బాలుకు ఎక్కువ శాతం రొమాంటిక్ పాటలు పాడడానికే ఆహ్వానాలు అందేవి. అయితే కోదండపాణి తరువాత బాలులోని ప్రతిభను గుర్తించిన సంగీత దర్శకులలో సత్యం ఒకరు. హరనాథ్ హీరోగా నటించిన 'ప్రతీకారం' (1970) చిత్రంలో 'నారీ రస మాధురి లహరి' అనే పాటను సత్యం హంసానంది రాగంలో స్వరపరచి బాలుతో పాడించిన తొలి లలిత శాస్త్రీయ గీతం. కానీ ఈ సినిమా ఫ్లాప్ కావడంతో ఈ పాట కూడా ఎవరికీ అంతగా తెలియదు.

స్వర పారిజాతం

'కన్నె వయసు' (1973)లో 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' పాటను బాలుతో పాడించారు సత్యం. ఆ పాట క్లాసిజానికి మురిసిన జానకి తనతో కూడా పాడించాలని పట్టు పట్టడంతో ఆమెతో కూడా పాడించారు. జానకి అంచనా నిజమైంది... ఆ పాట బాలుకు ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చి, ఆయనను నిజంగా ఈ భువిలో విరిసిన స్వర పారిజాతంగా మలచింది... ఘంటసాల మరణించాక (1974) గాయకునిగా బాలు విశ్వరూపమే ప్రదర్శించారు.

రోజుకి పదహారు పాటలు...

'శంకరాభరణం, సాగర సంగమం' లాంటి తెలుగు చిత్రాలే కాకుండా 'ఏక్ దూజే కే లియే' లాంటి హిందీ చిత్రాలకు బాలు పాడిన పాటలు దేశమంతా ఉర్రూతలూగించాయి. 'త్యాగయ్య, అన్నమయ్య, సంగీత సామ్రాట్, భైరవ ద్వీపం' చిత్రాలలో బాలు శాస్త్రీయ సంగీతంలో పాడిన పాటలే విమర్శకుల నోళ్ళు మూయించాయి... ఓ దశలో రోజుకు 16 పాటలు మూడు షిఫ్టులలో పాడి, బాలు తన అసమాన ప్రతిభను నిరూపించుకున్నారు.

అరుదైన రికార్డు

అలనాటి రాజేశ్వర రావు మొదలు ఆధునిక యువ సంగీత దర్శకులందరికీ బాలు ఒక ఫేవరెట్ సింగర్. బాలు తన మిమిక్రీ కళతో రాజ్ బాబు, పద్మనాభం, మాడా, అల్లు రామలింగయ్య, రావు గోపాలరావు, నూతన ప్రసాద్, ఎ.ఎన్.ఆర్, ఎన్.టి.ఆర్, కమల్‌హాసన్ తదితరుల నటుల గొంతుకలకు అతి సన్నిహితంగా పాడి భళా అనిపించుకున్నారు. 50 ఏళ్ళకు పై సినీ ప్రస్థానంలో 40 వేల పాటలకు పైగా 11 భాషలలో పాడి, 40 సినిమాలకి సంగీత దర్శకత్వం వహించి, ప్రపంచంలోనే ఒక అరుదైన రికార్డు సృష్టించారు. తెలుగు, తమిళమే కాకుండా కన్నడంలో కూడా బాలు పాడిన పాటలకు జాతీయ పురస్కారాలు లభించాయి. గాయకుడిగానే కాకుండా గాత్రదాన కళాకారుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా ఆయా విభాగాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారాన్ని 29 సార్లు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి బాలు. ఆయనతో కలిసి ఆయన సమక్షంలో అనేక కార్యక్రమాల్లో పాటలు పాడిన అదృష్టం ఈ వ్యాస రచయితకు కూడా ఉన్నది.

ఆ స్వరాలు అజరామరం

బాలు 1993 ఫిబ్రవరి 14న లలిత కళాతోరణంలో ఘంటసాల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తరువాత 2003లో రవీంద్ర భారతి ప్రాంగణాన ఘంటసాల విగ్రహం స్థాపించడానికి మూల కారణమైన బాలు... ఆ మహనీయునితో కలిసి పాడుతానని కానీ మరణించిన తరువాత ఆయన విగ్రహం చెంతనే తన ప్రతిమ ఉంటుందని కలలో కూడా అనుకోలేదు. తెలుగు సినీ కళామ తల్లికి ఘంటసాల, బాలు రెండు కళ్ళ వంటివారు. వారు దివంగతులైనా ఆ స్వరాలు అజరామరం.

– డా. వి.వి. రామారావు
రచయిత, గాయకుడు, ఆకాశవాణి వ్యాఖ్యాత

సాక్షి వెల్త్ By ప్రాఫిట్ ప్లస్
సోమవారం
15-12-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (8-12-25 నుంచి 12-12-25 వరకు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
445	140
85,268	26,047

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,187	▽	406
డోజోన్స్	48,454	▽	249
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,649	▽	54
డాక్స్	24,186	▽	108
షాంఘై	3,889	△	16
నికాయ్	50,836	△	687

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.58	91.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.53	122.87
€	యూరో	ఎస్‌బీఐ	103.83	107.78
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	47.00	60.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.87	61.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.68	71.39
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.22	24.72
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.73	24.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.94	13.76

కో-లివింగ్.. ఇన్వెస్ట్‌మెంటే!

ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న ట్రెండ్

- సాధారణ అద్దెతో పోలిస్తే కో-లివింగ్‌తో ఎక్కువ ఆదాయం
- అద్దెకన్నా వార్షికంగా 35–40 శాతం ఎక్కువ వచ్చే అవకాశం
- నిర్వహణ మొత్తం చూసుకునేందుకు ప్రత్యేక ఏజెన్సీలు
- విజయవాడ, వైజాగ్ తదితర ప్రాంతాల్లో డిమాండ్
- స్మార్ట్ ఇన్వెస్టర్లకు ఇదో కొత్త ఆదాయ మార్గం

ఒకప్పుడు సింగిల్‌గా అద్దెకుండే వారికి సింగిల్ రూమ్‌లు దొరికేవి. కానీ ఇప్పుడు ఆ జమానా పోయింది. అయితే సింగిల్ బెడ్‌రూమ్ తీసుకోవాలి. ఇపుడు అవీ దొరకటం లేదు. ఇక డబుల్ లేదా ట్రిపుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తీసుకుంటే అద్దెలు తడిసి మోపెడవుతాయి. హైదరాబాద్ వంటి నగరాల్లోనైతే కో-లివింగ్ లేదా షేర్డ్ రెంటల్ ఇళ్లు బాగా దొరుకుతాయి. అంటే ఒక ట్రిపుల్ బెడ్‌రూమ్‌ను మూడు బెడ్‌రూమ్‌లుగా విభజించి... కిచెన్, హాల్ వంటివి కామన్‌గా వినియోగించుకోవటమన్న మాట. ఆ సింగిల్ బెడ్‌రూమ్‌లో ఒక్కరే గానీ, ఇద్దరు గానీ ఉండొచ్చు. దాన్ని బట్టే అద్దె ఉంటుంది.

అభివృద్ధి చెందిన పెద్ద నగరాలకే పరిమితమైన కో–లివింగ్ రెంటల్ హౌసింగ్ విధానం ఇపుడు ద్వితీయ శ్రేణి (టైర్–2) నగరాల్లోనూ పెరుగుతోంది. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వంటి నగరాల్లోనూ ఈ సంస్కృతి ఇపుడిపుడే ప్రాచుర్యం అందుకుంటోంది. అటు ప్రొఫెషనల్స్‌తో పాటు ఇటు పెట్టుబడులపై అధిక రాబడులనిచ్చే కొత్త మార్గాలను అన్వేషిస్తున్న ఇన్వెస్టర్లకు కూడా ఇది మంచి అవకాశమేనని చెప్పాలి.

నాస్కామ్ తాజా నివేదిక ప్రకారం విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ వంటి నగరాలు కొత్త టెక్నాలజీ, ఎడ్యుకేషన్ హబ్‌లుగా ఎదుగుతున్నాయి. దీనితో ఆయా ప్రాంతాలకు యువ ప్రొఫెషనల్స్, విద్యార్థులు బాగా వస్తున్నారు. సౌకర్యవంతంగా ఉంటూనే, తక్కువ అద్దెకు లభించే వసతి సదుపాయాల కోసం వారు వెతుక్కుంటున్నారు. ఫలితంగా... అలాంటి సౌకర్యాలను అందిస్తున్న కో–లివింగ్ ప్రాజెక్టులకు ఆదరణ పెరుగుతోంది. సింగిల్ బెడ్రూమ్ అద్దెకన్నా సుమారు 35 శాతం చౌకగా, సరళతరమైన నిబంధనలతో లీజుకు తీసుకునేందుకు వీలుగా ఉండటంతో పాటు వై-ఫై, క్లీనింగ్, కమ్యూనిటీ కార్యక్రమాల్లాంటి హంగులెన్నో ఉంటుండటంతో జెన్ జెడ్ వీటివైపు మొగ్గు చూపుతోంది.

నిర్వహణ బాదరబందీ లేకుండా...

ఇలాంటి ప్రాపర్టీలను కో–లివింగ్ తరహాలో అద్దెకు ఇవ్వాలనుకునే యజమానులకు నిర్వహణ బాధ్యతలను గానీ, కిరాయిదార్లతో డీల్ చేయటం వంటి బాధ్యతలు గానీ లేకుండా వాటన్నిటినీ తామే చూసుకునే నిర్వహణ ఏజెన్సీలు చాలా వస్తున్నాయి. నెస్ట్ అవే, స్టాంజా లివింగ్, కోలివ్, యువర్‌స్పేస్ లాంటి కంపెనీలు రకరకాల విధానాల్లో నిర్వహణ సేవలను అందిస్తున్నాయి. కిరాయిదారుకు అద్దెకివ్వడం నుంచి గదుల మెయింటెనెన్స్, ఫర్నిషింగ్, అద్దెల వసూళ్లు మొదలైన పనులన్నీ ఓనర్ల ప్రమేయం లేకుండా అవే చూసుకుంటాయి. ఫలితంగా నిర్వహణ బాదరబందీ లేకుండా యజమానులకు స్థిరంగా నెలకి ఇంత చొప్పున అద్దె లభిస్తుంది. సాధారణ ఫ్లాటు కాస్త అధిక రాబడి అందించే సాధనంగా మారుతుంది.

లాభసాటి ఇన్వెస్ట్‌మెంట్ కూడా...

ఓనరు ఏమాత్రం కలుగజేసుకోవాల్సిన అవసరం లేకుండా ఈ వసతి సదుపాయాలను మేనేజ్ చేసే సంస్థలిపుడు చాలా వస్తున్నాయి. వాటి కారణంగా ఇలాంటి ప్రాపర్టీలు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. ఉదాహరణకు వైజాగ్‌లో సాధారణ ట్రిపుల్ బెడ్రూమ్ ఫ్లాట్ అద్దె నెలకు రూ.18,000 ఉందనుకుంటే, ఆ ఇంటినే కో–లివింగ్ కింద (మూడు వేర్వేరు గదులుగా) మారిస్తే రూ. 24,000– రూ. 30,000 వరకు వస్తోంది. అంటే దాదాపు 35–40 శాతం మేర అధికంగా రాబడి వచ్చినట్లే. సంప్రదాయ రెంటల్ విధానమైతే పెట్టుబడిపై వార్షికంగా సుమారు 2 నుంచి 3 శాతం మేర నికరంగా రాబడి లభిస్తుంటే... ఈ కో–లివింగ్ విధానంలో 5 నుంచి 7 శాతం రాబడి వస్తోంది. అదే ఎడ్యుకేషన్, టెక్నాలజీ సెంటర్లకు దగ్గర్లో ఉన్నవైతే కొన్ని సందర్భాల్లో 8 శాతం వరకు రాబడి ఉంటోంది. అంటే బ్యాంకు వడ్డీతో సమానంగా వస్తున్నట్లే. పైపెచ్చు దీర్ఘకాలంలో విలువ పెరగటం లాంటి రియల్ ఎస్టేట్ ఆస్తులకు ఉండే పెరుగుదల ప్రయోజనాలు ఎలాగూ ఉంటాయి.

ఖాళీగా ఉండేది తక్కువే..

సాధారణంగా విద్యార్థులు, జూనియర్ ఐటీ ఉద్యోగులు కొంత సమయం పాటు వచ్చి వెళ్లిపోతుంటారు. ఫలితంగా కో–లివింగ్ ప్రాపర్టీలకు డిమాండ్ స్థిరంగా ఉంటోంది. వైజాగ్‌లోని మధురవాడ, విజయవాడలోని బెంజ్ సర్కిల్‌లాంటి ప్రాంతాల్లో ఏడాది పొడవునా 90– 95 శాతం ఆక్యుపెన్సీ రేటు ఉంటున్నట్లు కన్సల్టింగ్ సంస్థల చెబుతున్నాయి.

రిస్కులు తెలుసుకోవాలి..

షరా మామూలుగా ఏ పెట్టుబడి సాధనంలోనైనా ఎంతో కొంత రిస్కులు ఉంటాయి. కో–లివింగ్‌లోనూ అలాంటివి కొన్ని ఉంటాయి. కిరాయిదారులు తరచుగా మారుతుండటం వల్ల ప్రాపర్టీ పాతబడిపోతుంటుంది. నిర్వహణ వ్యయాలు పెరుగుతుంటాయి. వివాదాలు తలెత్తవచ్చు. ప్రమాదాలు, డ్యామేజ్‌లకు ఆస్కారం ఉండటం వల్ల ఖరీదైన ఇన్సూరెన్స్ పాలసీని కూడా తీసుకోవాల్సి రావచ్చు. ఇవి కాకుండా జోనింగ్ పరిమితుల్లాంటి రెగ్యులేటరీ నిబంధనల అవరోధాలు, పరస్పరం సంబంధంలేని కిరాయిదార్లు, స్వల్పకాలిక రెంటల్ నిబంధనలపరంగా ఏవైనా వివాదాలు తలెత్తడంలాంటి సమస్యలు రావచ్చు. అయితే, ద్వితీయ శ్రేణి నగరాల్లో రిస్కులతో పోలిస్తే ప్రయోజనాలే ఎక్కువన్నది నిపుణుల మాట.

నిఫ్టీ @ 29,000 పాయింట్లు

2026 ఆఖరు నాటికి కోటక్ సెక్యూరిటీస్ అంచనా

శ్రీపాల్ షా
ఎండీ,కోటక్ సెక్యూరిటీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కార్పొరేట్ల ఆదాయాలు మెరుగ్గా ఉంటున్న నేపథ్యంలో 2026 ఆఖరు నాటికి నిఫ్టీ 12 శాతం వృద్ధి చెందవచ్చని, 29,120 పాయింట్లకు చేరొచ్చని దేశీ బ్రోకరేజ్ సంస్థ కోటక్ సెక్యూరిటీస్ వెల్లడించింది. మరీ బులిష్‌గా ఉంటే నిఫ్టీ 32,032 పాయింట్లకు ఎగియొచ్చని, బేరిష్‌గా ఉంటే 26,208 పాయింట్లకు తగ్గొచ్చని కోటక్ సెక్యూరిటీస్ పేర్కొంది. 'స్థూల ఆర్థిక పరిస్థితులు పటిష్టంగా ఉండటం, పాలసీలపరంగా సానుకూల చర్యలు, దేశీయంగా పెరుగుతున్న పెట్టుబడుల దన్నుతో వచ్చే ఏడాది కార్పొరేట్ల ఆదాయాల వృద్ధి పటిష్టంగా ఉంటుందని భావిస్తున్నాం. అంతర్జాతీయంగా భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య ఉద్రిక్తతలు ఎలా ఉన్నప్పటికీ భారతదేశ దీర్ఘకాలిక మార్కెట్ వృద్ధి గాథ పటిష్టంగానే ఉంటుంది' అని కోటక్ సెక్యూరిటీస్ ఎండీ శ్రీపాల్ షా తెలిపారు. ఆశావాదం గరిష్ట స్థాయిలో ఉందని, 2025 సవాళ్లతో గడిచినప్పటికీ విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మళ్లీ సానుకూలంగా తిరిగొస్తారని బ్రోకరేజీలు అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో విస్తృత స్థాయి ర్యాలీ లేదని, నిఫ్టీ స్టాక్స్‌లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయని షా వివరించారు. మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ ఇంకా ఆల్‌టైం గరిష్ట స్థాయిలకు చాలా దూరంలోనే ఉన్నాయన్నారు. బడ్జెట్ వరకు లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో ఆసక్తి కొనసాగుతుందని, మార్చి తర్వాత నుంచి మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ పెరగడం మొదలవుతుందని కోటక్ సెక్యూరిటీస్ వర్గాలు తెలిపాయి.

బ్యాంకింగ్, బీమా సానుకూలం..

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ స్టాక్స్ సానుకూలంగా ఉన్నట్లు కోటక్ సెక్యూరిటీస్ వెల్లడించింది. మరోవైపు పసిడి రేటు 10 గ్రాములకు రూ.1.5 లక్షల స్థాయి దిశగా పరుగు కొనసాగించవచ్చని వివరించింది. వెండిపై ఆసక్తి మరింతగా పెరగవచ్చని, కేజీ ధర రూ. 2.1 లక్షలకు చేరొచ్చని పేర్కొంది.

యాక్సిస్ గోల్డ్ అండ్ సిల్వర్ ప్యాసివ్ ఎఫ్‌వోఎఫ్ ఫండ్

బంగారం, వెండిపై పెట్టుబడుల పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా.. యాక్సిస్ గోల్డ్ అండ్ సిల్వర్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్)ను తీసుకొచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్ ఆఫ్ ఫండ్ న్యూ ఆఫర్. ఈ నెల 10న మొదలు కాగా, 22వ తేదీన ముగియనుంది. ఈ ఒక్క పథకం ద్వారా ఇన్వెస్టర్లు బంగారం, వెండి ధరల ర్యాలీలో భాగం కావొచ్చని సంస్థ ప్రకటించింది. ఈ పథకం గోల్డ్ ఈటీఎఫ్, సిల్వర్ ఈటీఎఫ్‌లల్లో 50:50 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేస్తుంది. కనీసం రూ.100 నుంచి ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ''చారిత్రకంగా చూస్తే బంగారం, వెండి ద్రవ్యోల్బణం, కరెన్సీ అస్థిరతలకు చక్కని హెడ్జింగ్ సాధనంగా పనిచేశాయి. అదే సమయంలో పెట్టుబడుల్లో వైవిధ్యం ప్రయోజనాలను సైతం పోర్ట్‌ఫోలియోకి అందిస్తాయి''అని యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో బి.గోపకుమార్ తెలిపారు.

ఆటుపోట్లున్నా ముందుకే..!

- కీలకంకానున్న దేశ, విదేశీ గణాంకాలు
- యూఎస్, భారత్ చర్చలపై దృష్టి
- రూపాయి మారకం, బాండ్ల ఈల్డ్స్‌కు ప్రాధాన్యం
- స్టాక్ మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణులు

గత వారం తొలుత అంచనాలకు విరుద్ధంగా దేశీ స్టాక్ మార్కెట్లు బలహీనపడినప్పటికీ చివర్లో కొంత కోలుకున్నాయి. వెరసి ఈ వారం సైతం మార్కెట్లు ఆటుపోట్ల మధ్య ముందుకుసాగే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. బుల్లిష్ ట్రెండ్ కొనసాగవచ్చని భావిస్తున్నారు. మరోపక్క దేశ, విదేశీ ఆర్థిక గణాంకాలు సెంటిమెంటుకు కీలకంగా నిలవనున్నట్లు చెబుతున్నారు. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్

బుల్స్ VS బేర్స్

టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణ ఇండెక్స్(డబ్ల్యూపీఐ) గణాంకాలు నేడు(సోమవారం) విడుదలకానున్నాయి. అక్టోబర్(2025)లో ప్రతిద్రవ్యోల్బణం(మైనస్ 1.21 శాతం) నమోదు కాగా.. నవంబర్ నెలకు సైతం ధరల క్షీణత కనిపించనున్నట్లు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. దీంతో అక్టోబర్‌తో పోలిస్తే గత నెలలో కాస్తమెరుగ్గా మైనస్ 0.5 నుంచి –0.6 శాతంస్థాయిలో గణాంకాలు వెలువడవచ్చని చెబుతున్నారు. ఈ బాటలో నవంబర్ నెలకు వాణిజ్య సంబంధ గణాంకాలు విడుదలకానున్నట్లు తెలియజేశారు. ప్రధానంగా పసిడి ధరలు భారీగా పెరగడంతో అక్టోబర్‌లో వాణిజ్య లోటు(ఎగుమతి, దిగుమతుల మధ్య అంతరం) రికార్డ్ గరిష్టం 41.68 బిలియన్ డాలర్లను తాకింది. నవంబర్‌లోనూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అక్టోబర్‌లో దిగుమతుల బిల్లు 76 బిలియన్ డాలర్లను దాటగా.. ఎగుమతులు 34.38 బిలియన్ డాలర్లు మాత్రమే.

కరెన్సీ మారకంపై కన్ను

గత వారం డాలరుతో మారకంలో రూపాయి ఇంట్రాడేలో చరిత్రాత్మక కనిష్టం 90.56కు పడిపోయింది. ఆరు ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 98.4కు బలహీనపడగా.. 10ఏళ్ల ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ తొలుత నీరసించినప్పటికీ 4.18 శాతానికి కోలుకున్నాయి. ఫెడ్, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోతలు కరెన్సీ, బాండ్లపై ప్రభావం చూపుతున్నట్లు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. కాగా.. యూఎస్ విధించిన అదనపు టారిఫ్‌లకుతోడు మెక్సికో సైతం భారత్ దిగుమతులపై సుంకాలను పెంచడం సెంటిమెంటును దెబ్బతీసినట్లు విశ్లేషకులు తెలియజేశారు. అయితే ఇటీవల యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్‌తో దేశ ప్రధాని నరేంద్ర మోడీ చర్చలు, మెక్సికో వాణిజ్య అధికారులతో భారత అధికారుల భేటీ టారిఫ్‌ల సమస్యలకు చెక్ పెట్టే వీలున్నట్లు పరిశ్రమవర్గాలు అంచనా వేస్తున్నాయి.

విదేశీ గణాంకాలు

యూఎస్, యూరోజోన్ ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారం విడుదలకానున్నాయి. గత నెలకు యూఎస్ వినియోగ ధరలు, రిటైల్ అమ్మకాలు, వ్యవసాయేతర ఉపాధి గణాంకాలు సైతం వెల్లడికానున్నాయి. వెరసి అమెరికా ఆర్థిక వ్యవస్థ అంతర్గత పటిష్టత, ద్రవ్యోల్బణ ఔట్‌లుక్ తదితర అంశాలు ఫెడ్ మానిటరీ పాలసీపై ప్రభావం చూపనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు తెలియజేశారు. ఈ బాటలో విడుదలకానున్న జపనీస్ ద్రవ్యోల్బణం, వాణిజ్య గణాంకాలు బ్యాంక్ ఆఫ్ జపాన్ పరపతి సమీక్షను ప్రభావితం చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో ఈ వారం సైతం మార్కెట్లలో హెచ్చుతగ్గులకు వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

ఎఫ్‌పీఐల అమ్మకాల స్పీడ్

2 వారాల్లో 2 బిలియన్ డాలర్లు వెనక్కి

కొద్ది రోజులుగా దేశీ స్టాక్స్‌లో విక్రయాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఈ నెలలోనూ ఇదే ధోరణిలో సాగుతున్నారు. దీంతో డిసెంబర్ తొలి రెండు వారాల్లోనే 2 బిలియన్ డాలర్ల(రూ. 17,955 కోట్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఫలితంగా ఈ కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటివరకూ 18.4 బిలియన్ డాలర్ల(రూ. 1.6 లక్షల కోట్లు) విలువైన స్టాక్స్‌ను విక్రయించారు. అక్టోబర్‌లో రూ. 14,610 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి గత నెల(నవంబర్) చివరిలో అమ్మకాల బాట పట్టిన సంగతి తెలిసిందే. దీంతో నవంబర్‌లో నికరంగా రూ. 3,765 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇది దేశీ స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

చిన్న షేర్లు భళా

అంచనాలకు అనుగుణంగా గడిచిన వారం యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటులో 0.25 శాతం కోత పెట్టడంతో చివర్లో మార్కెట్లు రికవరీ అయ్యాయి. వెరసి ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 26,000 పాయింట్లకు ఎగువన, బీఎస్‌ఈ సెన్సెక్స్ 85,200స్థాయికి పైన నిలిచాయి. డాలరుతో మారకంలో రూపాయి చరిత్రాత్మక కనిష్టానికి చేరడం, యూఎస్‌కు తోడు కొత్తగా దేశీ ఎగుమతులపై మెక్సికో సుంకాల పెంపు ప్రకటించడం సెంటిమెంటును దెబ్బతీసినట్లు నిపుణులు పేర్కొన్నారు. దీంతో గత వారం నికరంగా సెన్సెక్స్ 445 పాయింట్లు(0.51 శాతం) క్షీణించి 85,268 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 140 పాయింట్లు(0.53 శాతం) వెనకడుగుతో 26,047 వద్ద ముగిసింది. అయితే బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.14 శాతం, స్మాల్ క్యాప్ 0.65 శాతం చొప్పున పుంజుకోవడం గమనార్హం!

సాంకేతికంగా ముందుకే..

చార్టుల ప్రకారం గత వారం అంచనాలకు భిన్నంగా దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. అయితే రెండో సపోర్ట్ స్థాయిల వద్ద నుంచి కోలుకున్నాయి. వెరసి సాంకేతికంగా కీలకమైన 85,000 పాయింట్లు(సెన్సెక్స్), 26,000 పాయింట్ల(నిఫ్టీ) కీలకస్థాయిలకు ఎగువన ముగిశాయి. ఈ వారం సైతం ఆటుపోట్ల మధ్య బలపడే వీలున్నట్లు సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు.

- నిఫ్టీకి తొలుత 26,000 పాయింట్లు సపోర్ట్‌గా నిలవవచ్చు. తదుపరి 25,800 వద్ద తిరిగి మద్దతు లభించే వీలుంది. 26,000 పాయింట్ల స్థాయికి ఎగువన నిలదొక్కుకుంటే 26,350 వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. ఆపై సమీప భవిష్యత్‌లో 26,900–27,000 వరకూ పుంజుకునే చాన్స్‌లున్నాయ్.
- సెన్సెక్స్ జోరందుకుంటే తొలుత 85,700–85,800 పాయింట్ల వద్ద అమ్మకాల ఒత్తిడి కనిపించవచ్చు. ఈ స్థాయిలను అధిగమిస్తే 88,000–88,500 వరకూ బలపడే వీలున్నట్లు అంచనా. ఒకవేళ అమ్మకాలతో బలహీనపడితే 85,000 నుంచి 84,000 పాయింట్లవరకూ క్షీణించవచ్చు.

స్టాక్స్ వ్యూ

సన్ టీవీ | **బ్రోకరేజ్:** ఎలారా సెక్యూరిటీస్ | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 562 **టార్గెట్: రూ. 730**

ఎందుకంటే: మీడియా రంగ దిగ్గజం సన్ టీవీ నెట్‌వర్క్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికం(జూలై–సెప్టెంబర్)లో పటిష్ట పనితీరు చూపింది. కూలీ సినిమా ప్రదర్శనతో నిర్వహణ లాభం(ఇబిటా) అంచనాలను మించి బలపడింది. అయితే వార్షికంగా కీలకమైన ప్రకటనల ఆదాయం 13 శాతం క్షీణించింది. ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాల బ్రాండ్స్ ప్రకటనలు నిర్మాణాత్మక శైలిలో డిజిటల్ మీడియంవైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో పూర్తి ఏడాదికి ప్రకటనల అమ్మకాలు 8 శాతం నీరసించవచ్చని భావిస్తున్నాం. ఈ బాటలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) లోనూ బలహీన ధోరణిలోనే నమోదైనప్పటికీ ఆపై సంవత్సరాని(2027–28)కల్లా తిరిగి ప్రకటనల ఆదాయంలో ఓమాదిరి(3–4 శాతం) రికవరీకి వీలున్నట్లు అంచనా వేస్తున్నాం. కాగా.. ఏప్రిల్–జూన్(క్యూ1)లో ధరల పెంపు కారణంగా సబ్‌స్క్రిప్షన్ ఆదాయం 9 శాతం పుంజుకున్నప్పటికీ ఇకపై నీరసించే వీలుంది. కూలీ మూవీ నుంచి ప్రపంచవ్యాప్తంగా రూ. 510 కోట్ల వసూళ్లకుతోడు సినిమా పంపిణీ బిజినెస్ నుంచి 34 శాతం వాటా సమకూరడం క్యూ2 ఆదాయానికి దన్నుగా నిలిచాయి. అయినప్పటికీ మరోపక్క సన్ మరాఠీ, సన్ నియో తదితర ప్రాంతీయ చానళ్లు మార్కెట్ వాటాను పెంచుకుంటున్నాయి. ఈ అంశాల నేపథ్యంలో 2025–28 కాలానికి ఆదాయ అంచనాలు 4 శాతం, షేరువారీ ఆర్జన(ఈపీఎస్)లో 5–8 శాతం కోత పెడుతున్నాం. 1.5–2 బిలియన్ డాలర్ల విలువకు అవకాశమున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. సన్ టీవీకి లబ్ధిని చేకూర్చనుండగా.. వాటాదారులకు నిలకడగా చెల్లిస్తున్న 35 శాతం డివిడెండ్ సానుకూల అంశంగా పేర్కొనవచ్చు.

ఏథర్ ఎనర్జీ | **బ్రోకరేజ్:** ఎమ్‌కే గ్లోబల్ | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 644 **టార్గెట్: రూ. 925**

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికం(జూలై–సెప్టెంబర్)లో అంచనాలనకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహన రంగ దిగ్గజం ఏథర్ ఎనర్జీ ఆకర్షణీయ పనితీరు ప్రదర్శించింది. వార్షిక ప్రాతిపదికన ఆదాయం క్యూ2లో 54 శాతం ఎగసి రూ. 890 కోట్లను తాకింది. అమ్మకాల పరిమాణం వార్షికంగా 67 శాతం, త్రైమాసికవారీగా 42 శాతం జంప్‌చేయడం ఇందుకు సహకరించింది. పెరిగిన ఉత్పత్తి, వ్యయ నియంత్రణల కారణంగా నిర్వహణ(ఇబిటా) నష్టం రూ. 130 కోట్లకు పరిమితమైంది. నిర్వహణ సంబంధ మార్జిన్లు(ఇబిటీడీఏఎం) గతేడాది(2024–25) క్యూ2లో నమోదైన మైనస్ 21 శాతం నుంచి మైనస్ 14.7 శాతానికి రికవర్‌కావడం ఇందుకు దన్నుగా నిలిచింది. స్థూల మార్జిన్లు(ఎక్స్‌ఇన్సెంటివ్) గత క్యూ2లో 10 శాతంగా, ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లో 16.5 శాతంగా నమోదుకాగా.. క్యూ2కల్లా ఇవి 17.3 శాతానికి మెరుగుపడ్డాయి. బ్యాటరీలలో ఎల్‌ఎఫ్‌పీకి పెరుగుతున్న డిమాండ్, నిర్వహణ సామర్థ్యం ఇందుకు తోడ్పాటునిచ్చాయి. సమీపకాలంలో ఎదురుకానున్న సరఫరా సవాళ్లు, నిబంధనల కారణంగా మూడో తయారీ ప్లాంటు(ఏయూఆర్‌ఐసీ) 2–3 నెలలు ఆలస్యమయ్యే అవకాశమున్నప్పటికీ కొత్త ఆధునిక స్కూటర్ల ఈఎల్ ప్లాట్‌ఫామ్‌ను సమయానుగుణంగా ప్రారంభించనుంది. ఇందుకు నిర్వహణలోగల హోసూర్ ప్లాంటు దోహదం చేయనుంది. కంపెనీకున్న ప్రీమియం బ్రాండ్‌కు తోడు, అధిక మార్జిన్లు ఆర్జించే వాహనేతర విభాగ ఆదాయం(12 శాతం) దేశీ ఈవీ ద్విచక్ర వాహన అమ్మకాలకు జోష్‌నివ్వనున్నాయి. వెరసి రానున్న కాలంలో ఈవీ ద్విచక్ర వాహన అమ్మకాలలో కంపెనీ ముందునిలిచే అవకాశముంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

డబ్బును ఎప్పుడూ మన సేవకుడిగా ఉంచాలి,
యజమానిగా కాదు
-ఫ్రాన్సిస్ బేకన్, ఆంగ్ల తత్వవేత్త

పవర్‌ఫుల్ ఆదా... సెకండ్ హ్యాండ్ ఈవీకి ఓకే!

అందుబాటు ధరలకే ప్రీ ఓన్డ్ ఎలక్ట్రిక్ కార్లు

- పెట్రోల్ కారు కంటే తక్కువ ధరలకే
- నిర్వహణ వ్యయం చూసినా ఎంతో తక్కువ
- బ్యాటరీ గురించి అంతగా ఆందోళన వద్దు
- వినియోగాన్ని బట్టే ఎంపిక ఉండాలి..
- ఛార్జింగ్ సదుపాయాలనూ దృష్టిలో పెట్టుకోవాలి



ఐదేళ్ల కిందట దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు పెద్దగా లేనేలేవు. మొత్తం వాహనాల్లో ఎలక్ట్రిక్ వాటా నిండా ఒక శాతం కూడా లేదు. మరి ఇప్పుడో..? దాదాపుగా మూడున్నర శాతానికి చేరుకుంది. ఇదేమీ మామూలు పెరుగుదల కాదు. మరెలా సాధ్యమైంది? ఎలాగంటే అప్పట్లో ఛార్జింగ్ సదుపాయాలు తక్కువ. ధరలు ఎక్కువ. పైపెచ్చు మోడళ్లు తక్కువే. దాంతో కొనేవారు వెనకడుగు వేసేవారు. ఇపుడు ఛార్జింగ్ సదుపాయాలు పెరిగాయి. ప్రతి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలోనూ వస్తున్నాయి. దాదాపు అన్ని కంపెనీలూ ఈ రంగంలోకి వచ్చి రకరకాల మోడళ్లు తెస్తున్నాయి. వీటికి తోడు ధరలూ తగ్గాయి. అందుకే ఇపుడు జనం ఆలోచనలు మారుతున్నాయి. సరే! ఇదంతా ఒకెత్తయితే... ఆర్థికంగా మనకు ఏదైతే లాభం? ఈ ప్రశ్నకు చాలామంది సమాధానం వెతుకుతూనే ఉన్నారు. వారికోసమే ఈ కథనం...

పెట్రోల్, డీజిల్ కార్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ కార్ల ధరలు కొంచెం ఎక్కువ. కానీ నిర్వహణ వ్యయాన్ని లెక్కలోకి తీసుకుంటే ఎలక్ట్రిక్ కారు నిర్వహణ వ్యయమే తక్కువ. మరి మొత్తంగా చూసినపుడు ఏది బెటర్? ఇలా చూసినపుడు స్మార్ట్‌గా సేవ్ చేసుకోవటానికి సెకండ్ హ్యాండ్ (ప్రీఓన్డ్/ అప్పటికే మరొకరు వినియోగించిన) ఎలక్ట్రిక్ కారు కొనటం మంచిదంటున్నారు నిపుణులు. కొత్త పెట్రోల్ కారు కొనే బదులు ప్రీ ఓన్డ్ ఎలక్ట్రిక్ కారును ఇంటికి తెచ్చుకోవటమనేది స్మార్ట్ మార్గమని సలహా ఇస్తున్నారు.

ఎలక్ట్రిక్ కారే చౌక.. అదెలా?

కొత్త వాటి ధరలు అధికంగా ఉంటుండడంతో.. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్ తదితర పట్టణాల్లో ప్రీ ఓన్డ్ ఎలక్ట్రిక్ కార్లకు ఇటీవల డిమాండ్ బాగా పెరిగింది. ఇందులో ఉన్న ఆదా సూత్రం చాలా మందికి నచ్చుతోంది. ఎందుకంటే పెట్రోల్ కార్లతో పోల్చినపుడు ఎలక్ట్రిక్ కార్ల విలువ వేగంగా తగ్గిపోతోంది. 2020లో రూ.12 లక్షలు పలికిన ఈవీ ధర.. ఇప్పుడు రూ.5.5 నుంచి 6.5 లక్షలకే దొరుకుతోంది.

అందుబాటు ధరలకే..

ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్ ఎప్పటికప్పుడు మారిపోతోంది. కొత్త కొత్త ఫీచర్లు తరచూ యాడ్ అవుతూనే ఉన్నాయి. పైపెచ్చు కంపెనీలు అత్యాధునిక సదుపాయాలతో మోడళ్లను అప్‌గ్రేడ్ చేస్తున్నాయి. దీంతో అప్‌గ్రేడెడ్ వెర్షన్‌ను కొనుక్కోవటానికి సంపన్నులు మొగ్గు చూపిస్తున్నారు. ఫలితంగా 3- 4 ఏళ్లు తిరక్కుండానే తమ పాత వాహనాన్ని సెకండ్ హ్యాండ్ మార్కెట్లో విక్రయానికి పెడుతున్నారు. ఈ ధోరణే ఇప్పుడు మధ్య తరగతి వాసులకు కలిసి వస్తోంది. సెకండ్ హ్యాండ్‌లో పెట్రోలు కారు కొని అధిక నిర్వహణ వ్యయాన్ని భరించే బదులు... తక్కువ ధరకే ఈ ఎలక్ట్రిక్ వాహనాన్ని కొని తక్కువ నిర్వహణ వ్యయంతో ముందుకెళుతున్నారు.

నిర్వహణ వ్యయం కలిసొచ్చేదిలా...

- పెట్రోలు కారు లీటర్‌కు 15 కిలోమీటర్లు మైలేజీ ఇస్తోందనుకుందాం. దాన్లో నెలకు 1,000 కిలోమీటర్లు ప్రయాణిస్తే దాదాపుగా రూ.6,500 నుంచి రూ.7000 ఖర్చవుతుంది.
- నెలకు ఇంతే దూరం కోసం ఎలక్ట్రిక్ కారులో గనక తిరిగితే.. ఒక కిలోమీటర్‌కు రూ.1.5 చొప్పున ఎలక్ట్రిక్ చార్జింగ్ కోసం రూ.1,500–2,000 వెచ్చిస్తే సరిపోతుంది.
- ఈ ఉదాహరణలో ఎలక్ట్రిక్ కారును వినియోగించడం వల్ల నెలవారీ రూ.5,000 వరకు ఆదా అవుతుంది.
- ఎలక్ట్రిక్ కారులో ఇంజన్ ఆయిల్ మార్చుకోవాల్సిన అవసరం ఉండదు. క్లచ్/గేర్ బాక్స్‌లు ఉండవు. కనుక ఎలక్ట్రిక్ కారుకు సర్వీసింగ్ కోసం ఏడాదిలో రూ.2,000–5,000 సరిపోతుంది.
- పెట్రోల్ కారులో ఇంజన్ ఆయిల్, సర్వీసింగ్ కోసం ఏటా రూ.12,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది.

'బ్యాటరీ'పై ఆందోళన ఎందుకు?

ఎలక్ట్రిక్ కారుకు బ్యాటరీయే హృదయం. కొంత కాలానికి బ్యాటరీ పనితీరు పడిపోతుందని, అగ్ని ప్రమాదాల రిస్క్ ఉంటుందని కొందరు భయపడుతుంటారు. కానీ, ఇపుడు కంపెనీలు ఏమాత్రం రాజీ పడకుండా మెరుగైన టెక్నాలజీతో మంచి బ్యాటరీలు తెస్తున్నాయి. పైపెచ్చు కార్ల కంపెనీలు బ్యాటరీలపై ఎనిమిదేళ్ల వారంటీని లేదంటే 1,60,000 కిలోమీటర్ల వినియోగానికి వారంటీని ఆఫర్ చేస్తున్నాయి. పైగా నాలుగేళ్ల వినియోగం తర్వాత ఎలక్ట్రిక్ కారు బ్యాటరీ పనితీరు అందరూ అనుకునేట్టు 40–50 శాతం పడిపోవడం అన్నది నిజం కాదు. 8–12 శాతమే తగ్గుతున్నట్టు యూజర్ డేటా ఆధారంగా తెలుస్తోంది.దీన్నిబట్టి చూసినపుడు మూడేళ్లు వాడిన కారును కొనుక్కున్నా మరో మూడు నాలుగేళ్లు అదే బ్యాటరీని నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. ఒకవేళ బ్యాటరీ మార్చాల్సి వస్తే.. అది కారును బట్టి రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ ఉంటోంది.

ఐదేళ్లలో మిగిలేది బ్యాటరీకి పెట్టొచ్చు...

ప్రీఓన్డ్ ఈవీ వర్సెస్ పెట్రోల్ కారు

- నెలవారీ వినియోగం 1,000 కిలోమీటర్లు
- పెట్రోల్ కారుకు నెలకు ఇంధనం కోసం రూ.7,000 చొప్పున ఐదేళ్లలో రూ.4.2 లక్షలు అవుతుంది.
- అదే ఎలక్ట్రిక్ కారుకు నెలకు రూ.2,000 చొప్పున రూ.లక్ష చాలు.
- పెట్రోల్ కారుకు ఏటా రూ.12వేల చొప్పున ఐదేళ్లలో రూ.60వేలు మెయింటెనెన్స్ అవుతుంది.
- ఎలక్ట్రిక్ కారుకు రూ.2–5 వేల చొప్పున రూ.10–25వేలు సరిపోతుంది.
- ఈ రకంగా చూస్తే ఎలక్ట్రిక్ కారుపై ఐదేళ్లలో రూ.3 – 4 లక్షలు మిగులుతుంది.
- బ్యాటరీ రీప్లేస్ చేయాల్సిన సమయం వచ్చేసరికి బ్యాటరీ ఖర్చు కన్నా మనకు మిగిలేదే ఎక్కువనేది నిపుణుల మాట.

ఎవరికి ఏది అనుకూలం?

ప్రీఓన్డ్ ఈవీ:

- పట్టణాల్లో రోజువారీ కార్యాలయానికి వెళ్లి వచ్చేందుకు అయితే ఈవీ అనుకూలం.
- ఒక రోజులో 80 కిలోమీటర్ల లోపు ప్రయాణించే వారు దీనికి మొగ్గు చూపొచ్చు. నెలలో కనీసం 700 కిలోమీటర్లు, అంతకుమించి ప్రయాణించే వారికే ఈవీ లాభసాటి.
- రూ.5– 8 లక్షలే పెట్టుబడి పెట్టగలిగే వారు, ఇంట్లో చార్జింగ్ వసతులు కలిగిన వారు ఇటు వైపు మొగ్గు చూపించొచ్చు.

పెట్రోల్ కారు:

- హైవేలపై ఎక్కువగా ప్రయాణించే వారు లేదా గ్రామీణ/మారుమూల ప్రాంతాలకు ప్రయాణాలు ఎక్కువగా పెట్టుకునే వారికి ఎలక్ట్రిక్ కారు కంటే పెట్రోల్ కారు అనుకూలం. ఎలక్ట్రిక్ కారుకు ఒకసారి చార్జింగ్ చేశాక... మైలేజ్ పరంగా పరిమితులను దృష్టిలో పెట్టుకోవాలి.
- ఇంట్లో చార్జింగ్ సదుపాయం లేని వారికి సైతం పెట్రోల్ కారుతోనే సౌలభ్యమని చెప్పాలి.
- నెలలో 500 కిలోమీటర్లకు మించి ప్రయాణం చేయని వారికి పెట్రోల్‌పై, కారు నిర్వహణపై పెద్దగా వ్యయం చేయాల్సిన అవసరం ఏర్పడదు. వినియోగం తక్కువే కనుక ఏటా విలువ గణనీయంగా తగ్గిపోయే ఎలక్ట్రిక్ కారు కంటే పెట్రోల్ కారే వీరికి అనుకూలం.

హైదరాబాద్ సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లో ధరల తీరు

కారు మోడల్	కొత్తది	పాతది (ధర రూ.లక్షల్లో)
టాటా నెక్సాన్ ఈవీ	14.5	6.5 - 7 (2020 మోడల్)
టాటా టిగోర్ ఈవీ	12	5 - 6 (2021)
ఎంజీ జెడ్ఎస్ ఈవీ	24	13 - 15 (2020)

అవగాహనతోనే ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ

విశ్వనాథ్ కృష్ణమూర్తి

భారత జాతీయ చెల్లింపుల సంస్థ (NPCI) చీఫ్ రిస్క్ ఆఫీసర్

డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి, ఇవి భారతదేశాన్ని డిజిటల్–ఫస్ట్ ఆర్థిక వ్యవస్థ వైపు తీసుకెళ్తున్నాయి. ఇవి భద్రతతో పాటు, వినియోగదారులకు చెల్లింపుల్లో సౌకర్యాన్ని అందిస్తాయి. అయితే, డిజిటల్ పేమెంట్లను సురక్షితంగా ఉపయోగించడం, ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా ఉండటం ఈరో?జుల్లో అత్యంత కీలకం. సంభవించే మోసాలను ముందుగానే గుర్తించగలిగితే అది మీతోపాటు మీ కుటుంబ సభ్యులను కూడా ఆన్ లైన్ మోసాల నుంచి కాపాడడమే కాకుండా అందరికీ సురక్షితమైన, తక్కువ నగదు వినియోగంతో కూడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో సహాయపడుతుంది. ఆధునిక టెక్నాలజీ చెల్లింపులను వేగంగా జరిపేలా, సులభతరంగా మార్చినప్పటికీ, ఆన్‌లైన్ మోసాల నుండి పూర్తి స్థాయి రక్షణ అవగాహనతోనే సాధ్యపడుతుంది. ఆన్‌లైన్ మోసాలు, ముఖ్యంగా సామాజిక ఇంజినీరింగ్ ద్వారా జరిగేవి ఇటీవలి కాలంలో చాలా ఆందోళనగా కలిగిస్తున్నాయి. దురాశ, భయం, అత్యవసరం వంటి భావోద్వేగాలను సాధనాలుగా ఉపయోగించి ఆన్‌లైన్ మోసగాళ్లు వినియోగదారులను వంచిస్తారు.

ఇటీవలి కాలంలో వేగంగా పెరుగుతున్న ధోరణుల్లో ఒకటి ''డిజిటల్ అరెస్టు' తమను పోలీసులమని చెప్పుకుంటూ ఎవరో కాల్ చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. మీ బ్యాంక్ ఖాతా దర్యాప్తులో ఉందని, డబ్బును 'సురక్షిత' ఖాతాకు మార్చాలని వారు చెబుతారు. వెంటనే మానసిక ఒత్తిడికి గురైన వినియోగదారులు వారి ట్రాప్‌లో పడి అంతా పోగొట్టుకుని చాలా ఆలస్యంగా అది మోసమని గ్రహిస్తారు. నిజమైన ప్రభుత్వ సంస్థలు, నియంత్రణ సంస్థలు ఎప్పుడూ ఫోన్లు, వీడియో కాల్ ద్వారా డబ్బు అడగవు, కేసులను దర్యాప్తు చేయవు. డబ్బు విషయంలో నిర్ణయం తీసుకునే ముందు కాల్ చేసిన వ్యక్తి నిజస్వరూపాన్ని నిర్ధారించుకోవడం, నమ్మకమైన ప్రభుత్వ సంస్థలను సంప్రదించడం చాలా ముఖ్యం.

వేగంగా పెరుగుతున్న పెట్టుబడి మోసాలు

ఆర్థిక నిపుణులుగా పరిచయం చేసుకుని మోసం చేసే వారు ఇటీవలి బాగా పెరిగారు. పేరున్న సంస్థలను, నకిలీ రిఫరెన్సులను అమాయక, ఔత్సాహిక ఇన్వెస్టర్లను మోసగించేందుకు వీరు ఉపయోగిస్తారు.అసాధారణ లాభాలు , ప్రత్యేక పెట్టుబడి అవకాశాలను అందిస్తామని వాగ్దానం చేస్తారు. బదులుగా డబ్బు అందుకున్న వెంటనే అదృశ్యమైపోతారు. అందుకే ఎల్లప్పుడూ సెబీ, ఆర్‌బీఐ ఇతర అధికారిక నియంత్రణ సంస్థల వెబ్‌సైట్లలో నమోదైన సంస్థల జాబితాలను తనిఖీ చేస్తుండాలి.

వినియోగదారులు సురక్షితంగా ఎలా ?

డిజిటల్ పేమెంట్‌లను ఆమోదించే ముందు వినియోగదారులు ఎల్లవేళలా యాప్ నోటిఫికేషన్‌లను జాగ్రత్తగా పరిశీలించాలి, మోసం జరిగితే వెంటనే తమ బ్యాంకుకు తెలియజేయాలి లేదా 1930 (సైబర్ సెక్యూరిటీ హెల్ప్‌లైన్)కు కాల్ చేయాలి, అలాగే నిర్ధారించని యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(NPCI) కూడా తక్షణ చెల్లింపు వ్యవస్థ -యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్(UPI) వ్యవస్థలో అనేక భద్రతా చర్యలను అమలు చేస్తోంది. తెలియని యూపీఐ ఐడీలకు డబ్బు పంపేటప్పుడు హెచ్చరిక సందేశాలతో ప్రారంభ అలర్టులు, అలాగే డివైస్ బైండింగ్ లాంటి రెండంచెల ధృవీకరణతో కూడిన భద్రతా వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. 'మే మూర్ఖ్ నహీ హూన్'' వంటి ప్రచార వీడియోల ద్వారా ప్రజల్లో అవగాహనను పెంచడానికి కూడా ఎన్‌పీసీఐ కృషి చేస్తోంది. డిజిటల్ భద్రతగా ఉండడం, ఆన్‌లైన్ మోసాల విషయంలో అప్రమత్తతతో ఉండే సంస్కృతిని వినియోగదారుల్లో పెంపొందించేందుకు ప్రయత్నిస్తోంది. డిజిటల్ పేమెంట్లు ప్రతి వినియోగదారుడికి సులభంగా సురక్షితంగా ఉండేలా చేస్తోంది.

కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఒకప్పుడు స్వాతంత్రం రాక ముందు ఆదాయపు పన్ను చట్టం 1922...., స్వాతంత్రం వచ్చిన తరువాత చట్టం 1961 అమలులోకి వచ్చింది. మధ్యలో ఎన్నో మార్పులు, చేర్పులు, కూర్పులు, నాలుగైదు సార్లు పెనుమార్పులు. తీసివేతలు, కలిపివేతలు, 65 సార్లు 4,000 మార్పులు చేశారు. ఈ సంవత్సరం కొత్త చట్టాన్ని అమల్లోకి తెస్తున్నారు. ఆదాయపు పన్ను చట్టం 2025.. 47 చాప్టర్లను 23కు కుదించారు. 819 సెక్షన్లను 536కి తగ్గించారు. ఇప్పుడు షెడ్యూళ్లు లేవు. ఇప్పుడు వాటి సంఖ్య 16. ప్రస్తుతం అంకెలకు ఇంగ్లీషు అక్షరాలు తగిలించి ... ఉదాహరణకు 194 అ.. ఇలా మూడు అక్షరాల రైలుబండిలా పెట్టి వ్యవహారం నడుపుతున్నారు. ఇకపై అలా ఉండదు. కేవలం నంబర్లే... సెక్షన్ 10లో ఉండే అన్ని మినహాయింపులను షెడ్యూల్స్‌లో అమర్చారు. క్లారిటీ కోసం కొన్ని టేబుల్స్, ఫార్ములాలు ప్రవేశపెట్టారు. అదేదో సినిమా డైలాగు గుర్తొస్తోంది. 'అయితే నాకేంటి'? ఈ మార్పుల వలన మనకు ఒరిగేది ఏమిటి?

1.4.2026 నుంచి అమల్లోకి వచ్చే ఈ చట్టం ప్రత్యేకతలు ఏమిటంటే...?

- సరళీకృతంగా ఉంటుంది.
- వాడుకలో లేనివాటిని తీసివేశారు
- కొన్ని అంశాలను నెంబరింగ్ ఇచ్చి క్రమబద్ధీకరించారు.
- కొన్ని అంశాలను పునర్‌నిర్మాణం చేశారు.
- రాబోయే పదం ''పన్ను సంవత్సరం''. ప్రస్తుత అకౌంటింగ్ సంవత్సరం, ఫైనాన్సియల్ సంవత్సరం, ఆదాయపు సంవత్సరం, గత సంవత్సరం, ఇవన్నీ మనకు అర్థం అయ్యేలా చెప్పాలంటే మనం ఆదాయం సంపాదించిన సంవత్సరం. ఈ ఆదాయాన్ని సంవత్సరం తరువాత అస్సెస్సుమెంట్ సంవత్సరం అంటే ఆ తరువాత సంవత్సరంలో అస్సెస్సు చేస్తారు. కాబట్టి ఈ సంవత్సరం అస్సెస్సుమెంట్ సంవత్సరం అని అంటారు.
- రామాయణం అంతా విని రాముడికి సీత ఏమి అవుతుందని అడిగినట్లు... 64 ఏళ్లు దాటినా టాక్స్ ప్లేయర్‌కి ఈ రెండు సంవత్సరాల మధ్య తేడా తెలియదు. కన్ఫ్యూజన్ పోలేదు. ఎన్నో పొరపాట్లు జరిగేవి. ఇన్‌కం టాక్స్ చెల్లించేటప్పుడు చలాన్‌లో సంవత్సరానికి సంబంధించిన కాలమ్ నింపేటప్పుడు తికమక అయ్యేవారు. ఇకపై తికమక అవసరం ఉండదు. 1.4.2026 నుంచి నుంచి ఒకే పదం వాడుకలోకి వస్తుంది. అదే ''పన్ను సంవత్సరం''.
- టీడీఎస్‌కి సంబంధించిన అంశాలను చాలా పద్ధతి ప్రకారం ఎటువంటి తికమక రాకుండా చేశారు. ఒక సెక్షన్ ద్వారా జీతాలకు సంబంధించిన అంశాలు పొందుబరిచారు. ఒకే ఒక సెక్షన్ ద్వారా మిగతా అన్ని టీడీయస్ అంశాలు పొందుబరిచారు. ఈ పట్టిక సమగ్రం.., సంపూర్ణం. క్రమసంఖ్య ఏ ఆదాయం మీద చేయాలి? ఎవరికి వర్తిస్తుంది? పరిమితులు... ఇలా ఉంటాయి వివరాలు... రెసిడెంట్లకు, నాన్ రెసిడెంట్లకు, టీసీఎస్.. ఎవరికి అక్కర్లేదు.? ఇలా అన్నీ టేబుల్స్ ద్వారా చక్కగా వివరించారు.
- పాతకాలపు పదజాలానికి స్వస్తి పలికారు.
- పాతవాటికి మంగళం పలికి, ప్రపంచంలో ఆచరించే మంచి పద్ధతులకు చట్టంలో చోటిచ్చారు.
- వర్చువల్, డిజిటల్ ఆస్తులను నిర్వచించారు. క్రిప్టో కరెన్సీ, టోకనైజ్డ్ ఆస్తులు, టెక్నాలజీ ద్వారా ఏర్పడే హక్కులు మొదలైనవి వివరించారు.
- వివాదాలకు ఆస్కారం లేకుండా పరిష్కారం చేస్తారు.
- టెక్నాలజీని ఆసరా తీసుకొని అధికార్లకు విస్తృత అధికారాలు కల్పించారు. ఇన్నాళ్లు సెర్చ్‌లు అంటే ఇంటినో, ఆఫీసునో, ఫిజికల్ ఏరియా మాత్రమే ఉండేవి. ఇక నుంచి మీ ఈ–మెయిల్స్, క్లౌడ్ సర్వర్లు, సోషల్ మీడియా అకౌంట్లు, వెబ్‌సైట్లు అన్నింట్లోనూ చొరబడతారు ఎగబడతారు. ఇకపై బుకాయించలేము. ఈ నగదు నాది కాదు మా మామగారిది అనలేము. అధికారులకు విస్తృత సమాచారం ఇవ్వడం వల్ల మీకు సంబంధించిన సమాచారం వారి చెంతనే ఉంటుంది.

కాబట్టి కొత్త చట్టంలోని అంశాలకు అనుగుణంగా నడుచుకుందాం. చట్ట ప్రకారం మీ విధులను సక్రమంగా నిర్వర్తించండి. ఫిబ్రవరిలో బడ్జెటుకు కసరత్తు జరుగుతోంది. అందులో శ్లాబులు, రేట్లు మారవచ్చు. మారకపోవచ్చు. ఈ రాబోయే మార్పులు తప్ప, మిగతా అంతా కొత్త చట్టం మనకు అందుబాటులో ఉంటుంది. వీలయితే చూడండి...



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రిస్క్ కొద్దీ రాబడులు!

ఎస్‌బీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాల లక్ష్యాల కోసం పెట్టుబడులు పెట్టాలనుకునే వారు.. తప్పక పరిశీలించాల్సిన వాటిల్లో ఫోకస్డ్ ఫండ్స్ కూడా ఉండాలి. ఎందుకంటే ఇవి ఇతర ఫండ్స్ మాదిరిగా కాకుండా.. ఎంపిక చేసిన కొన్ని కంపెనీల్లోనే పెట్టుబడులు పెడుతూ మెరుగైన రాబడులు సమకూర్చి పెట్టే విధంగా పనిచేస్తుంటాయి. ఈ విభాగంలో మెరుగైన రాబడులు కోరుకునే వారు ఎస్‌బీఐ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్‌ను పరిశీలించొచ్చు. అన్ని రకాల మార్కెట్లలోనూ లాభాలు ఇవ్వగల స్టాక్స్‌ను గుర్తించి ఇన్వెస్ట్ చేయడం ద్వారా రాబడులు ఇచ్చే విధానంతో ఈ పథకం పనిచేస్తుంటుంది. కనుక ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లకు ఇదొక మంచి పెట్టుబడి ఆప్షన్ అవుతుంది.

పెట్టుబడుల విధానం

ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్స్ విభాగంలో ముందు నుంచి పనిచేస్తున్న పథకాల్లో ఎస్‌బీఐ ఫోకస్డ్ ఫండ్ ఒకటి. పోర్ట్‌ఫోలియోలో 25–30 స్టాక్స్ వరకు నిర్వహిస్తుంటుంది. మిగిలిన ఈక్విటీ పథకాల మాదిరిగా కాకుండా... ఫోకస్డ్ ఈక్విటీ విభాగంలోని పథకాలు తక్కువ స్టాక్స్‌ను పోర్ట్‌ఫోలియోలో కలిగి ఉంటాయి. ఇక్కడి నుంచి భవిష్యత్తులో పటిష్టమైన వృద్ధితో రాణించేందుకు అవకాశమున్న కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అంతేకాదు, ఆయా కంపెనీల పనితీరును, అవి పనిచేస్తున్న రంగాల్లో మార్పులను ఎప్పటికప్పుడు నిత్యం పరిశీలిస్తూ అవసరమైతే వేగంగా నిర్ణయాలు అమలు చేస్తుంటాయి. అందుకే ఈ పథకంలో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. కనుక రిస్క్ భరించగలిగే సామర్థ్యం (ఆటుపోట్లు) ఉన్న వారికే ఈ పథకం అనుకూలం. ముఖ్యంగా ఈ పథకం విదేశీ స్టాక్స్‌లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది.

రాబడులు

ముఖ్యంగా ఈ పథకం పనితీరు అన్ని కాలాల్లో స్థిరంగా ఉండడాన్ని గమనించొచ్చు. గడిచిన ఏడాది కాలంలో ఎన్నో అస్థిరతల మధ్య ఈ పథకం 12.93 శాతం రాబడులు తెచ్చిపెట్టింది. మూడు నెలల్లో 6 శాతం, ఆరు నెలల్లో 8 శాతం చొప్పున రాబడిని గమనించొచ్చు. అస్థిరతలను ఈ పథకం సమర్థవంతంగా ఎదుర్కొన్న విధానాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మూడేళ్లలో వార్షిక రాబడి 18 శాతం చొప్పన ఉంది. ఐదేళ్లు, ఏడేళ్లలోనూ వార్షిక రాబడి ఇదే స్థాయంలో ఉంది. ఇక పదేళ్ల కాలంలో ఈ పథకం ఏటా 16.46 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. బీఎస్ఈ 500 టీఆర్ఐతో పోల్చి చూస్తే ఈ పథకం కొన్ని కాలాల్లో సమాన స్థాయిలో, కొన్ని కాలాల్లో కొంత అధిక రాబడులు చూపించడాన్ని గమనించొచ్చు. ఇక ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ సగటు రాబడి కంటే ఈ పథకంలోనే అధికంగా ఉంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఆల్ఫాబెట్ ఐఎన్‌సీ (గూగుల్)	7.94
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.77
ముత్తూట్ ఫైనాన్స్	5.45
ఎస్‌బీఐ	5.28
బజాజ్ ఫిన్‌సర్వ్	5.12
ఎయిర్‌టెల్ పీసీఆర్ఈ	4.99
కోటక్ బ్యాంక్	4.63
బజాజ్ ఫైనాన్స్	4.57
అదానీ పవర్	4.25
ఇపామ్ సిస్టమ్స్	4.25

ముఖ్యంగా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో (సిప్) పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్‌ను అధిగమించొచ్చు.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.40,824 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 96.65 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సాధనాల్లో 0.78 శాతం పెట్టుబడులు ఉన్నాయి. 2.57 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. పోర్ట్‌ఫోలియోలో 27 స్టాక్స్ ఉన్నాయి. ఈక్విటీల్లోనూ 77.6 శాతం లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్‌లో 22.36 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. అత్యధికంగా 31.82 శాతం పెట్టుబడులు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో ఉన్నాయి. ఆ తర్వాత టెక్నాలజీ రంగ కంపెనీలకు 16.84 శాతం, కన్జ్యూమర్ డిస్క్రెషినరీ కంపెనీలకు 15.6 శాతం, ఇంధన రంగ కంపెనీలకు 10.18 శాతం చొప్పున కేటాయించింది.

శునకానికి సమాధి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కంటికి రెప్పలా చూసుకుంటున్న శునకం మృతి చెందడంతో గుర్తుగా ఓ దంపతులు సమాధి కట్టారు. చిత్తూరు నగరం గిరింపేటకు చెందిన సుదర్శన్, గాయత్రిదేవి రోట్ వీలర్ రకానికి చెందిన శునకాన్ని తొమ్మిదేళ్ల క్రితం ఇంటికి తెచ్చుకున్నారు. దానికి 'బాక్సీ' అని నామకరణం చేసి ఇంట్లో వ్యక్తిగా చూసుకున్నారు. గత నెల అనారోగ్యం బారిన పడడంతో చెన్నై, బెంగళూరు ఆస్పత్రులో చికిత్స అందించారు. రూ.7 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇంతా చేసినా రెండు వారాల క్రితం బాక్సీ మృతి చెందింది. గిరింపేటలోని శ్మశాన వాటిలో ఖననం చేశారు. బాక్సీకి గుర్తుగా అక్కడ సమాధి నిర్మించారు. సమాధిపై బాక్సీ బొమ్మను తీర్చిదిద్దడం చూపరులను ఆకట్టుకుంటోంది.

CO_2 పెరిగితే.. పోషకాలు తగ్గిపోతాయ్!

- గాలిలో కార్బన్ డయాక్సైడ్ పెరిగితే తగ్గుతున్న కార్బోహైడ్రేట్లు
- తగ్గుతున్న ప్రొటీన్లు, జింక్ ముఖ్యమైన సూక్ష్మపోషకాలు
- పెరుగుతున్న సీసం, నికెల్ వంటి భార ఖనిజాలు
- వరి, గోధుమలు, జొన్నలపై తాజా అధ్యయనంలో వెల్లడి

గాలిలో అంతకంతకూ పెరుగుతున్న కార్బన్ డయాక్సైడ్ (సీఓ2)కు.. మన ఆహారంలో పోషకాలకు ప్రత్యక్ష సంబంధం ఉందని మీకు తెలుసా? భూతాపం పెరుగుతున్న కొద్దీ మనం రోజూ తినే వరి బియ్యంలో, గోధుమల్లో, ఇంకా చెప్పాలంటే.. జొన్నల్లో కూడా పిండి పదార్థాల శాతం పెరిగిపోతోంది. ప్రొటీన్లు, సూక్ష్మపోషకాల శాతం ఆ మేరకు తగ్గిపోతోంది. అంతేకాదు, విషతుల్యమైన సీసం వంటి భార లోహాలు ప్రమాదకర స్థాయిలో ఆహార గింజల్లోకి చేరిపోతున్నాయి. టూకీగా చెప్పుకోవాలంటే.. భూతాపం పెరుగుతున్నకొద్దీ మన దైనందిన ఆహారంలో పోషకాల సమతుల్యత అస్తవ్యస్తమవుతోందని తాజా అధ్యయనం చెబుతోంది. – సాక్షి, సాగుబడి

➤ గాలిలో నానాటికీ పెరుగుతున్న కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు వాతావరణ మార్పులకు కారణమవుతాయని అందరికీ తెలుసు. కానీ ఇటీవల వెలువడిన ఒక కొత్త అధ్యయనం.. అధిక సీఓ2 వల్ల ఇప్పుడు ఆహార పంటల పోషకవిలువలు స్థిరంగా క్షీణిస్తున్నాయని తేల్చింది. మనం తినే ఆహారంలో పిండి పదార్థాలు పెరిగిపోయి, ప్రొటీన్లు, సూక్ష్మ పోషకాలు తగ్గిపోతే.. అధిక బరువు, పౌష్టికాహార లోపం వంటి సమస్యలు ఏకకాలంలో మరింత పెరుగుతాయి.

ఆ మూడింటిలో..

నెదర్లాండ్స్‌లోని లీడెన్ యూనివర్సిటీ నిపుణుల పరిశోధన వివరాలు 'గ్లోబల్ ఛేంజ్ బయాలజీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పెరుగుతున్న సీఓ2 ప్రభావం వల్ల పంటల్లో పోషకాలు తగ్గిపోయి, మనం తినే ప్రతి ముద్దలోనూ కేలరీలు గతం కన్నా ఎక్కువగా ఉంటాయని ఈ అధ్యయనం వెల్లడించింది. వరి, గోధుమ, జొన్న వంటి ప్రధాన ఆహార ధాన్యాల్లో పిండి పదార్థాలు పెరుగుతుండగా, ప్రొటీన్ తగ్గిపోతోందన్నారు. ఐరన్, జింక్, మెగ్నీషి యం, కాల్షియం వంటి అతిముఖ్యమైన సూక్ష్మపోషకాలు కూడా తగ్గిపోతున్నాయి. పప్పుధాన్యాల్లో జింక్ 38% తగ్గినట్లు గుర్తించారు.

ఎందుకిలా?

గాలిలో ఒకప్పుడు 350 పీపీఎం స్థాయిలో ఉండే సీఓ2 ప్రస్తుతం 426 పీపీఎంకు పెరిగింది. గాలిలో సీఓ2 లభ్యత పెరుగుతున్నకొద్దీ మొక్కలు దాన్ని ఎక్కువగా తీసుకుంటూ షుగర్‌ను, పిండిపదార్థాలను ఎక్కువగా ఉత్పత్తి చేసుకుంటున్నాయి. తత్ఫలితంగా మట్టి నుంచి వేర్ల ద్వారా ఇతర పోషకాలను తీసుకునే సామర్థ్యం తగ్గిపోతోంది. వరి, గోధుమ, జొన్నల్లో ఇలా జరుగుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. పిండి పదార్థాలు పెరగటం, ప్రొటీన్లు, సూక్ష్మపోషకాలు తగ్గటం అనేది మనం తినే గింజలు, పూలు, కాయలు, ఆకులు, దుంపలన్నిటిలోనూ ఒకేలా ఉన్నట్లు వారు తెలిపారు.

భార లోహాల ముప్పు

అధిక సీఓ2 ప్రభావంతో ధాన్యాల్లో క్రోమియం, నికెల్, సీసం వంటి విషతుల్యమైన భార లోహాలు ఎక్కువగా పోగుపడుతున్నాయని పరిశోధకులు తేల్చారు. ఇవి అతి స్వల్ప మోతాదుల్లో ఉన్నప్పటికీ మెదడు, గుండె, నాడీ మండలాలకు హాని చేస్తాయి. సీఓ2 స్థాయి పెరగటంతో గోధుమలో సీసం 170% పెరిగింది.

కిం కర్తవ్యం?!

భారతీయులు ఆహారంలో కార్బోహైడ్రేట్ల (పిండి పదార్థాల)ను మితిమీరి తీసుకోవటం, ప్రొటీన్లను అవసరం కన్నా తక్కువగా తీసుకోవటం వల్ల ఊబకాయం, షుగర్ వంటి జీవనశైలి వ్యాధుల బెడద ఏటేటా పెరుగుతోందని అధ్యయనాలు హెచ్చరిస్తున్న విషయం మనకు తెలిసిందే. రోజువారీ మొత్తం ఆహారంలో 45%కి మించి పిండి పదార్థాలు తీసుకోవద్దని, 15%పైగా ప్రొటీన్లు తీసుకోవాలని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) సూచిస్తోంది. అయితే, ప్రజలు 62% మేరకు పిండి పదార్థాలు అధికంగా తింటున్నారని, 11.5% మేరకు ప్రొటీన్లు అవసరం కన్నా తక్కువగా తింటున్నారని ఇటీవలి సర్వేల్లో తేలింది. ప్రపంచ దేశాలన్నీ సీఓ2 స్థాయిలు తగ్గించడంపై తక్షణమే దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

ఉత్సాహం నింపిన నేవీ మారథాన్

విశాఖ స్పోర్ట్స్: నావికాదళం ఆధ్వర్యంలో వైజాగ్ నేవీ మారథాన్ ఔత్సాహిక పరుగు వీరులతో సాగరతీరం నిండిపోయింది. పదిహేడువేల మంది ఈ పరుగులో భాగస్వామ్యం కాగా కొందరు విదేశీ అథ్లెట్లు కూడా పాల్గొన్నారు. నేవీ డే వేడుకల్లో భాగంగా ఆదివారం ఆర్కే బీచ్ దరి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి పరుగును తూర్పు నౌకాదళ కమాండ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, ఆయన సతీమణి ప్రియ భల్లా ప్రారంభించారు. నేవీ అధికారులతో పాటు కలెక్టర్ హరేందిర ప్రసాద్ పాల్గొన్నారు. 42, 21 కిలోమీటర్ల విభాగంలో పరుగు నిర్వహించగా..10 కి.మీ విభాగంలో ఎయిర్‌క్రాఫ్ట్ రన్ నిర్వహించారు. వివిధ విభాగాల్లో విజేతలకు నేవీ అధికారులు బహుమతులు అందజేశారు.

రెండు ప్రమాదాల్లో నలుగురి మృతి

- నెల్లూరు జిల్లాలో బైక్‌ను కారు ఢీకొని దంపతుల దుర్మరణం
- అనకాపల్లి జిల్లాలో బైక్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు యువకులు..

ఆత్మకూరు/అచ్యుతాపురం రూరల్: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనకాపల్లి జిల్లాల్లో జరిగిన ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం పాలయ్యారు. నెల్లూరు జిల్లాలో ఆదివారం బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు, అనకాపల్లి జిల్లాలో శనివారం రాత్రి మోటారు సైకిల్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం బోయలచిరివెళ్ల గ్రామానికి చెందిన చవల మాధవ (38), మనోజ (35) దంపతులు. వీరి కుమార్తె ఆత్మకూరులోని ఏపీ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతోంది. ఆదివారం పేరెంట్ మీట్ ఉండడంతో వీరు వెళ్లారు. ఇంటివద్ద నుంచి భోజనం తీసుకెళ్లి కుమార్తెకు తినిపించారు. అక్కడి నుంచి బైక్ మీద ఇంటికి వెళుతుండగా.. నెల్లూరు–ముంబై రహదారిలో ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి బద్వేల్ నుంచి నెల్లూరు వెళుతున్న ఇన్నోవా కారు రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో దంపతులు అక్కడికక్కడే మృతిచెందారు.

మంచులో దారి సరిగా కనిపించక..

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం జగన్నాథపురం సమీపంలో శనివారం రాత్రి మోటారు సైకిల్ కరెంటు స్తంభాన్ని ఢీకొనడంతో మునగపాక మండలం గణపర్తి గ్రామానికి చెందన ధనువిజయ్ (19), చెర్లోపాలెం గ్రామానికి చెందిన దూలి దుర్గ (20) మరణించారు. ఎస్‌ఐలు సుధాకర్, వెంకటరావు తెలిపిన మేరకు.. తండ్రి చనిపోవడంతో దూలి దుర్గ అచ్యుతాపురం మండలం చోడపల్లిలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి విద్యుత్ లైటింగ్ పనులు చేసుకుంటూ తల్లి నాగమణికి చేయూతగా నిలుస్తున్నాడు. గణపర్తికి చెందిన భోగాది మహేష్, లక్ష్మి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ధనువిజయ్ లైటింగ్ పనులకు సహాయకుడిగా వెళుతున్నాడు. వీరికి జగన్నాథపురానికి చెందిన ఇంటి జగన్ స్నేహితుడు. గణపర్తిలో శనివారం జరిగిన పండుగలో వీరు ఉత్సాహంగా గడిపారు. తరువాత దుర్గను చోడపల్లిలో డ్రాప్ చేయడానికి బైక్‌పై ముగ్గురూ బయలుదేరారు. జగన్నాథపురంలో జగన్ దిగిపోయి, తన బైక్‌ను దుర్గకు ఇచ్చాడు. రాత్రి 11.30 గంటల సమయంలో దుర్గ, ధనవిజయ చోడపల్లి వెళుతుండగా మంచు విపరీతంగా కురవడంతో దారి సరిగా కనిపించక జగన్నాథపురం సమీపంలో రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు మృతిచెందారని వైద్యులు తెలిపారు.

భోగాది ధనువిజయ్, దూలి దుర్గ (ఫైల్)

తెరపైకి ఈపీఎఫ్ వేతన పరిమితి పెంపు!

- ప్రస్తుత వేతన పరిమితి రూ.15 వేలు... దీన్ని 30 వేల వరకు పెంచాలంటున్న కార్మిక సంఘాలు
- పెంపు అంశాన్ని పరిశీలిస్తామని పార్లమెంటులో కేంద్ర కార్మిక శాఖ మంత్రి ప్రకటన
- ఈ పెంపుతో వేతనజీవికి నెలజీతంలో కోత పడ్డా... పీఎఫ్‌లో భారీగా పొదుపు

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) వేతన పరిమితి త్వరలో పెరిగే అవకాశం ఉంది. పదకొండేళ్ల క్రితం తర్వాత మరోసారి ఈ పరిమితిని పెంచేందుకు కేంద్ర కార్మిక శాఖ కసరత్తు చేస్తోంది. వేతన పరిమితి పెంపుతో ఉద్యోగుల సామాజిక భద్రతకి మరింత ధీమా కలగడంతోపాటు పదవీ విరమణ సమయంలో ఉద్యోగికి అందే ఆర్థిక లబ్ధి కూడా భారీగా పెరగనుంది. వేతన పరిమితిని చివరిసారిగా 2014లో రూ.6,500 నుంచి 15 వేలకు పెంచారు. ఆ తర్వాత ఇప్పటివరకు పెంపుదలపై ఎలాంటి చర్చలు జరగలేదు. ఈ అంశంపై ఇటీవల పార్లమెంటులో పలువురు సభ్యులు లేవనెత్తగా... అందుకు స్పందించిన కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ 'ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకోదు. వాటాదారులతో చర్చించాలి. అంతేకాకుండా కార్మిక సంఘాలు, పారిశ్రామిక సంఘాలతోనూ చర్చలు జరపాల్సి ఉంటుంది. అయితే పెంపు అంశంపై మాత్రం కేంద్రం సానుకూలంగా ఉంది' అని చెప్పారు. దీంతో ఒక్కసారిగా వేతన పెంపు అంశం తెరపైకి వచ్చింది.

30వేల వరకు పెంచాలంటున్న సంఘాలు

ఈపీఎఫ్ 1995లో అమల్లోకి వచ్చిన సమయంలో ఈపీఎఫ్ వేతన పరిమితి రూ.5వేలుగా ఉంది. ఆ తర్వాత 2001లో అప్పటి జీవన వ్యయం, వేతనాల స్థితికి అనుగుణంగా వేతన పరిమితిని రూ.6,500కు పెంచారు. 13 ఏళ్ల తర్వాత దీన్ని రూ.15వేలకు పెంచారు. ఆ తర్వాత ఇప్పటివరకు ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. ఇప్పుడు ఉద్యోగాల్లో చేరే వారికి కనీస వేతనం రూ.20వేల కంటే ఎక్కువగా ఉంది. దీంతో ఈపీఎఫ్ వేతన పరిమితి పెంపు అనివార్యమని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా వేతన పరిమితిని రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. వేతన పరిమితి పెంపుతో ఎక్కువ మంది ఉద్యోగులు ఈపీఎఫ్ పరిధిలోకి వచ్చేస్తారు. అంతేకాకుండా ఈపీఎఫ్ ఉద్యోగుల పొదుపు మరింత పెరుగుతుంది. యాజమాన్యాలపై కొంత భారం పడినప్పటికీ... ఉద్యోగులకు మాత్రం పీఎఫ్‌లో భారీగా పొదుపు ఉంటుందనేది కార్మిక సంఘాల నేతల అభిప్రాయం. అయితే వేతన పెంపు అంశంపై ఈపీఎఫ్ఓ ఆధ్వర్యంలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. సీబీటీ సమావేశం ఇప్పటివరకు షెడ్యూల్ కాలేదు. సాధారణంగా మార్చి లేదా ఏప్రిల్‌లో జరిగే రెగ్యులర్ సమావేశంలో ఈ అంశాన్ని చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

హవ్వ.. మద్యం ఆదాయాన్నీ తాకట్టు పెట్టి అప్పు తెస్తారా!

- సంపద సృష్టి అంటే అప్పులు చేయడమా?
- ఇప్పుడు రాష్ట్రం శ్రీలంకగా మారదా.. సింగపూర్ అవుతుందా?
- 18 నెలల్లో రూ.2.66 లక్షల కోట్లు అప్పు చేశారు
- ఆ డబ్బులు ఏం చేశారో చెప్పండి
- ఎలాంటి షరతులు లేకుండా.. ఎస్క్రో అకౌంట్ ద్వారా అప్పులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు
- మరి ఇప్పుడు చేస్తున్నదేమిటి?
- సంక్షేమ పథకాల కోసం అప్పు చేసినట్టు.. సంక్షేమ పథకాల కోసమే ఖర్చు చేసినట్టు ఆధారాలు చూపగలరా?
- సీఎం చంద్రబాబును నిలదీసిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, అమరావతి: మద్యంపై భవిష్యత్‌లో వచ్చే ఆదాయాన్ని సైతం తాకట్టు పెట్టి.. ఏపీబీసీఎల్ ద్వారా చంద్రబాబు ప్రభుత్వం నాన్ కన్వర్టబుల్ బాండ్లు జారీ చేసి రూ.5,750 కోట్లు అప్పు తీసుకురావడంపై రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నిలదీశారు. ఈ మొత్తంపై 9.15 శాతం వడ్డీ చెల్లించేలా తీసుకురావడం సిగ్గు చేటు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుగ్గన రాజేంద్రనాథ్ మీడియాతో మాట్లాడుతూ.. కేబినెట్ అనుమతి లేకుండానే విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథకాలకు నిధుల సమీకరణ కోసం బాండ్లు జారీ చేసినప్పుడు రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రం శ్రీలంకలా మారుతుందని విమర్శించిన వారే ఇప్పుడు అదే పని ఎలా చేస్తారని నిలదీశారు? చంద్రబాబు ప్రభుత్వం ఈ బాండ్లకు షరతులు లేకుండా, మార్చడానికి వీలు లేని గ్యారంటీ ఇవ్వడం.. మద్యం అమ్మకాలపై భవిష్యత్‌లో వచ్చే స్పెషల్ మార్జిన్ ఆదాయాన్ని ఎస్క్రో అకౌంట్ ద్వారా నేరుగా అప్పు తీర్చడానికి మళ్లించాలని నిర్ణయించడంపై మండిపడ్డారు. ఎస్క్రో అకౌంట్ పెద్ద ఫ్రాడ్ అంటూ అసెంబ్లీలో ఊగిపోయిన చంద్రబాబు.. ఇప్పుడు అవే విధానాలు పాటిస్తున్నారంటే తాను ఫ్రాడ్ చేశానని ఒప్పుకుంటున్నారా? అని ప్రశ్నించారు. లేదంటే నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసింది సబబే అని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

18 నెలల్లో రూ.2.66 లక్షల కోట్లు అప్పులా!

'చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల్లో ఏకంగా రూ.2.66 లక్షల కోట్లు అప్పులు చేసింది. అయితే, డిసెంబర్ 15 వచ్చినా ఇంకా అనేక శాఖల్లో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదు. మరి తెస్తున్న అప్పంతా ఏమవుతోంది. వాటికి లెక్కలు చూపండి. వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన నిధుల సేకరణకు నిబంధనల మేరకే బాండ్లు జారీ చేస్తే.. దారుణంగా విషం చిమ్మి రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందంటూ చంద్రబాబు తీవ్ర దుష్ప్రచారం చేశారు. చివరకు కేంద్ర ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేశారు. మరి ఇప్పుడు మీరు చేస్తోంది ఏమిటి బాబూ? ఏపీబీసీఎల్ ద్వారా రూ.3 వేల కోట్లు, గ్రీన్‌షూ ఆప్షన్‌లో మరో రూ.2,750 కోట్లు కలిపి మొత్తం రూ.5,750 కోట్లు 9.15 శాతం వడ్డీకి బాండ్లు జారీ చేసి అప్పు చేస్తున్నారు. అంటే భవిష్యత్‌లో వచ్చే మద్యం ఆదాయాన్ని తాకట్టుపెట్టి ఆ రుణం సేకరిస్తున్నారు. మరో విషయమేమిటంటే.. ఆ రుణానికి ప్రభుత్వం భేషరతుగా మార్చడానికి వీలులేని విధంగా గ్యారంటీ ఇచ్చింది. దానివల్ల భవిష్యత్‌లో ఏ పరిస్థితుల్లోనూ ప్రభుత్వానికి ఏవిధమైన వెసులుబాటు ఉండదు. ఇంకా దారుణమైన అంశం ఏమిటంటే.. మద్యం సరఫరాలో ఏపీబీసీఎల్‌కు వచ్చే ఎక్సైజ్ డ్యూటీ, స్పెషల్ మార్జిన్ ఆదాయాన్ని కూడా ఎస్క్రో అకౌంట్ ద్వారా లింక్ చేస్తున్నారు. అంటే మధ్యలో గ్యారంటీగా ఉన్న ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఆ అకౌంట్ నుంచి నేరుగా రుణం చెల్లింపు జరుగుతుంది. ఆవిధంగా బాబు ప్రభుత్వం ఆ హక్కుని రాసిచ్చింది. గత ప్రభుత్వ హయాంలో రుణాలకు ప్రయత్నించినప్పుడు ఇదే ఎల్లో మీడియా నానాయాగీ చేసింది' అని బుగ్గన మండిపడ్డారు.

సంపద సృష్టి అంటే అప్పు చేయడమా?:

'అప్పట్లో మేం కార్పొరేషన్ల ద్వారా రుణం సేకరిస్తే అది తప్పు. అదే ఇప్పుడు మీరు చేస్తే సంపద సృష్టి. ఇన్నివిధాలుగా అంత అప్పు చేస్తున్న మీరు ఆ నిధులను దేనికి వాడుతున్నారు. ఎక్కడైనా సంక్షేమానికి అప్పులు చేసినట్టు చూపించగలరా. చేసిన అప్పును ఫలానా పథకానికి ఖర్చు చేసినట్టు మీ ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉన్నాయా. మొన్ననే ఏపీఎండీసీ బాండ్ల మీద రూ.9 వేల కోట్ల అప్పు చేసి రూ.150 కోట్లు కమీషన్ ఇవ్వలేదా? అంటే మీ ప్రకారం ఆ కమీషన్‌లో కూడా మీకు కమిషన్ ఉన్నట్టేనా? ఇప్పుడు ఈ బాండ్లకు ఇంచుమించు రూ.200 కోట్లు ఏదో ఇస్తున్నారా లేదా? గతంలో రూ.166 కోట్ల కమిషన్ ఇచ్చారని చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతుంటే.. పవన్‌కళ్యాణ్ ముసిముసి నవ్వులు నవ్వారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెప్పుకునే పవన్ ఇప్పుడు మీ ప్రభుత్వంలో రూ.150 కోట్లు కమీషన్ ఇచ్చారు కదా. మరి దాన్ని ప్రశ్నించరా' అని బుగ్గన నిలదీశారు.

ఈ ప్రశ్నలకు బదులేది?

- 'పంచాయతీరాజ్ శాఖకు కేంద్రం నుంచి రూ.900 కోట్ల నిధులు వస్తే ఇంతవరకు ఎందుకు స్థానిక సంస్థలకు విడుదల చేయలేదు. దీని వల్ల కేంద్రం నుంచి రావాల్సిన మరో రూ.1,000 కోట్లు రాకుండా ఆగిపోయాయి. ఇది నిజమా కాదా?
- ఉచిత ఇసుక ఈ రాష్ట్రంలో ఎక్కడైనా దొరుకుతుందా? కూటమి నాయకులను కాదని వాళ్లకు డబ్బులు ఇవ్వకుండా ఎక్కడైనా ఇసుక వ్యాపారం జరుగుతుందా?
- కూటమి నాయకులకు నెలవారీ మామూళ్లు ఇవ్వకుండా మద్యం వ్యాపారం ఎక్కడైనా జరుగుతోందా?
- జాతీయ రహదారులను కి.మీ.కు రూ.30 కోట్లతో నిర్మిస్తుంటే.. అమరావతిలో 6 లేన్లు, 8 లేన్లు, 10 లేన్లకు కి.మీ.కు రూ.70 కోట్ల వరకు ఎందుకు ఖర్చు చేస్తున్నారు? సీడ్ యాక్సెస్ రోడ్డుకైతే కి.మీ.కు ఏకంగా రూ.180 కోట్ల వరకు ఎలా ఖర్చు చేస్తున్నారు.
- మేం ఎంతో కష్టపడి మెడికల్ కాలేజీలు కడితే వాటిని పీపీపీ మోడల్‌లో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఎందుకు పెడుతున్నారు?
- సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇవ్వాలి. ప్రతి రైతుకి ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలి. మరి ఎందుకు ఇవ్వడం లేదు. గ్యారంటీ సంతకం చేసిన పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదు.
- బాబు వస్తే 50 ఏళ్లు నిండిన ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.4 వేలు ఇస్తామని చెప్పారా లేదా? దానికి మీరు గ్యారింటర్ కదా? మీరు సంతకం పెట్టారు కదా? ఇచ్చారా పవన్?
- మద్యం ఆదాయం ఎవరి జేబుల్లోకి పోతోంది. కనీసం 10 శాతం పెరగాల్సిన మద్యం ఆదాయం ఎందుకు 3 శాతమే పెరిగింది? ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి పోతున్నట్టు?' అని బుగ్గన ప్రశ్నల వర్షం కురిపించారు. కాగ్ నివేదిక ప్రకారం కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉందని, ఈ ఏడాది తొలి 6 నెలల్లో రెవెన్యూ రాబడి దారుణంగా పడిపోయిందని స్పష్టం చేశారు. 2014–19 మధ్య టీడీపీ హయాంలో అప్పు సగటు పెరుగుదల 22.6 శాతంగా ఉంటే.. 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ హయాంలో రెండేళ్లు కోవిడ్ సంక్షోభం ఉన్నప్పటికీ అప్పుల పెరుగుదలను 13.5 శాతానికి తగ్గించామని బుగ్గన గుర్తు చేశారు.

END THE YEAR WITH THE eSUV YOU REALLY WANTED.
Anniversary Benefits* up to ₹3.80 Lakh.
This December only. Limited time. Limited stock.

Anniversary Benefits valid till 27th December 2025 on select Mahindra eSUVs

Jaw-Dropping Benefits*	XEV 9e	BE 6
Special December Benefit	Up to ₹ 1.40 Lakh	Up to ₹ 2.00 Lakh
SUV Care Package	Up to ₹ 1.85 Lakh	-
Corporate Benefit	Up to ₹ 25 000.00	Up to ₹ 20 000.00
Exchange/ Loyalty Benefit	Up to ₹ 30 000.00	Up to ₹ 30 000.00
Total Benefits*	Up to ₹ 3.80 Lakh	Up to ₹ 2.50 Lakh

Contact your nearest Mahindra Dealership today
*Terms & conditions apply. Offer valid for limited time and limited stock only. Benefits may vary basis model or pack (variant) chosen by the customer. For detailed information, please connect with your nearest dealership.
PIONEER AUTO WORLD GUNTUR PVT LTD #149, MANGALAGIRI ROAD, GUNTUR - 522001, PHONE 8885546846,
NEON VJA ANDHRA PRADESH, VIJAYAWADA PHONE: 9063494478, 9063494410.
ELECTRIC ORIGIN SUVs mahindra

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

విదేశాల్లో తేలినీలాపురంలో వాలి

ఖండాలని దాటుకొని.. దారి తప్పకుండా.. ఏటా వచ్చే అతిథులతో... శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామం కళకళలాడుతోంది. ఆస్ట్రేలియా, సైబీరియా, బంగ్లాదేశ్, బర్మా తదితర దేశాల నుంచి ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో ఫెలికాన్, లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటికాకులు), ఓపెన్‌బిల్డ్ స్టార్క్(నత్తగుల్ల కొంగలు), స్పూన్‌బిల్స్(తెడ్డుముక్కు కొంగ), వైట్ ఐబీస్ (తెల్లకంకణాలు) తదితర పక్షులు తేలినీలాపురం గ్రామానికి చేరుకుంటాయి. వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి ఇక్కడ సంతానోత్పత్తి చేస్తాయి. వాటి పిల్లలతో వేసవి పెరిగే సమయంలో అంటే.. ఏప్రిల్‌లో సొంత దేశాలకు తిరుగు పయనమవుతాయి. తేలినీలాపురానికి విదేశీ పక్షులు రాకతో.. పర్యాటకుల సందడి క్రమంగా పెరుగుతోంది. అయితే.. ఈ విడిది కేంద్రంలో సరైన సౌకర్యాలు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

నిర్లక్ష్యానికి చర్యలు తప్పవు

మంత్రి సవిత

సాక్షి, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత.. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్‌లను ఆదేశించారు. మంత్రి ఆదివారం వారితో ఫోన్‌లో మాట్లాడుతూ.. హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపైకి రావడానికి గల కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. 9వ తరగతి విద్యార్థి లక్ష్మీనరసింహ, ఎనిమిదో తరగతి విద్యార్థి భార్గవ్ హాస్టల్ సమీపంలోని బైపాస్ రోడ్డులో అయ్యప్పస్వాముల మండపానికి ప్రసాదం కోసం వంటపాత్రలతో వెళ్లడంతో కారు వారిని ఢీకొట్టిందని చెప్పారు. వంటపాత్రలు ఇచ్చి ప్రసాదం తెమ్మని వారికి చెప్పింది ఎవరని ప్రశ్నించారు. విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

శంషాబాద్‌లోని కన్హా శాంతివనానికి నేడు సీఎం

సాక్షి, అమరావతి: హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్న కన్హా శాంతివనాన్ని ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం సందర్శించనున్నారు. ఉదయం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి బయల్దేరి వెళ్లనున్న సీఎం 11 గంటలకు కన్హా శాంతివనం చేరుకోనున్నారు. ఆశ్రమం అధ్యక్షుడు కమలేష్ డి.పటేల్ దాజీతో సమావేశం కానున్నారు. శాంతివనంలోని వెల్‌నెస్, మెడిటేషన్ సెంటర్ సహా, యోగా కేంద్రాలను సీఎం తిలకించనున్నారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్టిఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను సీఎం సందర్శిస్తారు. అనంతరం శాంతివనం వ్యవస్థాపకులు దాజీ నివాసానికి వెళ్లనున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1,400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. చంద్రబాబు మధ్యాహ్నం తిరిగి అమరావతి చేరుకుని, సచివాలయంలో అధికారులతో వేర్వేరు సమీక్షల్లో పాల్గొంటారు.

వైద్య శాఖను ప్రైవేట్‌పరం చేయాలనుకుంటున్న ప్రభుత్వం

యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు

సాక్షి, అమరావతి: పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్వహణ ద్వారా వైద్య శాఖను ప్రైవేట్‌పరం చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మండిపడ్డారు. వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్వహించేలా ఒత్తిడి తేవాలని యూనియన్‌లకు పిలుపునిచ్చారు. విజయవాడలో ఆదివారం ఎనిమిదో మహాసభలు నిర్వహించారు. సమావేశాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వివిధ కేడర్ల ఉద్యోగులు ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించడంతో పాటు, రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు, ఇకపై ఖాళీలన్నింటినీ శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా కె.జగన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

రేపు వీఆర్‌ఏల మహా ధర్నా

సాక్షి, అమరావతి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళగిరిలోని సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ కార్యాలయం వద్ద మంగళవారం (రేపు) గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏలు) మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ వీఆర్ఏ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) వైస్ చైర్మన్ నల్లిపోగు నాగేశం చెప్పారు. ఈ ధర్నాకు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యను కోరారు. ఆయన ఆదివారం విజయవాడంలో ఈశ్వరయ్యను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

టెక్నాలేజీ

టెక్నాలజీ.. కాస్త టెక్నా'లేజీ' అవుతోంది.. పాశ్చాత్య నాగరికతకనుగుణంగా సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. వయో భేదంలేదు అసలేలేదు.. అరచేతిలో స్వర్గం.. అనర్థాలు అధికమన్న విషయం తెలిసినా సామాజిక మాధ్యమాల్లోనే కాలం గడిపేవారి సంఖ్య పెరిగిపోతోంది.. అతివినియోగంతో జ్ఞాపకశక్తి తగ్గిపోతోంది.. అన్ని వయసుల వారిలోనూ ఆరోగ్య సమస్యలూ పెరిగిపోతున్నాయి.. ఫలితంగా చిన్నారులేకాదు.. 15 నుంచి 32 ఏళ్ల యువత కూడా డేంజర్ జోన్‌లోకి వెళ్లిపోతోంది..

- అతివినియోగంతో తగ్గుతున్న జ్ఞాపకశక్తి
- ప్రజల్లో పెరిగిపోతున్న ఆరోగ్య సమస్యలు
- డేంజర్ జోన్‌లోకి వెళ్తున్న 15 నుంచి 32 ఏళ్ల యువత
- అనర్థాలున్నా.. టెక్నాలజీని వీడని జనం

సాక్షి, పుట్టపర్తి: ప్రపంచీకరణ నేపథ్యంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. గత మూడు దశాబ్దాలతో పోలిస్తే.. టెక్నాలజీ అభివృద్ధి, తద్వారా ప్రజలకు అందిన మేలు ఊహలకు అందదు. చావు కబురు చెప్పాలంటే టెలిగ్రామ్ పంపే రోజుల నుంచి నిమిషాల్లో సమాచారం చేరవేసే సాంకేతిక పరిజ్ఞానం వచ్చింది. బంధువులను పండుగలు, శుభకార్యాల్లో మాత్రమే కలిసి రోజుల నుంచి నిత్యం టచ్‌లో ఉండేలా టెక్నాలజీ అందిపుచ్చుకున్నారు. మధ్య మధ్యలో మంచీచెడులు తెలుసుకోవాలంటే ఉత్తరాలే దిక్కయ్యేవి. ఆ దశ నుంచి కంప్యూటర్, ఇంటర్నెట్ యుగంలోకి వచ్చాం. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో సగటున స్మార్ట్‌ఫోన్ ఉంది. ఇంటింటా స్మార్ట్ టీవీలు ఉన్నాయి. ఇంటర్నెట్ ద్వారా ఇంట్లో నుంచి ప్రపంచాన్ని చూసే అవకాశం లభిస్తోంది. ఏ సమాచారం కావాలన్నా గూగుల్‌లో దొరుకుతోంది. పండుగలు, శుభకార్యాల కోసం మంచి బ్రాండ్ దుస్తులతో సహా ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా కొంటున్నారు. వ్యాపార రంగంలో ఆన్‌లైన్ బిజినెట్ వాటా సుమారు సగం పైగా ఉందని తెలుస్తోంది. అంతేకాకుండా పిల్లల వీడియో గేమ్స్ యాప్స్ రూపంలో మొబైల్స్, టీవీల్లో వస్తున్నాయి. టెక్నాలజీ వినియోగించకుండా రోజు గడవని స్థితి నెలకొంది. ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా.. గూగుల్ మ్యాప్‌లో వెతుక్కుని వెళ్లే స్థితికి వచ్చారు. ఇదంతా పక్కన బెడితే.. మరో కోణంలో టెక్నాలజీని అతిగా వినియోగించి అనారోగ్యం బారిన పడేవారి సంఖ్య కూడా పెరిగిపోతోంది. అలాంటి వారిలో 15 – 35 ఏళ్ల మధ్య వయసు వారే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

శారీరక శ్రమ తగ్గిపోతోంది..

టెక్నాలజీ ప్రభావంతో చదువులో వెనుకబడడం, క్రమశిక్షణ లేకపోవడం, దేనిపైనా దృష్టి సారించలేకపోవడం, ఒకరినొకరు మాట్లాడడం తగ్గిపోవడం, శారీరక శ్రమ తగ్గిపోవడంతో ఊబకాయం సమస్యలు పెరుగుతున్నాయి. నిద్రలేమి వేధిస్తోంది. చిన్న విషయానికి కూడా కోపం తెచ్చుకోవడం వంటి ప్రభావాలు పడుతున్నాయి. ఆఖరుకు చిన్నపిల్లలు కూడా డేంజర్ జోన్‌లోకి వెళ్తున్నారని వైద్యనిపుణులు చెప్తున్నారు.

మారుతున్న సాంకేతికత తెచ్చిన తంటా

పెరిగిపోతున్న ఒత్తిడి..

స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్‌తోనే టెక్నాలజీని విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా చిన్నపిల్లలు, యువతకు ఆరోగ్య సమస్యలు అధికంగా వస్తున్నాయని వైద్యులు చెప్తున్నారు. 40 ఏళ్ల లోపు వయసున్న వారికి టెక్నాలజీ అతి వినియోగం కారణంగా మానసిక, శారీరక సమస్యలు అధికమయ్యాయి. యువత ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో సమయం గడుపుతుండడంతో సాధారణం కంటే ఐదు రెట్లు ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. స్మార్ట్‌ఫోన్ తక్కువగా వాడేవారు పాజిటివ్ ధోరణితో ఉండగా.. అతిగా వినియోగించే వారు నెగిటివ్ ఆలోచనలో ఉంటారని నిపుణులు చెప్తున్నారు. ట్యాబ్‌లు, కంప్యూటర్లపై ఎక్కువగా ఆధారపడేవారు కంటి సమస్యతో బాధపడుతున్నారు. కొంత మందికి తలనొప్పి, భుజం, వెన్ను నొప్పి సమస్యలు వస్తున్నాయి.

- ఒకే ప్రదేశంలో కూర్చొని కంప్యూటర్ చూస్తూ గడిపే వారికి వెన్ను సమస్యలు అధికం అవుతున్నాయి. ఈ నొప్పితో ఇతర విషయాలపై దృష్టి సారించలేకపోతున్నారు. నిత్యం ఉద్యోగ ఒత్తిళ్లతో బిజీలో ఉండటంతో పాటు మధ్య మధ్యలో స్నేహితులతో ముచ్చటించటం.. పలు విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తితో కంప్యూటర్‌తోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు.. ఫలితంగా మూడు పదుల వయసుకే వెన్నెముక బారిన పడుతున్నారు. ఇటీవల పుట్టపర్తిలో 36 ఏళ్ల వ్యక్తి వెన్నెముక నొప్పి బారిన పడడమే నిదర్శనంగా చెప్పవచ్చు.
- స్మార్ట్‌ఫోన్లతో జ్ఞాపకశక్తి కోల్పోతున్నారు. కనీసం కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు కూడా గుర్తుపెట్టుకోలేని పరిస్థితి. గణాంకాల విషయానికొస్తే క్యాలిక్యులేటర్ వాడుతున్నారు. ప్రైమరీ పాఠశాల నుంచి చిన్నారులు స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడటంతో ఏ విషయం గుర్తుంచుకోలేకపోతున్నారు. ఫోన్ లేకుంటే ఏ పనీ చేయలేని స్థితిలోకి వెళ్తున్నారు. ఫలితంగా టీనేజీలోనే జ్ఞాపక శక్తి కోల్పోతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. రెండు నెలల క్రితం హిందూపురంలో 16 ఏళ్ల బాలుడు జాపకశక్తి కోల్పోయి.. మానసికంగా దెబ్బ తిన్నట్లు వైద్యులు నిర్ధారించారు.
- పండుగ వచ్చినా.. ఫంక్షన్ రోజయినా.. ఎలాంటి శుభకార్యం కోసమైనా.. నేరుగా వెళ్లి పిలిచే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. సమీప బంధువులను తప్ప మిగతా అందరినీ టెక్నాలజీ ఆధారంగా ఆహ్వానిస్తున్నారు. శుభవార్త, చేదువార్తలు కూడా సామాజిక మాధ్యమాల ద్వారానే తెలియజేస్తున్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి ఒక్కరూ అర్ధరాత్రి వరకు ఫోన్‌లతోనే గడిపేస్తున్నారు. మెసేజీలు, ఫోన్ కాల్స్, రీల్స్‌కు బానిసలుగా మారారు.

ఆరోగ్యం ప్రధానం

నిద్రపోయే గంట ముందే స్మార్ట్‌ఫోన్ వాడకం, టీవీ చూడటం మానేయాలి. అతి దగ్గరగా కూర్చొని టీవీ, ఫోన్ కూడా చూడరాదు. టెక్నాలజీని అవసరం మేరకే వాడుకోవాలి. లేదంటే సోమరితనం పెరిగిపోతుంది. చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల వాడకం పూర్తిగా తగ్గించాలి. స్మార్ట్‌ఫోన్లలో పిల్లలు ఏం చేస్తున్నారనే విషయం గమనించడం తల్లిదండ్రుల బాధ్యత. లేదంటే పెడదారిలో వెళ్లే అవకాశం అధికంగా ఉంటుంది.

– ఫైరోజాబేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, శ్రీసత్యసాయి జిల్లా

పోర్టును గాలికొదిలేశారు..!

సాక్షి, విశాఖపట్నం : మేజర్ పోర్టులతో పోటీ పడుతూ.. సరకు రవాణాలో దూకుడుగా వెళ్తున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)కి కేంద్ర ప్రభుత్వం బ్రేకులు వేసేసింది. ఒకేసారి ఉన్నతాధికారులను బదిలీ చేసి.. వారి స్థానంలో కొత్తవారిని నియమించకుండా.. పోర్టు కార్యకలాపాలను గాలికొదిలేసింది. ఇదే అదనుగా ఓ మహిళా అధికారి పోర్టులో పెత్తనం చెలాయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్‌చార్జ్ చైర్మన్ కూడా పట్టించుకోకపోవడంతో ఆయా విభాగాధికారులు ఎవరికివారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

ముందుకు కదలని ఫైళ్లు

విశాఖ పోర్టు అనాథగా మారిపోయింది. అధికారులంతా బదిలీ అవ్వడంతో కార్యకలాపాలు, ఇతర వ్యవహారాలు అస్తవ్యస్తమైపోయాయి. పోర్టు చైర్మన్ డా.అంగముత్తుని ముంబై పోర్టు చైర్మన్‌గా బదిలీ చేయడంతో పాటు వీపీఏ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. అయినా.. చైర్మన్ మాత్రం ముంబైకే పరిమితమయ్యారు. నెలలో ఒకట్రెండు సార్లు మాత్రమే పోర్టుకు వస్తూ.. తూతూ మంత్రంగా సమీక్షలు నిర్వహించి వదిలేస్తున్నారు. దీంతో పాలన గాడి తప్పింది. ఇక డిప్యూటీ చైర్మన్‌గా దుర్గేష్ కుమార్ దూబే పదవీ కాలం ఇంకో రెండు నెలలు ఉన్నా.. ఇటీవలే బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. పోర్టు చరిత్రకు భిన్నంగా డిప్యూటీ చైర్మన్ పదవీకాలం ఉన్నప్పటికీ బదిలీ చేసేశారు. రిలీవ్ అయ్యేందుకు ఈ నెల 19వ తేదీ వరకూ సమయం ఉన్నా బదిలీ విషయంలో జరిగిన అన్యాయంతో పోర్టు వ్యవహారాల్ని పట్టించుకోవడం మానేశారు. అదేవిధంగా ఏళ్ల తరబడి సెక్రటరీగా వ్యవహరించిన వేణుగోపాల్‌ని పారాదీప్ పోర్టుకు డిప్యూటీ చైర్మన్‌గా బదిలీ చేశారు. పరిపాలన వ్యవహారాల ఫైళ్లు ముందుకు కదిపే ఉన్నతాధికారులు లేకపోవడంతో పోర్టులో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిపోయింది.

అంతా ఆమె కనుసన్నల్లోనే..!

ట్రాఫిక్ విభాగంలో ఉన్నతాధికారి అనారోగ్యం కారణంగా అంతంత మాత్రంగానే విధుల నిర్వహణలో భాగస్వామ్యమవుతున్నారు. దీంతో ఈ విభాగంలో కార్యకలాపాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. కేవలం షిప్స్ బెర్తింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ వ్యవహారాలు కిందిస్థాయి సిబ్బంది ద్వారా మేనేజ్ చేస్తున్నారు. ఇలా పోర్టులో ప్రతి విభాగాన్ని నడిపించే నాయకత్వం లేకపోవడంతో వ్యవహారాలు సరిగా జరడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఉన్నతాధికారులెవ్వరూ లేకపోవడంతో ఓ మహిళా అధికారి.. అంతా తానై పోర్టులో చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమెపై గతంలో సీబీఐ దాడులు జరిగాయి. తర్వాత విధుల్లో చేరిన సదరు మహిళా అధికారి ఇప్పుడు పోర్టులో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారంటూ విమర్శలొస్తున్నాయి. పోర్టులో అన్ని విభాగాల్లోనూ ఆమె తలదూర్చి.. ఉద్యోగుల్ని ఇబ్బంది పెడుతున్నారంటూ పోర్టు వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. వీలైనంత త్వరగా విభాగాధిపతులను నియమించి పోర్టును తిరిగి గాడిలో పెట్టాలంటూ ఉద్యోగులు కోరుతున్నారు.

ఏపీకి జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు

సాక్షి, అమరావతి: ఇంధన పరిరక్షణ, సామర్థ్యంలో రాష్ట్రానికి జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు–2025 దక్కింది. ఆదివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. రాష్ట్రం తరఫున ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎల్.శివ శంకర్ అవార్డు అందుకున్నారు. స్టేట్ డిసిగ్నేటెడ్ ఏజెన్సీ (ఎస్డీఏ) విభాగం గ్రూప్–2లో ఏపీ మొదటి బహుమతి సాధించినందున ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఏపీఎస్ఈసీఎం సీఈఓ ఎస్.నాగలక్ష్మి తెలిపారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి జాతీయ ఇంధన సంరక్షణ అవార్డును అందుకుంటున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎల్.శివ శంకర్

దళారుల దందా పట్టని మంత్రి సారథి

- ప్రతి ధాన్యపు గింజా కొంటామంటూ ముక్తాయింపు

తోట్లవల్లూరు (పామర్రు): ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం దళారులు, మిల్లర్ల దందా స్వయంగా తన సమక్షంలో బయటపడినా.. దానిని కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మళ్లీ ప్రయత్నించారు. రైతుల ప్రయోజనాలు కాపాడటానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నిర్దిష్టంగా వెల్లడించని మంత్రిం.. రైతులకు అన్యాయం జరగకుండా ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తాజాగా ముక్తాయింపు ఇచ్చారు. కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో ఆదివారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే శనివారం అధికారులతో కఠినంగా మాట్లాడానని చెప్పుకొచ్చారు. ధాన్యం అమ్మిన రైతులకు అణా పైసలతోసహా ధర చెల్లించాలనేది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ''మంత్రి సాక్షిగా ధాన్యం కొను'గోల్‌మాల్' బట్టబయలు'' అనే శీర్షికన ఆదివారం సాక్షి పత్రికలో వార్త ప్రచురితమైన నేపథ్యంలో మంత్రి ఈ అంశంపై మాట్లాడడం గమనార్హం. మంత్రి స్వగ్రామం మొవ్వ మండలం కారకంపాడు సరిహద్దుల్లోనే ఒక్కో బస్తాకు రూ.200కుపైగా దళారులు దోచేస్తుంటే రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించవచ్చునని రైతులు పేర్కొంటున్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి'పై అక్కసు వెళ్లగక్కే బదులు, క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అవినీతి దందాను అరికట్టి, తమకు న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

సాక్షి ప్లస్
ట్రావెల్
సోమవారం ॥ 15-12-2025

పర్యాటక ప్రదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ నేలంతా పరుచుకున్న పచ్చదనం చూసి ముగ్ధులవుతుంటాం.
కానీ, ఈ సీజన్‌లో ప్రత్యేకంగా నేలంతా గులాబీ రంగు పరుచుకున్నట్టుగా.. అలల్లా ఎగిసిపడుతున్న ఆ అందం చూడాలంటే మన దేశంలోనే కొన్ని ముఖ్యమైన ప్రదేశాలున్నాయి.
వీకెండ్‌లో ఈ పింక్ సీజన్.. మీలో ఫుల్ స్వింగ్‌ను ఇట్టే తెచ్చేస్తుంది. అతిథులుగా విచ్చేసి, సందడి చేస్తున్న పింక్ ఫ్లెమింగోలు బారులు బారులుగా తేరు కట్టి, తీరుగా మనల్ని అలరిస్తున్నాయి.
ఆ అందాల ఆనందాన్ని తిలకించడానికి ముందుగా ముంబై మీదుగా ప్రయాణిద్దాం...

పర్యాటకం : ఫ్లెమింగో

పింక్ సీజన్... ఫుల్ స్వింగ్

భారతదేశంలో అధికారికంగా ఫ్లెమింగో సీజన్ వచ్చేసింది. పిలవకుండా వచ్చే ఈ శీతాకాలపు అతిథులు ముంబైతో పాటు నవీ ముంబైలలోని కొన్ని బెస్ట్ సైట్ సీయింగ్ ఫ్లెమింగో ప్రదేశాలు ఉన్నాయి.

పొడవాటి కాళ్ళు, వంగిన మెడలు, విలక్షణమైన కిందికి వంగిన ముక్కులతో సొగసైన ఈ నీటి పక్షులు.. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న చిత్తడి నేలలను గులాబీ రంగుతో చిత్రించడం ప్రారంభించాయి. ప్రతి యేటా అక్టోబర్ చివరి నుండి మే మొదటి వారం వరకు ఫ్లెమింగోలు భారతదేశానికి వలస వస్తుంటాయి. ఫిబ్రవరి నుండి మార్చి వరకు వీటి సంఖ్య గరిష్టస్థాయిలో ఉంటుంది. ఈ సంవత్సరం వర్షాకాలం సీజన్ కొంచెం పెరగడంతో ఈ పక్షుల రాకలో కొంచెం ఆలస్యం జరిగిందని పక్షి పరిశీలకులు గమనించారు. ఇప్పుడు, ఈ అద్భుతమైన పక్షుల మొదటి గుంపు ముంబై, నవీ ముంబై అంతటా ఐకానిక్ ప్రదేశాలలో వచ్చి చేరాయి. దీంతో వీక్షకుల ఉత్సాహం మిన్నంటుతోంది.

మహారాష్ట్రలో ఫ్లెమింగోలకు ఆవాసం ఇచ్చే 8 ఉత్తమ ప్రదేశాలు

థానే క్రీక్ ఫ్లెమింగో అభయారణ్యం

పక్షి ప్రేమికులకు ఈ ప్రాంతం స్వర్గధామమే. ఈ అభయారణ్యం ఐరోలి, వాషి మధ్య విస్తరించింది. ఉల్హాస్ నది సల్సెట్ ద్వీపం ఈశాన్య మూలలో రెండు ఉప నదులుగా విడిపోతుంది. మరొకటి వాసాయి క్రీక్. ఈ రెండూ అరేబియా సముద్రంలోకి ప్రవహిస్తాయి. క్రీక్ సాల్సెట్ ద్వీపం తూర్పు సరిహద్దును ఏర్పరచడం, కొంకణ్ ప్రధాన భూభాగం నుండి ద్వీపాన్ని వేరు చేస్తుంది. దీనినే థానే క్రీక్ అంటారు. ఈ ప్రాంతం వివిధ ఏవియన్ జాతులకు నిలయంగా ఉండటంతో బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ ద్వారా ముఖ్యమైన పక్షి ప్రాంతంగా గుర్తించబడింది. ముఖ్యంగా ఇది ఫ్లెమింగోలు, అనేక ఇతర వలస, నీటి పక్షుల జనాభాకు నిలయంగా ఉంది. ఫ్లెమింగోలను దగ్గరి నుంచి వీక్షించడానికి కోస్టల్ – మెరైన్ బయోడైవర్సిటీ సెంటర్ నుండి ప్రసిద్ధ బోట్ సఫారీ ఉంది.

సేవిరి మడ్ ఫ్లాట్స్

ముంబై నడిబొడ్డున ఉన్న ఈ పోషకాలతో కూడిన బురద ఫ్లాట్‌లు వేలాది ఫ్లెమింగోలను ఆకర్షిస్తాయి. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ ఇక్కడ గైడెడ్ వాక్‌లు మరియు ఫ్లెమింగో–వాచింగ్ ఈవెంట్‌లను నిర్వహిస్తుంది.

భండప్ పంపింగ్ స్టేషన్

తూర్పు ఎక్స్‌ప్రెస్ హైవేకి దూరంగా ఉన్న ఈ క్రీక్‌సైడ్ స్పాట్ పక్షులను చూసేవారికి, ముఖ్యంగా సూర్యోదయ– సూర్యాస్తమయ సమయంలో చాలా ఇష్టమైనది. ఈ ప్రాంతం మడ అడవులతో ఆకర్షణీయంగా ఉంటుంది. వివిధ రకాల నీటి బాతులు, వలస పక్షులను ఆకర్షిస్తుంది.

డీపీఎస్ ఫ్లెమింగో సరస్సు

ఇప్పుడు నవీ ముంబైలోని నెరుల్ ప్రాంతంలో ఒక పరిరక్షణ అభయారణ్యం, ఈ సరస్సు సూర్యోదయం– సూర్యాస్తమయ సమయాలలో అద్భుతమైన దృశ్యాలను అందిస్తుంది. ఇది ఫోటోగ్రాఫర్ల కంటికి కళల దృశ్యమై కనువిందు చేస్తుంది. ఇది నగరంలో ప్రశాంతమైన ప్రదేశం, ప్రకృతి నడకలు, పక్షుల ఫోటోగ్రఫీకి అనువైనది.

కరావే ఫ్లెమింగో పాయింట్

నవీ ముంబైలోని సీవుడ్స్‌లో టీఎస్ చాణక్య సమీపంలో, సుందరమైన వెట్‌ల్యాండ్స్‌లో నడుస్తూ ఫ్లెమింగోలను చూడొచ్చు. ప్రశాంతమైన పరిసరాలు, కుటుంబంతో కలిసి చేసే విహారయాత్రలు, పర్యావరణ పర్యాటకానికి గొప్ప ప్రదేశంగా మారాయి. ఫ్లెమింగో గుంపులను దగ్గర నుంచి చూసేందుకు సీజనల్ బోట్ రైడ్‌లు అందుబాటులో ఉంటాయి.

భిగ్వాన్‌లోని ఉజాని ఆనకట్ట బ్యాక్ వాటర్స్

తరచుగా మహారాష్ట్ర భరత్‌పూర్ అని పిలువబడే భిగ్వాన్ పక్షి ప్రేమికులకు అంతగా తెలియని రత్నం. పూణే సమీపంలోని యశ్వంత్ సాగర్ జలాశయం ఫోటోగ్రాఫర్‌లకు మరొక హాట్‌స్పాట్.

కర్నాల పక్షుల అభయారణ్యం



ముంబైకి సమీపంలో ఉన్న ఈ అభయారణ్యం ట్రెక్కింగ్ ట్రైల్స్, ఇతర వలస జాతులతో పాటు ఫ్లెమింగోలను వీక్షించడానికి వీలు కల్పిస్తుంది. ఇది చారిత్రాత్మక కర్నాల కోటకు నిలయం. అంతేకాదు, పక్షులను చూడటానికి గొప్ప ప్రదేశం.

నందూర్ మధమేశ్వర్ పక్షుల అభయారణ్యం :

నాసిక్‌లోని ఒక ముఖ్యమైన చిత్తడి నేల ఇది. ప్రకృతి ప్రేమికులకు, ఫొటోగ్రాఫర్లకు అనువైనది. ఈ అభయారణ్యం రామ్‌సర్ ప్రదేశంగా గుర్తించబడింది, శీతాకాలంలో వేలాది వలస పక్షులను ఈ

ప్రాంతం ఆకర్షిస్తుంది. ప్రకృతితో తిరిగి కనెక్ట్ అవ్వాలనుకునే వారికి కోయ్నా వన్యప్రాణుల అభయారణ్యం, సంజయ్ గాంధీ నేషనల్ పార్క్‌తో పాటు మహారాష్ట్ర నేచర్ పార్క్‌లను కూడా సందర్శించవచ్చు.

ఫ్లెమింగోలను చూడటం అనేది కేవలం దృశ్యాలను వీక్షించే కార్యక్రమం కాదు. వేగవంతమైన ప్రపంచంలో నిశ్శబ్దంగా ఉండే అందమైన, ఆహ్లాదకరమైన దృశ్యాలను మనసులో ముద్రించుకోవచ్చు. నిశ్శబ్దంలో నీటి అలలు, తెల్లవారుజామున ఆకాశంలో మెత్తటి రెక్కల శబ్దంలో నవీ ముంబై విలువైన అరుదైన సహజ విహారయాత్రను అందిస్తుంది.

సూర్యోదయం-సూర్యాస్తమయాలు అత్యుత్తమం...

ఉదయం 7 నుండి 9 గంటల మధ్య లేదా మధ్యాహ్నం 4 నుండి 6 గంటల మధ్య, పక్షులు చురుకుగా ఆహారం తీసుకుంటున్నప్పుడు ఈ ప్రదేశాలు చాలా అందంగా ఉంటాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ విహరించవచ్చు. ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి రూ.50, గైడెడ్ బోట్ సఫారీ ఒక్కొక్కరికి రూ.500..

పడవ ప్రయాణానికి..

ఈ ప్రదేశాలలో స్థానిక మత్స్యకారులు నేచర్ లవర్స్‌కి సూర్యోదయ పడవ ప్రయాణాలను అందిస్తారు. పక్షులకు దాణా వేయడం, వాటిని అందుకోవడానికి పెద్ద సంఖ్యలో ఫ్లెమింగోలు ఎగరడం.. ఆహ్లాదంగా అనిపించే ఉదయాలే దీనికి ఉత్తమ సమయం. అభయారణ్యం వెలుపల పడవ ప్రయాణాలు సాధారణంగా ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతాయి. ఈ పడవ ప్రయాణానికి సీజన్, వ్యక్తుల సమయాన్ని బట్టి వ్యక్తికి రూ.900 – రూ.1,500 మధ్య ఖర్చవుతాయి.

ఇలా చేరుకోవచ్చు...

హైదరాబాద్ ప్రయాణికులు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ముంబైకి రెండు గంటల విమాన ప్రయాణం ద్వారా చేరుకోవచ్చు. తరువాత రైలు లేదా టాక్సీ ప్రయాణం ద్వారా నవీ ముంబైకి వెళ్లొచ్చు. వాషి, నెరుల్, సీవుడ్స్‌లో వసతి సదుపాయం లభిస్తుంది.

మన దేశానికి అరుదెంచే వలస పక్షుల సమయాలు...

పింక్ ఫ్లెమింగోలు శీతాకాలంలో దాదాపు నవంబర్ నుండి మే వరకు భారతదేశానికి వస్తాయి. జనవరి నుండి మార్చి వరకు విస్తృతంగా సందడి చేస్తాయి. ఫ్లెమింగో సీజన్ మాత్రం నవంబర్ నుండి మే వరకు కొనసాగుతుంది. కాకపోతే వాటి సంఖ్య తగ్గుతూ ఉంటుంది. ఈ సీజన్‌లో నివాసి లెస్సర్ ఫ్లెమింగోలు, వలస వచ్చిన గ్రేటర్ ఫ్లెమింగోలు రెండూ కనిపిస్తాయి.

ట్రావెల్ ట్రెండ్స్

జెన్ ఏఐ వోవర్ అడ్మిన్

రాబోయే కాలంలో ప్రయాణాలకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వాడకం పెరగబోతోంది. ప్రయాణికులు ఇప్పటికే ట్రావెల్ ప్లాన్, బుకింగ్‌ల కోసం జనరేటివ్ ఏఐని ఉపయోగిస్తున్నారు. ప్రయాణాలకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వడానికి చాట్‌జీపీటీ కూడా రంగంలోకి దిగడంతో ప్రయాణాలను ప్లాన్ చేసుకోవడం గతంలో కంటే చాలా సులువు అయింది. ప్రయాణాలకు సంబంధించి ఏఐ సాంకేతికతను వాడుకోవడానికి సంబంధించి మంచితో పాటు చెడు కూడా ఉంది అని చెబుతున్నారు నిపుణులు. ఆల్గోరిథమిక్ సిఫారసులు వోవర్ టూరిజానికి కారణం అవుతాయని, ఉద్దేశపూర్వకంగా కొన్ని ప్రాంతాలను మాత్రమే ప్రయాణానికి సూచిస్తాయని, ట్రావెల్ స్కామ్స్ జరగడానికి కూడా అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ‘ప్రయాణాల కోసం ఏఐ సాధనాలను వాడుకోవడానికి సంబంధించి ఎన్నో పరిమితులు ఉన్నాయి’ అంటుంది కల్చరల్ ట్రెండ్స్ స్పెషలిస్ట్ జాస్మిన్ బినా.

ఇతర రాష్ట్రాలలోనూ...

మహారాష్ట్రలోని చిత్తడి నేలలు, సరస్సులతో పాటు గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్, ఒడిశాలోని చిలికా సరస్సు వంటి తీరప్రాంతాలలో ఫ్లెమింగోలు అద్భుతమైన అందాలలో కనువిందు చేస్తాయి. మహారాష్ట్రలో భిగ్వాన్ ‘దక్షిణ భారత్‌పూర్‘ అని పిలుస్తారు, ఉజాని ఆనకట్ట బ్యాక్ వాటర్ ఫ్లెమింగో గుంపుకు ప్రసిద్ధి చెందింది.

గుజరాత్‌లో...

అతిపెద్ద లెస్సర్ ఫ్లెమింగో బ్రీడింగ్ గ్రౌండ్ (ఫ్లెమింగో సిటీ) కు నిలయం. నల్ సరోవర్, థాల్ లేక్ పక్షుల కేంద్రం, ఖిజాదియా పక్షుల అభయారణ్యంలో శీతాకాలంలో ఫ్లెమింగోలు పుష్కలంగా కనువిందు చేస్తాయి.

చేరుకోవడానికి ప్రయాణ మార్గం...

విమానంలో... హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఎయిర్ పోర్ట్ నుంచి అహ్మదాబాద్ లేదా జామ్ నగర్‌కు చేరుకోవచ్చు. అహ్మదాబాద్ నుంచి నల్ సరోవర్, థాల్ ప్రాంతాలకు కారు లేదా లోకల్ ట్రైన్‌లో చేరుకోవచ్చు. కచ్‌కు విమానంలో లేదా రోడ్డు, రైలు మార్గం ద్వారా చేరుకొని తర్వాత రాన్‌కు ప్రయాణించవచ్చు.

రాజస్థాన్

సాంబార్ సరస్సు ఫ్లెమింగోలకు శీతాకాలపు విడిది ప్రదేశం. హైదరాబాద్ నుండి 1100 కిలోమీటర్ల దూరంలో ఉంది సాంబార్ లేక్. విమానం /రైలు మార్గాల్లో వయా జైపూర్‌కు చేరుకొని వెళ్లాలి. రైలు మార్గంలో నాగ్‌పూర్, ఫులేరాకు చేరుకోవచ్చు.

ఒడిశా

భారతదేశంలోని అతిపెద్ద తీరప్రాంత సరస్సు అయిన చిలికా సరస్సు వేలాది మందిని ఆకర్షిస్తుంది. హైదరాబాద్ నుంచి చిలికా సరస్సు రోడ్డు మార్గంలో దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఫ్లైట్/ ట్రెయిన్/ బస్ మార్గాల ద్వారా విశాఖపట్నం, భువనేశ్వర్ మీదుగా చేరుకోవచ్చు. భువనేశ్వర్‌కి విమానంలో వెళ్లి అక్కణ్ణుంచి టాక్సీ లేదా ట్రెయిన్ ద్వారా సరస్సుకు చేరుకోవచ్చు.

- నిర్మలారెడ్డి, సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి

నాస్టాల్జియ

వన్స్ అపాన్ ఏ టైమ్... వండర్‌ఫుల్ పోస్టర్స్

ఇప్పుడంటే...

ఆధునికం అని ఏమిటి, అత్యాధునికమైన కెమెరాలు ఉన్నాయి.

ఫొటోషాప్‌లు ఉన్నాయి. ఎన్నో ఎన్నెన్నో ఎడిటింగ్ టూల్స్ ఉన్నాయి.

కానీ...వన్స్ అపాన్ ఏ టైమ్ పెద్దగా ఏమీ లేవు.

అయినా...ఎన్నో పరిమితులు ఉన్నా, ట్రావెలింగ్‌కు సంబంధించిన పోస్టర్‌లను అద్భుతంగా డిజైన్ చేసేవారు ఆర్టిస్టులు.

‘అవి ఆ కాలానికి మాత్రమే’ అనుకోవడానికి లేదు. కాలాతీతమైనవి.

అందుకే అలనాటి ట్రావెలింగ్‌కు సంబంధించిన అద్భుత పోస్టర్‌ల ఎగ్జిబిషన్ గురుగ్రామ్‌లోని ‘హెరిటేజ్ ట్రాన్స్‌పోర్ట్ మ్యూజియం’లో జరుగుతోంది...

1920లలో...

మన దేశంలోని రైల్వే బోర్డు తమ ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలి అనేదాని గురించి ఆలోచించింది. ఆదాయం పెరగాలంటే ప్రయాణికుల సంఖ్య పెరగాలి. ప్రయాణికుల సంఖ్య పెరగాలంటే ఆకర్షణీయమైన ప్రకటనలు రూపొందించాలి అని నిర్ణయించుకుంది.



అలా మొదలైంది...

దేశంలోని ప్రధాన పర్యాటక ప్రదేశాల గురించి ప్రచారం చేయడానికి దేశీయ, అంతర్జాతీయ చిత్రకారులతో పోస్టర్లు, ఇతరత్రా విజువల్స్ రూపొందించారు. ఇవి రైల్వే స్టేషన్ గోడలపై, ఓడరేవులు, వ్యాపారకేంద్రాలు, మార్కెట్‌లు, పోస్టాఫీసుల దగ్గర కనిపించేవి.

విదేశీ పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని ఆసక్తి కలిగించేలా డిజైన్ చేసిన పోస్టర్లు కూడా ఇందులో ఉన్నాయి. ఈ పోస్టర్‌లలో అత్యంత పాత పోస్టర్... 1914కు చెందిన కనర్డ్ లైన్ అడ్వర్‌టైజ్‌మెంట్. అద్భుతమైన లేఔట్‌తో ఈ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ పోస్టర్‌లపై ‘విజిట్ ఇండియా’ ‘సీ ఇండియా’ అంటూ పెద్ద పెద్ద అక్షరాలు కనిపిస్తాయి. ఆరోజుల్లో రైల్వే యాడ్స్‌ను రూపొందించడం అనేది ఖరీదైన వ్యవహారంలా ఉండేది. ఆ ఖరీదుకు తగ్గట్టే పోస్టర్లు ఆకర్షణీయంగా కనిపించేవి.

ఎయిర్ ఇండియా... మహారాజా మస్కట్

ఇక విమానాల విషయానికి వస్తే... ‘ఎయిర్ ఇండియా’ పోస్టర్లు ‘మహారాజ మస్కట్’ తో ఆకట్టుకునేవి.

‘ఎయిర్ ఇండియా–రోమ్ పోస్టర్’ ‘ఎయిర్ ఇండియా–యూరప్ పోస్టర్’....ఇలా రకరకాల పోస్టర్లు డిజైన్ చేసేవారు. అలనాటి న్యూ బోయింగ్ 747ను ప్రమోట్ చేయడానికి కూడా ఎయిర్ ఇండియా పోస్టర్లు రూపొందించింది.

కళాత్మక విలువలు

నవీన సాంకేతికతతో ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కడానికి ముందే పదిమందిని ఆట్టుకునేలా ఈ పోస్టర్‌లను రూపొందించడం విశేషం. గ్రాఫిక్ ఆర్టిస్టుల లితోగ్రాఫిక్ ప్రింట్స్ ఎక్కువగా ఉండేవి. గౌరీ శంకర్, పి.సమ్దార్, కుషల్ ముఖర్జీ, శోభాసింగ్, బి.సన్యాల్‌లాంటి చిత్రకారులు ఎక్కువగా పోస్టర్లు డిజైన్ చేసేవారు.

‘మొక్కుబడిగా డిజైన్ చేసినట్లు కాకుండా కళాత్మక విలువలు ఉట్టిపడేలా ఆనాటి ట్రావెల్ పోస్టర్లు కనిపిస్తాయి’ అంటారు విశ్లేషకులు.

ఆ కాలానికి స్వాగతం

అలనాటి అద్భుత విజువల్స్ ఈతరానికి పరిచయం చేయడానికి గురుగ్రామ్‌లోని హెరిటేజ్ ట్రాన్స్‌పోర్ట్ మ్యూజియం నడుం కట్టింది. 1930 నుంచి 1970 మధ్యలో రూపొందించిన ట్రావెల్ పబ్లిసిటీ పోస్టర్‌లను హెరిటేజ్ ట్రాన్స్‌పోర్ట్ మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారు. ‘పోస్టర్స్ దట్ మూవ్డ్ ఇండియా: టూరిజం, ట్రావెల్ అండ్ ట్రాన్స్‌పోర్ట్’ పేరుతో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్ ఫిబ్రవరి 2026 వరకు కొనసాగుతుంది.

షార్ట్ కట్

ఆ దేశంలో న్యాప్ కేఫ్‌లు ఉంటాయి!

- దక్షిణ కొరియాలో ‘న్యాప్ కేఫ్’ల పేరుతో కేఫ్‌లు ఉంటాయి. పగటి పూట పవర్ న్యాప్ తీసుకోవాలనుకునేవారు వీటికి వెళుతుంటారు.
- బొలీవియాలో ‘పలాసియో డి సాల్’ పేరుతో పూర్తిగా ఉప్పు దిమ్మలతో నిర్మించిన హోటల్ ఉంది.
- సిక్కింలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో టిబెటన్ నూతన సంవత్సర లోసర్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. ఈ వేడుకలను చూడడం అద్భుతమైన అనుభవం.
- ఫిబ్రవరి మాసంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో ఆరు రోజుల పాటు క్రీడలు, సాంస్కతిక ఉత్సవాలు ‘తవాంగ్స్ టైడ్స్ ఇంటర్నేషనల్’ పేరుతో ఘనంగా జరుగుతాయి. దేశ,విదేశాలకు చెందిన ఆటగాళ్లు, కళాకారులు ఈ క్రీడా,కళా ఉత్సవాలలో పాల్గొంటారు. తవాంగ్స్ నది ఒడ్డున రాత్రులు ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలతో అందంగా వెలిగిపోతాయి. క్రీడా ప్రతిభను గుర్తించడం, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.
- పేరులో ‘గ్రీన్’ మాట ఉన్నప్పటికీ....‘గీన్‌ల్యాండ్’తో పోల్చితే ‘ఐస్‌ల్యాండ్’లోనే పచ్చదనం ఎక్కువ.

సచిన్... సచిన్... మెస్సీ... మెస్సీ

ముంబైని మురిపించిన దిగ్గజాల భేటీ

వాంఖెడేలో అర్జెంటీనా స్టార్ సందడి • నేడు ఢిల్లీకి

ముంబై: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ తన 'గోట్ టూర్'లో భాగంగా రెండో రోజు ముంబైని మురిపించాడు. భారత మాస్టర్ సచిన్ టెండూల్కర్‌తో కలిసి వాంఖెడేలో సందడి చేశాడు. మామూలుగా అయితే ఈ మైదానంలో టెండూల్కర్ ఉంటే 'సచిన్... సచిన్...' అనే గోలే వినిపించేది. కానీ ఆదివారం స్వరం మారింది. యువ తరం, నవతరం అంతా కలిసి తమ ఆరాధ్య క్రికెటర్‌తో పాటు అభిమాన ఫుట్‌బాలర్ పేరునూ మార్మోగించారు. దీంతో వాంఖెడే స్టేడియం 'సచిన్... సచిన్... మెస్సీ... మెస్సీ...' నామ స్మరణతో మార్మోగిపోయింది. సచిన్, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, భారత ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రితో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, బాలీవుడ్ స్టార్స్ అజయ్ దేవ్‌గణ్, టైగర్ ష్రాఫ్, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్, పలువురు సెలబ్రిటీలతో స్టేడియమంతా తారతోరణం దిద్దుకుంది.

వాంఖెడే పుటల్లో ఈ పూట

క్రీడా ప్రపంచంలోనే అలుపెరగని దిగ్గజాలు ప్రత్యక్షంగా మైదానాన్ని, పరోక్షంగా యావత్ భారత్‌ను అలరించారు. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లోని క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ తన పురిటి గడ్డపై జగద్విఖ్యాత ఫుట్‌బాలర్ లయోనల్ మెస్సీతో కలిసి సందడి చేశాడు. వాంఖెడే స్టేడియంలో దిగ్గజాల భేటీతో సరికొత్త అధ్యాయం ప్రారంభించినట్లయ్యింది. పోటెత్తిన అభిమానులతో కిక్కిరిసిపోయిన స్టేడియంలో వీరిద్దరే కేంద్ర బిందువులయ్యారు. భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రి, రాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సహా పుర ప్రముఖులు ఎందరున్నా... వేల కళ్లు సచిన్–మెస్సీల నుంచి చూపును తిప్పుకోలేకపోయాయి. ముఖ్యంగా భారత క్రికెట్ అభిమానులు తమ ఆరాధ్య దిగ్గజం సచిన్‌ను విఖ్యాత ఫుట్‌బాలర్‌తో కన్నుల పండుగగా చూసుకున్నారు. ఈ సందర్భంగా మహా సీఎం ఫడ్నవీస్ రాష్ట్రంలో యువ ఫుట్‌బాలర్ల ప్రతిభను సానబెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ప్రాజెక్ట్ మహాదేవ' పేరిట ఫుట్‌బాల్ ప్రతిభావంతుల్ని తయారు చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు.

అపురూపం... పరస్పర బహుమానం

అర్జెంటీనా స్టార్‌కు టెండూల్కర్ తను స్వయంగా ఆటోగ్రాఫ్ చేసిన వన్డే జెర్సీని మెస్సీకి అందివ్వగా... ప్రతిగా మెస్సీ కూడా తన సంతకంతో కూడిన ఫుట్‌బాల్‌ను సచిన్‌కు ఇచ్చాడు. అన్నట్లు ఆటలు వేరైనా... దేశాలు వేరైనా... సచిన్ జెర్సీ నంబర్, మెస్సీ జెర్సీ నంబర్ ఒక్కటే 10! అదేనండీ 'దస్‌కా దమ్''! దిగ్గజాలు పరస్పర బహుమతులు ఇస్తూ స్వీకరిస్తుంటే అభిమానులంతా ఉప్పొంగిపోయారు. ఈ అపు'రూపం'ను తమ ఫోన్ కెమెరాల్లో పదిలంగా బంధీచేసుకున్నారంతా!

నేడు ప్రధాని మోదీతో మెస్సీ భేటీ...

'గోట్ టూర్'లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈరోజు మర్యాదపూర్వకంగా కలువనున్నాడు. మూడు రోజుల 'గోట్ టూర్' నేడు ఢిల్లీలో ముగియనుంది. ముంబై నుంచి సోమవారం ఉదయం 10 గంటల తర్వాత మెస్సీ ఢిల్లీ చేరుకుంటాడు. నగరంలోని క్రీడాభిమానులతో 'మీట్ అండ్ గ్రీట్' ముగించుకొన్న తర్వాత మెస్సీ... ప్రధాని మోదీతో భేటీ అవుతాడు. ప్రధాని నివాసంలో దాదాపు 20 నిమిషాల పాటు వీరిద్దరి మధ్య జరిగే మాటామంతీలో సాకర్ సూపర్ స్టార్ ఫుట్‌బాల్ ముచ్చట్లు పంచుకోనున్నాడు. ఆ తర్వాత భారత సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చీఫ్ రాహుల్ నవీన్, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, ఎంపీ ప్రఫుల్ పటేల్‌తో కూడా మెస్సీ భేటీ అవుతారని నిర్వాహకులు వెల్లడించారు. ఇలా పలువురు వీవీఐపీలను కలిసిన తర్వాత మెస్సీ మధ్యాహ్నం 3.30 గంటలకు అరుణ్ జైట్లీ స్టేడియానికి చేరుకుంటాడు. అక్కడ తన అభిమానుల్ని అలరించిన అనంతరం స్వదేశానికి పయనమవుతాడని నిర్వాహకులు వెల్లడించారు.

నాకు ఇక్కడ (వాంఖెడే) మరుపేలేని మధుర జ్ఞాపకాలెన్నో ఉన్నాయి. అందుకే మన ముంబై ఒక కలల నగరి. ఈ వేదికపై ఎంతో మంది స్వప్నాలు సాకారమయ్యాయి. 2011 నాకు బాగా గుర్తు. నా కల (వన్డే వరల్డ్‌కప్) కూడా ఇక్కడే నిజమైంది. ముఖ్యంగా మీ (అభిమానులు) మద్దతే లేకపోతే ఆ స్వర్ణానుభూతిని నేనైతే ఎప్పటికీ చూడలేను. ఇప్పుడు కూడా మెస్సీని ఇక్కడ చూస్తుంటే అలాంటి అనుభూతే కలుగుతోంది. మన యువ ఫుట్‌బాలర్లను ప్రోత్సహించిన మెస్సీకి మీ అందరి తరఫున, భారతీయుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను.

-సచిన్ టెండూల్కర్

మెస్సీ, స్వారెజ్‌లతో భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కుటుంబసభ్యులు

భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రికి తన జెర్సీ అందజేస్తున్న అర్జెంటీనా కెప్టెన్ మెస్సీ

'గోట్ టూర్' చీఫ్ ఆర్గనైజర్ జైలుకు!

శతద్రు దత్తాకు 14 రోజుల రిమాండ్

కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ ప్రస్తుతం 'గోట్ (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా భారత్‌లో మూడు రోజుల పాటు పర్యటిస్తున్నాడు. ఈ టూర్ ముఖ్య నిర్వాహకుడు శతద్రు దత్తా కాగా... తొలిరోజు కోల్‌కతాలో ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమయ్యాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసిన కోల్‌కతా పోలీసులు జైలుకు తరలించారు. కొన్నిరోజులుగా సాల్ట్‌లేక్ స్టేడియంలో మెస్సీ మ్యాచ్ ఆడతాడంటూ ప్రముఖంగా ప్రచారం చేశారు. రూ. వేలల్లో టికెట్లను అమ్మారు. ఫుట్‌బాల్ క్రేజీ బెంగాలీ వాసులు సుమారు 80 వేల మంది వేలకువేలు వెచ్చించి స్టేడియానికి తరలివెళ్లారు. కానీ తమ ఆరాధ్య ఫుట్‌బాలర్ మెస్సీ పట్టుమని పది నిమిషాలైనా మైదానంలో అలరించలేదు. ఆ ఉన్న కొద్దిసేపు కూడా చీమలదండు లాంటి భద్రతా వలయంతో ఏ గ్యాలరీలోని ప్రేక్షకుడు కూడా మెస్సీని చూడలేకపోయాడు. దీంతో సూపర్‌స్టార్‌ను ప్రత్యక్షంగా చూసి కన్నుల పండగ చేసుకుందామని రూ.వేలు వెచ్చించిన అభిమానుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఒక్కసారిగా వేల మంది విరుచుకుపడటంతో కరతాళ ధ్వనులతో మార్మోగాల్సిన మైదానం రసాభాసగా మారింది. ఈ ఈవెంట్ నిర్వహణ వైఫల్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అభిమానుల తాకిడి, అంచనాలకు విరుద్ధంగా ఏర్పాట్లు, నిర్వహణ వైఫల్యంపై చీఫ్ ఆర్గనైజర్ శతద్రు దత్తాను శనివారమే అదుపులోకి తీసుకొని ఆదివారం జడ్జి ముందు హాజరు పరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి... ముఖ్య నిర్వాహకుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో శతద్రును జైలుకు తరలించారు.

జాతీయ మహిళల చెస్ విజేత నందిత

దుర్గాపూర్: జాతీయ మహిళల చెస్ చాంపియన్‌షిప్‌లో తమిళనాడుకు చెందిన పీవీ నందిత విజేతగా నిలిచింది. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత నందిత 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. తొమ్మిది గేముల్లో గెలిచిన నందిత, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయింది. చాంపియన్‌గా నిలిచిన నందితకు విన్నర్స్ ట్రోఫీతో పాటు రూ. 7 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి. పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ)కు చెందిన మేరీ ఆన్ గోమ్స్ 9 పాయింట్లతో రన్నరప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. త్రిపుర అమ్మాయి అర్షియా దాస్ 8.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. శుభి గుప్తా (ఉత్తరప్రదేశ్), కల్యాణి సిరిన్ (కేరళ), సృష్టి పాండే (మహారాష్ట్ర), వర్షిణి (తమిళనాడు), సాచి జైన్ (ఢిల్లీ), ఏజీ నిమ్మీ (కేరళ) 8 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా వీరి ర్యాంకింగ్‌ను వర్గీకరించగా వరుసగా 4 నుంచి 9 స్థానాల్లో నిలిచారు. తెలంగాణ అమ్మాయి వేల్పుల సరయు 7.5 పాయింట్లతో 11వ ర్యాంక్‌ను దక్కించుకుంది. సరయు ఏడు గేముల్లో గెలిచి, మూడు గేముల్లో ఓడిపోయి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. తెలంగాణకు చెందిన శివంశిక 7 పాయింట్లతో 21వ స్థానంలో, గాదె శరణ్య 6.5 పాయింట్లతో 33వ స్థానంలో, స్నేహ భరతకోటి 6.5 పాయింట్లతో 37వ స్థానంలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పొట్లూరి సుప్రీత 7.5 పాయింట్లతో 14వ స్థానంలో, భీమరశెట్టి శ్రావ్యశ్రీ 7 పాయింట్లతో 18వ స్థానంలో, మోడిపల్లి దీక్షిత 7 పాయింట్లతో 24వ స్థానంలో నిలిచారు. పాయింట్లు సమంగా ఉన్నపుడు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు.

నందిత

సరయు

హారిక

ముంబా మాస్టర్స్ శుభారంభం

ముంబై: టెక్ మహీంద్రా గ్లోబల్ చెస్ లీగ్‌లో అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్ జట్టు శుభారంభం చేసింది. గ్యాంజెస్ మాస్టర్స్ జట్టుతో ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ముంబా మాస్టర్స్ 17–4 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ జట్టు 9–7తో అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ జట్టును... ఫయర్స్ అమెరికన్ గాంబిట్స్ 8–5తో పీబీజీ అలాస్కన్ నైట్స్ జట్టును ఓడించాయి. ముంబా మాస్టర్స్ జట్టు తరఫున మాక్సిమి లాగ్రేవ్ 34 ఎత్తుల్లో విశ్వనాథన్ ఆనంద్‌పై, షఖ్రియార్ మమెడైరోవ్ 45 ఎత్తుల్లో సిందరోవ్‌పై, ద్రోణవల్లి హారిక 60 ఎత్తుల్లో స్టావ్‌రులా సొలాకిడూపై గెలుపొందారు. కోనేరు హంపి (ముంబా మాస్టర్స్) 61 ఎత్తుల్లో పోలీనా షువలోవా (గ్యాంజెస్) చేతిలో ఓడిపోగా... వెస్లీ సో (ముంబా)–విన్సెంట్ కీమెర్ (గ్యాంజెస్) గేమ్ 36 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. లీగ్ నిబంధనల ప్రకారం నల్లపావులతో ఆడి గెలిస్తే 4 పాయింట్లు, తెల్ల పావులతో ఆడి గెలిస్తే 3 పాయింట్లు లభిస్తాయి. 'డ్రా'గా ముగిస్తే ఒక పాయింట్ దక్కుతుంది. నేడు జరిగే రెండో రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో అమెరికన్ గాంబిట్స్‌తో ముంబా మాస్టర్స్; అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ జట్టుతో గ్యాంజెస్ మాస్టర్స్ జట్టు; పీబీజీ అలాస్కన్ నైట్స్ జట్టుతో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ జట్టు తలపడతాయి.

సింగిల్స్ చాంప్స్ ఉన్నతి, కిరణ్

కటక్: ఒడిశా మాస్టర్స్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్ విభాగంలో భారత్‌కు రెండు టైటిల్స్ లభించాయి. మహిళల సింగిల్స్‌లో హరియాణాకు చెందిన 18 ఏళ్ల ఉన్నతి హుడా... పురుషుల సింగిల్స్‌లో కేరళకు చెందిన కిరణ్ జార్జి చాంపియన్స్‌గా అవతరించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ప్రపంచ 28వ ర్యాంకర్ ఉన్నతి 21–17, 21–10తో భారత్‌కే చెందిన ప్రపంచ 53వ ర్యాంకర్ ఇషారాణి బారువాను ఓడించింది. 31 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ఉన్నతికి తొలి గేమ్‌లో కాస్త పోటీ ఎదురైంది. రెండో గేమ్‌లో మాత్రం ఆరంభం నుంచే ఉన్నతి జోరు కొనసాగింది. పురుషుల సింగిల్స్ తుది పోరులో ప్రపంచ 41వ ర్యాంకర్ కిరణ్ జార్జి 21–14, 13–21, 21–16తో ప్రపంచ 77వ ర్యాంకర్ మొహమ్మద్ యూసుఫ్ (ఇండోనేసియా)పై విజయం సాధించింది. 65 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండో గేమ్‌లో తడబడ్డ కిరణ్ నిర్ణాయక మూడో గేమ్‌లో కీలకదశలో పాయింట్లు గెలిచి టైటిల్‌ను ఖాయం చేసుకున్నాడు. విజేతలుగా నిలిచిన ఉన్నతి, కిరణ్‌లకు 8,250 డాలర్ల (రూ. 7 లక్షల 46 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 5,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

పోర్చుగల్‌లోని నజారే ప్రాంత నార్త్ బీచ్‌లో శనివారం నజారె బిగ్ వేవ్ చాలెంజ్ సర్ఫింగ్ టోర్నమెంట్‌లో దూసుకొస్తున్న భారీ అలను తప్పించుకుంటూ ముందుకు సాగుతున్న చిలీ సర్ఫర్ రఫేల్

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు 270 అడుగుల పొడవైన శాండ్‌విచ్‌ను తయారు చేసి రికార్డు నెలకొల్పారు

దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు, తీవ్ర చలి మధ్యనే జనం సంచారం

ప్రవర్తన మార్పుతోనే దేశ ఇంధన ప్రగతి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీ: దేశంలోని అన్ని రంగాలలో శక్తి (ఇంధన) సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రతి పౌరుడిలోనూ ప్రవర్తన మార్పు చాలా కీలకమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన 'జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం'లో ఆమె మాట్లాడారు. ప్రకృతికి అనుగుణంగా సమతుల్య జీవనశైలిని అవలంబించాలనే చైతన్యం భారతదేశ సాంస్కృతిక సంప్రదాయంలో అంతర్లీనంగా ఉందని స్పష్టం చేశారు. ఈ భావనే ప్రపంచానికి మన సందేశంగా మారుతున్న 'పర్యావరణం కోసం జీవనశైలి – లైఫ్'నినాదానికి ఆధారమన్నారు.

పెయింటింగ్ పోటీలో విజేతకు అవార్డును అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

కీలకమైన మార్పులు

'భారతదేశ ఇంధన పరివర్తన విజయం కోసం ప్రతి రంగం, పౌరుల భాగస్వామ్యం అవసరం. అన్ని రంగాలకు ఇంధన సామర్థ్యాన్ని తీసుకురావడానికి ప్రవర్తనా మార్పు అత్యంత కీలకం.'.. అని రాష్ట్రపతి సూచించారు. ఇంధన సంరక్షణ అనేది కేవలం ఒక అవకాశం మాత్రమే కాదని.. ప్రస్తుత అత్యంత ముఖ్యమైన అవసరమని తెలిపారు.

సమర్థ వినియోగం జరగాలి

శక్తిని ఆదా చేయడం అంటే తక్కువగా ఉపయోగించడం మాత్రమే కాదని, దానిని తెలివిగా, బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా వినియోగించడమని రాష్ట్రపతి ఉద్ఘాటించారు. 'అనవసరంగా విద్యుదుపకరణాలను వాడకుండా ఉండటం, శక్తి సామర్థ్యం గల పరికరాలను ఉపయోగించడం, మన ఇళ్లు, కార్యాలయాలలో సహజ కాంతి, గాలిని వినియోగించుకోవడం, లేదా సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధన మార్గాలను స్వీకరించడం ద్వారా, మనం కేవలం శక్తిని ఆదా చేయడమే కాకుండా, కార్బన్ ఉద్గారాలను కూడా తగ్గించగలం'.. అని ముర్ము సూచించారు.

గణనీయంగా శక్తి ఆదా

2023–24లో భారతదేశ ఇంధన సామర్థ్య ప్రయత్నాల ఫలితంగా 53.60 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన శక్తి ఆదా అయిందని రాష్ట్రపతి తెలిపారు. ఈ ప్రయత్నాలు వార్షికంగా గణనీయమైన ఆర్థిక పొదుపులకు, ఉద్గారాల తగ్గింపునకు దారి తీశాయని వెల్లడించారు. చివరగా, ఇంధన సంరక్షణ రంగంలో కృషి చేస్తున్న వాటాదారులందరినీ రాష్ట్రపతి అభినందించారు. సామూహిక బాధ్యత, భాగస్వామ్యం, ప్రజల సహకార స్ఫూర్తితో భారతదేశం ఇంధన సంరక్షణలో ప్రధాన పాత్ర పోషించి, 'హరిత భవిష్యత్తు' లక్ష్యాలను సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ఆమె 2025 సంవత్సరానికి 'జాతీయ ఇంధన సంరక్షణ అవార్డులు', 'ఇంధన సంరక్షణపై జాతీయ చిత్రలేఖన పోటీ' విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

పర్యావరణం, ఆర్థిక ప్రయోజనాలు

స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీటి వనరులు, సమతుల్య పర్యావరణ వ్యవస్థను నిర్వహించడానికి కూడా ఇంధన సంరక్షణ చాలా ముఖ్యమని రాష్ట్రపతి చెప్పారు. 'మనం ఆదా చేసే ప్రతి యూనిట్ శక్తి, ప్రకృతిపై మన బాధ్యతకు, భవిష్యత్ తరాలపై మన సున్నితత్వానికి చిహ్నంగా నిలుస్తుంది'.. అని స్పష్టం చేశారు. యువత, పిల్లలు ఇంధన సంరక్షణపై అవగాహన పెంచుకుని, ఈ దిశగా ప్రయత్నాలు చేస్తే, దేశం స్థిరమైన అభివృద్ధిని సాధించగలదని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు.

ఫలిస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు

'ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన', 'జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్' వంటి కార్యక్రమాలు శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తున్నాయని ముర్ము గుర్తు చేశారు. 'పునరుత్పాదక వినియోగ బాధ్యత', 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాల' ద్వారా ప్రభుత్వం పునరుత్పాదక ఇంధనాన్ని, శక్తి సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు.

ముద్దుల్లో ప్రపంచ రికార్డు

వాషింగ్టన్: అమెరికాలోని వాషింగ్టన్ డీసీ నగరం మరోసారి ముద్దుల పోటీకి వేదికైంది. 'నేషనల్ కిస్ అండర్ ది నేషనల్ మిజిల్‌టో' కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో జంటలు తరలివచ్చాయి. ఆంథెమ్ రోలో వేలాడదీసిన మిజిల్‌టో మొక్కల కింద 480 మంది జంటలు ముద్దాడటం ఇప్పటిదాకా రికార్డుగా ఉంది. అయితే, శనివారం జరిగిన కార్యక్రమానికి సుమారు 1,435 జంటలు వచ్చి ముద్దాడుకున్నాయి. ఈ సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు తరఫున న్యాయ నిర్ణేతగా వచ్చిన మైకేల్ ఎంప్రిక్ ఇక్కడికి చేరుకున్న మూడు వేలమందిని చూసి ఆశ్చర్యమేస్తోంది. వీరంతా మిజిల్‌టో కింద ముద్దుల చరిత్రను సృష్టించారని తెలియజేస్తున్నాను. ఇప్పటి వరకు ఉన్న రికార్డును వీరు సులభంగా బద్దలు కొట్టారు. ఇది సరికొత్త ప్రపంచ రికార్డు'అని కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. ఒంటరిగా ఇక్కడికి ఎవరూ రాలేదన్నారు. అందరూ జంటలుగానే వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. వీరంతా ఏకకాలంలో ఐదు సెకన్లపాటు ముద్దులు పెట్టుకుని, రికార్డు నెలకొల్పారని ఎంప్రిక్ వివరించారు. తాము కేవలం 500 జంటలు మాత్రమే పాల్గొంటాయని భావించామని, అనూహ్యంగా 6 వేల జంటలు నమోదు చేయించుకున్నాయని నిర్వాహకుడు ఎబనీ వాల్టన్ చెప్పారు. ఈ కార్యక్రమం కోసం ఒరెగాన్‌లోని ఓ వ్యవసాయక్షేత్రం నుంచి 17,150 మిజిల్‌టో అనే గుబురుగా ఉండే పారాసైటిక్ నాచు మొక్కలను తెప్పించామన్నారు.

72 గంటలపాటు చెట్టును కౌగిలించుకుని..

కెన్యా పర్యావరణ ఉద్యమకారిణి ప్రపంచ రికార్డు

నైరోబీ: కెన్యా పర్యావరణ ఉద్యమకారిణి ట్రంఫెనా ముతోని ప్రపంచ రికార్డు సృష్టించారు. నిద్రాహారాలు మాని 72 గంటలపాటు ఒక చెట్టును కౌగిలించుకుని ఉండిపోయారు. గతంలో 48 గంటల పాటు చెట్టును కౌగిలించుకుని తాను సృష్టించిన రికార్డును తానే బద్దలు కొట్టారు. నౌరీ పట్టణంలోని ఓ ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో చెట్టును ఆమె ఇందుకు ఎంచుకున్నారు. అడవుల నరికివేత, మృగాల హత్యలకు నిరసనగా, యువతకు పర్యావరణ సంరక్షణ విలువను తెలపడానికి ఆమె ఈ కార్యక్రమం చేపట్టారు. ఆమె నిరసనకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. చాలా మంది ఆమెకు మద్దతుగా నిలిచారు. ఒకానొక దశలో ఆమె నిద్రలోకి జారుకోగా.. మద్దతుదారులు మేల్కొలిపారు. కొందరైతే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పరిశీలకులకు ఆమె ఫీజు చెల్లించడానికి ముందుకొచ్చారు. ఈ సమయంలో ఆమె నలుపు, ఆకుపచ్చ, ఎరుపు, నీలం రంగుల్లో ఉన్న ఊలు టీషర్టును ధరించారు. నలుపు ఆఫ్రికన్ శక్తని, ఆకుపచ్చ అడవులకు, ఆశకు ప్రతిరూపమని, ఇక ఎరుపు ప్రతిఘటనకు, నీలం నీటికి గుర్తని.. చెప్పారు. వాతావరణ మార్పులు, అడవుల నరికివేత వల్ల కలిగే ప్రమాదం గురించి అవగాహన పెంచడమే తన నిరసన లక్ష్యమని చెప్పారు. తక్కువ కార్బన్ ఉద్గారాలను విడుదల చేసే తమ దేశాలు.. వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రభావాలను ఎక్కువగా ఎదుర్కోవాల్సి వస్తోందని ఆఫ్రికన్ దేశాలు ఆరోపిస్తున్నాయి.

చోరబాటుదారులను కాపాడేందుకు కుట్ర

కాంగ్రెస్‌పై బీజేపీ ధ్వజం

న్యూఢిల్లీ: రాజకీయ లబ్ధి కోసం చొరబాటుదారులను కాపాడేందుకు కాంగ్రెస్ కుట్రలు సాగిస్తోందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఆదివారం ఆరోపించారు. చొరబాటుదారుల ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదని కాంగ్రెస్ కోరుకుంటోందని విమర్శించారు. రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ ధర్నా కేవలం చొరబాటుదారుల కోసమేనని ఆక్షేపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగవని తేల్చిచెప్పారు. రాజ్యాంగబద్ధ సంస్థలను అప్రతిష్టపాలు చేయాలన్నదే కాంగ్రెస్ అసలు ఉద్దేశమని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో కాంగ్రెస్ అసలు రంగును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టంగా బయటపెట్టారని సంబిత్ పాత్ర గుర్తుచేశారు. బుజ్జగింపు రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని కాంగ్రెస్‌కు హితవు పలికారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు ఆధారాలు ఉంటే ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సవాలు విసిరారు.

ప్రమాద కేసులో రూ.1.38 కోట్ల పరిహారం

న్యూఢిల్లీ: గురుగ్రామ్‌లోని ద్వారక ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం కేసులో ఢిల్లీ మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఏసీటీ) బాధిత కుటుంబానికి రూ.1.38 కోట్లను చెల్లించాలని తీర్పు ఇచ్చింది. 2022 డిసెంబర్ 11న ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై 32 ఏళ్ల కౌశల్ మిశ్రా ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా ఓ కారు ఢీకొంది. ఒక ప్రైవేట్ కంపెనీలో సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కౌశల్ తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో పది రోజుల తరువాత మృతి చెందారు. కౌశల్ ఇన్సూరెన్స్ చేసి ఉన్నాడు. దీంతో కౌశల్ కుటుంబం వేసిన పిటిషన్‌పై అధికారి సుదీప్ రాజ్ సైనీ విచారణ జరిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కౌశల్ హెల్మెట్ ధరించి ఉన్నాడని, కారు రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన వాంగ్మూలం మేరకు తీర్పు చెప్పింది. మృతుడి నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందన్న బీమా సంస్థ వాదనను ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. ఆయనపై ఆధారపడిన వారికి జరిగిన నష్టం, వైద్య ఖర్చులు, అంత్యక్రియల ఖర్చులు, ఇతర నష్టాలతో కలిపి కుటుంబానికి పరిహారంగా రూ.1.38 కోట్లు చెల్లించాలని ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయాలని టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్‌ను ఆదేశించింది.

దక్షిణాఫ్రికాలో ఆలయం కూలి నలుగురు మృతి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో విషాదం చోటు చేసుకుంది. హిందూ దేవాలయం కూలిన ఘటనలో భారత సంతతి వ్యక్తి సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన భారతీయుడిని ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ విక్కీ జైరాజ్ పాండేగా గుర్తించారు. ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచే పాండే కీలకంగా పనిచేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న న్యూ అహోబిలం ఆలయం క్వాజులు-నాటల్ ప్రావిన్స్‌లోని ఈథెక్విని‌లో ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆలయంలో కార్మికులు, ఆలయ అధికారులు ఉన్నారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రెండేళ్ల కిందట నిర్మాణం మొదలైన ఆలయం నిటారుగా ఉన్న కొండపై ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఈ దశలో శిథిలాల కింద ఎంతమంది చిక్కుకున్నారనే విషయాన్ని చెప్పలేమని, వారు ప్రాణాలతో బయటపడే అవకాశం కూడా లేదని అధికారులు తెలిపారు. నిర్మాణం చట్ట విరుద్ధమని, ప్రాజెక్టు ప్రణాళికలకు ఎలాంటి ఆమోదం జరగలేదని ఈథెక్విని మున్సిపాలిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆలయంలో మహిళ హత్య

మరొకరి కోసం గాలింపు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని మన్‌సరోవర్ పార్కు ఏరియాలోని ఓ ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం ఒక మహిళ దారుణ హత్యకు గురైంది. ఆలయం లోపల పూజ చేస్తున్న మహిళపై దుండగులు కత్తులతో దాడి చేశారు. తల, ఛాతీపై బలమైన గాయాలతో మహిళ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. మృతురాలిని పూజారిగా పనిచేసే కుసుమ్ శర్మ(48)గా గుర్తించారు. సీసీపుటేజీ ఆధారంగా ఈ దారుణానికి ఒడిగట్టింది ఇద్దరని తేల్చిన పోలీసులు ఆంచల్ సక్సేనా అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. పాత కక్షలే కారణమని ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. హత్య కేసుగా నమోదు చేసుకుని, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

భూభాగాన్ని వదులుకోబోం

అమెరికాకు జెలెన్‌స్కీ స్పష్టీకరణ

బెర్లిన్: రష్యాతో యుద్ధానికి తెరదించేందుకు తాను సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ మరోసారి స్పష్టం చేశారు. అందులో భాగంగా పాశ్చాత్య దేశాలు అందించే భద్రతా హామీలకు బదులుగా ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం డిమాండ్‌ను వాదుకుంటామని చెప్పారు. అమెరికా ఒత్తిడి చేస్తున్నట్టుగా తాము భూభాగాన్ని రష్యాకు వదులుకునే ప్రసక్తే లేదన్నారు. యుద్ధానికి తెరదించే మార్గాలపై అమెరికా దూతలతో చర్చల నిమిత్తం ఆయన ఆదివారం బెర్లిన్ చేరుకున్నారు. దూతల బృందంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, స్టీవ్ విట్కాఫ్ ఉన్నారు. ఈ సందర్భంగా జెలెన్‌స్కీ తమకు భద్రతా హామీలు కూడా నాటో దేశాల స్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వాటికి చట్టపరమైన రక్షణకు కల్పించాలి. అప్పుడే రష్యా మళ్లీ మాపైకి కాలు దువ్వకుండా ఉంటుంది. అమెరికా సూచిస్తున్నట్టుగా డొనెట్స్క్‌ను నిస్సైనిక ప్రాంతంగా మార్చి, దానిపై సార్వభౌమత్వాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేమని తెగేసి చెప్పారు.

హమాస్ టాప్ కమాండర్ రయీద్ సాద్ మృతి

జెరూసలేం: ఇజ్రాయెల్ జరిపిన దాడిలో టాప్ కమాండర్ రయీద్ సాద్ మరణించారని హమాస్ ఆదివారం తెలిపింది. సాద్‌ను చంపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన ఒక రోజు తర్వాత హమాస్ ఈ విషయాన్ని ఆదివారం ధ్రువీకరించింది. మిలిటరీ తయారీ యూనిట్‌కు రయీద్ సాద్ కమాండర్‌గా ఉన్నారని హమాస్ వెల్లడించింది. కొత్త కమాండర్‌ను నియమించినట్లు ప్రకటించిన హమాస్ వివరాలు మాత్రం ఇవ్వలేదు. అయితే, సాద్ గాజాపై యుద్ధానికి దారి తీసిన 2023 అక్టోబర్ 7 దాడికి రూపశిల్పిగా ఇజ్రాయెల్ పేర్కొంది. కాల్పుల విరమణను ఉల్లంఘించి అతను ఉగ్రవాద సంస్థను పునర్నిర్మించడంలో నిమగ్నమయ్యాడని పేర్కొంది. కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఇజ్రాయెల్, హమాస్ పదేపదే ఆరోపించుకుంటున్నాయి. కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటి నుంచి గాజాపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులు, కాల్పుల్లో కనీసం 391 మంది మరణించారని పాలస్తీనా అధికారులు తెలిపారు. అయితే ఆ దాడులు తమ సైనికులపై ఉగ్రవాదుల దాడులకు ప్రతీకారంగా జరిగాయని, ఇజ్రాయెల్ నియంత్రణలో ఉన్న 'ఎల్లో లైన్'దగ్గరకు చేరుకున్న పాలస్తీనియన్లపై దళాలు కాల్పులు జరిపాయని ఇజ్రాయెల్ తెలిపింది. 2023లో ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిలో 1,200 మంది మరణించారు. 251 మందిని బందీలుగా పట్టుకున్నారు. దాదాపు అందరు బందీలు, మృతుల అవశేషాలను పలు ఒప్పందాల ద్వారా తిరిగి ఇచ్చారు. ఇజ్రాయెల్ రెండేళ్లుగా చేస్తున్న దాడుల్లో గాజాలో ఇప్పటివకు 70,660 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో దాదాపు సగం మంది మహిళలు, పిల్లలు ఉన్నారు.

నౌరదేహిలో మరో చీతా రిజర్వ్

మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ వెల్లడి

భోపాల్: వచ్చే వర్షాకాలం కల్లా వీరాంగన దుర్గావతి టైగర్ రిజర్వ్‌ను చీతాలకు నివాసంగా మారుస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు. సాగర్ జిల్లాలోని నౌరదేహిలో ఉన్న ఈ టైగర్ రిజర్వ్‌ను చీతాలకు మూడో ఆవాసంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ప్రపంచంలో చీతాల పునరావాసానికి ఏకైక ప్రదేశం రాష్ట్రమేనని, ఇతర రాష్ట్రాల్లో ప్రయత్నించినా విజయవంతం కాలేదని చెప్పారు. ఇటీవల రాష్ట్రంలో చీతాల మరణాల సంఖ్య పెరగడం గురించి ఆయన మాట్లాడుతూ 'ఎక్కువ చీతాలు ఉన్నప్పుడు ఇటువంటి సంఘటనలు సహజంగానే జరుగుతాయి. వాటిని సంరక్షించడానికి ప్రయత్నిస్తున్నాం. అస్సాం నుంచి ఖడ్గ మృగాలను తెస్తున్నాం. బెంగళూరు అడవుల నుంచి కింగ్ కోబ్రాస్ తెచ్చాం. పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి జూలు నిర్మిస్తున్నాం. జంతువుల ప్రాణాలను కాపాడటానికి టైగర్ రిజర్వుల్లో రెస్క్యూ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం' అని తెలిపారు. చీతాలతోపాటు అనేక వన్యప్రాణులను రాష్ట్రంలో ఆవాసం కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

సౌర తుపాను అధ్యయనంలో

ఆదిత్య-ఎల్1 కీలకం: ఇస్రో

బెంగళూరు: భారత తొలి సౌర అబ్జర్వేటరీ ఆదిత్య-ఎల్1 మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 2024లో భూమిని వణికించిన అత్యంత భయానకమైన, శక్తిమంతమైన సౌర తుపాను అంత అసాధారణంగా ఎందుకు ప్రవర్తించిందో శాస్త్రవేత్తలు అర్థం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరించింది. అత్యంత కచ్చితత్వంతో కూడిన తన అయస్కాంత క్షేత్ర కొలతల ద్వారా ఈ అరుదైన సౌర దృగ్విషయాన్ని అంతరిక్షంలో పలు నిర్ధారిత ప్రాంతాల నుంచి అధ్యయనం చేయడంలో దోహదపడింది. భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) మంగళవారం ఈ మేరకు వెల్లడించింది. 'గానన్స్ స్టార్మ్' గా పిలుచుకుంటున్న ఆ సౌర తుపాను కరోనల్ మాస్ ఎజెక్షన్స్(సీఎంఈ) గా పిలిచే అతి భారీ సౌర పేలుళ్ల సమాహారం. సీఎంఈలు అత్యంత వేడిమితో కూడిన వాయు సమూహాలు. ఇవి చండ ప్రచండంగా భూమిని తాకినప్పుడు భూ అయస్కాంత క్షేత్రాన్ని కుదిపేస్తాయి. ఉపగ్రహాలు, జీపీఎస్‌తో పాటు పవర్ గ్రిడ్‌లను నష్టపరుస్తాయి. 2024 నాటి సౌర తుపాను తీవ్రత, అందుకు దారితీసిన పరిస్థితులపై భారత సైంటిస్టు బృందం కీలక పరిశోధన చేసింది. ఆ తుపాను మధ్యంలో మెలిదిరిగిన తాళ్లను పోలి ఉండే సౌర అయస్కాంత క్షేత్రం అక్కడక్కడ విరుగుతూ, తిరిగి కలిసిపోతూ సాగింది. ఈ అసాధారణతను మన బృందమే వెలుగులోకి తెచ్చింది. దీన్ని ప్రతిష్టాత్మక ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్ ప్రముఖంగా ప్రచురించింది. ఆదిత్య-ఎల్1 అనేది సౌర అధ్యయనం నిమిత్తం 2023లో భారత్ ప్రయోగించిన తొలి అంతరిక్ష మిషన్.

ఫ్యాన్స్ ఫుట్‌బాల్ ఆడేసుకున్నారు

- మంటలు రేపిన మెస్సీ నిష్క్రమణ
- స్టేడియంలో అభిమానుల విధ్వంసం
- కార్పెట్, కుండీలు చోరీ

ఫుట్‌బాల్ దేవుడు లియోనెల్ మెస్సీని కళ్లారా చూసేందుకు కోల్‌కతాలో అభిమానుల సాహసాలు, పడిన ఆరాటం అంతా ఇంతా కాదు. కొందరు వేలకు వేలు చెల్లించగా, ఓ అభిమాని ఏకంగా తన పెళ్లి వేడుకలను పక్కనపెట్టి స్టేడియానికి వచ్చాడు. కానీ, అంతిమంగా వారందరికీ మిగిలింది తీవ్ర నిరాశే. 'గోట్ టూర్ 2025'లో భాగంగా సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సీ అడుగుపెట్టినప్పటికీ, ఆయన ముందుగానే నిష్క్రమించడంతో పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. ఈ అస్తవ్యస్థ, పేలవమైన నిర్వహణతో వేలాది మంది అభిమానుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

మెస్సీ కనిపించలేదు.. కార్పెట్ తీసుకుపోతున్నా!

మెస్సీని దగ్గరగా చూడాలని రూ.10,000 చెల్లించిన ఓ అభిమాని, తీవ్ర నిరాశతో.. ఆవేశంతో ఊగిపోయాడు. స్టేడియం లోపలికి చొచ్చుకొచ్చి.. ఏకంగా మైదానంలోని గడ్డి కార్పెట్‌ను చుట్టి, మోసుకుపోతూ కనిపించాడు. 'మెస్సీ ముఖం కూడా కనిపించలేదు. చాలా డబ్బు పోయింది, అందుకే ఈ కార్పెట్‌ను ఇంటికి తీసుకెళ్లి ప్రాక్టీస్ చేస్తా!'.. అని ఆగ్రహం, వ్యంగ్యం మిళితమైన స్వరంతో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించింది. నెటిజన్లు అతన్ని 'అత్యంత ప్రాక్టికల్ అభిమాని'గా అభివర్ణించారు. మెస్సీ కంటే ఎక్కువ సేపు స్టేడియంలో ఆ కార్పెట్ మాత్రమే ఉందంటూ మీమ్స్ వెల్లువెత్తాయి.

కుండీలు మోసుకెళ్లిన మరో అభిమాని

కార్పెట్ దొంగతనం జరిగిన కొద్దిసేపటికే, మెస్సీ జెర్సీ ధరించిన మరో వ్యక్తి సైతం మైదానం నుంచి రెండు పూలకుండీలను మోసుకెళ్తూ కనిపించాడు. పూలకుండీలను ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా.. 'వీటిని మా ఆవిడకు ప్రేమగా బహుమతిగా ఇస్తాను'.. అని ఆ వ్యక్తి చెప్పాడు. అభిమానులు అందినకాడికి స్టేడియంలోని వస్తువులను దోచుకుపోయారు. మొత్తం మీద, మెస్సీని చూడాలనే ఆశ నెరవేరక, సోఫాలు పీకివేయడం, సీట్లు ధ్వంసం చేయడం, బాటిళ్లు విసరడం వరకు విధ్వంసం కొనసాగింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

'మంచే' జరిగిందిలే!

మంచు కురిసినా పెరగని చలి • కశ్మీర్‌లో ప్రకృతి అసాధారణ మార్పు

శ్రీనగర్: కశ్మీర్ లోయలో ప్రకృతి అసాధారణ పరిణామం చెందింది. ఎత్తైన ప్రాంతాల్లో రాత్రిపూట మంచు కురవడంతో, ఉష్ణోగ్రతలు మరింత పడిపోతాయనే అంచనాలకు భిన్నంగా, ఈ నెలలో తొలిసారిగా కనిష్ట రాత్రి ఉష్ణోగ్రతలు ఫ్రీజింగ్ పాయింట్ (సున్నా డిగ్రీలు) కంటే పైకి పెరిగాయి. ఈ అసాధారణ పరిణామం వల్ల.. చలి తీవ్రత నుంచి లోయవాసులకు కాస్త ఉపశమనం లభించిందని అధికారులు ఆదివారం తెలిపారు.

దాదాపు 5 డిగ్రీల సెల్సియస్ పెంపు

శ్రీనగర్లో కనిష్ట ఉష్ణోగ్రత 2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శుక్రవారం రాత్రి ఇది మైనస్ 2.9 డిగ్రీల సెల్సియస్‌గా ఉంది. అంటే, ఒక రోజులో దాదాపు ఐదు డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రత పెరిగింది. వాతావరణ శాఖ ప్రకారం, ప్రస్తుతం నమోదైన ఉష్ణోగ్రత ఈ సీజన్‌కు ఉండాల్సిన సాధారణ స్థాయి కంటే 3.2 డిగ్రీలు ఎక్కువ. జమ్మూ కశ్మీర్‌లో పుల్వామా మాత్రమే మైనస్ 2.7 డిగ్రీల సెల్సియస్‌తో.. సున్నా డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతను నమోదు చేసిన ఏకైక ప్రాంతంగా నిలిచింది.

మంచు కురిసిన ప్రాంతాలు

గందర్బల్ జిల్లాలోని జోజిలా పాస్, మినామర్గ్, బాల్టాల్ ప్రాంతాలు సహా బందిపోరా జిల్లాలోని తులైల్ ప్రాంతాల్లో మంచు కురిసినట్లు అధికారులు తెలిపారు.



'చిల్లై కలాన్' ముంగిట కశ్మీర్

డిసెంబర్ 21న ప్రారంభమయ్యే 40 రోజుల అతి తీవ్రమైన చలికాలంగా పరిగణించే 'చిల్లై కలాన్' వైపు కశ్మీర్ అడుగులు వేస్తోంది. ఈ సమయంలోనే మంచు కురిసే అవకాశాలు అత్యధికంగా ఉండి, ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతాయి. అయితే, 'చిల్లై కలాన్' మొదలయ్యే డిసెంబర్ 20–21 తేదీలలో లోయలో అక్కడక్కడా తేలికపాటి వర్షం లేదా మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

నవంబర్ హీటెక్కింది

- రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు
- ప్రమాద సంకేతమే: సైంటిస్టులు

వాషింగ్టన్: గ్లోబల్ వార్మింగ్ తాలూకు విపరిణామాలకు మరో తాజా తార్కాణం. గత నవంబర్ ప్రపంచవ్యాప్తంగా పెద్దగా చలి జాడలు లేకుండానే గడచిపోయింది. అంతేనా, చరిత్రలో అత్యంత వేడిని చవిచూసిన నవంబర్ మాసాల జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. యూరోపియన్ యూనియన్ కు చెందిన కొపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ (సీ3ఎస్) ఈ మేరకు చేదు వాస్తవాన్ని వెల్లడించింది. నవంబర్ లో సగటు భూ ఉపరితల వాయు ఉష్ణోగ్రత 14.02 డిగ్రీ సెంటీగ్రేడ్ గా నమోదైంది. 1991–2020 నడుమ నమోదైన నవంబర్ సగటు కంటే ఇది ఏకంగా 0.65 డిగ్రీ అదనం! అత్యంత వేడిమి నవంబర్లుగా రికార్డులకెక్కిన 2023 కంటే 0.2 డిగ్రీలు, 2024 కంటే కేవలం 0.08 డిగ్రీలే తక్కువ. ఇక పారిశ్రామికీకరణ (1850–1900)కు ముందునాటితో పోలిస్తే ఏకంగా 1.54 డిగ్రీలు ఎక్కువ! ఈ విషయంలో అంతర్జాతీయంగా అంగీకరించిన 1.5 డిగ్రీల పరిమితిని కూడా ఈ నవంబర్ దాటేసింది. 2025లో తొలి 11 నెలల సంగతి చూసుకున్నా 1.48 డిగ్రీల అదనపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ లెక్కన 2025 కూడా చరిత్రలోనే అత్యంత వేడిమయమైన సంవత్సరాల జాబితాలో రెండు, లేదా మూడో స్థానంలో నిలవడం ఖాయమేనని సైంటిస్టులు అంటున్నారు.

ఎంత భారీ తేడాలో!

ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రత పెరుగుదలలో కూడా భీతి కలిగించే ఒక పరిణామాన్ని సైంటిస్టులు గమనించారు. ధ్రువ ప్రాంతాల్లో ఈ పెరుగుదల మరీ ఎక్కువగా నమోదైంది. ఆర్కిటిక్ లోని ఉత్తర కెనడా, ఆర్కిటిక్ మహాసముద్రం, పశ్చిమ రష్యా సగటు కంటే ఏకంగా 5 నుంచి 7 డిగ్రీలు ఎక్కువ వేడెక్కాయి.

బౌద్ధమతం ఒక సామాజిక ఉద్యమం

పురుషార్థాలు

హిందూ సమాజ వ్యవస్థలో ప్రతి వ్యక్తికీ పురుషార్థాలు మార్గదర్శక సూత్రాలుగా వ్యవహరిస్తాయి. పురుషార్థాలు 4. అవి..

ధర్మం, అర్థం, కామం, మోక్షం.

1. ధర్మం

హిందూ జీవనంలో ధర్మం అనే భావానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ధర్మం అనే పదం సంస్కృతంలోని'ధృ' అనే ధాతువు నుంచి వచ్చింది. 'ధృ' అంటే కలిపి ఉంచు, నిలబెట్టు అని అర్థం. ధర్మం మానవుడి ప్రవర్తనను క్రమబద్ధం చేస్తుంది. సమాజానికి ఏది ఆమోద యోగ్యమో, దానికి అనుగుణంగా వ్యక్తి జీవించాలి. నీతి, నిజాయతీ, నైతిక ప్రవర్తన గురించి ధర్మం చెబుతుంది. 'ధర్మం' అనే పదాన్ని అనేక సందర్భాల్లో అనేక అర్థాల్లో వాడారు.

ఐతరేయ బ్రాహ్మణం: విశ్వానికంతటికీ మూలం ధర్మం. ప్రజలు మార్గదర్శకత్వం కోసం ధర్మం గురించి బాగా తెలిసిన వ్యక్తి వద్దకు వెళతారు. ధర్మం వల్ల దుష్టత్వాన్ని పారద్రోలవచ్చు. ప్రతిదీ ధర్మం మీదే ఆధారపడి ఉంది. అందువల్ల ధర్మం అత్యుత్తమ సుగుణం.

మహాభారతం: ప్రజల్లో శక్తి, ప్రభావం కలగడానికి ధర్మాన్ని వివరించారు. ధర్మం అహింసతో కూడింది, దృఢమైంది. అది ప్రపంచాన్ని నిలబెడుతుంది. సృష్టిలోని ఏ జీవికీ హాని చేయకుండా ఉండేది కచ్చితంగా ధర్మం.

వైశేషిక సూత్రాలు: భౌతిక లాభం, ఆధ్యాత్మిక సుగుణం దేని నుంచి కలుగుతాయో అదే ధర్మం.

మహానారాయణోపనిషత్తు: జగత్ అంతటికీ మూలం ధర్మం. ధర్మాన్ని శ్రద్ధగా పాటించేవారిని ప్రజలు ఆశ్రయిస్తారు. ధర్మం ద్వారా పాపాలను పోగొట్టుకుంటారు. ధర్మం అత్యంత సుగుణం. 'సు' అంటే మంచి అని అర్థం. గుణం అంటే లక్షణం అని అర్థం.

జైమిని ప్రకారం: వేదాలు సూచించే, ఆశించే ఫలితం లేదా ఆశయమే ధర్మం.

మనుస్మృతి ప్రకారం: పక్షపాత బుద్ధితో కాకుండా, నీతి నిజాయతీలతో రాగద్వేషాలను వీడి మనసా, వాచా, కర్మణా జీవించే పవిత్ర జీవన విధానమే ధర్మం. ప్రతి వస్తువుకు గమనించదగ్గ నైసర్గిక ధర్మం ఉంటుంది.

- మానవుడు ఆచరించాల్సిన ధర్మాలను గురించి యాజ్ఞవల్క్యుడు తొమ్మిది ధర్మ సుగుణాలను వివరించాడు. అవి..
  అహింస, నిర్మలత్వం, నీతి,
  పరిశుభ్రత, ఇంద్రియ నిగ్రహం,
  దానం, ఆత్మనిగ్రహం, ప్రేమ, సహనం
- ఈ తొమ్మిది ధర్మగుణాల్లో మొదటి ఆరు ధర్మ గుణాలు సమాజ మనుగడకు,మిగతా మూడు ధర్మాలు వ్యక్తి సత్ప్రవర్తనకు తోడ్పడతాయి.

ధర్మం లక్షణాలను కింది విధంగా గ్రహించవచ్చు.

1. ప్రజల శ్రేయస్సు కోసం ధర్మం ఉంది.
2. ఇతరులకు హాని చేయరాదు అనే భావం ఇందులో ఉంది.
3. ధర్మం వ్యక్తి నడవడిక నియమాలను, జీవన విధానాన్ని సూచిస్తుంది.
4. ధర్మం ఆనందానికి మూలం
5. ఏకీకృతం చేయడానికి ధర్మం ఉపకరిస్తుంది.
6. ధర్మం కర్తవ్యాన్ని సూచిస్తుంది.
7. ధర్మం సామాజిక విలువలకు, సాంస్కృతిక ప్రమాణాలకు ప్రతీకగా ఉంటుంది.

- హిందూ సామాజిక వ్యవస్థలో ధర్మం అత్యంత ఉన్నతమైంది, ఉత్కృష్టమైంది.

2. అర్థం

దీన్నే సంపద, ఐశ్వర్యం అంటారు. సంపద వల్ల శారీరక సుఖం కలుగుతుంది. అంటే వ్యక్తి అవసరాలను తీర్చడానికి అర్థం ఉపయోగపడుతుంది. కౌటిల్యుడి 'అర్థశాస్త్రం' అర్థం విలువను వివరించింది. ధనాన్ని అక్రమ మార్గాల ద్వారా సంపాదించరాదు. అర్థం ఎక్కువ చలామణిలో ఉండటంవల్ల వ్యక్తులు, సమాజం అభివృద్ధి జరుగుతుంది.

3. కామం

కామం అంటే కోరిక. ఇంద్రియ వాంఛలను తృప్తి పరచుకోవడం కామం. గృహస్థాశ్రమంలో వ్యక్తికి కామం సహజం. కామం కేవలం శారీరక వాంఛలకు మాత్రమే పరిమితం కాదు. నృత్యం, సంగీతం, నటన కళారూపాలు మొదలైన వాటిలో కూడా కోరిక ఉంది. కామం వివాహానికి, సంతాన ప్రాప్తికి మూలం. ధర్మంతో కూడిన కామం అంగీకార యోగ్యం. కాబట్టి ప్రతి వ్యక్తీ కామాన్ని క్రమబద్ధం చేసుకోవాలి. ద్విజులలో సంతానోత్పత్తికి మాత్రమే కామాన్ని ఉద్దేశించారు. ధర్మం, అర్థం, కామాలను త్రి వర్గాలు అని పిలుస్తారు. పురుషార్థాలలో కామానికి తక్కువ ప్రాధాన్యమిచ్చి ధర్మానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

4. మోక్షం

ప్రతి హిందువు తుది లక్ష్యం మోక్ష సాధన. మోక్షం అంటే 'ఆత్మను పరమాత్మలో మిళితం చేయడం'. మోక్షసాధన అంటే ప్రతి వ్యక్తి ఆత్మ సాక్షాత్కారం లేదా అంతరంగిక ఆధ్యాత్మికతను సాధించడం. ధర్మ, అర్థ, కామ పరిపూర్ణత ఇందులో ఉంటుంది. కర్మం, జ్ఞానం, భక్తి అనే మూడు మార్గాల ద్వారా మోక్షం లభిస్తుంది. భగవద్గీతలో మోక్షాన్ని పరాగతిగా వర్ణించారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

బౌద్ధమతం

గౌతమబుద్ధుడు రుమిందై గ్రామ సమీపంలోని లుంబినివనంలో జన్మించాడు. అతడి తండ్రి కపిలవస్తు పాలకుడైన శుద్ధోదనుడు, తల్లి మహామాయ. గౌతమబుద్ధుడి అసలు పేరు సిద్ధార్థుడు. గౌతమబుద్ధుడు పుట్టిన ఏడు రోజులకే అతడి తల్లి మహామాయ మరణించింది. సవతితల్లి మహాప్రజాపతి గౌతమి పెంచడంతో అతడికి గౌతముడిగా పేరొచ్చింది. బుద్ధుణ్ని పెంచిన 'గౌతమి ప్రజాపతి' బౌద్ధమతంలో తొలి సన్యాసిని. బుద్ధుడి భార్య యశోధర, కుమారుడు రాహులుడు.

బుద్ధుడు తన 29వ ఏట ఒక వృద్ధుణ్ని, ఒక వ్యాధిగ్రస్తుణ్ని, ఒక సన్యాసిని, ఒక శవాన్ని చూశాడు. వీటిని చూసిన బుద్ధుడు కలత చెంది ఇల్లు వదిలి జ్ఞానాన్వేషణకు బయల్దేరాడు. సంరక్షకుడైన చెన్న సహాయంతో 'కంతక' అనే గుర్రం మీద బుద్ధుడు బయల్దేరాడు. దీన్నే మహాభినిష్క్రమణ అంటారు. జ్ఞానాన్వేషణలో భాగంగా బుద్ధుడు రెండేళ్లపాటు వైశాలిలో అలారకలామ వద్ద ధ్యాన విధానాన్ని నేర్చుకున్నాడు. రాజగృహంలో ఉద్రక(ఉద్దక) వద్ద కొన్ని రోజులు శిష్యరికం చేశాడు. గురువుల వద్ద తనకు కావాల్సిన సమాధానం లభించలేదు. దీంతో ముక్తి కోసం 15రోజులు ఉపవాసం ఉన్నాడు. గౌతముడు స్పృహ కోల్పోయిన దశలో సుజాత అనే స్త్రీ అతడి ప్రాణాలను కాపాడింది.

గౌతమ బుద్ధుడు బుద్ధగయ వద్ద బోధివృక్షం కింద 49 రోజులు ధ్యానం చేశాడు. ఇక్కడే జ్ఞానోదయం(మహాసంబోధి) పొంది బుద్ధుడయ్యాడు (బుద్ధుడు అంటే తథాగతుడు-నిజాలను తెలుసుకున్నవాడు అని అర్థం). తర్వాత కఠోర ఆహార నియమాలు, సాధనలు చేయకూడదని అన్నీ మధ్యస్తంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. అందుకే బుద్ధుడు ప్రవచించిన మార్గాన్ని మధ్యే మార్గం అంటారు. మధ్యేమార్గం అంటే మనిషి పూర్తిగా సన్యాసిగా కాకుండా, పూర్తిగా భౌతిక కాంక్షలతో కాకుండా స్వీయ నిగ్రహశక్తితో జీవితాన్ని గడపటం. ఈ మార్గాన్ని అనుసరించిన ఏ వ్యక్తయినా అతడి సామాజిక నేపథ్యంతో నిమిత్తం లేకుండా ముక్తి పొందుతాడు.

ఉదా:ఐశ్వర్యానికి, పేదరికానికి మధ్య జీవించడం.

బుద్ధుడు సిద్ధాంతాలను ప్రబోధించలేదు. కానీ ఆధ్యాత్మిక వికాసానికి ఒక హేతువాద మార్గాన్ని సూచించాడు. అందుకే బుద్ధుణ్ని ఆజ్ఞయవాది(Agnostic) అని పిలవవచ్చు. బుద్ధుడు సత్యదూరాలైన వేదాలను తిరస్కరించాడు. జంతు బలులను ఖండించి, క్లిష్ట సంస్కారాలను ఎదిరించాడు. హిందూ మతంలోని అసమానత్వం, కొన్ని మత ఛాందస భావాలను ముఖ్యంగా కులవ్యవస్థను, బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నించాడు. అందువల్ల బౌద్ధమతాన్ని మత ఉద్యమంగా కాకుండా ఒక సామాజిక ఉద్యమంగా చూడాలని కొందరి భావన. అందుకే బౌద్ధమతాన్ని రియాక్షనరీ రిలీజియన్ అని పిలుస్తారు.

బుద్ధుడు సారనాథ్‌లోని జింకలవనంలో కొండిన్య, అశ్వజిత్, బద్రుక, మహానామ, కశ్యప /ఉపాలి అనే అయిదుగురు శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. దీన్నే ధర్మచక్రపరివర్తనం అంటారు. బౌద్ధమత పుట్టుకగా 'సారనాథ్'ను పేర్కొంటారు.

బుద్ధుడి శిష్యులకు బోధించిన సారాన్ని పంచశీల అంటారు.

పంచశీల సూత్రాలు..

- అసత్య (అసత్యం పలకరాదు)
- అసతేయ (దొంగతనం చేయరాదు)
- అపరిగ్రహ (ఆస్తిని కూడబెట్టరాదు)
- మత్తుమందులు సేవించరాదు
- వ్యభిచారం చేయరాదు

బుద్ధుడి బోధనలు

1. ఆర్యసత్యాలు
2. అష్టాంగ మార్గం
3. ప్రతిత్య సముత్పాదన (కార్యకారణ సిద్ధాంతం)
4. మధ్యేమార్గం

నిగ్రహశక్తిని కోల్పోయినవారు మానసికంగా బలహీనులయ్యే అవకాశముంది. కాబట్టి నిగ్రహాన్ని నిలబెట్టుకోవడానికి ఆర్యసూత్రాలు (లేదా) ఆర్యసత్యాలు, అష్టాంగ మార్గాన్ని పాటించాలని బుద్ధుడు చెప్పాడు.

బుద్ధుడి ఆర్యసత్యాలు

1. ప్రపంచం మొత్తం దుఃఖమయం
2. కోరికలే దుఃఖాలకు కారణాలు
3. దుఃఖ నిర్మూలనకు కోర్కెలను జయించాలి
4. దుఃఖ నిర్మూలనకు ఏకైక మార్గం అష్టాంగ మార్గం

బుద్ధుడి అష్టాంగ మార్గం:

1. సమ్యక్ ఆలోచన
2. సమ్యక్ వాక్కు
3. సమ్యక్ క్రియ
4. సమ్యక్ జీవనం
5. సమ్యక్ కృషి
6. సమ్యక్ నిశ్చయం
7. సమ్యక్ విశ్వాసం
8. సమ్యక్ దృష్టి

ప్రతిత్య సముత్పాదన: దీన్నే కార్యకారణ సిద్ధాంతం అంటారు. ఇది బుద్ధుడి తత్వం. అంటే కర్మల వల్లే జీవుడు బంధ విముక్తుడు అవుతాడు.

బౌద్ధ సమావేశాలు: బౌద్ధ సమావేశాలనే బౌద్ధ సంగీతులు అంటారు. వినయ, సుత్త, అభిదమ్మ పీఠికలను త్రిపీఠకాలంటారు.

బౌద్ధ సంగీతులు

బౌద్ధ సంగీతి	కాలం	నగరం	రాజు	అధ్యక్షుడు	కారణం	ప్రాధాన్యం
మొదటి సంగీతి	క్రీ.పూ.483 (బుద్ధుడు మరణించిన వెంటనే)	రాజగృహం	అజాతశత్రువు	మహాకశ్యప	బుద్ధుడి బోధనలను గ్రంథస్తం చేయడానికి	ఆనందుడు 'వినయ', ఉపాలి 'సుత్త' అనే పీఠికల (నియమావళి గ్రంథాలు)ను సంకలనం చేశారు.
రెండో సంగీతి	క్రీ.పూ.383	వైశాలి	కాలాశోకుడు	సభాకమి	బౌద్ధమతంలో విభేదాలను పరిష్కరించడానికి	బౌద్ధమతం థేరవాదులు(మార్పు కోరనివారు), మహాసాంఘికులు(మార్పు కోరేవారు)గా చీలిపోయింది.
మూడో సంగీతి	క్రీ.పూ.250	పాటలీ పుత్రం	అశోకుడు	మొగలిపుత్రతిస్స	బౌద్ధమతానికి సంబంధించిన అనేక విషయాలను చర్చించడానికి	అభిదమ్మ పీఠికను సంకలనం చేశారు.
నాలుగో సంగీతి	క్రీ.శ. 1వ శతాబ్దం	కుందలవనం కశ్మీర్	కనిష్కుడు	వసుమిత్రుడు	18 శాఖల మధ్య ఐక్యత సాధించడానికి	బౌద్ధమతం మహాయాన, హీనాయాన శాఖలుగా చీలిపోయింది.

విద్య, ఉద్యోగ సమాచారం

జిప్‌మర్, పుదుచ్చేరిలో ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3 పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా ఎంటెక్/ ఎంఈ/ఎంఎస్సీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 15.12.2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.28,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2025.
- **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

ఐఐటీ జమ్మూలో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) జమ్మూ ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్-3, ప్రాజెక్ట్ అసోసియేట్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్3-01, ప్రాజెక్ట్ అసోసియేట్1-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- **వేతనం:** నెలకు రీసెర్చ్ అసోసియేట్-3కు రూ.67,000, ప్రాజెక్ట్ అసోసియేట్-1కు రూ.37,000.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2025.
- **వెబ్‌సైట్:** https://iitjammu.ac.in

రక్తపోటును నియంత్రించే హార్మోన్?



అంతస్స్రావక గ్రంథులు

1. ఎడ్రినల్ (అధివృక్క) గ్రంథులు

మానవుడిలో ఒక జత ఎడ్రినల్ గ్రంథులు మూత్ర పిండాల పైభాగంలో ఉంటాయి. అధివృక్క గ్రంథిలో రెండు భాగాలుంటాయి. 1.వల్కలం.. అధివృక్క గ్రంథి వెలుపలి భాగం. 2. దవ్వ.. లోపలి భాగం.

అధివృక్క వల్కల హార్మోన్లు: దీని నుంచి విడుదలయ్యే హార్మోన్లను కార్టికాయిడ్లు అంటారు. ఇవి మూడు రకాలు.

ఎ) కార్టిసాల్ బి) అల్డోస్టిరాన్
సి) లైంగిక కార్టికాయిడ్లు

కార్టిసాల్

ఈ హార్మోన్ పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఉపవాస(అత్యవసర) పరిస్థితుల్లో గ్లూకోజ్‌ను సంశ్లేషించి రక్తంలోకి విడుదల చేస్తుంది. కాబట్టి కార్టిసాల్‌ను ప్రాణరక్షక హార్మోన్ అంటారు. ఇది ఒక ఒత్తిడి పోరాట హార్మోన్‌గా కూడా పనిచేస్తుంది. కార్టిసాల్ అధికస్రావం వల్ల కూషింగ్స్ వ్యాధి (బఫెల్లో నెక్) వస్తుంది.

- **లక్షణాలు:** ముఖం, అవయవాలు, వీపు ప్రాంతంలో కొవ్వు పేరుకుపోతుంది.
  వీపుపై మూపురం (బఫెల్లో హంప్) వేలాడుతూ ఉంటుంది.
  కార్టిసాల్ తక్కువైతే అడిసన్స్ వ్యాధి వస్తుంది.
  లక్షణాలు: చర్మంపై కంచు వర్ణపు మచ్చలు, బరువు కోల్పోవడం, కండరాల బలహీనత.

అల్డోస్టిరాన్

ఇది దేహంలో నీరు, లవణాల తుల్యతను క్రమపరుస్తుంది. మూత్రం నుంచి సోడియం (Na^+) పునఃశోషణను పెంచుతుంది. అదే సమయంలో పొటాషియం (K^+), ఫాస్ఫేట్ అయాన్లను మూత్రంలోకి స్రవింపజేయడంలో తోడ్పడుతుంది. శరీరంలో పొటాషియం అయాన్ల గాఢత పెరగడం ప్రమాదకరం. కాబట్టి అధివృక్క ఆల్డోస్టిరాన్ లోపిస్తే మానవుడు మరణిస్తాడు.

లైంగిక కార్టికాయిడ్లు

ఇవి ఒక రకమైన లైంగిక హార్మోన్లు(ఆండ్రోజన్స్). ఇవి స్త్రీ, పురుషుల్లో లైంగిక హార్మోన్లకు అనుబంధంగా పనిచేస్తాయి.

ఈ హార్మోన్ల అధిక స్రావం వల్ల స్త్రీ , పురుషుల్లో వ్యాధులు వస్తాయి. అవి..

- **విరిలిజం:** స్త్రీలకు అవాంఛిత రోమాలు (గడ్డాలు, మీసాలు) రావడం, పురుష గొంతు.
- **హిర్సుటిజం:** స్త్రీలకు ఛాతీపైన, శరీరంపైన రోమాలు రావడం.
- **గైనకోమాస్టియా:** ఇది పురుషులకు వచ్చే వ్యాధి. పురుషులకు రొమ్ములు ఏర్పడటం.

అధివృక్క దవ్వ

అధివృక్క దవ్వ రెండు రకాల హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది.

ఎ) ఎడ్రినలిన్ (ఎపినెఫ్రిన్)
బి) నార్ ఎడ్రినలిన్ (నార్ ఎపినెఫ్రిన్)

ఇవి ఒత్తిడి, అత్యవసర పరిస్థితులకు అనుక్రియగా ఉత్పత్తి అవుతాయి. కాబట్టి వీటిని అత్యవసర హార్మోన్లు (ఎమర్జెన్సీ హార్మోన్లు), పోరాట లేదా పలాయన హార్మోన్లు, 3F హార్మోన్ (Fight -Flight - Fright) , 4S హార్మోన్ (Sugar Metabolism, Salt retainning, Sex hormones, Source of Energy), బీపీ హార్మోన్ లేదా రక్తపోటుకు కారణమైన హార్మోన్ అని పిలుస్తారు.

ఈ హార్మోన్ల వల్ల భయం, కోపం వంటి భావోద్వేగాలకు లోనైనప్పుడు వెంట్రుకలు నిక్కబొడుచుకోవడం, చెమటపట్టడంతో పాటు హృదయస్పందన, శ్వాసక్రియ రేటు పెరుగుతాయి.

ఎడ్రినలిన్

హృదయ స్పందన రేటును పెంచి గుండెపోటుకు (బీపీ) కారణమవుతుంది.

నార్ ఎడ్రినలిన్

ఈ హార్మోన్ రక్త పీడనాన్ని తగ్గిస్తుంది (నియంత్రిస్తుంది)

గమనిక: లోనోట్రోప్స్ రక్తపోటును తగ్గించడానికి వాడే ఔషధం.

2. బీజకోశాలు

బీజకోశాలు రెండు రకాలు..

1) పురుష బీజకోశాలు (ముష్కాలు)
2) స్త్రీ బీజ కోశాలు

ముష్కాలు / పురుష బీజకోశాలు

ముష్కాలు పురుష ప్రత్యుత్పత్తి అంగాలు. ఒక జత ముష్కాలు శరీరం వెలుపల ముష్క గోణుల్లో ఉంటాయి.

- **ముష్కాల ప్రధాన విధి:** శుక్రకణోత్పత్తి, హార్మోన్ విడుదల. ముష్కాల్లోని లిడిగ్ కణాల నుంచి టెస్టోస్టిరాన్ (ఆండ్రోజెన్) అనే లైంగిక హార్మోన్ విడుదలవుతుంది.
- **టెస్టోస్టిరాన్ విధి:** కండరాల అభివృద్ధి,ముఖం, బాహుమూలాల్లో రోమాలు ఏర్పడటం, పురుష కంఠధ్వని(గొంతు మారడం). ఈ లక్షణాలను ద్వితీయ లైంగిక లక్షణాలు అంటారు.

స్త్రీ బీజకోశాలు

స్త్రీలలో ఒక జత స్త్రీ బీజకోశాలు ఉదర కుహరంలో ఉంటాయి. ప్రాథమికంగా ఇవి అండాలను ఉత్పత్తి చేస్తాయి. ఇవి ప్రతి రుతుచక్రంలోనూ ఒక అండాన్ని విడుదల చేస్తాయి. ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్‌లను విడుదల చేస్తాయి.

- **ఈస్ట్రోజన్:** ఈ హార్మోన్ స్త్రీలలో ద్వితీయ లైంగిక లక్షణాలను ప్రేరేపిస్తుంది.అంటే రుతుచక్ర ప్రారంభం, స్తనాభివృద్ధి, స్త్రీ కంఠస్వరం.
- **ప్రొజెస్టిరాన్:** దీన్ని ప్రెగ్నెన్సీ హార్మోన్, గర్భస్రావ నిరోధక హార్మోన్ అంటారు. ఈ హార్మోన్ పిండ ప్రతిస్థాపనకు తోడ్పడుతుంది. ఫలధీకరణ ద్వారా ఏర్పడిన పిండాన్ని గర్భాశయ గోడలకు అంటి పెట్టడంలో దోహదపడుతుంది. ఈ హార్మోన్ రుతుచక్రం ఆగిపోవడానికి, మళ్లీ ఫలధీకరణ జరగకుండా ఉండటానికి తోడ్పడుతుంది. కాబట్టి గర్భ నిరోధక మాత్రల్లో ప్రొజెస్టిరాన్‌ను ఉపయోగిస్తారు. ఈ హార్మోన్ జరాయువు ఏర్పడటానికి తోడ్పడుతుంది.
- **రిలాక్సిన్ హార్మోన్:** ఈ హార్మోన్‌ను ప్రసవ సమయంలో జరాయువు స్రవిస్తుంది. ఇది సుఖ ప్రసవానికి దోహదపడుతుంది.

3. థైమస్ గ్రంథి (బాలగ్రంథి)

ఈ గ్రంథి రెండు ఊపిరితిత్తుల మధ్య గుండెకు దగ్గరగా ఉంటుంది. ఇది తల్లిగర్భంలో ఉన్న పిండం (ఆరో వారం)లో ఏర్పడుతుంది. ఇది చిన్న పిల్లల్లో మాత్రమే ఉంటుంది. కౌమార దశలో అదృశ్యమవుతుంది. కాబట్టి దీన్ని బాలగ్రంథి, తాత్కాలిక గ్రంథి, తిరోగమన గ్రంథి,అంతరించిపోయే గ్రంథి అని పిలుస్తారు. ఈ గ్రంథి స్రవించే హార్మోన్ థైమోసిన్.

- **థైమోసిన్ విధి:** లింఫోసైట్ కణాల పరిపక్వతకు తోడ్పడుతుంది. ఫలితంగా ప్రతిరక్షకాలు (యాంటిబాడీలు)ఉత్పత్తి అవుతాయి. ఇవి వ్యాధి నిరోధకతను పెంపొందిస్తాయి.

మాంసం దుకాణాల్లో జంతువుల థైమస్ గ్రంథిని స్వీట్ బ్రెడ్‌గా అమ్ముతారు.

- **ఎక్టో హార్మోన్లు:** కొన్ని వినాళ గ్రంథుల నుంచి బాహ్య వాతావరణంలోకి విడుదలయ్యే రసాయన పదార్థాలను ఎక్టో హార్మోన్లు లేదా పిరమోన్లు అంటారు. ఈ పిరమోన్లు కీటకాల్లో మాత్రమే ఉంటాయి.
- ఒక జాతి జీవుల నుంచి విడుదలయ్యే పిరమోన్లను అదే జాతికి చెందిన కీటకాలు మాత్రమే గుర్తిస్తాయి. దీంతో వాటి మధ్య ఆకర్షణ, కమ్యూనికేషన్స్ నెలకొంటాయి.
  ఉదా: కూలీ చీమ మార్గాన్ని ఇతర చీమలు పిరమోన్ల వల్లే అనుకరిస్తాయి.

4. పీనియల్ గ్రంథి

ఇది మానవుడి మెదడు ద్వారగోర్థం పృష్ఠతలంలో ఉంటుంది. మెలటోనిన్ హార్మోన్‌ను స్రవిస్తుంది. ఇది శరీరంలోని 24 గంటల దిన పరివర్తన లేదా సర్కేడియన్ లయలను క్రమపరుస్తుంది. అంటే నిద్ర, మెలకువల వలయాన్ని నియంత్రిస్తుంది.

5. జఠరాంత్రనాళ హార్మోన్లు

జీర్ణాశయం, ఆంత్రమూలాల శ్లేష్మస్తరం హార్మోన్లను స్రవిస్తుంది. ఈ హార్మోన్లు జీర్ణ గ్రంథుల చర్యలను పరిరక్షిస్తాయి. ఇది నాలుగు రకాల పెప్టైడ్ హార్మోన్లను స్రవిస్తుంది. అవి...

- **గాస్ట్రిన్:** ఈ హార్మోన్‌ను జీర్ణాశయం స్రవిస్తుంది. ఇది జఠర గ్రంథులను ప్రభావితం చేసి హైడ్రోక్లోరిక్ ఆమ్లం, పెప్సినోజన్ విడుదలను ప్రేరేపిస్తుంది.
- **సెక్రిటిన్:** ఆంత్రమూలం నుంచి విడుదలయ్యే ఈ హార్మోన్ క్లోమ, పైత్య రసాల స్రావాన్ని ప్రేరేపిస్తుంది. మొదట కనుగొన్న హార్మోన్ సెక్రిటిన్
- **కోలిసిస్టోకైనిన్:** ఇది కూడా ఆంత్రమూలం నుంచి విడుదలవుతుంది. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్యరసాన్ని ఆంత్రమూలంలోకి విడుదల చేయిస్తుంది.
- **పాంక్రియోజైమిన్:** దీన్ని ఆంత్రమూలం స్రవిస్తుంది. ఈ హార్మోన్ క్లోమాన్ని ఉత్తేజపర్చి క్లోమరసం విడుదలకు దోహదపడుతుంది.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. రక్తపోటును నియంత్రించే హార్మోన్?
   1) థైరాక్సిన్ 2) ఇన్సులిన్
   3) ఎడ్రినలిన్ 4) పిట్యూటరీ గ్రంథి
2. ఇన్సులిన్, ఈస్ట్రోజన్ అనేవి ?
   1) బ్యాక్టీరియాలు 2) ఫంగస్‌లు
   3) క్రిములు 4) హార్మోన్లు
3. అధిక ఆవేశాన్ని కలిగించే గ్రంథి ఏది?
   1) పిట్యూటరీ గ్రంథి 2) ఎడ్రినల్ గ్రంథి
   3) థైరాయిడ్ గ్రంథి 4) సెలైవరీ గ్రంథి
4. మానవ దేహంలో అధివృక్క గ్రంథి వేటిపై ఉంటుంది?
   1) చిన్నప్రేగు 2) గుండె
   3) ఊపిరితిత్తులు 4) మూత్ర పిండాలు
5. తమ జాతి జీవులపై ప్రభావం చూపించేవి, జీవి శరీరం నుంచి బాహ్యంగా విడుదలయ్యే సమ్మేళనాన్ని ఏ విధంగా పిలుస్తారు?
   1) సబ్‌హార్మోన్లు 2) న్యూరోహార్మోన్లు
   3) పిరమోన్లు 4) న్యూరోట్రాన్స్ మీటర్
6. స్త్రీ జీవుల్లో ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని నియంత్రించేది?
   1) ఈస్ట్రోజన్ 2) ఆక్సిటోసిన్
   3) టెస్టోస్టిరాన్ 4) ప్రొజెస్టిరాన్
7. శిశువుల్లో మాత్రమే ఉండి కౌమార దశలో అంతరించే గ్రంథి?
   1) థైరాయిడ్ గ్రంథి 2) థైమస్ గ్రంథి
   3) పీనియల్ గ్రంథి 4) పీయూష గ్రంథి
8. గర్భ నిరోధక మాత్రల్లో ఉండే హార్మోన్?
   1) ఈస్ట్రోజెన్ 2) ప్రొజెస్టిరాన్
   3) ఆక్సిటోసిన్ 4) ప్రొలాక్టిన్
9. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్యరసాన్ని స్రవింపజేసే హార్మోన్?
   1) సెక్రిటిన్ 2) ఇన్సులిన్
   3) కోలిసిస్టోకైనిన్ 4) ఎడ్రినలిన్
10. లైంగిక కార్టికాయిడ్ల అధికస్రావం వల్ల వచ్చే వ్యాధి?
    1) విరిలిజం 2) హిర్సుటిజం
    3) గైనకోమాస్టియా
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 4; 5) 3; 6) 1; 7) 2; 8) 2; 9) 3; 10) 4.

విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉన్న దేశాలేవి?

వ్యవసాయం

ప్రముఖ ఆర్థిక భౌగోళిక శాస్త్రజ్ఞుడు విట్లిసీ కింద సూచించిన వ్యవసాయ వ్యవస్థలను గుర్తించాడు.

- సాంద్ర జీవనాధార వ్యవసాయం
- విస్తార వాణిజ్య వ్యవసాయం
- మిశ్రమ వ్యవసాయం
- వాణిజ్య పండ్ల తోటల సాగు
- మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్
- ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్
- వాణిజ్య పాడి మండలం
- వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)
- పోడు వ్యవసాయం
- సంచార పశు పోషణ

సాంద్ర జీవనాధార వ్యవసాయం

ఆయనరేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాలకు చెందిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో జీవనాధార సాంద్ర వ్యవసాయం అమల్లో ఉంది. ఇండియా, చైనా, బ్రెజిల్, థాయ్‌లాండ్, మెక్సికో, ఈజిప్ట్ లాంటి వ్యవసాయ ప్రధాన దేశాల్లోని వ్యవసాయ వ్యవస్థలు ఈ కోవకు చెందినవి. సాంద్ర వ్యవసాయంలో పంటల తీవ్రత అధికం. పెద్ద మొత్తాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు నీటిని వాడతారు. వ్యవసాయ భూకమతాల సగటు పరిమాణం చాలా తక్కువ. జనాభాలో అధిక శాతం ప్రత్యక్షంగా వ్యవసాయం పైనే ఆధారపడతారు. కాబట్టి వ్యవసాయ భూమిపై ఒత్తిడి అధికం. ప్రధానంగా ఆహార పంటలను పండిస్తారు. జనాభా, జనసాంద్రతలు అధికంగా ఉండటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా దేశీయంగానే వినియోగిస్తారు. మిగులు లేకపోవడంతో ఎగుమతులు అత్యల్పం. వ్యవసాయంలో శ్రామిక శక్తిని అధికంగా వినియోగిస్తారు. సగటు వ్యవసాయ భూమికి దిగుబడులు అధికంగా ఉన్నప్పటికీ, తలసరి దిగుబడులు కనిష్ఠంగా ఉంటాయి. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉంటుంది. ఈ వ్యవసాయ మండలంలో రైతుల ఆదాయాలు స్వల్పంగా ఉంటాయి. రైతులు తమ గృహ అవసరాల ఆధారంగా పంటలను ఎంచుకుంటారు.

విస్తార వాణిజ్య వ్యవసాయం

ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనాల్లో విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉంది. వ్యవసాయంపై ఆధారపడే శ్రామిక జనాభా శాతం చాలా తక్కువ. వ్యవసాయంలో యాంత్రీకరణ స్థాయి అధికం. వ్యవసాయ భూకమతాలు చాలా పెద్దవి.

ఉదాహరణకు యూఎస్ఏలో సగటు భూకమతాల పరిమాణం 1000–1400 హెక్టార్లు. పంటల తీవ్రత సాంద్ర వ్యవసాయ మండలంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది.

ప్రపంచ మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మండలంలో పంటలు పండిస్తారు. జనాభా, జనసాంద్రత తక్కువగా ఉండటం వల్ల స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం తక్కువ. మిగులు వ్యవసాయ ఉత్పత్తుల వల్ల పెద్ద మొత్తాల్లో ఎగుమతి చేస్తారు. విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉండే యూఎస్ఏ, కెనడా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాలు ప్రపంచంలో ప్రధాన వ్యవసాయ ఎగుమతిదారులు. ఈ మండలాన్ని ప్రపంచ ధాన్యాగారంగా అభివర్ణిస్తారు. ఈ తరహా వ్యవసాయం విస్తారంగా పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకొని ఉంది.

మిశ్రమ వ్యవసాయం

పంటలతోపాటు పశుపోషణ కోసం కూడా వ్యవసాయ భూమిపై ఆధారపడటాన్ని మిశ్రమ వ్యవసాయంగా వ్యవహరిస్తారు. ఈ తరహా వ్యవసాయంలో పంటల నుంచి వచ్చిన రొట్టను, వ్యవసాయ ఉత్పత్తులను పశుగ్రాసంగా వాడతారు. పశువుల మేతకోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లు ఉండవు. అయితే జీవనాధార వ్యవసాయంలా కాకుండా, ఈ మండలంలో వ్యవసాయ పంటలు, పశుపోషణ వాణిజ్య తరహాలో జరుగుతుంది. పశ్చిమ, మధ్య ఐరోపాల్లో వ్యవసాయం ఈ కోవకు చెందింది. ఈ మండలంలో సగటు వ్యవసాయ భూకమతాల పరిమాణం మధ్యస్థంగా (100–200 హెక్టార్లు) ఉంటుంది.

వాణిజ్య పండ్ల తోటల సాగు

మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతాలు పండ్ల తోటల సాగుకు అనుకూలం. కవోష్ణ వాతావరణం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

వల్ల ముఖ్యంగా సిట్రస్ జాతికి చెందిన పండ్ల తోటలు ఇక్కడ సాగవుతాయి. మధ్యధరా తీరంలోని ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, గ్రీస్, మొరాకో, అల్జీరియా, ట్యునీషియా ప్రాంతాలు, దక్షిణాఫ్రికాలోని కేప్ ప్రాంతం, యూఎస్ఏలోని కాలిఫోర్నియా తీరం, మధ్య చిలీ, ఇజ్రాయెల్ తీర ప్రాంతాలు ఈ వ్యవసాయ మండలం కిందకు వస్తాయి. ఈ ప్రాంతాల్లో బత్తాయి, నిమ్మ, ద్రాక్ష, నారింజ, దానిమ్మ లాంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను వాణిజ్య పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఇది పెట్టుబడితో కూడుకున్న వ్యవసాయం. పండ్ల రసాలు, జామ్‌లు, జెల్లీలు, సాస్‌లు, ఎండు పళ్లను ఈ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు. ద్రాక్ష సారాయి తయారీ కూడా పెద్ద పరిశ్రమగా రూపొందింది. ఫ్రాన్స్‌లోని రైన్ లోయ, ఇటలీలోని గెరొన్ బేసిన్ వీటికి ప్రసిద్ధి.

మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్

పారిశ్రామిక విప్లవం తర్వాత ఐరోపా, ఉత్తర అమెరికాల్లో విస్తృత నగరీకరణ జరిగింది. విస్తరిస్తున్న మెట్రోపాలిటన్ నగరాల్లో తాజా కూరగాయలు, పండ్లకు గిరాకీ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో వాయవ్య ఐరోపా, ఉత్తర అమెరికాల్లోని పెద్ద పెద్ద నగరాల సమీపంలో పండ్లు, కూరగాయల సాగు వాణిజ్య పద్ధతిలో ప్రారంభమైంది. రోజూ ఉదయాన్నే ఈ వ్యవసాయ ప్రాంతాల నుంచి నగరాలకు భారీ ట్రక్కుల ద్వారా తాజా పండ్లు, కూరగాయల రవాణా జరుగుతుంది. అందువల్ల దీన్ని ట్రక్ ఫార్మింగ్ (మార్కెట్ గార్డెనింగ్) అని పిలుస్తారు. ఆగ్నేయ ఆస్ట్రేలియాలోని నగర జనాభాకు కావాల్సిన తాజా పండ్లు, కూరగాయలను టాస్మానియా దీవి నుంచి బాస్ జలసంధి ద్వారా మర పడవలపై సరఫరా చేస్తారు. అందువల్ల టాస్మానియా దీవిని 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా వ్యవహరిస్తారు.

ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్

ఎస్టేట్ ఫార్మింగ్ పద్ధతుల్లో ఉద్యానవన తోటల పెంపకాన్ని వలస పాలనా కాలంలో వలస రాజ్యాలు ప్రారంభించాయి. ఉష్ణమండల ఆయన రేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాల్లోని దేశాల్లో వలస పాలకులు కాఫీ, తేయాకు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, చెరకు, అరటి పంటలను ఎస్టేట్‌ల రూపంలో సాగు చేయడం ప్రారంభించారు. ఈ రకమైన సాగులో వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా నడిపిస్తారు. ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే యాజమాన్యం కేవలం విధాన నిర్ణయాలను మాత్రమే తీసుకుంటుంది. సాగు నిర్వహణ కోసం సుశిక్షితులైన, సాంకేతిక అర్హతలు ఉన్న వారిని 'మేనేజర్లు'గా వేతన ప్రాతిపదికన నియమిస్తారు. శ్రామికులను దినసరి లేదా రోజువారీ కూలీ ప్రాతిపదికన వినియోగిస్తారు. లాభాలను ఆశించి ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. ఇప్పటికీ ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు కన్పిస్తాయి.

దేశం	ఎస్టేట్లు	పెట్టుబడి పెట్టిన దేశం
శ్రీలంక	తేయాకు	బ్రిటన్
మలేషియా	రబ్బరు	బ్రిటన్
ఇండోనేషియా	రబ్బరు, చెరకు	డచ్
దక్షిణాఫ్రికా	చెరకు	డచ్, బ్రిటన్
బ్రెజిల్	కాఫీ	పోర్చుగల్
ఫిలిప్పీన్స్	కొబ్బరి	యూఎస్ఏ
కరేబియన్ దీవులు	చెరకు, అరటి	యూఎస్ఏ
పశ్చిమ ఆఫ్రికా	కొకురా	ఫ్రాన్స్

వాణిజ్య పాడి మండలం

వాయవ్య ఐరోపాలోని సమశీతోష్ణ వాతావరణంలో పచ్చిక బయళ్లు విస్తారంగా పెరుగుతాయి. ఈ పరిస్థితులు పశుపోషణకు అనుకూలం, జెర్సీ, ఆరిషైర్, స్విస్‌బ్రౌన్, ఆబర్డన్, హార్ట్‌ఫోర్డ్, ఫ్లెచ్‌విక్ లాంటి మేలి రకం పాడి పశువుల జాతులకు ఈ ప్రాంతాలు నిలయాలు. పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు పెట్టి ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని వాడుతూ పాడి పశువులను పెంచుతారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలోని యూకే, డెన్మార్క్, బెల్జియం, నెదర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, నెదర్లాండ్ దేశాల నుంచి పెద్ద మొత్తాల్లో పాడి వస్తువులు ఉత్తర అమెరికా, యూరప్‌లోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. డెన్మార్క్‌ను Butter House of Europe గా అభివర్ణిస్తారు. కొపెన్‌హెగెన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజూ విమానాల ద్వారా వెన్నను ప్రపంచం నలుమూలలకు ఎగుమతి చేస్తారు.

వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)

పశ్చిమ యూఎస్ఏలోని రాకీ పర్వత ప్రాంతం, అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వే దేశాలు రాంచింగ్ (Ranching) మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో మాంసం ఉత్పత్తి కోసం పశువులను పెంచుతారు. పశుపోషణ కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా మొక్కజొన్నను పండిస్తారు. బాగా లావెక్కిన పశువులను యాంత్రిక వధ శాలల్లో సంహరించి, మాంసాన్ని యంత్రాల సహాయంతో శుద్ధి చేసి ప్యాక్ చేస్తారు. మాంసం శుద్ధి, ప్యాకింగ్ ఒక పెద్ద పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వేల నుంచి శుద్ధి చేసిన మాంసాన్ని యూఎస్ఏకు ఎగుమతి చేస్తారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో కూడా రాంచింగ్ అమల్లో ఉంది.

సంచార పశు పోషణ

దట్టమైన అటవీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల నుంచి కొన్ని ఆదిమ తెగల సమాజాల్లో ఇప్పటికీ సంచార పశుపోషణ, సంచార వ్యవసాయం అమల్లో ఉంది. ఈశాన్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని 'జూమింగ్'గా పిలుస్తారు. మధ్య భారతదేశంలో 'బేవార్' అని, కేరళలో 'పొనమ్' అని పిలుస్తున్నారు. సంచార వ్యవసాయం బ్రెజిల్ (రోకా), మలేషియా (లడాంగ్)లలో కూడా అమల్లో ఉంది.

మాదిరి ప్రశ్నలు

1. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉండే వ్యవసాయ విధానం ఏది?
   1) సాంద్ర జీవనాధార వ్యవసాయం
   2) విస్తార వాణిజ్య వ్యవసాయం
   3) మిశ్రమ వ్యవసాయం
   4) పైవేవీ కాదు
2. Butter House of Europe గా పేరొందిన దేశం ఏది?
   1) ఆస్ట్రేలియా 2) చిలీ
   3) దక్షిణాఫ్రికా 4) డెన్మార్క్
3. పండ్ల తోటల సాగుకు అనువైన శీతోష్ణస్థితి ఉన్న ప్రాంతం ఏది?
   1) వాయవ్య ఐరోపా 2) పశ్చిమ ఆఫ్రికా
   3) మధ్యధరా ప్రాంతం
   4) తూర్పు ఐరోపా
4. 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా పేరొందిన ప్రాంతం ఏది?
   1) టాస్మానియా 2) న్యూసౌత్‌వేల్స్
   3) క్వీన్స్‌లాండ్ 4) విక్టోరియా
5. మధ్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
   1) జూమింగ్ 2) పొనమ్
   3) బేవార్ 4) ఏదీకాదు
6. కింద సూచించిన పంటల్లో చల్లటి వాతావరణంలో పండించే పంట ఏది?
   1) కొబ్బరి 2) రబ్బరు
   3) తేయాకు 4) చెరకు
7. దేశంలో వాణిజ్య పద్ధతుల్లో అత్యధికంగా పూలను ఎగుమతి చేస్తోన్న రాష్ట్రం ఏది?
   1) కేరళ 2) తమిళనాడు
   3) తెలంగాణ 4) కర్ణాటక
8. కింది వాటిలో రాంచింగ్ మండలంలో ఉన్న దేశం ఏది?
   1) ఉరుగ్వే 2) కెనడా
   3) లాత్వియా 4) శ్రీలంక
9. ఏ దేశాన్ని ఆదర్శంగా తీసుకొని భారత్‌లో సహకార రంగంలో పాడి సహకార సంఘాలను స్థాపించారు?
   1) బ్రెజిల్ 2) నెదర్లాండ్స్
   3) ఇజ్రాయెల్ 4) డెన్మార్క్

సమాధానాలు

1) 1 2) 4 3) 3 4) 1
5) 3 6) 3 7) 4 8) 1
9) 4

Which file is responsible to start MS-Word?

BANK EXAMS

COMPUTER AWARENESS

MS - WORD

1. Which is not a font style?
   1) Bold 2) Superscript
   3) Italic 4) Regular
   5) None of above
2. What is gutter margin?
   1) Margin that is added to right margin when printing
   2) Margin that is added to the left margin when printing
   3) Margin that is added to the outside of the page when printing
   4) Margin that is added to the binding side of page when printing
   5) None
3. Landscape is?
   1) A font style
   2) Paper Size
   3) Page Layout
   4) Page Orientation
   5) None
4. Typeface option will come under which menu?
   1) Edit 2) View 3) Format
   4) Tools 5) None of above
5. Background color on a document is not visible in?
   1) Web layout view
   2) Print Preview
   3) Reading View
   4) Print Layout view
   5) None
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page Setup
   2) Section
   3) Page
   4) Document
   5) None of above
7. Which of the following is not available on the Ruler of MS Word screen?
   1) Tab stop box
   2) Left Indent
   3) Right Indent 4) Center Indent
   5) None of above
8. Gutter position can be set in following positions
   1) Left & Right 2) Left & Top
   3) Left & Bottom
   4) Left Only 5) None of above
9. What is the Short cut key for line break?
   1) CTRL + Enter
   2) Alt + Enter 3) Shift + Enter
   4) Space + Enter
   5) None of above
10. By pressing F12, which of following will happen?
    1) Save As dialog box will open
    2) Save dialog box will open
    3) Open dialog box will open
    4) Close dialog box will open
    5) None of above
11. Which key will open an Open dialogue box?
    1) F12 2) Alt + F12
    3) Ctrl + F12 4) Shift + F12
    5) None of above
12. How will MS Word will respond in repeated word ?
    1) A Green wavy line under the repeated word
    2) A Red wavy line under the repeated word
    3) A Blue wavy line under the repeated word
    4) A pink wavy lines under the repeated word
    5) None of above
13. What is the use of "All Caps" feature in MS - Word?
    1) It changes all selected text into Capital Letter
    2) It adds captions for selected Image
    3) It shows all the image captions
    4) It changes some text into Capital Letter
    5) None of above
14. Which file is responsible to start MS Word?
    1) Winword.exe
    2) Win.exe
    3) Word.exe
    4) Wordwin.exe
    5) None of above
15. To keep track of different editions of a document which feature we will use?
    1) Editions 2) versions
    3) Tracks 4) Traces
    5) None of above
16. Which is not a type of margin?
    1) Top 2) Left 3) Right
    4) Center5) None of above
17. What will be the use of Ctrl + J?
    1) Insert Image
    2) Insert Hyperlink
    3) Align Justify
    4) Search file 5) None of above
18. What shortcut will we use to align center?
    1) Ctrl + A 2) Ctrl + E
    3) Ctrl + D 4) Ctrl + B
    5) None of above
19. Which shortcut will we use to make text Italic?
    1) Ctrl + U 2) Ctrl + T
    3) Ctrl + I 4) Ctrl + P
    5) None of above
20. How to use Format Painter multiple times?
    1) By Click on Lock Format Painter Icon
    2) Format Painter cannot be use multiple times
    3) By Double Click on the Format Painter Icon
    4) By Double Click on the Format Painter Icon
    5) None of above
21. What is place to the left of horizontal scroll bar?
    1) Indicators 2) Split buttons
    3) Tab stop buttons
    4) View buttons
    5) None of above
22. Where can you find the horizontal split bar on MS-Word screen?
    1) On the top of vertical scroll bar
    2) On the bottom of vertical scroll bar
    3) On the left of horizontal scroll bar
    4) On the right of horizontal scroll bar Comment on this question
    5) None of above
23. Tabs stop position cannot be the following alignment?
    1) Decimal Alignment
    2) Center Alignment
    3) Bar Alignment
    4) Justify Alignment
    5) None of above
24. What is the use of bookmarks?
    1) To correct the spellings.
    2) To jump to a specific location in the document
    3) To ignore spelling mistakes
    4) To save alignments as it is
    5) None of above
25. Which feature is used to replace straight quotes with smart quotes as you type?
    1) Auto Correct as you type
    2) Auto Change as you type
    3) Auto Ignore as you type
    4) Auto Format as you type
    5) None of above
26. Ctrl + D is short cut used for?
    1) Open Dialogue Box
    2) Font Dialogue Box
    3) Save as Dialogue Box
    4) Save Dialogue Box
    5) None of above
27. Ctrl + G is shortcut for?
    1) Open Find and Replace Dialog box with activating Goto Tab
    2) Open Find and Replace Dialog box with activating Find Tab
    3) Open Find and Replace Dialog box with activating Replace Tab
    4) Open Goto Dialog box
    5) None of above Comment on this question
28. Ctrl + H is short cut for?
    1) Open Insert Dialog box activating Insert Hyper Link Tab
    2) Open Find and Replace Dialog box with activating Go to Tab
    3) Open Find and Replace Dialog box with activating Find Tab
    4) Open Find and Replace Dialog box with activating Replace Tab
    5) None of above
29. What can be searched by find?
    1) Format 2) Characters
    3) Symbol 4) All of above
    5) None of above
30. On which page the header or the footer is printed by default?
    1) On first page
    2) on last page
    3) on alternate page
    4) Every page 5) None of above
31. Which of these toolbars allows changing of Fonts and their sizes?
    1) Standard 2) Formatting
    3) Options 4) Review
    5) None of above
32. To spell check which function key you will press?
    1) F5 2) F6 3) F7
    4) F8 5) None of above
33. How to insert a sound file in word document?
    1) From insert -> sound menu option
    2) From insert -> object menu option
    3) From insert -> subject menu option
    4) From insert -> file menu option
    5) None of above
34. How many maximum number of columns can be inserted in the word document?
    1) 45 2) 50 3) 55
    4) 65 5) None of above
35. What is smallest and largest available font on formatting toolbar?
    1) Smallest 8 and Largest 70
    2) Smallest 5 and Largest 72
    3) Smallest 8 and Largest 72
    4) Smallest 5 and Largest 70
    5) None of above
36. Why drop cap is used in document?
    1) To get all first character capital
    2) To get all first character small
    3) To begin a paragraph with a large dropped initial capital letter
    4) To begin a paragraph with a large dropped initial small letter
    5) None of above
37. What is Macro?
    1) Small add-on programs that are installed afterwards if you need them
    2) Type of high level programming language
    3) Type of low level programming language
    4) Small programs created in MS-Word to automate repetitive tasks by using VBA
    5) None of above
38. Which among following can be a vertical separation between columns?
    1) Margin
    2) Header
    3) Orientation
    4) Gutter
    5) None of above
39. To change the typeface of a document, we will choose following menu option:
    1) Edit 2) View 3) Tools
    4) Format 5) None of above
40. To auto fit the width of column:
    1) Double click the left border of column
    2) Double click the right border of column
    3) Double click the column header
    4) None of above
    5) All the above
41. What is the default font size of a new Word document based on Normal template?
    1) 8pt 2) 10pt 3) 12pt
    4) 14pt 5) None of above
42. Which of following line spacing is invalid?
    1) Single 2) Double
    3) Triple 4) Multiple
    5) None of above
43. Format painter tool can be found in?
    1) Options toolbar
    2) Standard toolbar
    3) Formatting toolbar
    4) Drawing toolbar \
    5) None
44. Which among following is correct extension of word files?
    1) xls 2) doc 3) ppt
    4) dcw 5) None of above
45. You can jump to the next column by?
    1) Press Alt + Down-arrow
    2) Clicking with your mouse on the next column
    3) Both of above
    4) None of above
    5) Press Alt + 5 arrow

Key

1) 2; 2) 4; 3) 4; 4) 3; 5) 2; 6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 1; 11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 2; 16) 4; 17) 3; 18) 2; 19) 3; 20) 3; 21) 4; 22) 1; 23) 4; 24) 2; 25) 4; 26) 2; 27) 1; 28) 4 ; 29) 4; 30) 4; 31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3; 36) 3; 37) 4; 38) 1; 39) 4; 40) 2; 41) 3; 42) 3; 43) 2; 44) 2; 45) 3.